

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 213
గురువారం 24-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు..
నా జన్మ ధన్యమైనట్టే'


**జింబాబ్వే 344/4**
టి20ల్లో అత్యధిక స్కోరుతో ప్రపంచ రికార్డు నెలకొల్పిన జింబాబ్వే -14లో


**కార్పొరేట్ 'జెడ్' జపం**
జెడ్ అక్షరంతో మొదలయ్యే బ్రాండ్లు, కంపెనీల వెల్లువ -15లో


**ప్రియాంక నామినేషన్**
కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉపఎన్నికలో నామినేషన్ దాఖలు చేశారు.
వివరాలు 6లో ▸


**చట్టాల కోరలు తీశారు**
దేశంలో పర్యావరణ చట్టాల్లో సవరణలు చేసి, చివరకు వాటిని కోరల్లేని చట్టాలుగా మార్చేశారని కేంద్రంపై సుప్రీం మండిపడింది.
వివరాలు 6లో ▸


**బారామతి బరిలో అజిత్**
అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 38 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది.
వివరాలు 6లో ▸


**ఓటేసిన 2.1 కోట్ల అమెరికన్లు**
అమెరికా అధ్యక్ష ఎన్నికలకు నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే 2.1 కోట్ల మంది అమెరికన్లు ఓటు వేశారు.
వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### 20వేల మె.వా. పునరుత్పాదక విద్యుత్ ఎందుకు ?



విద్యుత్ డిమాండ్‌పై అశాస్త్రీయ, అవాస్తవిక అంచనాల ఆధారంగా గతంలో అడ్డగోలుగా చేసుకున్న పీపీఏలను విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామిక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు తప్పుబట్టారు.
- వివరాలు 5లో▶

### రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు!



తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని వెల్లడించారు.
- వివరాలు 3లో▶

### ఏఈవోల్లో చీలిక !



డిజిటల్ క్రాప్ సర్వేను బహిష్కరిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారుల్లో చీలిక ఏర్పడింది. ప్రభుత్వం 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడంతో పలువురు వెనక్కి తగ్గినట్టు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.
- వివరాలు 3లో▶

### మూడు నగరాల ముచ్చట



మూసీ పునరుజ్జీవం, ముచ్చర్లలో ఫ్యూచర్ సిటీ బృహత్తర ప్రాజెక్టులపై అధ్యయనానికి రాష్ట్ర బృందం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ బృందం బుధవారం ఇంచియాన్ నగరంలో అభివృద్ధి చేసిన 3 అంతర్జాతీయ స్మార్ట్‌సిటీలను పరిశీలించింది.
- వివరాలు 16లో▶

# సుహృద్భావమే లక్ష్యం

**చైనా, భారత్ సంబంధాలు బలపడాలి** **జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక భేటీలో మోదీ**

- ఇది ప్రపంచమంతటికీ మేలన్న ప్రధాని
- నిస్సైనికీకరణ ఒప్పందంపై నేతల హర్షం
- సరిహద్దుల్లో శాంతి నెలకొనాలని వ్యాఖ్యలు
- వారిమధ్య ఐదేళ్ల తర్వాత ఇదే తొలి భేటీ
- త్వరలో ప్రత్యేక ప్రతినిధుల స్థాయి భేటీలు



బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కరచాలనం

కజాన్: భారత్, చైనా సంబంధాల మెరుగుదల దిశగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ప్రధాని నరేంద్ర మోదీ నడుమ ద్వైపాక్షిక సమావేశం బుధవారం జరిగింది. రష్యాలో జరిగిన మూడు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఇందుకు వేదికైంది. జిన్‌పింగ్, మోదీ అధికారికంగా భేటీ కావడం ఐదేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. లద్దాఖ్ సమీపంలో సరిహద్దు గస్తీపై ఇరు దేశాల సైనిక, తదితర ఉన్నతాధికారుల స్థాయిలో కుదిరిన తాజా ఒప్పందాన్ని అధినేతలిద్దరూ స్వాగతించారు. ఇరుదేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా పలు అంశాలపై ప్రత్యేక ప్రతినిధులు నడుమ మరిన్ని ఉన్నత స్థాయి చర్చలు జరపాలని నిర్ణయించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతల పరిరక్షణే ఇరుదేశాల ధ్యేయం కావాలని మోదీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పరస్పర విశ్వాసం, గౌరవం, పరిణతే ప్రాతిపదికగా ఇరు దేశాల సంబంధాలు బలపడాలని పిలుపునిచ్చారు. రష్యాలోని కజాన్‌లో బ్రిక్స్ సదస్సు ముగిసిన అనంతరం నేతల భేటీ జరిగింది. అన్ని అంశాలపైనా వారిద్దరూ 50 నిమిషాలకు పైగా లోతుగా చర్చలు జరిపారు. ''విభేదాలు, వివాదాలను చర్చలు
మిగతా 2వ పేజీలో ▶

**చర్చలు, దౌత్యానికే మా మద్దతు**
- సంఘర్షణలకు యుద్ధాలు పరిష్కారం కాదు
- 'బ్రిక్స్' సదస్సులో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాటం సాగించాలని పిలుపు

6లో

# రాష్ట్రంలో పొలిటికల్ బాంబులు

**ఒకట్రెండు రోజుల్లో పేలబోతున్నాయి: మంత్రి పొంగులేటి**



- అందులో ప్రధాన నేతలే ఉంటారు.. ధరణి, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర అంశాల్లో సాక్ష్యాలను బయటపెడతాం
- కక్ష సాధింపు చేయం.. పూర్తి ఆధారాలతో ప్రజల ముందుపెడతాం
- ఎంత పెద్దవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు..
- రెండు రిపోర్టులు ట్రాక్‌లో ఉన్నాయి.. అవి ప్రజలు కోరుకున్న విధంగా వస్తాయి

(సియోల్ నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి)

''రాష్ట్రంలో ఒకటి రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయి. దాంట్లో ప్రధాన నేతలు ఉంటారు. ధరణి, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంతోపాటు ఎనిమిది నుంచి 10 అంశాల్లో నిజాలు నిగ్గుతేల్చి ప్రజల ముందు ఉంచబోతున్నాం'' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణకొరియా పర్యటనలో ఉన్న ఆయన బుధ వారం సియోల్‌లో మీడియాతో మాట్లాడారు. ''తప్పు చేసినవాళ్లు ఎంత పెద్దవాళ్లు అయినా వదలం.. అది విదేశీ కంపెనీయా? వారిని ఎలా ట్రీసవుట్ చేయాలి? వారి వెనుక ఉన్న తొత్తులు ఎవరు? వారి మధ్య జరిగిన లావాదేవీలేమిటి?.. ఇలా అన్నింటినీ నిగ్గుతేల్చి మా ప్రభుత్వం ప్రజల ముందు పెట్టనుంది. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు'' అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

**ఆధారాలతో సహా ఫైళ్లు సిద్ధమవుతున్నాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు అంటూ ఆరోపణలు చేయడమే తప్ప, ఇప్పటివరకు ఎలాంటి రుజువులు చూపలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోందని మీడియా ప్రతినిధులు పేర్కొనగా.. మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. ''మేం సియోల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన తర్వాత రోజు తెల్లారో,
మిగతా 2వ పేజీలో ▶

**ఉత్తర భాగంలో మార్పాలంటూ కేంద్రమంత్రి గడ్కరీపై ఒత్తిళ్లు**

- కొన్నిచోట్ల స్థానికుల వ్యతిరేకతను ఆసరాగా తీసుకుని పావులు
- తమకు అనుకూలురైన వారికి ప్రయోజనం చేకూర్చే యత్నాలు
- మూడు ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లను మరోచోట ఖరారు చేయాలంటూ నేతల ప్రతిపాదనలు
- టెండర్లు సైతం ఖరారైన దశలో పెరుగుతున్న ఒత్తిళ్లతో ఉత్కంఠ



# అలైన్‌మెంట్‌లో టింక'రింగ్'!

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగు రోడ్డు దక్షిణ భాగాన్ని ఓపక్క రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా చేపట్టేందుకు సిద్ధమవుతుండగా, మరోపక్క ఉత్తర భాగం అలైన్‌మెంటులో మార్పులు చేయాలనే ఒత్తిడి మొదలైంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజల వ్యతిరేకతను ఆసరాగా చేసుకుని కొందరు నేతలు ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రజలకు మద్దతు ముసుగులో తమకు అనుకూలమైనవారి కోసం పావులు కదుపుతున్నారు. ఢిల్లీ స్థాయిలో మంత్రాంగం నడుపుతున్నారు. ఉత్తర భాగానికి సంబంధించి అన్ని రకాల గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయి, భూ పరిహారానికి అవార్డులు పాస్ చేసే సమయంలో ఇప్పుడు ఈ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. అలైన్‌మెంటు ఖరారై, టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నందున మార్పులు సాధ్యం కాదని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతుండగా, కొందరు నేతలు
మిగతా 2వ పేజీలో ▶

# బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో కిషన్‌రెడ్డి?

**బలంగా వినిపిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడి పేరు**
- దేవేంద్ర ఫడ్నవీస్, ధర్మేంద్ర ప్రధాన్, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ల పేర్లూ పరిశీలన.. దక్షిణాది రాష్ట్రాల నుంచే ఎంపికకు అవకాశం
- దక్షిణ భారతంలో పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యం
- డిసెంబర్ చివరికి కొత్త అధ్యక్షుడి ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ



భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను బీజేపీ అధిష్టానం వేగిరం చేసింది. డిసెంబర్ కల్లా కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ పూర్తయ్యేలా అన్ని రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని అన్ని రాష్ట్రాల యూనిట్‌లను ఆదేశించింది. ఈసారి దక్షిణాది రాష్ట్రాల వారికే అవకాశం ఎక్కువగా ఉందని, తద్వారా అక్కడ పార్టీ మరింత బలోపేతం దిశగా చర్యలుంటాయని బీజేపీ వర్గాలు బలంగా చెబుతున్నాయి. ఇప్పటికే సంస్థాగత ఎన్నికల నిర్వహణకు పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ నేతృత్వంలో ఎన్నికల కమిటీని నియమించారు. కమిటీ రెండ్రోజుల కిందటే పార్టీ కీలక నేతలతో వర్క్‌షాప్ నిర్వహించి సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై మార్గదర్శనం చేసింది. బీజేపీలో మొదట బూత్, ఆ తర్వాత మండల, ఆ తర్వాత జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. ఎన్నికల అధికారులు ప్రకటించే తేదీల్లో బూత్, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి ఎన్నిక కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల తర్వాత రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవాలి. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాష్ట్రాల అధ్యక్షుడిని ఎన్నుకోనుండగా, జాతీయ కౌన్సిల్ సభ్యులు జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు 2 నెలల సమయం.. అంటే డిసెంబర్ రెండో వారానికి పూర్తవుతుంది, ఆ తర్వాత
మిగతా 3వ పేజీలో ▶


గుంటూరు జీజీహెచ్‌లో సహానా కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

# తప్పంతా సర్కారుదే

**నాలుగున్నర నెలల్లో రాష్ట్రంలో వరుసగా అఘాయిత్యాలు**

**చంద్రబాబు బాధ్యత తీసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలి**

**చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్**
- గుంటూరులో సహానా, బద్వేలులో దస్తగిరమ్మ కుటుంబసభ్యులకు వైఎస్ జగన్ పరామర్శ
- ఏకంగా 77 మంది మహిళలు, పిల్లలపై అత్యాచారాలు
- మనవాడైతే చాలు ఏం చేసినా పర్వాలేదనే ధోరణిలో ప్రభుత్వం

12లో

# ఎలాంటి ఆధారాలూ లేకుండా దిగజారి మాట్లాడారు

- తీవ్ర నష్టం చేకూర్చేలా కొండా సురేఖ వ్యాఖ్యలు
- చెప్పలేని విధంగా, నీచంగా అసత్య ఆరోపణలు చేశారు
- మంత్రిపై క్రిమినల్ చర్యలు తీసుకోండి
- నాంపల్లి కోర్టులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాంగ్మూలం



సిటీ కోర్టులు (హైదరాబాద్): మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తనతో పాటు, తమ పార్టీకి కూడా తీవ్ర నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీ రామారావు చెప్పారు. ఆమె వ్యాఖ్యలు అత్యంత నీచంగా ఉన్నాయని, వాటిని విని తాను షాక్‌కు గురయ్యానని పేర్కొన్నారు. తనపై సురేఖ చేసిన కామెంట్లను చూసి పలువురు సాక్షులు తనకు ఫోన్ చేశారని తెలిపారు. కొండా సురేఖ తనపై అసత్య ఆరోపణలు చేసి తన పరువుకు భంగం కలిగించారని పేర్కొంటూ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని
మిగతా 12వ పేజీలో ▶


వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శ్రీకారం

**విద్యార్థులు సులువుగా మాట్లాడేలా తరగతుల నిర్వహణ..**

**6,7 తరగతుల విద్యార్థులకు రోజూ వీడియో పాఠాలు**

# మేమూ ఇంగ్లిష్‌లో మాట్లాడతాం!

**ఖమ్మం జిల్లాలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు**

**చక్కగా నేర్చుకుంటున్నా..**



ఈ కోర్సు వల్ల ఇంగ్లిష్ నేర్చుకున్నా. ప్రస్తుతం చిన్నచిన్న వాక్యాలను మాట్లాడగలుగుతున్నా. త్వరలోనే ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడతాననే నమ్మకం ఏర్పడింది. మాలాంటి విద్యార్థులకు ఇది ఒక చక్కటి అవకాశం.
– డి.బ్యూలా, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, కొణిజర్ల మండలం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ సులువుగా అర్థం చేయించడం.. ఆపై మాట్లాడేలా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ 'వుయ్ కెన్ లెర్న్ స్పోకెన్ ఇంగ్లిష్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉన్నప్పటికీ.. విద్యార్థుల్లో భయాన్ని తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌తోపాటే విద్యార్థులు మాట్లాడేలా గతనెల 28 నుంచి జిల్లాలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహిస్తున్నారు.

**1,252 మంది విద్యార్థులకు లబ్ధి**

జిల్లాలోని కల్లూరు, తల్లాడ, వైరా, కొణిజర్ల, చింతకాని, ముదిగొండ, బోనకల్, ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లోని 16 పాఠశాలలను స్పోకెన్ ఇంగ్లిష్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 6, 7 తరగతుల విద్యార్థులు 1,252 మంది ఉండగా.. 16 మంది టీచర్లకు అవగాహన కల్పించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానర్ (ఐఎఫ్‌పీ) డిజిటల్ బోర్డులున్న పాఠశాలలను ఎంపిక చేశారు. హైదరాబాద్‌కి చెందిన భారత్ దేఖో, మంత్రా పర్ చేంజ్, అలోకిట్, శిక్షా లోక్ స్వచ్ఛంద సంస్థలు రోజూ 15 నిమిషాల నిడివి ఉన్న వీడియోలను ఈ పాఠశాలలకు ఆన్‌లైన్‌లో పంపిస్తుండగా.. వీడియో చూశాక మరో 15 నిమిషాలు విద్యార్థుల నడుమ గ్రూప్ డిస్కషన్
మిగతా 3వ పేజీలో ▶

**నేను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయలేదు**
- కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదు
- జీవన్‌రెడ్డి చరిత్ర ఏంటో అందరికీ తెలుసు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యలు



- వివరాలు 2లో▶



**ఇదండీ సంగతి**


హలో కంట్రోల్ రూం! కిందికి దిగితే బెదిరింపులు వస్తున్నాయని ఇక్కడే ల్యాండ్ అయ్యాం!

## క్లుప్తంగా...

### విమర్శలు కాదు.. సలహాలివ్వండి

బీజేపీ నేతలకు మంత్రి పొన్నం సూచన



సాక్షి, హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుపై బీజేపీ నాయకులు విమర్శలు చేయకుండా సలహాలిస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దక్షిణ కొరియాలోని సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బీజేపీ నాయకులు మూసీ సందర్శనకు వెళ్లి అనవసరంగా ధర్నా చేస్తున్నారని దుయ్యబట్టారు. మూసీ పక్కన నివసిస్తున్న ప్రజల పునరావాసానికి సంబంధించిన సమస్యలను లిఖిత పూర్వకంగా ఇస్తే.. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. అవకాశవాద రాజకీయాలు చేయొద్దని, మొసలి కన్నీరు కార్చొద్దని కోరారు.

### కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

కాంగ్రెస్ నేతలు ఈరవత్రి అనిల్, ప్రీతం

సాక్షి, హైదరాబాద్: లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న గోడను కూలగొట్టినందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని టీపీసీసీ నేతలు ఈరవత్రి అనిల్, నాగరిగారి ప్రీతంలు కోరారు. అంబేడ్కర్ విగ్రహం ముందు జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనుల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గోడ కడితే కేటీఆర్, మరికొందరి ప్రోద్బలంతో బీఆర్‌ఎస్ సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులు ఆ గోడను పగులకొట్టారని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలో ఉన్నప్పుడు దళితులను అన్ని విధాలుగా మోసం చేసిన బీఆర్‌ఎస్, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత మతిభ్రమించిన పనులకు పాల్పడుతోందన్నారు. విలేకరుల సమావేశం అనంతరం అనిల్, ప్రీతంతో పాటు కాంగ్రెస్ నేతలు మెట్టు సాయికుమార్, కొనగాల మహేశ్ తదితరులు అదనపు డీజీ మహేశ్ భగవత్‌ను కలిసి కేటీఆర్, క్రిశాంక్, కేటీఆర్ పీఏ తిరుపతిలపై ఫిర్యాదు చేశారు.

### ఫిరాయింపులు సరికాదు..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టీకరణ



జగిత్యాల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సుస్థిరంగా ఉందనడంలో ఎలాంటి అనుమానాలూ లేవని, ఇలాంటి సమయంలో ఫిరాయింపుల కు పాల్పడడం సరికాదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హితవు పలికారు. పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన పంచ్‌న్యాయ్‌కి కట్టుబడి ఉండటం కాంగ్రెస్ ఆలోచన విధానమన్నారు. సీనియర్ నాయకుడు గంగారెడ్డి హత్య అనంతరం తీవ్ర భావోద్వేగానికి గురైన ఆయన బుధవారం ఉదయం భారీగా తరలి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాలలో బీఆర్‌ఎస్ ఎవరో.. కాంగ్రెస్ ఎవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ వారు కాంగ్రెస్ ముసుగులో ఉంటున్నారని ఆరోపించారు. కాగా, పీసీసీ అధ్యక్షుడి నుంచి జీవన్‌రెడ్డికి మళ్లీ ఫోన్ వచ్చినట్లు తెలిసింది. సీనియర్ నాయకులతో సమావేశంలో పాల్గొన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# రైతుల ఖాతాకు విడిగా రూ. 500 బోనస్

**కనీస మద్దతు ధరకు కలపకుండా ఇ-కుబేర్ ప్లాట్‌ఫాం ద్వారా..**

- ధాన్యం సేకరణపై నేడు సీఎం రేవంత్‌కు మంత్రివర్గ ఉపసంఘం నివేదిక
- 26న వరి ధాన్యం సేకరణ విధానంపై కీలక నిర్ణయం




సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: సన్న ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం ఇవ్వదలచిన క్వింటాలుకు రూ.500 బోనస్‌ను ధాన్యం డబ్బులతో సంబంధం లేకుండా విడిగా రైతుల ఖాతాలకు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయిస్తే కనీస మద్దతు ధర కింద అంత మొత్తం డబ్బులు పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతుల ఖాతాల్లోకి చేరుతుంది. ఇక బోనస్ కింద సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 మొత్తాన్ని ఆర్థిక శాఖ 'ఇ-కుబేర్' ప్లాట్‌ఫాం ద్వారా సదరు రైతుల ఖాతాల్లో జమచేయాలని నిర్ణయించింది. కేంద్రం అందిస్తున్న కనీస మద్దతు ధరకు రూ.500 బోనస్‌ను కలపడం వల్ల తలెత్తే సమస్యలను పరిగణనలోకి తీసుకొని 'బోనస్'ను వడ్ల డబ్బులతో కలపకుండా విడిగా రైతుల ఖాతాలకు జమ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం ఎన్ని రోజుల్లో డబ్బులు జమచేస్తుందనే విషయంలో వచ్చే మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖరీఫ్ సేకరణకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం బోనస్‌తో పాటు పలు సిఫార్సులతో నివేదిక రూపొందించింది. ఈ నివేదికను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించనుంది. ఈనెల 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ నివేదికపై చర్చించి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కాగా, రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 2,539 కేంద్రాలను ప్రారంభించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష సమావేశంలో చెప్పారు. రైతుల తిండిగింజల అవసరాలతో పాటు ప్రైవేటు వ్యాపారులు, రైతుల స్వీయ అమ్మకాలు పోగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి, మంత్రివర్గ ఉపసంఘం సభ్యుడు డి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

- కేంద్రమంత్రికి లీగల్ నోటీసు పంపిన కేటీఆర్
- నిరాధార ఆరోపణలు చేసినందుకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: తనపై నిరాధారమైన ఆరోపణలు చేసి తన పరువుకు నష్టం కలిగించారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు లీగల్ నోటీసు పంపారు. తనపై చేసిన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని పేర్కొన్నారు. ఈ నెల 19న మీడియాతో మాట్లాడుతూ సంజయ్ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాడంటూ బండి చేసిన ఆరోపణలను కేటీఆర్ తన నోటీసులో వివరించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా ప్రస్తావించారని తెలిపారు. సంజయ్ వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసుల నుంచి తప్పించుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని కేటీఆర్ ఈ సందర్భంగా సవాల్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారం తన పరువుకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**రాజకీయంగా ఎదుర్కొలేకనే ఆరోపణలు**

బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అయ్యాయని, ఈ కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్ చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ కావాలని కల్పించిన కట్టుకథలని తెలిపారు. కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశంతో, రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేళ్ల రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని విమర్శించారు. అసత్య ప్రచారం చేసినందుకు బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సుహృద్భావమే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

తదితరాల ద్వారా సజావుగా పరిష్కరించుకోవాలి. శాంతి, సౌభ్రాతృత్వాలను అవి దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి'' అంటూ చైనా అధ్యక్షునికి మోదీ ఈ సందర్భంగా హితవు పలికారు. ప్రపంచంలోనే అతి పెద్ద దేశాలైన చైనా-భారత మధ్య సత్సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే గాక ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సామరస్యాలకు చాలా కీలకమని పేర్కొన్నారు. భేటీ అనంతరం ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ భేటీని ఇరు దేశాల ప్రజలతో పాటు అంతర్జాతీయ సమాజం కూడా ఆసక్తిగా గమనిస్తోందని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. సమస్యలు, విభేదాల పరిష్కారానికి, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు ఇరు దేశాల మధ్యా అన్ని స్థాయిల్లోనూ మరింత సమన్వయం, మరిన్ని చర్చ లు అత్యవసరమన్నారు. పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు, సమస్యలు తదితరాలు కూడా నేతలిద్దరి చర్చల్లో చోటుచేసుకున్నాయి. షాంఘై సహ కార సంస్థకు 2025లో చైనా సారథ్యానికి పూర్తిస్థాయిలో మద్దతిస్తామని జిన్‌పింగ్‌కు మోదీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. చైనా, భారత సైనికుల మ ధ్య 2020 నాటి గాల్వన్ లోయ ఘర్షణల అనంతరం ఇరు దేశాల సంబంధాలు దారుణంగా క్షీణించడం తెలిసిందే. వాటిని చక్కదిద్దుకునే ప్రయత్నాల దిశగా ఈ భేటీని కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

**చర్చలు కొనసాగుతాయి**

పలు ద్వైపాక్షిక అంశాలను అధినేతలిద్దరూ దీర్ఘకాలిక దృష్టితో లోతుగా సమీక్షించినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ''సరిహద్దు వివాదం మొదలుకుని పలు విభేదాలపై ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు కొనసాగాలని వారు నిర్ణయానికి వచ్చారు. ఆ మేరకు త్వరలోనే చర్చలుంటాయి'' అని వెల్లడించారు. మోదీ-జిన్‌పింగ్ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు ముందుగా సరిహద్దు ప్రాంతాల వద్ద శాంతి, సామరస్యం నెలకొనాలన్న అంశంపై వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్టు వివరించారు. అభివృద్ధిపరమైన సవాళ్లను అధిగమిస్తూ పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారన్నారు. ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో భారత్‌కు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనాకు విదేశాంగ మంత్రి వాంగ్ యీ సారథ్యం వహిస్తున్నారు. వారి నడుమ 2019లో చివరిసారిగా చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల విషయంలో మోదీ సూచనలన్నింటికీ జిన్‌పింగ్ సూత్రప్రాయంగా అంగీకరించినట్టు చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఇరు దేశాలూ ప్రత్యర్థులుగా, పోటీదారులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండాలని, పరస్పర ప్రగతే ఉమ్మడి లక్ష్యంగా కలిసి సాగాలని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డట్టు పేర్కొంది.

**ఉజ్బెక్, యూఏఈ అధ్యక్షులతో మోదీ భేటీ**

బ్రిక్స్ సదస్సు చివరి రోజు బుధవారం ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్‌అల్ నహ్యాన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు. వారిద్దరితో చర్చలు అత్యంత ఫలప్రదంగా జరిగినట్టు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అనంతరం రెండు రోజుల రష్యా పర్యటన ముగించుకుని మోదీ భారత్ బయల్దేరారు.

# సర్కారు తీరుపై అన్ని వర్గాల్లో ఆగ్రహం

**అందరూ ఆందోళన బాటలోనే ఉన్నారు**

- ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంచడం ఏంటి?
- 'ఎక్స్' వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్


సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై అన్ని వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలతో పాటు ఉద్యోగులు కూడా ఆందోళన బాటలోనే ఉన్నారన్నారు. 'ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంచడం ఏంటి? ఇంత అన్యాయం ఎప్పుడైనా ఉందా?' అని ప్రశ్నించారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'ఉద్యోగుల ఉద్యమ బాట' వార్త క్లిప్పింగ్‌ను తన పోస్టుకు ట్యాగ్ చేశారు.

**అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానిస్తారా?**

'కనీసం కలిసి మాట్లాడటానికి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఉద్యోగ సంఘాలను అవమానించడం భావ్యమా? విన్నపాలు వినేతీరికకూడా లేదా ఈ ముఖ్యమంత్రికి? కొత్త పీఆర్సీ వేసి ఆరు నెలల్లోనే సిఫారసులు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. 11 నెలలు గడిచినా రెండో పీఆర్సీ నివేదికను ఎందుకు తెప్పించుకోలేదు? సీపీఎస్ రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీం తిరిగి తెస్తామని మాటిచ్చి ఇప్పుడు బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నారు. తెలంగాణ ఉద్యమంలో, స్వరాష్ట్ర ప్రగతిలో కీలక భూమిక పోషించిన ఉద్యోగ వర్గాల సమస్యలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం. ఏఈవోల ఆవేదన వినకుండా వందల మందిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడం, ఉద్యోగుల మీద కక్ష కట్టడం మంచిది కాదు. వాళ్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి..' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ఇప్పుడు ఎవర్ని రాయితో కొట్టాలి?**

'మీ సొంత పార్టీ నేతే మీరు ప్రోత్సహించిన ఎమ్మెల్యేల ఫిరాయింపులు అప్రజాస్వామికమని, దుర్మార్గమైన చర్య అని సూటిగా వేలెత్తి చూపుతున్నారు. ఇప్పటికైనా మీరు లెంప లేసుకుంటారా?..' అని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుడే ఇది కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకమంటూ మీ దిగజారుడు రాజకీయాలపై దుమ్మెత్తి పోశారు. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును ఒప్పుకుంటారా? క్షమాపణ చెబుతారా? ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు ఉంటాయా? ఇప్పుడు రాయితో కొట్టాల్సింది ఎవరిని? ఫిరాయించిన ఎమ్మెల్యేలనా? ప్రోత్సహించిన మిమ్మల్నా?..' అని కేటీఆర్ నిలదీశారు.




# రాష్ట్రంలో పొలిటికల్ బాంబులు

▶ మొదటి పేజీ తరువాయి

మరోనాడో ఒకటో, రెండో బాంబులు పేలబోతున్నాయి. దాంట్లో ప్రధాన నాయకులే ఉంటారు. ఈ ధరణికి సంబంధించి, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఇతరత్రా ఏవైతే ఎనిమిదో, పదో అంశాలు ఉన్నాయో.. తొందరపడో, ఉత్తపుణ్యానికో, అన్యాయంగానో వారిపై వేయాలన్నది కాదు. ఆధారాలతో సహా నిరూపిస్తాం. కాళేశ్వరంపై కమిషన్ వేశాం. త్వరలో దాని నివేదిక వస్తుంది. ధరణికి సంబంధించిన సమాచారం కూడా వస్తోంది. ఆల్రెడీ రెండు ట్రాక్‌లో ఉన్నాయి. ఆధారాలతో సహా ఫైళ్లు సిద్ధమవుతున్నాయి. త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయి'' అని తెలిపారు.

**కొత్త కాన్సెప్ట్‌లో ధరణి..**

రాష్ట్రంలో ధరణి వచ్చిన తర్వాత ఒకే కాలమ్‌లో పేరు ఉంటే రైతుకు భూమి ఉన్నట్లు లేదంటే భూమి లేనట్లు అయిపోయిందని మంత్రి పొంగులేటి చెప్పారు. అదే ఇప్పుడు తాము 12 నుంచి 14 కాలాలు తీసుకొచ్చి.. ఆ భూమి స్వభావం, గతంలో ఎవరి దగ్గర ఉంది వంటి వివరాలన్నీ నమోదు చేస్తామని తెలిపారు. ''భవిష్యత్తులో డాక్యుమెంట్‌లో ఎలాంటి అపార్థాలు లేకుండా ఉండేలా కాలాలు ఉంటాయి. ధరణి పేరు కూడా మార్చబోతున్నాం. కొత్త కాన్సెప్ట్‌లో భూమి ఉన్న ప్రతి ఆసామికి పూర్తిగా క్లియర్ టైటిల్‌తో డాక్యుమెంట్ ఉండబోతోంది. ధరణిలో మొత్తం 35 మాడ్యూల్స్ ఉన్నాయి. ఏదైనా భూసమస్యపై దరఖాస్తు చేయాల్సి వచ్చినప్పుడు.. తెలిసో, తెలియకో ఒక మాడ్యూల్ బదులు మరో మాడ్యూల్‌లో దరఖాస్తు చేస్తే.. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా రిజెక్ట్ అవుతుంది. మేం 35 మాడ్యూల్స్‌కు బదులు సింగిల్ డిజిట్‌లో మాడ్యూల్స్‌తో కొత్త కాన్సెప్ట్‌ను తీసుకురాబోతున్నాం..'' అని పొంగులేటి తెలిపారు. విదేశీ సంస్థ చేతుల్లో నుంచి భూరికార్డుల నిర్వహణను తప్పించి.. భారత ప్రభుత్వ సంస్థ ఎన్‌ఐసీకి ఇచ్చామని చెప్పారు. 2024 రెవెన్యూ యాక్ట్‌ను ప్రజలకు అనుకూలంగా ఉండేలా తీసుకొచ్చామని.. అభద్రతతో ఉన్న లక్షల మంది రైతులు, భూములున్న ఆసాములకు భరోసాను కల్పించబోతున్నామని పేర్కొన్నారు.

# కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడేది లేదు

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడేది లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక కేటీఆర్ లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తే జాలేస్తోందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు లీగల్ నోటీసులు పంపినట్లు మీడియాలో చూశానని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని తెలిపారు. ముందుగా కేటీఆర్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించారని అందుకు స్పందనగానే తాను మాట్లాడినట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. 'ఆయన సుద్దపూస అనుకుంటున్నారేమో. ఆయన భాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు.. నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం'అని మంత్రి పేర్కొన్నారు. కాగా, బండి సంజయ్‌కి పంపిన లీగల్ నోటీసులే కేటీఆర్ రాజకీయ జీవితానికి సమాధి అవుతాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'రాజకీయాల్లో నోటీసులే సమాధానమైతే నీకు వంద నోటీసులు పంపాలి. మీ నాన్నకు వెయ్యి నోటీసులు పంపాల్సి ఉంటుంది. మీరు బండి సంజయ్‌పై చేసిన వ్యక్తిగత ఆరోపణలను, బూతు పురాణాలను చూస్తే ఎన్ని నోటీసులు ఇవ్వాలో గుర్తు చేసుకో. నువ్వు మా సంజయ్‌ని గుండుగాడు, దద్దమ్మ, సన్నాసి, సదువు లేనోడంటూ వెకిలిగా మాట్లాడలేదా? మేం లీగల్ నోటీసులిస్తే.. మీరు పారిపోయే రోజులు వస్తయ్'అంటూ ప్రకాశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు.

# గంగారెడ్డి హత్య వెనుక ఎవరున్నా వదిలేది లేదు

గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి అనంతరం మీడియాతో శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి హత్య వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. జగిత్యాలలో జరిగిన ఘటన దురదృష్టకరమని, ఈ హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఇప్పటికే డీజీపీ, జిల్లా ఎస్పీకి ఆదేశాలిచ్చామని చెప్పారు. తనకు అత్యంత సన్నిహిత వ్యక్తి హత్య జరగడంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బాధలో ఉన్నారని, ఆయనతో తాను మాట్లాడానని వెల్లడించారు. హతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**328 దరఖాస్తుల స్వీకరణ:** మంత్రితో ముఖాముఖి కార్య క్రమంలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు మంత్రి శ్రీధర్‌బాబు గాంధీభవన్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. శ్రీధర్‌బాబును కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు పెద్దఎత్తున ప్రజ లు వచ్చారు. వీరి నుంచి మొత్తం 328 దరఖాస్తులు స్వీకరించినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఇందులో వీఆర్ ఏలు, డీఎస్సీ (స్పోర్ట్స్ కోటా) అభ్యర్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, సామాన్య ప్రజలు ఉన్నారు. కాగా, జీవో 46 కారణంగా పోలీసు నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందంటూ అభ్యర్థులు పెద్దఎత్తున వచ్చారు. వీరితో ప్రత్యేకంగా మాట్లాడిన శ్రీధర్‌బాబు ఈ సమస్య పరిష్కారానికి సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకుగాను ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశం ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ఈ సమావేశానికి బాధితుల తరఫున ప్రతినిధులు హాజరై తమ సమస్యలను చెప్పాలని కోరారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షు లు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

# నేను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయలేదు


కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదు: ఎమ్మెల్యే సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: తాను ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయ లేదని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చెప్పారు. మంగళవారం జరిగిన మారు గంగారెడ్డి హత్యను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాజ కీయం చేయడం తగదన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు హత్యా రాజకీయాలు ప్రోత్సహించబోరని, అభివృద్ధిని మాత్రమే కోరుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను పనిచేస్తున్నానని చెప్పారు. హత్య కేసులో తన హస్తం ఉందని జీవన్‌రెడ్డి అనడం చాలా దురదృష్టకరమని పేర్కొ న్నారు. ఫిరాయింపు రాజకీయాల గురించి మాట్లాడుతున్న జీవన్‌రెడ్డిది ఎలాంటి చరిత్రో అందరికీ తెలుసునని సంజయ్ వ్యాఖ్యానించారు.

# 'ఫిరాయింపులపై రాహుల్ ద్వంద్వ వైఖరి'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ద్వంద్వ విధానాలు, మోసపూరిత వైఖరి.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ వ్యాఖ్యలతో మరోసారి రుజువయ్యాయని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నట్లు స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు రాజ్యాంగాన్ని కాపాడుతున్నట్లు చెప్పుకుంటూ, అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేయడం రాహుల్‌గాంధీ ద్వంద్వ వైఖరికి నిదర్శమని హరీశ్ ఎద్దేవా చేశారు.

# అలైన్‌మెంట్‌లో టింక'రింగ్'..

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విషయమై కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఒత్తిడి పెంచుతుండటం గమనార్హం.

**ఎక్కడెక్కడ మార్పులు**

- సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ వద్ద ట్రిపుల్ ఆర్ ప్రారంభమవుతుంది. ఇక్కడ జాతీయ రహదారి మీద భారీ ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్ నిర్మించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో భూములు ఇచ్చేందుకు కొందరు రైతులు నిరాకరిస్తున్నారు. గతంలో పబ్లిక్ హియరింగ్, సర్వే జరగకుండా అడ్డుకున్నారు. ఇదే ప్రాంతంలో దక్షిణ రింగు ప్రారంభం కావాల్సి ఉంటుంది. దాన్ని ఉత్తర రింగులో భాగంగా నిర్మించే ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్‌తో అనుసంధానించాల్సి ఉంది. దక్షిణ రింగును మరింత దూరంగా నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో, కొందరు నేతలు దీన్ని ఆసరా చేసుకుని ఉత్తర రింగు కూడలిని మరోచోట నిర్మించాలని ప్రతిపాదిస్తున్నారు. రైతుల వ్యతిరేకిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తమకు అనుకూల ప్రాంతానికి చేరువగా రింగురోడ్డు ఉండాలన్న ఉద్దేశంతో కొందరు నేతలు మార్పు కోరుతుండగా, ప్రస్తుత అలైన్‌మెంటు తమకు చెందినవారి భూముల్లోంచి ఉండటంతో వాటిని కాపాడే ప్రయత్నంలో భాగంగా కొందరు మార్పు కోరుతున్నారు.
- యాదాద్రి జిల్లాలో రింగురోడ్డు విషయంలో స్థానికుల వ్యతిరేకత ఎక్కువగా ఉంది. గతంలో జాతీయ రహదారి కోసం కొందరు, సాగునీటి ప్రాజెక్టు కాలువల కోసం కొందరు.. ఇలా పలు సందర్భాల్లో భూములు కోల్పోయారు. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ కోసం మరోసారి భూసేకరణ జరగటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ కొందరు వ్యాపారుల భూములు కూడా అలైన్‌మెంటు పరిధిలో ఉన్నాయి. దీంతో వారు బడా నేతలను ఆశ్రయించారు. స్థానికుల అభ్యర్థనలను ఆసరాగా తీసుకుని అలైన్‌మెంటును మార్చాలని నేతలు ఒత్తిడి చేస్తున్నారు. ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్ రాయగిరి హైవే వద్ద కాకుండా ఎగువన నిర్మించాలని ప్రతిపాదిస్తున్నారు.
- ఉత్తర రింగు చౌటుప్పల్ వద్ద ముగుస్తుంది. చౌటుప్పల్ పట్టణ శివారులోనే ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్ నిర్మించాల్సి ఉంది. ఇది పట్టణానికి మరీ చేరువగా ఉందని, దీని వల్ల విలువైన భూములను స్థానికులు కోల్పోవాల్సి వస్తుందని, పరిహారంగా వారికి న్యాయమైన మొత్తం దక్కదంటూ కొందరు నేతలు వకాల్తా పుచ్చుకుని గడ్కరీ కార్యాలయంలో ఒత్తిడి పెంచారు. పట్టణానికి దూరంగా ఉండేలా అలైన్‌మెంటు మార్చాలని కోరుతున్నారు.

**ఇతర ప్రాంతాల రైతుల్లో ఆందోళన**

అలైన్‌మెంటు మారుస్తున్నారంటూ ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రచారం ప్రారంభమైంది. ఉన్నతస్థాయిలో ఒత్తిళ్ల వల్ల రింగురోడ్డును ప్రస్తుత ప్రాంతానికి దూరంగా మారుస్తున్నారంటూ స్థానికుల్లో తప్పుడు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇతర ప్రాంతాల్లోని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తమ భూములకు ఎక్కడ ఇబ్బంది కలుతుందోనన్న భయంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సంప్రదిస్తున్నారు. అయితే అలాంటిదేమీ లేదని అధికారులు చెబుతుండటంతో ..ఏది నిజమో తెలియని అయోమయంలో ఉన్నారు.

**చిన్న మార్పుతో భారీ తేడా!**

రింగురోడ్డు అలైన్‌మెంటులో ఓ ప్రాంతంలో చిన్న మార్పు చేస్తే దాని ప్రభావం ఇటు రెండు కిలోమీటర్లు, అటు రెండు కిలోమీటర్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఎక్స్‌ప్రెస్ వే అయినందున ఉన్నఫళంగా రోడ్డును మలుపు తిప్పే వీలుండదు. రెండు కిలోమీటర్ల దూరం నుంచి మొదలుపెట్టి క్రమంగా మలుపు తిప్పాల్సి ఉంటుంది. ఇక మార్పు ఎక్కువగా ఉంటే, అలైన్‌మెంటులో కూడా భారీ మార్పు చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం ఊరికి ఒకవైపు ఉందనుకుంటే, మార్పు వల్ల మరో వైపునకు మారే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే ప్రజల్లో తీవ్ర అలజడికి కారణమవుతుంది. కాబట్టి ఇలాంటి మార్పులకు అవకాశమే లేదని అధికారులు చెబుతున్నారు. అయితే నేతలు మాత్రం ఢిల్లీ స్థాయిలో తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్టు సమాచారం.

# మైక్రో ఫైనాన్స్ ఉచ్చులో మహిళలు

ప్రభుత్వమే రుణ సౌకర్యం కల్పించాలి: ఐద్వా




మాట్లాడుతున్న మరియం ధావలే, చిత్రంలో మల్లు లక్ష్మి తదితరులు

సింగరేణి (కొత్తగూడెం): మైక్రో ఫైనాన్స్ ఉచ్చులో పడి మహిళలు, యువత ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వమే వారికి రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే కోరారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరిస్తున్న విధానాలతో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య నానాటికీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒకటే అమలవుతోందని, మిగితా వాటిలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో ఐద్వా జాతీయ నేత ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### ప్రభుత్వరంగ సంస్థల కమిటీ అత్యంత కీలకం

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వరంగ సంస్థల కమిటీ అత్యంత ప్రాధాన్యం కలిగినదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో బుధవారం ప్రభుత్వరంగ సంస్థల కమిటీ (పీయూసీ) ప్రారంభ సమావేశం జరిగింది. పీయూసీ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన గుత్తా మాట్లాడుతూ కాగ్ వంటి సంస్థలు ప్రభుత్వరంగ సంస్థలపై ఇచ్చే నివేదికలను పరిశీలించి, తిరిగి వాటిపై శాసన మండలికి తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పీయూసీ నివేదికలను సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ శాసన మండలి ద్వారా ఏర్పాటైన కమిటీలలో ప్రభుత్వ లెక్కల కమిటీ, అంచనాల కమిటీతో పాటు ప్రభుత్వరంగ సంస్థల కమిటీ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కమిటీలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు.

### క్రీడల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేశ్ రంజన్



సాక్షి, హైదరాబాద్: యువజన వ్యవహారాలు, సాంస్కృతిక, క్రీడల మంత్రిత్వ శాఖలో నుంచి క్రీడలను విడదీసి ఆ శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేశ్ రంజన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వాణిజ్యం, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు క్రీడల శాఖను కూడా అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ నేపథ్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో నెలకొల్పాలని నిశ్చయించడంలో నిధుల సమీకరణ బాధ్యతను జయేశ్ రంజన్‌కు ఇవ్వడానికి క్రీడల విభాగాన్ని కూడా అప్పగించారని ప్రభుత్వ వర్గాల సమాచారం.

### క్రమబద్ధీకరించకపోతే ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26వ తేదీన జరగనున్న కేబినెట్ సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులర్, మినిమం టైం స్కేల్‌పై ప్రకటన చేయాలని, లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని సంఘం అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య ఒక ప్రకటనలో గుర్తు చేశారు. ఇప్పటికే 169 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

### డిస్టెన్స్ ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: దూరవిద్య ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ విధానంలో నవంబర్ 5వ తేదీ వరకూ, రూ.500 ఆలస్య రుసుంతో 8వ తేదీ వరకూ దరఖాస్తులు పంపుకోవచ్చని టీజీసీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.జలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష నవంబర్ 9న జరగనుందని తెలిపారు. వివరాలకు www.ouadmissions.com వెబ్‌సైట్‌కు లింక్ కావాలని సూచించారు.

### ఆర్టీసీ వేతన సవరణ బాండ్ల బకాయిల చెల్లింపు

**చివరి విడతగా 4,900 మందికి రూ. 53 కోట్లు**

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు 2015 వేతన సవరణకు సంబంధించిన బాండు బకాయిల చెల్లింపు ప్రక్రియను ఆర్టీసీ పూర్తి చేసింది. ఇప్పటికి మూడు విడతల్లో కేటగిరీల వారీగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తూ వచ్చిన ఆర్టీసీ, మిగిలిపోయిన 4,900 మంది ఉద్యోగులకు బుధవారం రూ.53 కోట్లు చెల్లించింది. దీంతో తొమ్మిదేళ్ల నాటి వేతన సవరణ బాండ్ల తాలూకు మొత్తాన్ని చెల్లించి ఆర్టీసీ ఊపిరి పీల్చుకుంది. 2013లో జరగాల్సిన వేతన సవరణను ప్రభుత్వం 2015లో చేసింది. ఆ రెండేళ్ల కాలానికి సంబంధించిన బకాయిల్లో సగం మొత్తాన్ని నగదు రూపంలో విడతలుగా చెల్లించింది. మిగతా సగాన్ని బాండ్లు విడుదల చేసింది. వాటి కాలపరిమితి తీరినా.. గత ప్రభుత్వం చెల్లించలేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగానే ఆ మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నూతన ప్రభుత్వం రావటంతో ఆ బకాయిలు రూ.281 కోట్లను విడుదల చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ, ఆర్టీసీకి మాత్రం నిధులు అందలేదు. కొన్ని నెలల జాప్యం తర్వాత రూ.81 కోట్లు అందటంతో డ్రైవర్లకు చెల్లించారు. మరో రెండు నెలల తర్వాత కండక్టర్లకు చెల్లించారు. గత నెలలో గ్యారేజీ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి చెల్లించారు. అధికారులు, ఇతర కార్యాలయ సిబ్బంది మిగిలారు. ఎట్టకేలకు బుధవారం వారికి చెల్లించారు.

## కొత్త టీచర్లు ఎలా ఉన్నారు?

**ఆరాతీస్తున్న విద్యాశాఖ**

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన కొత్త ఉపాధ్యాయుల పనితీరుపై విద్యాశాఖ ఆరా తీస్తోంది. క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ జిల్లా విద్యాశాఖాధికారులను కోరింది. దీంతో డీఈవోలు ఈ బాధ్యతను మండల విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రత్యేక అంశాలను ఎంఈవోలకు సూచించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా 11,062 మందికి టీచర్ పోస్టులు వచ్చాయి. ఇందులో చాలామందిని ఏకోపాధ్యాయ పాఠశాలల్లోనే నియమించారు. కొత్తగా చేరినవారి బోధనా సరళి ఏ విధంగా ఉంది? విద్యార్థులతో ఎలా మమేకమవుతున్నారు? సమస్యలు వస్తున్నాయా? ఏమేరకు చొరవ చూపుతున్నారు? అనే అంశాలపై ప్రధానంగా నివేదిక కోరారు. దీంతోపాటు పాలనాపరమైన విధులు, విద్యాశాఖ నిబంధనావళిని ఎంతవరకు పాటిస్తున్నారనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఎంపికైన టీచర్లకు ముందుగా శిక్షణ ఇవ్వాలని అధికారులు భావించినప్పటికీ అది సాధ్యంకాలేదు. ముందుగా రిసోర్స్ పర్సన్స్‌ను నియమించి, వారి ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు పాఠశాల విద్య అధికారులు తెలిపారు. ఈలోగా వారి బోధన విధానాన్ని నిశితంగా పరిశీలిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని, ఆయా అంశాలను కూడా శిక్షణలో జోడించే వీలుందని ఓ సీనియర్ అధికారి తెలిపారు.



# ‘సెట్’ చేసేశారా?



- ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిధులు గోల్‌మాల్.. పాత వీసీలపై ఆరోపణలు... ఐసెట్‌లో వెలుగు చూసిన దుర్వినియోగం.. రూ. 29 లక్షల వరకూ అవినీతి
- ఈఏపీసెట్‌పైనా ఆరోపణలు.. అయినా గప్‌చుప్
- ఆరా తీస్తున్న అధికారులు... అన్ని సెట్స్‌పైనా లెక్కలు పరిశీలించాలని ఆదేశం... కొత్త వీసీలకు తొలి బాధ్యత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ సంవత్సరం నిర్వహించిన పలు ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్) నిధులు పక్కదారి పట్టినట్టు ఆరోపణలొస్తున్నాయి. వీసీలు మారడంతో సెట్ కన్వీనర్లపై ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులొస్తున్నాయి. ‘సెట్’కు కేటాయించిన నిధులు కన్వీనర్లు, ఆయా యూనివర్సిటీ వీసీలు అడ్డగోలు లెక్కలతో కాజేశారని పెద్దఎత్తున ఆరోపణలు విన్పిస్తున్నాయి. కాకతీయ వర్సిటీ నిర్వహించిన ఐసెట్ వ్యవహారం ఇప్పటికే తీవ్ర వివాదంగా మారింది. జేఎన్‌టీయూహెచ్ నేతృత్వంలో సాగిన ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)పైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై మండలి చైర్మన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. వాస్తవాలు తెలియజేయాలని కొత్త వీసీలను కోరారు. అవసరమైతే ప్రత్యేక బృందాన్ని విచారణకు పంపాలని చైర్మన్ భావిస్తున్నట్టు తెలిసింది.

**అసలేం జరిగింది?**

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఏటా ఈఏపీ, ఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీఈసెట్, పాలిసెట్, పీజీసెట్ నిర్వహిస్తారు. వివిధ వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఒక్కో సెట్ నిర్వహణను ఒక్కో వర్సిటీకి అప్పగిస్తారు. ప్రతీ సెట్‌కు ఒక కన్వీనర్, కొంతమంది సభ్యులను ఎంపిక చేస్తారు. అతిపెద్ద సెట్ అయిన ఈఏపీ సెట్‌ను సాధారణంగా జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తుంది. మరికొన్ని కీలకమైన సెట్స్‌ను ఉస్మానియా వర్సిటీకి అప్పగిస్తారు. ఐసెట్‌ను కొన్నేళ్లుగా కాకతీయ విశ్వవిద్యాలయానికి అప్పగిస్తున్నారు. సెట్ రాసే విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత విద్యామండలి కాన్ఫిడెన్షియల్ నిధులు ఇస్తుంది. సెట్ ప్రశ్నపత్రం కూర్పు, ప్రింటింగ్, రవాణా, నిర్వహణకు వీటిని ఉపయోగిస్తారు. ఈ వ్యవహారం మొత్తం రహస్యంగా ఉంటుంది. కాబట్టి ఏ బాధ్యత ఎవరికి అప్పగిస్తున్నారనేది ముందే చెప్పరు. పరీక్ష పూర్తయిన తర్వాత బిల్లులు పెట్టడం, ఆడిట్ నిర్వహించి, వాటిని ఉన్నత విద్యా మండలి అనుమతించడం ఆనవాయితీగా వస్తోంది. సంబంధం లేని వ్యక్తులు, ఊహించని విధంగా కంప్యూటర్లు, ఇతర వస్తువుల కొనుగోళ్లు చేపట్టినట్టు బిల్లులు ఉండటంతో కొత్త వీసీలు సందేహాలు లేవనెత్తుతున్నారు.

**ఐసెట్ నిధులు గందరగోళం**

కాకతీయ వర్సిటీ నిర్వహించిన ఐసెట్ నిధుల లెక్కలపై ప్రస్తుత వీసీ అభ్యంతరాలు లేవనెత్తినట్టు సమాచారం. దీనిపై అందిన ఫిర్యాదులను మండలి చైర్మన్‌కు పంపినట్టు తెలిసింది. ఐసెట్ నిర్వహణ కోసం ఈ వర్సిటీ రూ.99.50 లక్షలు ప్రతిపాదించగా, మండలి రూ. 92.76 లక్షలు మంజూరైంది. ఈ నిధులను కన్వీనర్ ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకూ ఖర్చు చేసినట్టు గుర్తించారు. దాదాపు రూ.16 లక్షలు సెల్ఫ్ చెక్కుల ద్వారానే విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోందని మండలి వర్గాలు సందేహిస్తున్నాయి. సంబంధమే లేని ఓ వ్యక్తికి రూ.2 లక్షలు ఇవ్వడం, అవసరం లేని రవాణాకు రూ. 40 వేలు వెచ్చించడం, కార్యాలయంలో పనిచేస్తున్న ఓ చిన్న ఉద్యోగి ఖాతాలో నగదు జమ వ్వడం, ఏ సంబంధం లేని మహిళకు రూ.82 వేలు వెళ్లడం, సరైన ప్రమాణాలు లేకున్నా రూ.87 వేల చొప్పున 6 కంప్యూటర్లు కొనడం అనుమానాలకు తావిస్తోంది. ఇందులో రూ.29 లక్షల వరకూ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈఏపీసెట్ నిర్వహణ నిధుల విషయంలోనూ పలు ఫిర్యాదులు వచ్చినట్టు తెలిసింది. అయితే, ఈ వ్యవహారంలో మండలి వర్గాలు గోప్యత పాటిస్తున్నాయి. ఈ సెట్ కోసం దాదాపు రూ.3 కోట్లు వెచ్చించారు.

**పరిశీలిస్తున్నాం**

కాకతీయ నిర్వహించిన ఐసెట్‌పై ఆరోపణలు వచ్చిన మాట నిజమే. ఇందులో వాస్తవాలు ఏమిటనేది పరిశీలిస్తున్నాం. ఇతర సెట్‌ల విషయంలోనూ ఫిర్యాదులు వస్తే విచారణ జరిపిస్తాం. వాస్తవాలు పరిశీలించిన తర్వాత ఏం జరిగిందనేది వెల్లడిస్తాం.

– ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

# మేమూ ఇంగ్లిష్‌లో మాట్లాడతాం!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. వీడియోలోని బొమ్మలు, వాటి నడుమ సంభాషణ గుర్తుండి ఇంగ్లిష్ మాట్లాడటం సులువవుతుందని భావిస్తున్నారు. వీటిద్వారా విద్యార్థులు ఉత్సాహంగా ఇంగ్లిష్ నేర్చుకుంటున్నారు. 15 రోజులకోసారి సమీక్షిస్తున్న కలెక్టర్.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి ఇంగ్లిష్ పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**విద్యార్థులకు మంచి అవకాశం**



ఇంగ్లిష్ నేర్చుకోవడానికి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. ఆడియో, వీడియోల ద్వారా పిల్లలు ఉత్సాహంతో ఒత్తిడి లేకుండా నేర్చుకుంటారు. ఇప్పటికే చిన్నచిన్న వాక్యాలు మాట్లాడుతున్నారు. కలెక్టర్, డీఈఓ ఆదేశాలతో త్వరలోనే ఇంకొన్ని పాఠశాలల్లో ప్రారంభిస్తాం.

–జక్కంపూడి జగదీష్, జిల్లా కోఆర్డినేటర్, ఉయ్ కెన్ లెర్న్ ప్రోగ్రాం

**కలెక్టర్ సార్‌కు ధన్యవాదాలు..**



స్పోకెన్ ఇంగ్లిష్ ప్రోగ్రాంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేర్చుకోగలుగుతున్నాం. రోజూ వినడం వల్ల కొంతకాలం తర్వాత మాట్లాడగలుగుతాం. మా పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్ మొదలు పెట్టినందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సార్‌కు ధన్యవాదాలు.

– బి.దేవిక, 7వ తరగతి, జెడ్పీఎస్ఎస్, కల్లూరు, ఖమ్మం జిల్లా

**త్వరలోనే 200 పాఠశాలల్లో..**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లిష్ మాట్లాడగలమనే విశ్వాసం కలిగించేలా ఈ కార్యక్రమం చేపట్టాం. ప్రస్తుతం 16 పాఠశాలలను ఎంపిక చేసినా త్వరలోనే 200 పాఠశాలలకు విస్తరిస్తాం. ప్ర భుత్వ పాఠశాలల్లో చదివాక డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు ఇంగ్లిష్‌లో రాణించలేక ప్రైవేట్ ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. దీంతో ‘వుయ్ కెన్ లెర్న్ స్పోకెన్ ఇంగ్లిష్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్, ఖమ్మం



# రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు!

**వాతావరణ నిపుణుల సూచన... బంగాళాఖాతంలో తుపాను ప్రభావం**

సాక్షి, హైదరాబాద్: తూర్పు– మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ బుధవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తుపానుగా మారింది. ఇది పారదీప్ (ఒడిశా)కు ఆగ్నేయ దిశగా సుమారు 560 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. వాయువ్య దిశగా కదులుతూ గురువారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అనంతరం 25న తెల్లవారుజాము కల్లా ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో పూరి, సాగర్ దీవుల మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని వెల్లడించారు.

**తగ్గుతున్న ఉష్ణోగ్రతలు:** ప్రస్తుతం రాష్ట్రానికి ఉత్తర, ఈశాన్య దిశల నుండి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి వర్షాలు నమోదయ్యాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నాటికి 7.48 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా. 6.02 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 81.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, బుధవారం నాటికి 102.28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 26 శాతం అధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవన సీజన్ నుంచి ఈశాన్య రుతుపవనాల సీజన్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో అత్యధికం, 16 జిల్లాల్లో అధికం, 12 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 2 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది.

### బీసీల భాగస్వామ్యంతోనే కులగణన: జాజుల



నల్లగొండ టౌన్: సమగ్ర కులగణనలో అన్ని బీసీ కులాలవారు భాగస్వాములై.. తమ కుటుంబ స్థితిగతులను నమోదు చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. అందుకోసం కులసంఘ నేతలంతా పట్టణ, గ్రామ స్థాయిలో అన్ని కులాల వారికి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం నల్లగొండలోని బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలని జీవో 18 విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో.. సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని పేర్కొన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

### ‘ఫీజు బకాయిలు విడుదల చేయకుంటే మిలిటెంట్ ఉద్యమాలే’

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని, ఈనెల 27లోపు బకాయిలు విడుదల చేయకుంటే ‘చలో ఇందిరాపార్క్’కార్యక్రమం నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. భారీగా విద్యార్థులు తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లారు. అరగంటసేపు గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు.

# ఏఈవోల్లో చీలిక!

- డిజిటల్ క్రాప్ సర్వేకు ముందుకొచ్చిన కొందరు
- ఉద్యమం కొనసాగిస్తామంటున్న మరికొందరు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన వ్యవసాయ శాఖ



సాక్షి, హైదరాబాద్: డిజిటల్ క్రాప్ సర్వేను బహిష్కరిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారుల్లో చీలిక ఏర్పడింది. ప్రభుత్వం 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడంతో అనేకమంది వెనక్కి తగ్గినట్టు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపితో బుధవారం జరిగిన చర్చల్లో కొందరు ఏఈవోలు సానుకూలత వ్యక్తం చేశారు. వారి సమస్యలపై వచ్చే సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చలు జరిపేందుకు అవకాశం కల్పిస్తానని డైరెక్టర్ హామీ ఇవ్వడంతో ఏఈవోలు తమ సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని ఉపసంహరించుకుంటున్నామని, డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు సిద్ధమేనని ఆయనకు తెలిపారు. వచ్చే వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని, ఏఈవోల సస్పెన్షన్‌ను కూడా ఎత్తివేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ఏఈఓలు డిజిటల్ సర్వేలో పాల్గొంటారంటూ డైరెక్టర్ గోపీ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో కొందరు ఏఈవో సంఘం నేతలు గురువారం నుంచి డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సర్వే చేస్తామని తెలిపారు. మొత్తంగా సగం మంది ఏఈఓలు సర్వే చేస్తామని చెబుతుండగా, సగంమంది సర్వే చేసేది లేదని తేల్చి చెబుతున్నారు. ముఖ్యంగా మహిళా ఏఈఓలు ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే చేయమని చెబుతున్నట్టు తెలిసింది. దీంతో ఏఈవోలు రెండు వర్గాలుగా చీలిపోయినట్టు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. కాగా, బుధవారం జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన ఏఈవోలు వ్యవసాయ కమిషనరేట్ వద్ద నిరసనకు దిగారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని, సస్పెండ్‌చేసిన ఏఈవోలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక దశలో కమిషనరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ముందస్తుగా పోలీసులను మోహరించారు.

**ఏఈవోల సస్పెన్షన్‌తో వ్యవసాయ కార్యక్రమాలపై ప్రభావం**

కక్ష సాధింపు చర్య వల్లే సస్పెండ్ చేశారని ఏఈవోలు మండిపడుతున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో ఇంతమందిని సస్పెండ్ చేయడం వల్ల అనేక పథకాలు, వ్యవసాయశాఖ చేపట్టే కార్యక్రమాలకు విఘాతం కలగనుంది. ఇప్పుడు గ్రామాల్లో ధాన్యం, పత్తి మార్కెట్లోకి వస్తుంది. ఈ సమయంలో ఏఈవోలు కీలకంగా వ్యవహరిస్తారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే, రైతులకు అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సింది కూడా ఏఈవోలే. ఇలాంటి కీలక సమయంలో ఏఈవోలపై ఉక్కుపాదం మోపడం పట్ల వ్యవసాయ ఉద్యోగులు మండిపడుతున్నారు. కాగా, ఏఈవోలు దారికొస్తే సరేసరి లేకుంటే మరికొందరిపైనా కఠిన చర్యలు చేపడతామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. ఏఈవోలకు ప్రత్యేక భారం ఏమీ ఉండదని, వారం పది రోజులపాటు నిర్వహించే డిజిటల్ క్రాప్ సర్వేను బహిష్కరించాల్సిన అవసరం ఏంటని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. కావాలని ఏఈవోలు ఇదంతా చేస్తున్నారని, వారిని ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొడుతున్నాయని అంటున్నారు. మరోవైపు సమ్మెకు సిద్ధమైన ఏఈవోలకు కొన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటిస్తుండగా, మరోవైపు పేరొందిన పలు ఉద్యోగ సంఘాల నేతలు బెదిరింపులకు దిగినట్టుగా తెలిసింది. ఏ విధంగానైనా సరే ఏఈవోలను సమ్మెకు వెళ్లకుండా వారు తీవ్ర ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది.

### గడ్డి తీయడం.. రాళ్లు ఎత్తడమేనా ఉద్యోగమంటే..

- ప్రశ్నిస్తూ రోడ్డెక్కిన పోలీస్ కుటుంబాలు..
- ఏక్ స్టేట్–ఏక్ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేయాలంటూ ఆందోళన



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న టీజీఎస్పీ కానిస్టేబుల్స్ కుటుంబీకులు

గోవిందరావుపేట: పోలీసు ఉద్యోగమంటే గడ్డి తీయడం.. రాళ్ల ఎత్తడమేనా అని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని టీజీఎస్పీ ఐదో బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబీకులు ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం జాతీయ రహదారి 163పై బైఠాయించి ఏక్ స్టేట్–ఏక్ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పస్రా సీఐ రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని పోలీస్ కుటుంబీకులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు టీజీఎస్పీ కానిస్టేబుల్ కుటుంబీకులు మాట్లాడుతూ 8 గంటలకు మించి పని చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బెటాలియన్ పోలీసులకు ఐదేళ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరారు. టీజీఎస్పీ బెటాలియన్‌కు చెందిన పోలీసులు వెట్టి చాకిరీ చేస్తున్నారని, వారు నెలలో 4 రోజులు మాత్రమే ఇంటికి వస్తున్నారన్నారు. ఆ సమయంలో పిల్లలు తమ తండ్రిని కూడా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో బెటాలియన్‌లో గడ్డి తీయిస్తున్నారని, రాళ్లు మోయిస్తున్నారని చెప్పారు. మూడు నెలలకోసారి పోస్టింగులు మార్చడం వల్ల పిల్లల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వాపోయారు.

### భార్యలు ధర్నాలు చేస్తే భర్తలను సస్పెండ్ చేస్తారా?: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: భార్యలు రోడ్డెక్కితే భర్తలను సస్పెండ్ చేసే చట్టం ఎక్కడా లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నల్లగొండలోని 12వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవంలో పాల్గొన్న రోజే పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాలు ధర్నా చేశాయని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు స్పెషల్ కానిస్టేబుళ్లు 15 రోజులు డ్యూటీ చేస్తే, 4 రోజులు సెలవులు ఉండేవని, ఇవ్వాళ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక 26 రోజులు కంటిన్యూ డ్యూటీ చేస్తే, 4 రోజులు లీవ్ ఇస్తామని అంటున్నారని ఆర్ఎస్పీ తెలిపారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఏక్ పోలీసు నినాదం అన్నారని, ఇప్పుడా నినాదం ఏమైందని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా వాళ్లపై ఎన్ని కేసులు పెట్టారని మాత్రమే రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా నేరాలు పెరిగిపోతున్నాయని, అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ లింగారెడ్డి దంపతులను దారుణంగా హత్య చేశారని చెప్పారు.

### బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో కిషన్‌రెడ్డి?

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారు.

**దక్షిణాదికే అవకాశమెక్కువ..:** ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం గత ఏడాది డిసెంబర్‌తో ముగిసినా సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీకాలాన్ని జూన్ 30 వరకు పొడిగించారు. ఆ తర్వాతా ఆయన్నే కొనసాగిస్తున్నారు. ఆరు నెలల నుంచి వివిధ పేర్లపై బీజేపీ కసరత్తు చేస్తోంది. ఇందులో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు శివరాజ్‌సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), సునీల్ భూపేంద్ర యాదవ్ (రాజస్తాన్), దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), ధర్మేంద్ర ప్రధాన్ (ఒడిశా)ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే కర్ణాటకలో తిరిగి అధికారం చేజిక్కించుకోవడం సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో పార్టీని మరింత విస్తరించాలని భావిస్తున్న బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాల నుంచే అధ్యక్షుడిని ఎంపిక చేస్తుందని బలమైన ప్రచారం జరుగుతోంది. జనవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశమున్న దృష్ట్యా, డిసెంబర్ రెండు లేదా మూడో వారానికి కొత్త అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో అధినాయకత్వం ఉంది.



బుధవారం వయనాడ్‌లో ప్రియాంకా గాంధీ నామినేషన్ కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### అటవీ శాఖ సిబ్బందికి ‘ప్రెసిడెన్షియల్’ అవార్డులివ్వండి

- కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు మంత్రి కొండా సురేఖ లేఖ
- రాష్ట్రంలోనూ సీఎం అవార్డులు అందించాలని ముఖ్యమంత్రికి వినతి



సాక్షి, హైదరాబాద్: అడవుల సంరక్షణలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్న అటవీ సిబ్బందికి కూడా పోలీసులకు ఇస్తున్న మాదిరిగానే విశేష సేవలందించే వారికి ‘ప్రెసిడెన్షియల్ గ్యాలెంటరీ అవార్డులు’అందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు బుధవారం లేఖ రాశారు. అలాగే రాష్ట్రంలోనూ సీఎం అవార్డు, అటవీ సేవా పతకాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా విడిగా మరో లేఖ రాశారు.



ధనం అనేది వివేకి బానిస, మూర్ఖుడి యజమాని.
– సెనెకా



సాక్షి
గురువారం, 24 అక్టోబర్ 2024

# ఈ భేటీ శుభ పరిణామం

అయిదేళ్ల తర్వాత నైరుతి రష్యాలోని కజన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల మధ్య బుధవారం ద్వైపాక్షిక సమావేశం జరిగింది. బ్రిక్స్ శిఖరాగ్ర భేటీ సందర్భంగా రెండు దేశాల అధినేతల మధ్యా చర్చలు జరగటం శుభపరిణామం. డెస్పాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో ఇరు దేశాల సైన్యాల గస్తీకి రెండురోజుల క్రితం అవగాహన కుదరటంతో అధినేతల భేటీ సాధ్యమైంది. ఈ విషయాన్ని మన విదేశాంగ మంత్రి జైశంకర్ సోమవారం ప్రకటించటం... దానికి అనుగుణంగా చైనా వైపునుంచి కూడా ప్రకటన జారీకావటంతో వాతావరణం తేలికపడింది. అయితే గతాన్ని అంత తేలిగ్గా మరిచిపోరాదు. సరిగ్గా అయిదేళ్లనాడు ఇదే నెలలో తమిళనాడులోని మహాబలిపురం వేదికగా ఇరు దేశాధినేతలూ కలుసుకోగా ఆ తర్వాత ఏడాది తిరగకుండానే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి చైనా తన నైజం చాటుకుంది. దాంతో ఇరు దేశాల సంబంధాలూ కనీవినీ ఎరుగనంతగా దెబ్బతిన్నాయి. నిజానికి అంతక్రితం 2018లో మోదీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సంప్రదింపుల కోసం వూహాన్ తరలివెళ్లిన నాటికే డోక్లాంలో రెండు దేశాల సైనికుల మధ్యా 73 రోజులపాటు ఘర్షణ వాతావరణం కొనసాగింది. డోక్లాం చిన్న అపశ్రుతి మాత్రమేనని, అంతా చక్కబడిందని అనుకుని మహాబలిపురంలో జిన్‌పింగ్‌కు ఘనమైన ఆతిథ్యం అందించిన కొద్దికాలానికే మళ్లీ సరిహద్దుల్లో సమస్యలు తలెత్తాయి. 2020 ఏప్రిల్‌లో చైనా సైనికులు వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)ను అతిక్రమించి గాల్వాన్ లోయలో చొరబాట్లకు పాల్పడ్డారు. తూర్పు లద్దాఖ్‌లోని ప్యాంగ్యాంగ్, డెస్పాంగ్, హాట్‌స్ప్రింగ్స్ తదితరచోట్ల ఆక్రమణలకు దిగి అక్కడ మన సైనికులు గస్తీ తిరగడానికి వీల్లేదని పేచీకి దిగారు. కర్రలు, ఇనుపరాడ్లతో మన జవాన్లపై దాడికి దిగి 21 మంది ఉసురు తీశారు.

అంతంతమాత్రంగా సాగుతూవచ్చిన సంబంధాలు కాస్తా ఆ తర్వాత పూర్తిగా పడకేశాయి. సరిహద్దు వివాదాలపై ఇరు దేశాల సైనిక కమాండర్ల మధ్య సంప్రదింపులు జరుగుతున్నా, అడపాదడపా సేనల ఉపసంహరణ జరిగినా మునుపటి సాన్నిహిత్యం లేదు. రెండు దేశాల విదేశాంగ మంత్రులూ 2020 సెప్టెంబర్‌లో సమావేశమై ఉద్రిక్తతల ఉపశమనానికి పంచసూత్ర పథకం రూపొందించారు. రక్షణ మంత్రుల స్థాయిలో కూడా చర్చలు జరిగాక వివాదాస్పద ప్రాంతాల నుంచి సైన్యాలను ఉపసంహరించుకోవాలన్న నిర్ణయం కూడా తీసుకున్నారు. కానీ సమస్యలు పూర్తిగా సమసిపోలేదు. 2022లో బాలిలో జరిగిన జీ–20 శిఖరాగ్ర సదస్సు, నిరుడు జోహాన్నెస్‌బర్గ్‌లో నిర్వహించిన బ్రిక్స్ అధినేతల సదస్సు సందర్భాల్లో మోదీ, జిన్‌పింగ్‌లు కలిసిన మాట వాస్తవం. అయితే అవి ముక్తసరి, మర్యాదపూర్వక భేటీలు మాత్రమే. ఆ తర్వాత ఎల్‌ఏసీలో పరిస్థితులు స్వల్పంగా మెరుగుపడ్డాయి. అయినా మన హిమాచల్‌ప్రదేశ్ గ్రామాలకు చైనా తనవైన పేర్లు పెట్టడం, సరిహద్దుల్లో కొత్త గ్రామాలు సృష్టించటంవంటి గిల్లికజ్జాలకు మాత్రం కొదవలేదు.

ఎల్‌ఓసీలో 45 ఏళ్లుగా ఇరు దేశాల సైనికులూ నిరంతరాయంగా గస్తీ కొనసాగిస్తున్న చోటులో చైనా దళాలు ఆక్రమణలకు దిగి ఇక్కడ గస్తీ కాయొద్దంటూ అభ్యంతరపెట్టడంతో 2020లో కొత్త వివాదం మొదలైంది. ఇలా మన జవాన్లు ఉండే చోటుకొచ్చి కవ్వింపులకు దిగి ఎదురుదాడి చేయటమో, మానటమో మనవాళ్లే తేల్చుకోవాల్సిన స్థితి కల్పించటం చైనా మొదలెట్టిన కొత్త వ్యూహం. యథాతథ స్థితిని కాలరాసి ఆ ప్రాంతం ఎప్పటినుంచో తమదన్న తర్కానికి దిగటం చైనాకే చెల్లింది. 1962లో సైతం ఇలాంటి వైఖరితోనే మన దేశంపై దురాక్రమణకు తెగించింది. అంతవరకూ మన దేశం చైనాకు అన్నివిధాలా సహాయసహకారాలు అందజేసింది. చైనా ఆవిర్భావం తర్వాత దాన్ని గుర్తించటంలో మనం ముందున్నాం. ఆ తర్వాత 'పంచశీల' ఒప్పందం సైతం కుదిరింది. కానీ దానికి వెన్నుపోటు పొడిచింది చైనాయే.

తాజాగా రెండు దేశాల మధ్యా సామరస్యత నెలకొనడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ చొరవ తీసుకున్నారన్న కథనం వినిపిస్తోంది. రష్యాను అంతర్జాతీయంగా ఏకాకిని చేయాలని పాశ్చాత్య దేశాలూ, అమెరికా ప్రయత్నిస్తున్న తరుణంలో రష్యా తన ప్రయోజనాలు కాపాడుకోవాలనుకోవటంలో వింతేమీ లేదు. ఉక్రెయిన్‌తో రష్యా సాగిస్తున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు భారీయెత్తున ఆయుధ సామగ్రి అందిస్తున్న ఆ దేశాలు రష్యాను ఆర్థిక ఆంక్షలతో కూడా దిగ్బంధించి దెబ్బ తీయాలని చూశాయి. ఆ తరుణంలో భారత్, చైనాలు రష్యానుంచి ముడి చమురు కొనుగోలుచేసి ఆదుకున్నాయి. అందుకే కావొచ్చు... ఆ రెండు దేశాలమధ్యా సామరస్యత సాధించి పాశ్చాత్య ప్రపంచానికి పుతిన్ షాక్ ఇచ్చారు. ఇరుగుపొరుగు దేశాలన్నాక సమస్యలు సహజం. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని, సామరస్యంగా మెలగాలని ఇరుపక్షాలూ అనుకున్నప్పుడు మాత్రమే అటువంటి సమస్యలు పరిష్కారమవుతాయి. అటు చైనాకు ఆర్థికరంగంలో సమస్యలు ముంచుకొస్తున్నాయి. అక్కడ హౌసింగ్ రంగం తీవ్రంగా దెబ్బతిని దాని ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. రుణభారం తడిసి మోపెడైంది. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో దాన్ని సక్రమంగా పరిష్కరించకపోతే చైనాయే కాదు... చైనాతోపాటు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ దెబ్బతింటాయి. భారత, చైనాలు రెండూ జనాభాపరంగా ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి. అతి పెద్ద మార్కెట్‌గల భారత్‌తో సంబంధాలు మెరుగుపడితే తన ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకోవటానికి ఆ చర్య తోడ్పడుతుందన్న వివేకం చైనాకు ఉండాలి. అధినేతల మధ్య అవగాహన ఆచరణలో కనబడాలి. మాటకూ, చేతకూ పొంతన కుదరాలి. అప్పుడు మాత్రమే చెలిమి వర్ధిల్లుతుంది.

# నోబెల్ అవార్డులు చెప్పే పాఠాలు

విశ్లేషణ



దినేశ్ సి.శర్మ

**ఈ ఏడాది భౌతిక, రసాయనశాస్త్ర నోబెల్ అవార్డులను పరిశీలించారా? ఈ రెండింటితోనూ రేపటితరం టెక్నాలజీగా చెప్పుకొంటున్న కృత్రిమ మేధకు సంబంధం ఉంది. కృత్రిమ మేధ పునాదులు దశాబ్దాల నాటి ఆవిష్కరణల్లో ఉన్నాయని ఈ పురస్కారాలు చాటుతున్నాయి. మౌలికాంశాలపై పరిశోధనలు ఎంత ముఖ్యమో కూడా ఇవి మరోసారి స్పష్టం చేస్తున్నాయి. మానవ విజ్ఞానం విస్తరించేందుకూ ఇవి ఎంతగానో అవసరం. మౌలికాంశాల పరిశోధనలకు ప్రత్యామ్నాయం లేదు. భారతీయులెవరికీ నోబెల్ అవార్డులు దక్కడం లేదంటే... అందుకు కారణం అదే. అంతర్జాతీయ స్థాయి శాస్త్ర రంగంలో భారత్ తనదైన ముద్ర వేయాలంటే, మౌలికాంశాలపై పరిశోధనలకు పెద్దపీట వేయాలి. ఇదో దీర్ఘకాలిక కార్యక్రమం అన్నది కూడా గుర్తు పెట్టుకోవాలి.**


ఈ ఏడాది భౌతిక శాస్త్ర నోబెల్ అవార్డులు పొందిన జాన్ హాప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్ భౌతిక శాస్త్ర సిద్ధాంతాలను, టూల్సును మెషీన్ లెర్నింగ్ కోసం ఉపయోగించారు. అణువు తిరిగే పద్ధతి సాయంతో హాప్‌ఫీల్డ్ సమాచారాన్ని నిల్వ చేసుకునే, పునర్మించే నిర్మాణం రూపొందించారు. హింటన్ సమాచార ధర్మాలను స్వతంత్రంగా గుర్తించగల పద్ధతిని ఆవిష్కరించారు. ప్రస్తుతం విస్తృత వినియోగంలో ఉన్న న్యూరల్ నెట్‌వర్క్‌కు పునాదులు ఇవే. కాలక్రమంలో ఈ ఆవిష్కరణలు కంప్యూటర్లు కాస్తా మానవుల జ్ఞాపకశక్తి, నేర్చుకునే శక్తులను అనుకరించేంత శక్తిమంతమయ్యాయి.

ఇప్పుడు ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు సంగతి చూద్దాం. వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన డేవిడ్ బేకర్, గూగుల్ డీప్‌మైండ్‌లో పని చేస్తున్న డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం.జంపర్‌లకు ఈ పురస్కారం దక్కింది. ప్రొటీన్ డిజైన్‌ను కంప్యూటర్ల సాయంతో అంచనా వేసేందుకు బేకర్ ఒక పద్ధతిని ఆవిష్కరిస్తే, డీప్‌మైండ్ శాస్త్రవేత్తలు ప్రొటీన్ల నిర్మాణాన్ని ముందస్తు అంచనా వేయగలిగారు. మన శరీరంలోని కణాలు, జీవక్రియలన్నింటికీ ప్రొటీన్లే కీలకం. అవి అతి సంక్లిష్టమైన పద్ధతుల్లో ముడుచుకుని ఉంటాయి. ఈ ముడతల్లోని తేడాలు, మార్పులు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అణు నిర్మాణం, పరిసరాల్లోని నీటి పరమాణువులు ప్రొటీన్ ముడతలను నిర్ణయిస్తాయి. ఒకే ఒక్క ప్రొటీన్ లెక్కలేనన్ని ఆకారాల్లో ఉండవచ్చు. కొత్త ప్రొటీన్లను డిజైన్ చేసేందుకు అవసరమైన కంప్యూటర్ నియమాలను బేకర్ అభివృద్ధి చేశారు. దీనివల్ల కొత్త చికిత్సలు, పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఇక గూగుల్ డీప్‌మైండ్ శాస్త్రవేత్తలు ఆల్ఫా–ఫోల్డ్ పేరుతో తయారు చేసిన సాఫ్ట్‌వేర్ అమైనో ఆమ్ల క్రమాన్ని బట్టి ప్రొటీన్ త్రీడీ నిర్మాణాన్ని ముందుగానే అంచనా కడుతుంది.

### పథ నిర్దేశకులకే నోబెల్...

మౌలికాంశాలపై పరిశోధనలు ఎంత ముఖ్యమో ఈ అవార్డులు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. సీవీ రామన్ తరువాత భారతీయులెవరికీ నోబెల్ అవార్డు దక్కలేదంటే... కారణం ఇదే. హరగోబింద్ ఖొరానా, ఎస్.చంద్రశేఖర్, వెంకీ రామకృష్ణన్ వంటి వారు విదేశీ విశ్వవిద్యాలయాల్లో మౌలిక అంశాలపైనే పరిశోధనలు చేసి నోబెల్ అవార్డులు సాధించిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి.

నోబెల్ అవార్డులు సాధారణంగా సాంకేతిక, శాస్త్ర రంగాల్లో కొత్త మార్గాలను ఆవిష్కరించిన వారికే ఇస్తూంటారు. హాప్‌ఫీల్డ్ విషయాన్నే తీసుకుందాం. తొంభై ఒక్క సంవత్సరాల వయసున్న ఈయన 'హాప్‌ఫీల్డ్ నెట్‌వర్క్' అని పిలుస్తున్న ఆవిష్కరణ కోసం 1980 నుంచే కృషి చేస్తున్నారు. హింటన్ ఆవిష్కరించిన 'బోల్ట్జ్‌మన్ మెషీన్' పద్ధతి కూడా దశాబ్దాల కృషి ఫలితమే. ఎంతో కాలం తరువాత 2010లో ఈ




కృత్రిమ మేధలో భారతీయులు : పి.సి. మహలనోబిస్, డి. రాజ్ రెడ్డి

ఆవిష్కరణలు మెషీన్ లెర్నింగ్ రంగాన్ని సమూలంగా మార్చేశాయి. చాట్‌జీపీటీ వంటి వినియోగదారు ఉత్పత్తికి వీరి పరిశోధనలే మూలం. ఇదే విధంగా రసాయన శాస్త్రంలో బేకర్ ప్రొటీన్ నిర్మాణాలపై దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. 1998లో ఆయన తన తొలి ఆవిష్కరణ 'రొసెట్టా'ను సిద్ధం చేశారు.

ఇలాంటి ఆవిష్కరణల్లో భారతీయుల పాత్ర కూడా ఉందన్న విషయం చాలా తక్కువ మందికి తెలుసు. కృత్రిమ మేధ, డిజిటల్ కంప్యూటర్లకు సంబంధించి శాస్త్రవేత్తల్లో ప్రాథమికంగా ఒక ఆలోచన మొదలైన 1950లలోనే గణాంక శాస్త్రవేత్తగా మారిన భౌతిక శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ ఒక భావనను ప్రతిపాదించారు. 'మహలనోబిస్ డిస్టెన్స్' అని పిలిచే ఈ భావన వేర్వేరు డేటా పాయింట్లలోని తేడాలను లెక్కిస్తుంది. అనంతరం ఈ మహలనోబిస్ డిస్టెన్స్‌ను కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తృతంగా వినియోగించారు. కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) వ్యవస్థాపకుడు కూడా మహలనోబిసే. సైబర్నెటిక్స్ ప్రాముఖ్యతను అప్పట్లోనే గుర్తించారు. ఇందుకు తగ్గట్టుగా 1955లోనే నార్బెర్ట్ వీనర్ వంటి వారిని ఐఎస్ఐ విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఆహ్వానించారు. ద్విజేశ్ దత్తా మజుందార్ వంటి వారిని ఫజీ లాజిక్, న్యూరల్ నెట్‌వర్క్ వంటి రంగాల్లో పరిశోధనలకు వీనర్ పురిగొల్పారు.

### ప్రొఫెసర్ రాజ్ రెడ్డి భాగస్వామ్యం...

1966లో అమెరికాలో డాక్టోరల్ విద్యార్థిగా ఉన్న రాజ్ రెడ్డి... మాటలను గుర్తించేందుకు 'హియర్సే–1' వంటి వ్యవస్థలను అభివృద్ధి చేశారు. మనుషుల్లానే కంప్యూటర్లు కూడా విషయాలను జ్ఞాపకం ఉంచుకునేలా, మనిషి మాటలను గుర్తించి అర్థం చేసుకోగల సామర్థ్యాన్ని కల్పించారు. ప్రస్తుతం కంప్యూటర్లు, రోబోలు మాటలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్నది రాజ్ రెడ్డి అభివృద్ధి చేసిన 'హియర్సే–2', హార్పీ, డ్రాగన్ వంటి సిస్టమ్సే. 'బ్లాక్‌బోర్డ్ మోడల్' పేరుతో రాజ్ రెడ్డి అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్... కృత్రిమ మేధ వేర్వేరు మార్గాల నుంచి వచ్చే సమాచారాన్ని సమన్వయపరచుకునేందుకు కీలకంగా మారింది. ఈ ఆవిష్కరణకు గాను 1994లో ప్రొఫెసర్ రాజ్ రెడ్డికి కంప్యూటర్ సైన్సులో నోబెల్ అవార్డుగా పరిగణించే 'టూరింగ్ అవార్డు' దక్కింది.

నోబెల్ అవార్డులు కృత్రిమ మేధ రంగంలో కీలక ఆవిష్కరణలకు దక్కడం బాగానే ఉంది. అయితే ఈ టెక్నాలజీతో వచ్చే ప్రమాదాలను కూడా ఈ ఏడాది నోబెల్ గ్రహీతలు గుర్తించారు. ఏఐ ఛాట్‌బోట్లు భయం పుట్టించేవే అని గూగుల్ కృత్రిమ మేధ విభాగపు అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న తరువాత హింటన్ వ్యాఖ్యానించడం గమనార్హం. కృత్రిమ మేధ విస్తృత వాడకం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతాయనీ, ఏఐ కారణంగా పెరిగిపోయే ఉత్పాదకత, సంపద ధనికులకు మాత్రమే సాయపడుతుందనీ అంచనా కట్టారు. కృత్రిమ మేధ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే చిన్నా చితకా ఉద్యోగాలు అనేకం లేకుండా పోతాయని హెచ్చరించారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వాలు సార్వత్రిక సామాన్య వేతనం వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవాలని హింటన్ సూచించారు.

భారతీయులకు నోబెల్ అవార్డు దక్కక పోవడం గురించి కూడా మాట్లాడుకుందాం. పరిశోధనలకు అవసరమైన నిధులు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఒకదాన్ని ఏర్పాటు చేసింది. కాకపోతే ఇందుకు నిధులు ఎలా సమకూరుస్తారన్నది ఇంకా స్పష్టం కాలేదు. అంతర్జాతీయ స్థాయి శాస్త్ర రంగంలో భారత్ తనదైన ముద్ర వేయాలని కృత నిశ్చయంతో ఉంటే, యూనివర్సిటీల్లో మౌలికాంశాలపై పరిశోధనలకు పెద్దపీట వేయాలి. అలాగే అన్ని రకాల మద్దతు అందివ్వాలి. ఇదో దీర్ఘకాలిక కార్యక్రమం అన్నది గుర్తు పెట్టుకోవాలి. అప్లైడ్ రీసెర్చ్, టెక్నాలజీ డెవలప్మెంట్లపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా తక్షణ సామాజిక, పారిశ్రామిక అవసరాలను తీర్చుకోవచ్చు.

స్థూలంగా చెప్పాలంటే నిధుల కేటాయింపు విషయంలో మౌలికాంశాలపై పరిశోధనలతోపాటు అప్లైడ్ రీసెర్చ్, టెక్నాలజీలు రెండింటికీ మధ్య ఒక సమతూకం సాధించాలి. ప్రైవేటు రంగం కూడా ఈ ఏడాది నోబెల్ అవార్డు గ్రహీతల నుంచి స్ఫూర్తి పొందాలి. రసాయన శాస్త్ర నోబెల్ అవార్డులో సగం గూగుల్ శాస్త్రవేత్తలకు దక్కిన విషయం గమనార్హం. మౌలికాంశాలపై పరిశోధనలకు ఆ ప్రైవేట్ కంపెనీ పెట్టిన పెట్టుబడులు ఇందుకు కారణం. నోబెల్ స్థాయి అవార్డు రావాలంటే, మౌలికాంశాలపై పరిశోధనలకు పెట్టుబడులు సమకూరుస్తుండటమే మార్గం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### అదే వ్యవహారమా?



మోదీని భవిష్యత్‌లో ఇండియా చాంబర్లెయిన్ (1930ల్లో బ్రిటన్ ప్రధాని) అని పిలుస్తారు. పోలండ్‌ను విడిచిపెట్టేందుకు చెకోస్లొవేకియాను హిట్లర్ దురాక్రమించడానికి హిట్లర్‌తో ఒప్పందం చేసుకున్నారు బ్రిటన్ ప్రధాని. కానీ ఆ ఒప్పందాన్ని పరిహసిస్తూ హిట్లర్ పోలండ్‌ను ఆక్రమించారు. చాంబర్లెయిన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

– సుబ్రహ్మణ్యస్వామి, కేంద్ర మాజీ మంత్రి

### జీర్ణం కాని విషయం



కజన్(రష్యా)లో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి తమ విదేశాంగ మంత్రిని పంపినప్పటికీ, సౌదీ అరేబియా యువరాజు గైర్హాజరీ వాళ్లింకా ఆచితూచి అడుగేస్తున్నారని సూచిస్తోంది. కానీ ఉక్రెయిన్ శాంతి సమావేశాల్లో పాల్గొనడానికి నిరాకరించిన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి కజన్‌లో కనబడటం మాత్రం పాశ్చాత్య ప్రభుత్వాలను చిర్రెత్తిస్తోంది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

### ఒక సంతోషం



1990ల తొలి ఏళ్లలో జేఆర్‌డీ టాటా పేరు మీదుగా బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డును ఇవ్వాలంటూ 'మాల్కమ్ బాల్‌డ్రిజ్ మోడల్'తో రతన్ టాటాను కలిశాను. 2 వారాల తర్వాత, దాన్ని అంతర్గతంగా అనుసరిద్దామని ఆయన పిలిచారు. అదే టాటా బిజినెస్ ఎక్స్‌లెన్స్ మోడల్ అయింది. అది జరగ డానికి సాయపడ్డందుకు సంతోషించాను.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

### కెనడాకు అర్థమయ్యేలా...



ప్రతి కెనడా ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖలిస్తానీల జాబితాను భారత ప్రభుత్వం నెలవారీగా విడుదల చేయాలని ఆశిస్తాను. అప్పుడు మాత్రమే మాలాంటివాళ్లం ఏళ్లుగా గొంతెత్తి అరుస్తున్నది కెనడా ప్రభుత్వానికి అర్థమౌతుంది.

– కుశల్ మెహ్రా, పాడ్‌కాస్టర్

### వాళ్లనేం చేయొచ్చు?



విమానాలకు బూటకపు బాంబు బెదిరింపులను చేసేవాళ్లను బెయిల్ ఇవ్వకుండా జైళ్లలో తోయవచ్చా?

– కిరణ్ మన్‌రాల్, రచయిత్రి

ఇన్ బాక్స్

## ఓస్లో ఒప్పందం – వాస్తవాలు

ఇజ్రాయెల్, పాలస్తీనాలు 'రెండు దేశాలుగా బతకడమే దారి' అనే శీర్షికతో వ్యాసం రాసిన (అక్టోబర్ 23న) ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్ కొన్ని వాస్తవాలను విస్మరించారు లేదా తప్పుగా పేర్కొన్నారు.

రెండు స్వతంత్ర దేశాలను ప్రతిపాదించిన 1993 నాటి నార్వే (ఓస్లో) ఒప్పందాన్ని ఇజ్రాయెల్ అంగీకరించి సంతకం చేయగా అందుకు హమాస్, ఇరాన్ నిరాకరిస్తున్నాయన్నారు. ఆ ఒప్పందం పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్ఓ) అధ్యక్షునిగా యాసిర్ అరాఫాత్‌కు, ఇజ్రాయెల్ ప్రధాని ఇజాక్ రాబిన్‌కు మధ్య జరిగింది. తర్వాత అరాఫాత్ 2004లో మరణించే వరకు 11 ఏళ్లపాటు అది అమలు కాకపోవటానికి కారణం ఎవరు? ఓస్లో ఒప్పందం ప్రకారం ఇరుపక్షాలూ మొదటిసారిగా పరస్పరం గుర్తించుకున్నాయి. కానీ అది ఆ కాలంలో గానీ, ఈరోజుకు గానీ అమలు కాకపోవటానికి బాధ్యత పూర్తిగా ఇజ్రాయెల్‌దేనని... స్వయంగా ఆ చర్చలకు సాక్షి అయిన ఆరన్ డేవిడ్ మిల్లర్ అనే అమెరికాకు చెందిన అగ్రస్థాయి నిపుణుడు, అమెరికా నుంచే వెలువడే 'ఫారిన్ పాలసీ' అనే సుప్రసిద్ధ జర్నల్‌లో ఇటీవలే రాశాడు. అంతేకాదు, ఆ ఒప్పందంలో అసలు 'పాలస్తీనా దేశం' అన్న మాటే లేదని వెల్లడిస్తూ, 1993 నుంచి ఆ మాత్రపు ఒప్పందాన్ని అయినా ఇజ్రాయెల్ ఎట్లా ఉల్లంఘిస్తూ వస్తున్నదో వర్ణించి చెప్పాడు.

వ్యాస రచయిత ప్రస్తావించిన వాటిలో మరొకటి మాత్రం చూద్దాము. అరాఫాత్ మరణం తర్వాత పీఎల్ఓ లేదా ఫతా పార్టీ నాయకత్వం పాలస్తీనా అథారిటీ (పీఏ) పేరిట పాలిస్తూ పూర్తి నిష్క్రియాపరంగా, అవినీతిమయంగా మారినందు వల్లనే, అంత వరకు కేవలం నామమాత్రంగా ఉండిన హమాస్, బాగా బలం పుంజుకుని 2006 నాటి ఎన్నికలలో గెలిచి 2007లో అధికారానికి వచ్చింది. ఆ పరిణామం ప్రజాస్వామిక ఎన్నికలలో జరిగిందే తప్ప బలప్రయోగంతో కాదు. ఇక ఇజ్రాయెల్ 1947 నుంచి మొదలుకొని ఈ 77 సంవత్సరాలుగా ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయ స్థానంతో పాటు అనేకానేక ఇతర ప్రపంచ సంస్థలను, ప్రపంచాభిప్రాయాన్ని ధిక్కరిస్తూ ఈరోజున గాజాలో, వెస్ట్ బ్యాంక్‌లో ఏ వ్యూహాన్ని అమలు చేసి అసలు పాలస్తీనా అన్నదే లేకుండా చేయజూస్తున్నదో కనిపిస్తున్నదే.

– టంకశాల అశోక్
సీనియర్ సంపాదకుడు, హైదరాబాద్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

# ముస్లిం ఓట్ల చుట్టూ ముగ్గుపోత!

అభిప్రాయం



దిలీప్ రెడ్డి

రెండు బలమైన కూటములు తలపడుతున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పోటీ సూచనలే కనిపిస్తున్నాయి. మిత్ర విభేదాలు, పార్టీ చీలికలు, కొత్త కలయికలు, మారే సమీకరణాలు, ఒకరిపై ఒకరి పోటీ ప్రభుత్వాల ఏర్పాటు... వెరసి గడచిన అయిదేళ్లలో మహారాష్ట్రలో రాజకీయ అనిశ్చితి రాజ్యమేలింది. గట్టి సంఖ్యాబలంతో ఈసారి స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న పట్టుదల అటు 'మహాయుతి', ఇటు 'మహా వికాస్ అఘాడీ' (ఎమ్‌వీఏ) కూటముల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే, ఎవరూ ఏ అవకాశాన్నీ వదలకూడదనే తలంపుతో పావులు కదుపుతున్నారు.

ప్రధాన స్రవంతి ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్‌కు తోడు ప్రాంతీయంగా ప్రాబల్యమున్న శివసేన, జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లూ ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. రెండు కూటముల్లో క్రియాశీలక పాత్ర పోషించే శివసేన, ఎన్సీపీలు ఈసారి ప్రత్యేకంగా నాలుగు పార్టీలుగా తలపడుతున్నాయి. 2022–23లో చోటుచేసుకున్న 'పవర్ పాలిట్రిక్స్'లో ఒక్కో పార్టీ రెండుగా చీలిన విషయం తెలిసిందే! ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన బీజేపీతో చేతులు కలిపి 'మహాయుతి'లో భాగమైతే, ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వం వహిస్తున్న శివసేన కాంగ్రెస్‌తో కూడి 'మహా వికాస్ అఘాడీ' భాగస్వామి అయింది. అలాగే అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ మహాయుతిలో ఉంటే, శరద్‌పవార్ నేతృత్వపు ఎన్సీపీ... ఎమ్‌వీఏలో భాగంగా ఉంది. ఇప్పుడీ రెండు కూటములూ, రాష్ట్రంలో 12 శాతంగా ఉన్న ముస్లిం ఓట్లపై దృష్టి కేంద్రీకరించాయి. వాటి చుట్టూ ముగ్గుపోసి వ్యూహాలు అల్లుతున్నాయి. మైనారిటీలుగా ఉండి కూడా మెజారిటీ వారిని ఓడించడమనే ఎత్తుగడతో ముస్లింలు 'వోట్ జిహాద్'కు పాల్పడుతున్నారని బీజేపీ విమర్శిస్తోంది. అవన్నీ తప్పుడు లెక్కలనీ, ముస్లింల ఉనికిని, త్యాగాలను కించపరిచేలా మాట్లాడుతున్న బీజేపీ నాయకత్వం, వారికి క్షమాపణలు చెప్పి ఎన్నికల బరిలో దిగాలనీ ప్రత్యర్థులు అంటున్నారు.

'తాము బహుళ సంఖ్యాకులుగా ఉన్న ఒక నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీలు మూకుమ్మడిగా బీజేపీ ప్రత్యర్థులకు ఓటువేసి మెజారిటీ వర్గమైన హిందువులను ఓడిస్తున్నారు' అన్నది బీజేపీ నాయకుల వాదన. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 'ధూలే' స్థానం పరిధి అయిదు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి బీజేపీ అభ్యర్థికి 1.9 లక్షల ఓట్ల ఆధిక్యత లభించినా, ముస్లిం ఆధిక్యత ఉన్న ఒక్క 'మాలెగావ్ సెంటర్' అసెంబ్లీ స్థానంలో ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థికి లభించిన ఏకపక్ష ఆధిక్యత వల్ల బీజేపీ అభ్యర్థి నాలుగువేల ఓట్లతో ఓడిపోయినట్టు, ఉదాహరణతో పీపీపీ ప్రదర్శన



ఇచ్చి ప్రచారం చేశారు. ఇదే కారణంగా మహాయుతి కూటమి 14 స్థానాలు కోల్పోయిందన్నది వారి వాదన. హిందువులు జాగృతం కావాలని బహిరంగంగానే చెప్పన్నారు. కానీ ఎమ్‌వీఏ కూటమి నాయకులు దీన్ని ఖండిస్తున్నారు. అదంతా బీజేపీ చేస్తున్న ఓ 'సానుకూల అన్వయ వాదన' తప్ప వాస్తవాలు వేరంటున్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న 38 అసెంబ్లీ స్థానాల్లో, 2019తో పోల్చి చూస్తే 20 (సగానికి ఎక్కువ) స్థానాల్లో మహాయుతి కూటమి అభ్యర్థులు 2024 ఎన్నికల్లో తమ ఓటు శాతాన్ని పెంచుకున్నట్టు జాబితా వెల్లడించారు. కిందటిసారి అసెంబ్లీకి ఎన్నికైన పదిమంది ముస్లింలలో 8 మంది ఆ స్థానాల నుంచే వచ్చారు. ప్రస్తుత సభలోని మొత్తం పదిమంది ముస్లిం ఎమ్మెల్యేలలో బీజేపీ, శివసేన, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల నుంచి ఇద్దరేసి ఉండగా మజ్లిస్, ఎన్సీపీ నుంచి ఒక్కొక్కరి చొప్పున ఉండటాన్ని గుర్తుచేస్తున్నారు. అధిక ముస్లిం జనాభా స్థానాలు కూడా ఏకపక్షంగా ఏం లేవనీ, ఆ 38లో కాంగ్రెస్ 11, బీజేపీ 11, అవిభక్త శివసేన 9, అవిభక్త ఎన్సీపీ 3, మజ్లిస్ 2, ఎస్పీ 2 స్థానాలు గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న విషయాన్ని ఎత్తిచూపుతున్నారు.

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ (ఎఐఎంఐఎం) మహారాష్ట్ర ఎన్నికల్లో దశాబ్దకాలంగా పాత్ర పోషిస్తోంది. 2014 ఎన్నికల్లో రంగ ప్రవేశం చేసి, ఔరంగాబాద్ సెంట్రల్, బైకుల్లా–2 అసెంబ్లీ స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించింది. ప్రకాశ్ అంబేడ్కర్ నాయకత్వంలోని 'వంచిత్ బహుజన్ అఘాడీ' (వీబీయే)తో అప్పుడు ఏర్పడ్డ పొత్తు, 2019 ఎన్నికలప్పుడు సీట్ల పంచాయితీలో వికటించి ఆ రెండు స్థానాలు నిలబెట్టుకో లేకపోయింది. కానీ మాలెగావ్ సెంట్రల్, ధూలే –2 అసెంబ్లీ స్థానాలతో పాటు ఒక పార్లమెంట్ స్థానం (ఔరంగాబాద్ సెంట్రల్) గెలిచి మజ్లిస్ మరోమారు వార్తలకెక్కింది. మరో నాలుగు చోట్ల రెండో స్థానంలో నిలిచింది. అంతే కాకుండా 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల శాతం, అక్కడి గెలుపు మార్జిన్ కంటే అధికం. 2014 లో 22 చోట్ల పోటీ చేసి 0.9 శాతం ఓట్లు సాధిస్తే, 2019లో 44 చోట్ల పోటీచేసి 1.34 శాతం ఓటువాటా పొందింది. పరిమిత ప్రభావమే అయినా... తక్కువ ఓటు వ్యత్యాసాలతో గెలుపోటములు నిర్ణయమయ్యే తీవ్ర పోటీలో మజ్లిస్ అభ్యర్థులు నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశాలు న్నాయి. ముస్లిం ఓట్లను చీల్చి పరోక్షంగా బీజేపీకి సహకరించేందుకే పోటీ చేస్తోందనే ఆరోపణలు బీజేపీ వ్యతిరేకపార్టీల నుంచి మజ్లిస్ ఎదుర్కోవాల్సి వస్తోంది. గణాంకాలు మాత్రం ఆ వాదనను ధృవపరచడం లేదు. ఉదాహరణకు విజేతల మార్జిన్ కన్నా మజ్లిస్ ఎక్కువ ఓట్లు పొందిన 13 నియోజకవర్గాల్లో, 7 చోట్ల బీజేపీ దాని భాగస్వాములు గెలిస్తే... 6 చోట్ల కాంగ్రెస్–ఎన్సీపీ కూటమి నెగ్గింది. 'హరియాణా, జమ్మూ–కశ్మీర్‌లో మేం పోటీ చేయలేదు కదా, ముస్లిం ఓట్లు చీల్చలేదు కదా, మరి కాంగ్రెస్ ఎందుకు గెలవలేదు?' అన్న అసద్ ప్రశ్న హేతుబద్ధమే అంటారు పరిశీలకులు. 5 చోట్ల అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించిన మజ్లిస్ ఈసారి కూడా ఎక్కువ స్థానాల్లో పోటీచేసే అవకాశాలున్నాయి. పొత్తులకు కలిసి రావాలంటే 28 స్థానాలు ఇవ్వాలన్న ఆ పార్టీ ప్రతిపాదనకు ఎమ్‌వీఏ అంగీకరించక పోవడం వల్ల ఇంకా పొత్తు కుదరలేదు. పొత్తు లేకుంటేనే బెటర్ అని ఎమ్‌వీఏ భావిస్తున్నట్టుంది.

పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాల్లో ముస్లిం ఓటింగ్ సరళి తమ అభ్యర్థుల గెలుపోటముల్ని కచ్చితంగా ప్రభావితం చేస్తుందనేది ప్రధాన పార్టీల ఆలోచన. బీజేపీ పక్షాలు ఆందోళన చెందితే, వ్యతిరేక పక్షాలు కొంత ఆశావహంగా ఉన్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 2 శాతం కన్నా తక్కువ ఓట్ల తేడాతో 27 చోట్ల, 2–3 శాతాల మధ్య ఓట్ల వ్యత్యాసంతో 14 చోట్ల, 3–4 శాతాల మధ్య ఓట్ల తేడాతో 11 చోట్ల, 4–5 శాతాల ఓట్ల మధ్య తేడాతో 19 చోట్ల అభ్యర్థులు గెలుపొందారు. అంటే 5 శాతం లోపల ఓట్ల వ్యత్యాసంతో మొత్తం 71 మంది అభ్యర్థులు గెలుపొందారన్నమాట. ఇలా తక్కువ ఓట్ల మెజారిటీతో గెలిచిన వారిలో బీజేపీ (29), కాంగ్రెస్ (12), శివసేన (5)తో పాటు ఇండిపెండెంట్లూ (5) ఉన్నారు. ఇక ముస్లిం జనాభా 15 శాతానికి మించి ఉన్నవి 51 నియోజక వర్గాలు కాగా 10–15 శాతాల మధ్య ముస్లిం జనాభా ఉన్న నియోజక వర్గాలు 54 ఉన్నాయి. 5–10 శాతాల మధ్య జనాభా ఉన్నవి 91, ఐదు కన్నా తక్కువ ముస్లిం జనాభా ఉన్నవి 92 నియోజకవర్గాలు ఉన్నాయి. బీజేపీ, వారి మిత్రపక్ష అభ్యర్థులను ఎక్కడెక్కడ ఎవరు ఓడించగలుగుతారో... ఆ నమ్మకాన్ని బట్టే ముస్లిం ఓటర్లు అటువైపు మొగ్గవచ్చనే అభిప్రాయం ఉంది. ఏ అంశం ఏ మేరకు అభ్యర్థుల జాతకాలను మారుస్తుందో నవంబరు 23 వరకు వేచి చూడాల్సిందే!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్,
పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.అష్టమి తె.5.57 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి నవమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.11.27 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.7.42 నుండి 9.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.01 నుండి 10.34 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 5.31.

# 20వేల మెగావాట్ల | పునరుత్పాదక విద్యుత్ ఎందుకు?

- ఐదేళ్లలో 24–43 వేల ఎంయూల మిగులు విద్యుత్
- అశాస్త్రీయ, అవాస్తవిక డిమాండ్ అంచనాలతో ఇప్పటికే అడ్డగోలుగా పీపీఏలు
- ఇకపై కొత్త ఒప్పందాలకు అనుమతిపై ఈఆర్సీ పునరాలోచన చేయాలి
- విద్యుత్ చార్జీల పెంపుపై బహిరంగ విచారణలో నిపుణులు, పారిశ్రామిక సంఘాల అభ్యంతరాలు
- 28న కొత్త టారిఫ్ ఉత్తర్వులను ప్రకటించనున్న ఈఆర్సీ


ఈఆర్సీ విచారణలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ డిమాండ్‌పై అశాస్త్రీయ, అవాస్తవిక అంచనాల ఆధారంగా గతంలో అడ్డగోలుగా చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల(పీపీఏ)లను విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామిక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు తప్పుబట్టారు. ఈ పీపీఏల ద్వారా వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో పెద్ద మొత్తంలో మిగులు విద్యుత్ ఉండబోతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఐదేళ్లలో కొత్తగా 20వేల మెగావాట్ల పునరుత్పాద విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక ఉన్న ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. 2024–25లో 24వేల మిలియన్ యూనిట్లు(ఎంయూ) ఉండనున్న మిగులు విద్యుత్.. 2028–29 నాటికి 43 వేల ఎంయూలకు పెరుగుతుందని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు నివేదించాయని గుర్తు చేశారు. యాదాద్రి విద్యుత్ కేంద్రం పూర్తయితే మిగులు విద్యుత్ ఇంకా పెరిగిపోతుందన్నారు. కొత్తగా 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే మిగులు విద్యుత్ మరింతగా పెరిగి రాష్ట్ర ప్రజలపై అనవసర భారం పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా పీపీఏలకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) అనుమతిచ్చిందని, ఇకపై కొత్త పీపీఏలకు అనుమతి విషయంలో పునరాలోచించాలని సూచించారు. 2024–25లో రూ.1221 కోట్ల విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదిస్తూ ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు(టీజీఎన్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్) సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)పై బుధవారం విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో ఈఆర్సీ నిర్వహించిన బహిరంగ విచారణలో పెద్ద సంఖ్యలో వక్తలు పాల్గొని మాట్లాడారు. పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలతో ప్రయోజనాలతోపాటే దుష్పరిణామాలూ ఉంటాయని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ(సీఈఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఓ నివేదిక ఇచ్చిందని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్‌రావు తెలిపారు. అవసరానికి మించి ఈ ఒప్పందాలు చేసుకుంటే జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలను బ్యాక్‌డౌన్ చేసి ఉత్పత్తిని తగ్గించడం/పూర్తిగా నిలుపుదల చేయాల్సి వస్తుందన్నారు. ఈ ఒప్పందాలతో ఇప్పటికే రాష్ట్రానికి ఏటా రూ.500 కోట్ల నష్టం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం 2022–23లో ఏకంగా రూ.5596 కోట్ల చార్జీలను పెంచగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.1221 కోట్ల విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించిందన్నారు. వాస్తవానికి ఏటా రూ.3వేల కోట్లకు పైనే చార్జీలు పెరుగుతాయన్నారు. జెన్‌కో థర్మల్, హైడల్ విద్యుత్ కేంద్రాలకు మరమ్మతు లేక ఉత్పత్తి తగ్గిందన్నారు. ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య ముందు తొలుత టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తమ ప్రతిపాదనలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నెల 28న ఈఆర్సీ కొత్త టారిఫ్ ఉత్తర్వులను ప్రకటించనుంది. నవంబర్ 1 నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి రానున్నాయి.

**ఇలా అయితే పరిశ్రమలు తరలిపోతాయి**

హెచ్‌టీ కేటగిరీలోని 33 కేవీ, 133 కేవీ వినియోగదారుల విద్యుత్ చార్జీలను 11 కేవీ వినియోగదారులతో సమానంగా పెంపుతోపాటు కొత్తగా స్టాండ్‌బై చార్జీలు, గ్రిడ్ సపోర్ట్ చార్జీలు, అన్‌బ్లాకింగ్ చార్జీల ప్రతిపాదనలను ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్(ఫ్యాప్సీ), తెలంగాణ ఐరన్, స్టీల్ మ్యానుఫాక్చర్స్ అసోసియేషన్, ఏపీ, టీజీ ప్లాస్టింగ్ మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్‌లు వ్యతిరేకించాయి. ఇలా అయితే రాష్ట్రంలోని పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌కు సమానంగా తమ విద్యుత్ చార్జీలను తగ్గించాలని దక్షిణమధ్య రైల్వే సీఈ కె.మౌర్య విజ్ఞప్తి చేశారు.

**రైతుల ఇబ్బందులపై వక్తల ఆగ్రహం**

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతుల కోసం రవాణా చేసేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులపై భారతీయ కిసాన్ సంఘ్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది రాకపోవడంతో రైతులే మరమ్మతులకు ప్రయత్నించి విద్యుదాఘాతంతో మరణిస్తున్నారన్నారు. విద్యుత్ సిబ్బంది అవినీతి, అక్రమాలు, వేధింపులపై ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. పాడి పరిశ్రమను వ్యవసాయ కేటగిరీ కింద చేర్చి ఉచిత విద్యుత్ వర్తింపజేయాలని యాదవ్ మహాసభ జాతీయ కార్యదర్శి రమేశ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.

**చార్జీల పెంపును వ్యతిరేకిస్తాం: మధుసూదనాచారి**

తెలంగాణలో 2015–23 మధ్య కాలం కరెంట్ విషయంలో స్వర్ణ యుగమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. గత ప్రభుత్వం చార్జీలు పెంచలేదన్నారు. చార్జీల పెంపుతో పరిశ్రమలు తరలిపోతాయని, మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.1220 కోట్ల చార్జీలను పెంచకుండా ప్రభుత్వమే అదనపు సబ్సిడీ ఇవ్వాలన్నారు.

**అక్కడికక్కడే ఎక్స్‌గ్రేషియా చెక్ అందజేత**

వనపర్తి జిల్లా గోపాలపేట మండలం జైన్ తిరుమలాపూర్‌లో పొలం వద్ద విద్యుదాఘాతంతో 2022 మార్చి 28న పరగోల యాదయ్య చనిపోయాడు. బహిరంగ విచారణలో ఫిర్యాదు రాగా, అక్కడికక్కడే సీఎండీ రూ.5 లక్షల చెక్‌ను యాదయ్య భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్సీ చైర్మన్ టి.రంగారావు, సభ్యులు మనోహర్, కృష్ణయ్య, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన అంటూనే ప్రజలపై నిర్బంధం

- ప్రభుత్వంపై సీపీఎం రాష్ట్ర కమిటీ ధ్వజం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ప్రజాపాలన అంటూనే.. మరోవైపు ప్రజలపై నిర్బంధాన్ని కొనసాగిస్తోందని సీపీఎం ఆరోపించింది. రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజా సమస్యల పరిష్కారానికి మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలుపరచడంలో జాప్యం చేస్తోందని ఆ పార్టీ మండిపడింది. ముఖ్యంగా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించకుండా, పేదల ఇళ్లను పడగొట్టి వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని ధ్వజమెత్తింది. మూసీ పునరుజ్జీవం పేరుతో నదికి ఆనుకుని ఉన్న ఇళ్లను తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాలను ఆ పార్టీ వ్యతిరేకించింది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను బుధవారం సీపీఎం ఒక ప్రకటనలో వెల్లడించింది. రీజనల్ రింగ్‌రోడ్‌కు సంబంధించి మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను అమలు చేయాలని కోరింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు పెంచి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. కౌలు రైతులకు చట్టపరమైన హక్కులు కల్పించి 'రుణ గుర్తింపు కార్డు'లు ఇవ్వాలని కోరింది. గ్రూప్–1 అభ్యర్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని సమావేశం తీర్మానం చేసింది.

# ఐఏఎస్ అమోయ్‌కుమార్‌ను ప్రశ్నించిన ఈడీ

- ఏడు గంటలపాటు విచారణ
- నేడు మళ్లీ హాజరుకావాలని ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** వందల కోట్ల విలువైన భూదాన్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో వందలకోట్ల విలువైన భూములు ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంలో ఆయన హస్తం ఉందనే కోణంలోనే ఈడీ ప్రధానంగా ప్రశ్నించినట్లు సమాచారం. బుధవారం ఉదయం 10.30 గంటలకు బషీర్‌బాగ్ సమీపంలోని ఈడీ కార్యాలయానికి వచ్చిన అమోయ్‌కుమార్‌ను రాత్రి వరకు ప్రశ్నించారు. నాగారంలోని 42 ఎకరాల భూమిని మహేశ్వరం తహశీల్దార్ జ్యోతి మరికొందరు కలిసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. ఈ విషయంలో స్థానికులు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు జ్యోతితోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో విజిలెన్స్ విభాగం కూడా విచారణ జరిపింది. పోలీసు కేసు, విజిలెన్స్ విచారణ ఆధారంగా అమోయ్‌కుమార్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అబ్దుల్లాపూర్‌మెట్ భూముల గురించి కూడా విచారించారు. శేరిలింగంపల్లి మండలం నానక్‌రామ్‌గూడలోని ప్రభుత్వ భూముల్లోనూ అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి విషయంలోనూ ఈడీ అధికారులు దృష్టి సారించారు. అమోయ్ కుమార్‌ను ఏడు గంటలపాటు సుదీర్ఘంగా విచారించిన ఈడీ అధికారులు గురువారం మరోసారి విచారణకు హాజరుకావాల్సిందిగా చెప్పి పంపారు.

# అలైన్‌మెంట్‌ను మార్చండి..

- లేదా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వండి
- రీజనల్ రింగ్ రోడ్డు బాధితుల డిమాండ్
- అవార్డు ఎంక్వైరీ బహిష్కరణ


చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు

**చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు 'అవార్డు ఎంక్వైరీ'ని బహిష్కరించారు. మూడు రోజుల పాటు రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించతలపెట్టిన అవార్డు ఎంక్వైరీని ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వబోమన్నారు. బుధవారం మొదటి రోజు విచారణను బహిష్కరించిన నిర్వాసితులు, జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దక్షిణ భాగంలో పాటిస్తున్న విధంగానే 40 కిలోమీటర్ల నిబంధన ఇక్కడ కూడా అమలు చేయాలన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం పలుమార్లు అలైన్‌మెంట్‌ను మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో గ్రామాలను నాశనం చేసే హక్కు పాలకులు, అధికారులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, నిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక రామలింగం, చింతల ప్రభాకర్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్, సుర్కంటి రాజిరెడ్డి, బోరెం ప్రకాష్‌రెడ్డి, చింతల సుధాకర్‌రెడ్డి, దబ్బటి రాములు, ఏనుగు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుమార్తెను విక్రయించారని తండ్రి ఆత్మహత్య

- నల్లగొండ జిల్లా గట్లమల్లేపల్లిలో ఘటన


నానమ్మతో వర్నిక

**నాంపల్లి:** మూడేళ్ల కూతురిని తల్లిదండ్రులకు తెలియకుండానే విక్రయించారు. తన బిడ్డ జాడ తెలియకపోవడంతో తండ్రి సైదిరెడ్డి(36) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గట్లమల్లేపల్లి గ్రామానికి చెందిన మల్గిరెడ్డి సైదిరెడ్డికి కుమురంభీం జిల్లా బాట్టుపల్లికి చెందిన దీపికతో 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత నుంచి సైదిరెడ్డి సోదరి సంధ్య, తల్లి రవణమ్మ నిత్యం దీపికను వేధించసాగారు. దీంతో మనోవేదనతో దీపిక అనారోగ్యం పాలైంది. కొద్దికాలం తర్వాత సైదిరెడ్డి–దీపిక దంపతులకు కూతురు వర్నిక జన్మించింది. సంధ్య, రవణమ్మలు మళ్లీ దీపికను వేధింపులకు గురిచేసి పుట్టింటికి పంపించి, దీపిక కూతురుని తమ వద్దే ఉంచుకున్నారు. దీపిక పుట్టింటివారు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. కాగా, సంధ్య, రవణమ్మలు ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి దీపిక మెడపై ఉన్న తాళిని లాక్కొని తమ కుటుంబంతో ఎలాంటి సంబంధం లేదని బెదిరించి తెల్ల కాగితంపై సంతకం చేయించుకొని వచ్చారు. కుటుంబ సమస్యతో సైదిరెడ్డి అనారోగ్యానికి గురయ్యాడు. నెల రోజుల నుంచి తన కూతురు వర్నిక కనిపించకపోవడంతో సైదిరెడ్డి తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. రోజూ తల్లిని తన బిడ్డ ఎక్కడని ప్రశ్నించినా, సమాధానం చెప్పక దాటవేశారు. తన తల్లి, చెల్లి కలిసి బిడ్డను అమ్మారని తెలుసుకున్న సైదిరెడ్డి మంగళవారం తన బంధువులకు ఫోన్ చేసి పొలం వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వర్నికను తీసుకొచ్చిన తర్వాతనే సైదిరెడ్డి అంత్యక్రియలు చేయాలని గ్రామస్తులు, బంధువులు డిమాండ్ చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో గుంటూరు జిల్లా నుంచి వర్నికను మేనత్త సంధ్య తీసుకువచ్చింది. వర్నిక విషయమై ప్రశ్నించగా, తల్లిదండ్రుల ఆరోగ్యం బాగా లేకపోవడంతో హైదరాబాద్‌లోని రక్షిత ఫౌండేషన్‌కు అప్పగించామని చెప్పిన సంధ్య, గట్టిగా నిలదీయడంతో విక్రయ విషయం వెలుగుచూసింది.

## ఒకే ఆస్పత్రిలో | తండ్రి మరణం.. కొడుకు జననం

- ఆవేదనలో తల్లి


శివ


పుట్టిన శిశువు

**రాజోళి:** విధి ఆ కుటుంబంతో వింత నాటకమాడింది. భర్త చనిపోయాడని బాధపడాలో.. అతనికి ప్రతిరూపంగా జన్మించిన కొడుకును చూసి సంబరపడాలో తెలియని దయనీయస్థితి ఏర్పడింది ఆ తల్లికి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన శివ (28)కు ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా బలపాలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో ఏడాది క్రితం వివాహమైంది. కాగా మంగళవారం శివ తుమ్మలపల్లె నుంచి రాజోళికి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే అతడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న శివ భార్య లక్ష్మితో పాటు కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున శివ మృతి చెందగా, తర్వాత గంట సమయంలోనే పురిటి నొప్పులతో శివ భార్య అదే ఆస్పత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఒకవైపు భర్త చనిపోయాడనే బాధ.. మరోవైపు కొడుకు రూపంలో మళ్లీ జన్మించాడనే నమ్మకంతో ఆమె పడిన వేదన వర్ణనాతీతం. పుట్టిన బిడ్డను చూసుకునే భాగ్యం తండ్రికి లేదని, బిడ్డకు తండ్రిని చూపించే అదృష్టం తల్లికి లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

## 5వ అంతస్తు కిటికీ నుంచి దిగేందుకు ప్రయత్నించి...

- ఇంటర్ విద్యార్థి మృతి
- నారాయణ బాసర సరస్వతి క్యాంపస్‌లో ఘటన


శివకుమార్

**మాదాపూర్:** అర్ధరాత్రి 12 గంటల సమయంలో హాస్టల్ బయటికి వెళ్లేందుకు ఐదవ అంతస్తు కిటికీ నుంచి దిగేందుకు ప్రయత్నిస్తూ జారిపడి విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా రైల్వేకోడూరు మండలానికి చెందిన కొలవలి శివకుమార్‌రెడ్డి (17) మాదాపూర్‌లోని చందానాయక్ తండాలో ఉన్న నారాయణ బాసర సరస్వతి క్యాంపస్‌లో ఇంటర్ సెకండియర్ (ఎంపీసీ) చదువుతున్నాడు. తన స్నేహితులు నిఖిల్, యశ్వంత్, బాలగణేశ్‌తో కలిసి 501 రూమ్‌లో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం స్టడీ అవర్స్ అయిపోయాక రాత్రి 10 గంటలకు అందరూ తమ రూంలోకి వెళ్లిన తరువాత బయటికి వెళ్లేందుకు రాత్రి 12.30 గంటల సమయంలో 5వ అంతస్తు బయటి భాగం నుంచి గ్రిల్స్, పైప్‌ల సహాయంతో దిగేందుకు వారు ప్రయత్నం చేశారు. ముందుగా శివకుమార్‌రెడ్డి గ్రిల్స్ లేని కిటికీ నుంచి దిగేందుకు ప్రయత్నించి కాలుజారి హాస్టల్ భవనానికి అనుకుని ఉన్న నిర్మాణంలో ఉన్న భవనంలో పడిపోయాడు. వెంటనే అతని స్నేహితులు కిందికి దిగి చూడగా తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. దీంతో హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మెడికవర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఉదయం చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా...

### కాళేశ్వరాన్ని సందర్శించిన బ్యాంకర్లు


మేడిగడ్డ వద్ద బ్యాంకర్ల బృందం

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, లక్ష్మీ పంపుహౌస్‌లను బ్యాంకర్ల బృందం బుధవారం పరిశీలించింది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ బ్యాంకర్ల బృందంలోని సీనియర్ మేనేజర్లు శ్రీని వాస్‌రెడ్డి, మోహన్ శరత్, వివేక్, విక్రమ్ కన్నా, వై.మనోజ్, జయ ఉపాధ్యాయ, ప్రవీణ్‌కుమా ర్ వర్మ, గాయత్రి, హర్జీత్‌సింగ్, సత్యనారాయణ, జౌల్లాహ్ తదితరులు బ్యారేజీల నిర్మాణాలు, పంపు హౌస్‌లో మోటార్లను పరిశీలించారు. వారికి బరాజ్‌ల గురించి ఈఈలు యాదగిరి, తిరుపతి రావు, డీఈఈ రవిచంద్ర వివరించారు.

### 'జైన్' సాబ్ ఇకలేరు

- అనారోగ్యంతో కేశోరాం మాజీ సీనియర్ ప్రెసిడెంట్ మృతి


కమల్‌చంద్ జైన్

**పాలకుర్తి(రామగుండం):** పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ మాజీ సీనియర్ ప్రెసిడెంట్ కమల్‌చంద్ జైన్ (కేసీ జైన్) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సీనియస్ ప్రెసిడెంట్‌గా దాదాపు 40 ఏళ్లపాటు ఆయన పని చేశారు స్థానికంగా కంపెనీ ప్రభావిత గ్రామాల అభివృద్ధితోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, వేలాది మందికి చేయూత అందించిన కేసీ జైన్.. ప్రభావిత గ్రామాల ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. బీకే బిర్లా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా కూడా పనిచేసిన కేసీ జైన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో తన సొంత వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హఠాన్మరణం చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న కేశోరాం కార్మికులతో పాటు ప్రభావిత గ్రామాల ప్రజలు, నాయకులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

### సీఐపై పోక్సో కేసు

- కూతురి స్నేహితురాలిపై అనుచిత ప్రవర్తన
- పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

**కాజీపేట:** నార్త్ జోన్ ఐజీకి అటాచ్‌లో ఉన్న ఒక సీఐపై.. మంగళవారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్‌ఐ లవన్ కుమార్ కథనం ప్రకారం.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కాలనీ సమీపంలోని పీజీఆర్ అపార్ట్‌మెంట్‌లో రవికుమార్ అనే సీఐ కుటుంబంతో నివసిస్తున్నారు. ఈనెల 9న ఆ సీఐ తన కూతురి స్నేహితురాలైన ఓ బాలికపై అనుచితంగా ప్రవర్తించారు. బాధితురాలు తన తల్లి దండ్రులకు ఈ విషయం చెప్పడంతో.. వారు సీఐని నిలదీశారు. సీఐ దురుసుగా వ్యవహరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

### యూట్యూబర్లు గంగవ్వ, రాజుపై కేసు

- రూ.25 వేల జరిమానా

**మల్యాల(చొప్పదండి):** వన్యప్రాణుల సంరక్షణ చట్టం నిబంధనలు ఉల్లంఘించిన కేసులో యూట్యూబర్లు గంగవ్వ, రాజుపై జరిమానా విధించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. జగిత్యాల ఎఫ్ఆర్‌వో పద్మారావు కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన యూట్యూబర్ గంగవ్వ, రాజు 2022 మే 20న చిలుక జోస్యం పేరిట వీడియో తీసి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. చిలుకను బంధించి, వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించారంటూ కరీంనగర్‌కు చెందిన వన్య ప్రాణుల సంరక్షకుడు ఎదులాపురం గౌతమ్ ఈనెల 21న గంగవ్వ, రాజుపై ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం నిబంధనలకు అనుగుణంగా మొదటి తప్పుగా క్షమించి రూ.25,000 జరిమానా విధించామని ఎఫ్ఆర్‌వో తెలిపారు. రాజు జరిమానా చెల్లించడంతోపాటు మరోమారు చట్టాన్ని ఉల్లంఘించబోమని లిఖిత పూర్వకంగా రాసిచ్చినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

### ప్రాణం తీసిన దోశ

- గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి


వెంకటయ్య

**కల్వకుర్తి టౌన్:** పనికి వెళ్లాలన్న తొందరలో దోశ వేగంగా తినడంతో.. అది గొంతులో ఇరుక్కొని ఒక వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఈ సంఘటన జరిగింది. సుభాష్‌నగర్ కాలనీలో నివసించే వెంకటయ్య (44) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం బస్టాండ్ సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో దోశ తీసుకొని ఇంటికి వచ్చాడు. పనికి వెళ్లాలనే ఆత్రుతతో త్వరగా తింటుండగా.. అది గొంతులో ఇరుక్కొంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

# ఆయిల్‌పామ్ సాగులో సహకరించండి

- మలేషియాకు మంత్రి తుమ్మల వినతి

**సాక్షి, హైదరాబాద్:** ఆయిల్‌పామ్ సాగులో తమకు సహకరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి తుమ్మలతోపాటు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా ప్రస్తుతం మలేషియాలో పర్యటిస్తున్నారు. బుధవారం మంత్రి తుమ్మల బృందం మలేషియా మంత్రి జోహరి అబ్దుల్ ఘనీని కలిసింది. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకోసం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధికి గల అవకాశాలను వివరించారు. మలేషియా మంత్రి ఘనీ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలన్నీ భారతదేశం అవలంబిస్తున్న ఆహార వృద్ధి విధివిధానాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకోసం తాము అన్ని విధాలా సహకరిస్తామని, త్వరలోనే తమ బృందం తెలంగాణలో పర్యటిస్తుందని తెలిపారు. అనంతరం తుమ్మల బృందం మాత్రోయి చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్‌ని కలిసింది. మలేషియాతో వ్యవసాయరంగంలో ఉన్న వ్యాపార అవకాశాలపై చర్చించింది. అనంతరం మలేషియా పామాయిల్ బోర్డును సందర్శించారు. పామాయిల్ రంగంలో తమ అనుభవాలను బోర్డు చైర్మన్ డాక్టర్ అహ్మద్ పర్వేజ్ గులామ్ ఖాదీర్ వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు సాయం చేస్తామని ఆయన తుమ్మలకు తెలిపారు.

# గల్ఫ్‌లో మృతుల కుటుంబాలకు రూ.6.45 కోట్లు

- ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల సాయం

**సాక్షి, హైదరాబాద్:** గల్ఫ్‌లో ఉద్యోగాల కోసం వెళ్లి వివిధ కారణాల వల్ల మరణించిన ఒక్కో వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 15 జిల్లాల్లోని అర్హులైన కుటుంబాలకు రూ.6.45 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లాలోని గల్ఫ్ బాధిత కుటుంబాలకు అత్యధికంగా రూ.1.75 కోట్లు, జగిత్యాల జిల్లాకు రూ.1.4 కోట్లు విడుదల చేశారు. రాజన్న సిరిసిల్లలో రూ.60 లక్షలు, నిర్మల్‌లో రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. మిగతా జిల్లాలైన కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, హనుమకొండ, కొత్తగూడెం, పెద్దపల్లి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు రూ.20 లక్షల చొప్పున విడుదల చేసింది.

# చర్చలు, దౌత్యానికే మా మద్దతు

**సంఘర్షణలకు యుద్ధాలు పరిష్కారం కాదు • 'బ్రిక్స్' సదస్సులో ప్రధాని మోదీ స్పష్టీకరణ • ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాటం సాగించాలని పిలుపు**



**కజన్:** సంఘర్షణలు, సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్యమార్గాలే శ్రేయస్కరమని ప్రధాని మోదీ మరోసారి తేల్చిచెప్పారు. శాంతియుత మార్గంలో చర్చలు, సంప్రదింపులకే తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఏ సమస్యకైనా యుద్ధాలతో పరిష్కారం లభించదని స్పష్టం చేశారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికి శాంతి చర్చలకు శ్రీకారం చుట్టాలని ఇరుపక్షాలకు పిలుపునిచ్చారు. రష్యాలోని కజన్ నగరంలో బుధవారం 16వ 'బ్రిక్స్' సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. బ్రిక్స్ అనేది విభజన సంస్థ కాదని, మొత్తం మానవాళి ప్రయోజనాల కోసం పనిచేస్తే సంస్థ అనే సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాలని కూటమికి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, సంఘర్షణలు, ఆర్థిక అనిశ్చితి, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి సవాళ్లపై మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచాన్ని సరైన మార్గంలో నడిపించేలా బ్రిక్స్ సానుకూల పాత్ర పోషించగలదని చెప్పారు. బ్రిక్స్ వైవిధ్యంతో కూడిన, సమగ్ర వేదిక అని వివరించారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

### ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు వద్దు

''యుద్ధానికి కాదు.. చర్చలు, దౌత్యానికే మా మద్దతు ఉంటుంది. కోవిడ్–19 సంక్షోభాన్ని మనమంతా కలిసికట్టుగా అధిగమించాం అదే తరహాలో ముందు తరాలకు సురక్షితమైన, బలమైన, సౌభాగ్యవంతమైన భవిష్యత్తును అందించడానికి నూతన అవకాశాలు మనం సృష్టించగలం. ప్రస్తుత సవాళ్ల నేపథ్యంలో బ్రిక్స్‌పై ప్రపంచ దేశాలకు ఎన్నో అంచనాలున్నాయి. వాటిని నెరవేర్చేలా మనం పనిచేయాలి. ఉగ్రవాద భూతాన్ని అంతం చేయడానికి అన్ని దేశాలూ కలిసికట్టుగా కృషి చేయాలి. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు. అందరూ ఒకే ఆలోచనతో ఉంటేనే లక్ష్యం సాధించడం సులువవుతుంది. యువతను ఉగ్రవాదం, తీవ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటిని అడ్డుకోవడానికి కఠిన చర్యలు అవసరం. అంతర్జాతీయ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితిలో సమగ్ర తీర్మానం చేసేలా మనమంతా కలిసి ఒత్తిడి పెంచాలి. అలాగే సైబర్ భద్రత, సురక్షితమైన కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం కోసం మనం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థతోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సమగ్ర సంస్కరణలు అవసరం. నిర్దిష్ట గడువులోగా సంస్కరణలు వచ్చేలా మనం ఉమ్మడిగా ముందుకు సాగాలి. బ్రిక్స్‌లో మన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అంతర్జాతీయ సంస్థలకు బ్రిక్స్ ప్రత్యామ్నాయం అనే భావన రాకూడదు. ఆయా సంస్థలను సంస్కరించే వేదిక అనే అభిప్రాయం అందరిలోనూ కలగాలి. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడాన్ని మనం కర్తవ్యంగా స్వీకరించాలి. ఆహార భద్రత, ఇంధన భద్రత, ఆరోగ్య సంరక్షణ, నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. బ్రిక్స్‌లోకి మరికొన్ని భాస్వామ్య దేశాలను ఆహ్వానించడానికి భారత్ సిద్ధంగా ఉంది. ఈ విషయంలో కూటమి దేశాలు ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలి. అదేసమయంలో బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాలను గౌరవించాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.

> **భారత ఆర్థిక ప్రగతి సూపర్: పుతిన్**
>
> భారత ఆర్థిక ప్రగతి అద్భుతమంటూ బ్రిక్స్ సదస్సు వేదిక సాక్షిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రస్తుతించారు. ఈ విషయంలో బ్రిక్స్ దేశాలకు భారత్ ఆదర్శంగా నిలిచిందన్నారు. ''హెచ్చు వృద్ధి రేటు సాధించాల్సిన అవసరాన్ని గురించి దేశాధినేతలుగా మనమంతా తరచూ మాట్లాడుతుంటాం. ప్రధాని మోదీ దాన్ని విజయవంతంగా సాధించి చూపిస్తున్నారు. 7.5 శాతం వృద్ధి రేటుతో భారత్‌ను మనందరికీ ఆదర్శంగా నిలిపారు. ఆయన సాధిస్తున్న విజయాలకు అభినందనలు. బ్రిక్స్ సదస్సులో పాల్గొన్నందుకు మోదీకి ధన్యవాదాలు'' అన్నా రు. ద్వైపాక్షిక వర్తకంలో భారత్, రష్యా సాధిస్తున్న వృద్ధి పట్ల పుతిన్ సంతృప్తి వెలిబుచ్చారు.

### కూటమిలోకి మరో ఐదు దేశాలు

బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) కూటమిలో చేరేందుకు గ్లోబల్ సౌత్ దేశాలు ఎంతగానో ఆసక్తి చూపుతున్నాయని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చెప్పారు. ఈ విషయంలో ఆయా దేశాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల పట్ల చురుగ్గా స్పందించాలని కూటమిలోని సభ్యదేశాలకు సూచించారు. కొత్త దేశాలను కూటమిలో భాగస్వాములుగా చేర్చుకోవాలని బ్రిక్స్ ప్రస్తుత సదస్సులో నిర్ణయించినట్లు తెలిపారు. బ్రిక్స్‌లో తాజాగా ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) సభ్యదేశాలుగా చేరాయి. బ్రిక్స్ ప్రయాణంలో ఇదొక కీలకమైన ఘట్టమని జిన్‌పింగ్ చెప్పారు. ఆయన బుధవారం బ్రిక్స్ సదస్సులో మాట్లాడారు.

> **ఉగ్రవాదంతో అందరికీ ముప్పు**
>
> బ్రిక్స్ సదస్సు అనంతరం కూటమి నేతలు బుధవారం ఒక ఉమ్మడి డిక్లరేషన్ విడుదల చేశారు. ఉగ్రవాదాన్ని 'ఉమ్మడి ముప్పు'గా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని నియంత్రించడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ఉగ్రవాదం అనేది ఏ ఒక్క మతం, జాతీయత, నాగరికతకు సంబంధించింది కాదని ఉద్ఘాటించారు. అది ఏ రూపంలో ఉన్నా ఖండించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఉగ్రవాద నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని బ్రిక్స్ కూటమి నేతలు నిర్ణయించారు. ప్రపంచానికి ముప్పుగా మారిన వాతావరణ మార్పులను కూడా డిక్లరేషన్‌లో ప్రస్తావించారు. అజర్‌బైజాన్‌లో జరగబోయే కాప్–29 సదస్సులో వాతావరణ మార్పులకు సంబంధించి ఒక పరిష్కారం మార్గం వెలువడే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు.

వచ్చే ఐదేళ్లలో బ్రిక్స్ దేశాల్లో 10 ఓవర్సీస్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. వీటిలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.



చేతిలో తుపాకీతో కన్పిస్తున్న ఈ ముష్కరుడెవరో తెలుసా? జమ్మూ కశ్మీర్‌లోని గాందర్బల్ జిల్లాలో గత ఆదివారం నిర్మాణ పనుల్లో ఉన్న ఆరుగురు కూలీలను, ఒక వైద్యున్ని కాల్చి చంపిన ఉగ్రవాదుల ముఠాలో ఒకడు. అక్కడి సీసీటీవీలో నమోదైన ఈ దృశ్యాలు బుధవారం వెలుగులోకి వచ్చాయి.

# చట్టాల కోరలు తీశారు

**కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆక్షేపణ**
- సీఏక్యూఎం చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం
- పంజాబ్, హరియాణా ప్రభుత్వాల తీరుపై మండిపాటు

**న్యూఢిల్లీ:** దేశంలో పర్యావరణ చట్టాల్లో సవరణలు చేసి, చివరకు వాటిని కోరల్లేనివిగా మార్చేశారని కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను దహనాన్ని నియంత్రించడానికి తీసుకొచ్చిన 'దేశ రాజధాని, పరిసర ప్రాంతాల్లో వాయు నాణ్యత నిర్వహణ కమిషన్(సీఏక్యూఎం) చట్టం–2021'ను ఎందుకు కఠినంగా అమలు చేయడం లేదని ప్రశ్నించింది. సీఏక్యూఎం చట్టం విషయంలో కేంద్రం తీరును న్యాయస్థానం తప్పుపట్టింది. చట్టం అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకుండానే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని ఆక్షేపించింది. ఢిల్లీలో కాలుష్యం తీవ్రత, పంట వ్యర్థాల దహనం సమస్యపై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపించారు. సీఏక్యూఎం చట్టంలోని సెక్షన్ 15కు సంబంధించి మరికొన్ని నియంత్రణలను మరో 10 రోజుల్లో జారీ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ చట్టాన్ని ప్రభావవంతంగా అమలు చేయడానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించడంతోపాటు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వివరించారు. పంజాబ్, హరియాణా అధికారులకు, కాలుష్య నియంత్రణ మండళ్లకు సీఏక్యూఎం ఇప్పటికే లేఖలు రాసిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పంట వ్యర్థాలను దహనం చేస్తూ కాలుష్యానికి కారణమవుతునవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఆదేశించిందని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తమకు తెలుసని పేర్కొంది. కాలుష్యాన్ని అరికట్టడంలో విఫలమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పింది. చటాన్ని ఉల్లంఘించే వారిపై పర్యావరణ పరిహార పన్నును మరింత పెంచేలా చట్టంలో సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పంజాబ్, హరియాణా ప్రభుత్వాల తీరుపైనా సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాల దహనాన్ని ఎందుకు అరికట్టడం లేదని నిలదీసింది. సీఏక్యూఎం ఆదేశాలను ఆయా ప్రభుత్వాలు అమలు చేయడం లేదని మండిపడింది. కాలుష్య నియంత్రణ విషయంలో పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు కేవలం కంటితుడుపు తప్ప అందులో కార్యశీలత లేదని ఆక్షేపించింది. పంట వ్యర్థాలను దహనం చేసేవారికి కేవలం రూ.2,500 చొప్పున జరిమానా విధించడం ఏమిటని ప్రశ్నించింది. కేవలం నామమాత్రంగా జరిమానా విధించి, కాలుష్యానికి లైసెన్స్ ఇస్తున్నారా అని న్యాయస్థానం మండిపడింది.

## నస్రల్లా వారసుడు హాషీం మృతి

**ఇజ్రాయెల్ ప్రకటన, ధ్రువీకరించిన హెజ్‌బొల్లా**



**జెరూసలేం/బీరూట్:** ఇటీవల మృతి చెందిన హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా వారసుడు హాషీమ్ సఫియుద్దీన్ మరణించినట్లు ఇజ్రాయెల్ మంగళవారం ప్రకటించింది. మూడు వారాల క్రితం బీరుట్ దక్షిణ శివారుపై తాము జరిపిన దాడిలో ఆయన మరణించినట్లు సైన్యం వెల్లడించింది. హెజ్‌బొల్లా కూడా బుధవారం దీన్ని ధ్రువీకరించింది. నస్రల్లా బంధువైన సఫియుద్దీన్ హెజ్‌బొల్లా ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలు చూసే కార్యనిర్వాహక మండలి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెజ్‌బొల్లా తరఫున మాట్లాడటమే గాక భద్రతా కారణాలతో నస్రల్లా వెళ్లలేని కార్యక్రమాలకు హాజరవుతూ వచ్చారు. హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్ హత్య తరువాత కాల్పుల విరమణకోసం మంగళవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఒత్తిడి తెస్తున్నారు. ఆయన ప్రస్తుతం పశ్చిమాసియా పర్యటనలో ఉన్న నేపథ్యంలో సఫియుద్దీన్ మరణాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది.

## జేఎంఎం అభ్యర్థుల జాబితాలు విడుదల

**బర్‌హేట్ నుంచి హేమంత్ సోరెన్ పోటీ**



**రాంచీ:** జార్ఖండ్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) బుధవారం 35 మంది పార్టీ అభ్యర్థుల పేర్లతో రెండు జాబితాలను విడుదలచేసింది. జేఎంఎం చీఫ్, రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సొంత నియోజకవర్గమైన సహీబ్‌గంజ్ జిల్లాలోని బర్‌హేట్(ఎస్టీ) నుంచి, ఆయన భార్య కల్పన గాండేయ్ నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. కల్పన గతంలో గాండేయ్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిపై భారీ మెజారిటీ గెలవడం తెల్సిందే. హేమంత్ సోదరుడు బసంత్ ఈసారి దుమ్కా నుంచి, అసెంబ్లీ స్పీకర్ రవీంద్రనాథ్ మహతో నాలా నుంచి, మంత్రి మిథిలేశ్ ఠాకూర్ గర్వా నుంచి పోటీచేస్తున్నారు. మూడుసార్లు బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచి ఇటీవల జేఎంఎంలో చేరిన కేదర్ హజారా ఈసారి జమూనా(ఎస్సీ) నుంచి పోటీచేస్తున్నారు. రాజ్యసభ సభ్యురాలు మహువా మాఝీ రాంచీ నుంచి పోటీచేయనున్నారు. జార్ఖండ్‌లో విపక్షాల 'ఇండియా' కూటమి భాగస్వామ్యులైన జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష పార్టీల మధ్య ఇప్పటికే సీట్ల సర్దుబాటు జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం కాంగ్రెస్, జేఎంఎం 70 చోట్ల పోటీచేస్తాయి. 11 చోట్ల ఆర్జేడీ, వామపక్ష పార్టీలు పోటీచేస్తాయి. ఆర్జేడీ మంగళవారం ఆరుగురి పేర్లను ప్రకటించింది. విపక్ష బీజేపీ 68 స్థానాల్లో బరిలో దిగనుంది. మిత్రపక్షాలైన ఏజేఎస్‌యూ 10, జేడీ(యూ) రెండు, ఎల్‌జేపీ(రాంవిలాస్) ఒక స్థానంలో బరిలోకి దిగనున్నాయి. రాష్ట్రంలో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 23న ఫలితాలను వెల్లడిస్తారు.

# ప్రియాంక నామినేషన్

- కాల్పెట్టా నగరంలో భారీ రోడ్ షో
- వయనాడ్ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని స్పష్టీకరణ



బుధవారం వయనాడ్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రియాంక

**వయనాడ్:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీకి ఆమె నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం రాత్రి కేరళకు చేరుకున్న ప్రియాంక బుధవారం వయనాడ్ జిల్లా కేంద్రమైన కాల్పెట్టా నగరంలో దాదాపు 2 కిలోమీటర్ల మేర భారీ రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కర్నాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాదిగా హాజరైన జన వాహినిని ఉద్దేశించి ప్రియాంక ప్రసంగించారు. మొదటిసారిగా 1989లో 17 ఏళ్ల వయసులో తన తండ్రి రాజీవ్ గాంధీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. అప్పటినుంచి 35 ఏళ్లుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నానని తెలిపారు. తన తల్లి సోనియా, సోదరుడు రాహుల్‌తోపాటు కాంగ్రెస్ నేతల కోసం ప్రచారం చేశానని వెల్లడించారు. తన విజయం కోసం తాను ప్రచారం చేసుకోవడం ఇదే తొలిసారి అని ఉద్ఘాటించారు. వయనాడ్‌లో పోటీ చేసే అవకాశం కల్పించిన మల్లికార్జున ఖర్గేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రియాంక పేర్కొన్నారు. ఉప ఎన్నికలో తనను గెలిపించాలని కోరారు. వయనాడ్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా, గొప్ప గౌరవంగా భావిస్తానని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. మొత్తం ప్రపంచమంతా తన సోదరుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా మారిన సమయంలో వయనాడ్ ప్రజలు మాత్రం ఆయనకు అండగా నిలిచారని చెప్పారు. తన కుటుంబమంతా వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని తెలిపారు. వయనాడ్‌ను విడిచి వెళ్తున్నందుకు రాహుల్ బాధపడుతున్నారని వెల్లడించారు. రాహుల్‌కు, ప్రజలకు బంధాన్ని తాను మరింత బలోపేతం చేస్తానన్నారు.

### వయనాడ్‌కు ఇద్దరు ఎంపీలు: రాహుల్

తన చెల్లెలు ప్రియాంక బాగోగుల మీరే చూసుకోవాలి అంటూ వయనాడ్ ప్రజలకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. తనకు మద్దతు ఇచ్చినట్లుగానే తన సోదరికి సైతం ఇవ్వాలన్నారు. వయనాడ్‌కు తాను అనధికారిక ఎంపీనని, ప్రియాంక అధికారిక ఎంపీ అవుతుందని చెప్పారు. పార్లమెంట్‌లో వయనాడ్‌కు ఇద్దరు ఎంపీలు ఉంటారని స్పష్టంచేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ... ప్రియాంకా గాంధీని ఆశీర్వదించాలని వయనాడ్ ఓటర్లను కోరారు. రోడ్ షో అనంతరం ప్రియాంకా గాంధీ వయనాడ్ కలెక్టరేట్‌కు చేరుకొని, నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కె.సి.వేణుగోపాల్ ఉన్నారు. నామినేషన్ తర్వాత ప్రియాంక, రాహుల్ పుత్తుమల శ్మశాన వాటికను సందర్శించారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు.

> **ప్రియాంక గాంధీ ఆస్తులు రూ.12 కోట్లు**
>
> తనకు రూ.12 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా స్పష్టం చేశారు. ఆస్తులు, అప్పుల వివరాలను ఆమె తన అఫిడవిట్‌తో ప్రస్తావించారు. నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను బుధవారం ఎన్నికల అధికారికి సమర్పించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో అద్దెలు, బ్యాంకు ఖాతాల్లోని నగదుపై వడ్డీ, ఇతర పెట్టుబడుల ద్వారా మొత్తం రూ.46.39 లక్షల ఆదాయం లభించినట్లు తెలిపారు. రూ.4.24 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయని, తన భర్త రాబర్ట్ వాద్రా బహుమతిగా ఇచ్చిన హోండా సీఆర్‌వీ కారు ఉందని తెలియజేశారు. అలాగే రూ.1.15 కోట్ల విలువైన 4,400 గ్రాముల బంగారం ఉన్నట్లు వెల్లడించారు. ఇక స్థిరాస్తుల విలువ రూ.7.74 కోట్లుగా పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో సొంతంగా కొన్న ఇంటి విలువను రూ.5.63 కోట్లుగా ప్రస్తావించారు. అలాగే రూ.15.75 లక్షల అప్పులు ఉన్నట్లు తెలిపారు. ప్రియాంకా గాంధీపై గతంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అటవీ శాఖ నుంచి ఆమెకు నోటీసు అందింది. భర్త రాబర్ట్ వాద్రా ఆస్తుల వివరాలను సైతం ప్రియాం తన అఫిడవిట్‌లో వెల్లడించారు. దీన్నిబట్టి రాబర్ట్‌కు రూ.37.9 కోట్ల విలువైన చరాస్తులు, రూ.27.64 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు స్పష్టమవుతోంది.


## బైజూస్‌కు మరో ఎదురుదెబ్బ..

**ఎన్‌క్లాట్ తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ:** ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ బైజూస్(థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థపై దివాలా చర్యలు చేపట్టకుండా నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌క్లాట్) ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. సెటిల్‌మెంట్ నగదు రూ.158.9 కోట్లను కమిటీ ఆఫ్ క్రెడిటర్(సీఓసీ) వద్ద డిపాజిట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం బీసీసీఐని ఆదేశించింది. ఎన్‌క్లాట్ తీర్పును వ్యతిరేకిస్తూ అమెరికా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. 61 పేజీల తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో బైజూస్‌పై ఆ కంపెనీ వ్యవస్థాపకులైన బైజూ రవీంద్రన్, ఆయన సోదరుడు రిజూ రవీంద్రన్ మరోసారి నియంత్రణ కోల్పోనున్నారు. బీసీసీఐతో రూ.158.9 కోట్ల వ్యవహారాన్ని సెటిల్‌మెంట్ చేసుకోవడానికి బైజూస్ అంగీకరించడంతో ఆ సంస్థపై దివాలా చర్యలు చేపట్టకుండా ఆగస్టు 2న ఎన్‌క్లాట్ తీర్పు ఇచ్చింది.

# ఓటేసిన 2.1 కోట్ల అమెరికన్లు





విస్కాన్సిన్‌లోని మాడిసన్ పబ్లిక్ లైబ్రరీలో ముందస్తు ఓటింగ్ కోసం బారులు తీరిన అమెరికన్లు

భారత సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌కు 36 గంటల ముందే ప్రచారానికి తెర పడుతుంది. కానీ అమెరికాలో అలా కాదు. కనీసం నాలుగు వారాల పాటు ప్రచారం, ఓటింగ్ సమాంతరంగా సాగుతాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మరో 12 రోజులే ఉంది. నవంబర్ 5న దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. కానీ ఏకంగా 2.1 కోట్ల మంది అమెరికన్లు ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ హోరాహోరీగా తలపడుతుండటం తెలిసిందే.

### 1.33 కోట్ల పోస్టల్ ఓట్లు

ఫ్లోరిడా వర్సిటీ ఎలక్షన్ ల్యాబ్ డేటా ప్రకారం 78 లక్షల ఓట్లు వ్యక్తిగత పద్ధతుల ద్వారా పోలయ్యాయి. మిగతా 1.33 కోట్ల పై చిలుకు ఓట్లు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా పోలయ్యాయి. ఆసియన్ అమెరికన్లలో మాత్రం 1.7 శాతం మంది మాత్రమే ముందస్తు ఓటింగ్‌ను ఉపయోగించుకున్నట్టు ఎలక్షన్ ల్యాబ్ తెలిపింది. దాని గణాంకాల ప్రకారం వ్యక్తిగత ప్రారంభ ఓటర్లలో 41.3 శాతం మంది రిప బ్లికన్లు ఓటు వేయగా, డెమొక్రాట్లు 33.6 శాతం మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యా లెట్ల ద్వారా డెమొ క్రాట్లు 20.4 శాతం, రిపబ్లికన్లు 21.2 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జార్జియా రాష్ట్రంలో నాలుగో వంతు ఓటర్లు ఇప్పటికే ఓటేశారు. 18.4 లక్షల మంది జార్జియన్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని సెక్రటరీ ఆఫ్ స్టేట్ కార్యాలయం తెలిపింది. ఇలినాయీ, టెక్సాస్ రాష్ట్రాల్లోనూ ముందస్తు ఓటింగ్ ఎక్కువగా జరిగింది. ఓటింగ్ సెంటర్లలో ఎక్కడ చూసినా పార్కింగ్ ప్రదేశాలు కిక్కిరిసి కన్పించాయి.

### అత్యధికంగా ఓటేసింది రిపబ్లికన్లే

7 అతి కీలక స్వింగ్ స్టేట్లయిన అరిజోనా, నెవెడా, విస్కాన్సిన్, మిషిగన్, పెన్సిల్వేని యా, నార్త్ కరోలినా, జార్జియాల్లో ఫలితాలే అధ్యక్ష ఎన్నికల విజేతను నిర్ణయిస్తాయని అమెరికా రాజకీయ పండితులు చెబుతుంటారు. ఈ కీలక యుద్ధభూమి రాష్ట్రాల్లో ముందస్తు ఓటింగ్‌లో రిపబ్లికన్ ఓటర్లే పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారని సీనియర్ పొలి టికల్ జర్నలిస్ట్ మార్క్ హాల్పెరిన్ అన్నారు. బహుశా మాజీ అధ్యక్షుడు ట్రంప్ విజయానికి ఇది సూచిక కావచ్చని అభిప్రాయపడ్డారు. రిపబ్లికన్లు ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో ముందస్తు ఓటింగ్‌లో పాల్గొంటున్నట్టు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఈ విషయంలో రిపబ్లికన్ పార్టీ బాగా శ్రమించిందని అరిజోనాలో ముందస్తు బ్యాలెట్లను ట్రాక్ చేసే డెమొక్రాటిక్ రాజకీయ వ్యూహకర్త శామ్ అల్మీ అంగీకరించారు.

### ప్రత్యేక సౌలభ్యం..

ముందస్తు ఓటింగ్ అమెరికా ఓటర్లకున్న ప్రత్యేకమైన సౌలభ్యం. వారు మెయిల్- ఇన్- బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు. దీన్ని మన దగ్గరి పోస్టల్ బ్యాలెట్‌తో పోల్చవచ్చు. కొన్ని చోట్ల పోలింగ్ రోజుకు వారాల ముందే పోలింగ్ కేంద్రాలను తెరుస్తారు. ముందుగానే ఓటేయాలనుకునే వారు నిర్ధారిత బూత్‌లకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంటారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

# బారామతి బరిలో అజిత్

**సాక్షి, న్యూఢిల్లీ/ ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల ప్రకటన విడుదలైనప్పటి నుంచి అన్ని పార్టీలు తమ సన్నాహాలను ముమ్మరం చేశాయి. అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 38 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బుధవారం విడుదల చేసింది. వీరిలో 26 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ పుణె జిల్లాలో బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ అసెంబ్లీ నియోజకవర్గం బారామతి లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. బారామతి ఎంపీ స్థానం శరద్ పవార్ కుటుంబానికి దశాబ్దాలుగా కంచుకోటగా ఉంటోంది. అందుకే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో శరద్‌పవార్ కుమార్తె సుప్రియాసూలేపై అజిత్ తన భార్య సునేత్రా పవార్‌ను పోటీకి నిలిపినా సునేత్రా ఓటమిని చవిచూడటం తెల్సిందే. ఛగన్ భుజ్‌బల్ యోలా నుంచి, దిలీప్ వాల్సే పాటిల్ అంబేగావ్ నుంచి పోటీ చేయనున్నారు.

### 45 మందితో శివసేన జాబితా విడుదల


మంగళవారం అర్ధరాత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 45 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. సీఎం ఏక్‌నాథ్ షిండే మరోసారి కోప్రి పాచ్ పాఖాడి నుంచి పోటీచేయనున్నారు. విలాస్ సందీపన్ భూమ్రే పైఠాన్ నుంచి, మంత్రి ఉదయ్ సమంత్ రత్నగిరి నుంచి బరిలో దిగనున్నారు. రాష్ట్రంలోని అధికార మహాయుతి కూటమి ఇప్పటివరకు 182 పేర్లను ప్రకటించింది. ఇందులో బీజేపీ నుంచి 99 మంది, శివసేన నుంచి 45 మంది, ఎన్సీపీ నుంచి 38 మంది అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే తన కుమారుడు అమిత్ ఠాక్రేను మాహిం అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దింపారు.

### శివసేన(యూబీటీ) తొలిజాబితా

ఉద్ధవ్‌ఠాక్రే సారథ్యంలోని శివసేన(యూబీటీ) బుధవారం 65 మంది అభ్యర్థుల పేర్లతో తొలిజాబితాను విడుదలచేసింది. పార్టీ నేత, మాజీ రాష్ట్ర మంత్రి ఆదిత్య ఠాక్రే సెంట్రల్ ముంబై పరిధిలోని వర్లీ నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. యువసేన నేత, ఆదిత్య బంధువు వరుణ్ సర్దేశాయ్ బాంద్రా(ఈస్ట్) నుంచి పోటీచేస్తారు. పార్టీ నుంచి చీలిపోయి పార్టీ పేరు, గుర్తును కైవసం చేసుకున్న ఏక్‌నాథ్ షిండే పోటీచేస్తున్న కోప్రి పాచ్ పాఖాడి నియోజకవర్గంలో శివసేన(యూబీటీ) తరఫున కేదార్ దిఘే బరిలో దిగుతున్నారు. షిండే రాజకీయగురువు ఆనంద్ దిఘే మేనల్లుడే కేదార్.

## ఛోటా రాజన్‌కు బెయిలు

**అయినా జైల్లోనే గ్యాంగ్‌స్టర్**



**ముంబై:** హోటల్ యజమాని హత్య కేసులో అండర్ వరల్డ్ డాన్ చోటా రాజన్‌కు బాంబే హైకోర్టు బుధవారం బెయిలు మంజూరు చేసింది. అయితే జర్నలిస్టు జేడే హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న నేపథ్యంలో రాజన్ తిహార్ జైలులోనే ఉండనున్నారు. దక్షిణ ముంబైలోని 'గోల్డెన్ క్రౌన్' హోటల్ యజమాని జయ శెట్టిని 2001 మే 4న కాల్చి చంపారు. ఈ కేసులో రాజన్‌తో పాటు మరో ముగ్గురు షూటర్లకు సీబీఐ ప్రత్యేక కోర్టు మే 30న జీవిత ఖైదు విధించింది. డబ్బులివ్వడానికి నిరాకరించినందుకే శెట్టిని హత్య చేశారని ఆరోపించారు.

## తుర్కియే వైమానిక సంస్థపై ఉగ్ర దాడి

**ఐదుగురు మృతి • 14 మందికి గాయాలు**

**అంకారా:** తుర్కియే రాజధాని అంకారా నగర శివారులోని ఒక వైమానిక, రక్షణ రంగ సంస్థపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారని తుర్కియే అంతర్గత మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. 14 మంది గాయపడ్డారు. అయితే ఎవరు దాడి చేశారు, ఎందుకు చేశారు? అనే వివరాలను బయటపెట్టలేదు. టుటాస్ అనే సంస్థ ప్రాంగణంలో దాడి జరిగినట్లు మంత్రి అలీ యెర్లికాయా చెప్పారు. తుర్కియేలో గతంలో కుర్ద్ మిలిటెంట్లు, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, వామపక్ష ఉగ్రవాదులు దాడులు జరిపారు. సంస్థలో భద్రతా సిబ్బంది షిఫ్ట్ మారే సమయంలో కొందరు ఆగంతకులు హఠాత్తుగా వచ్చి బాంబులు వేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపారని ప్రైవేట్ ఎన్‌టీవీ చానెల్ తన కథనంలో పేర్కొంది. అయితే ఆగంతకులు పారిపోలేదని లోపలి సిబ్బందిని బందీలుగా చేసుకుని అక్కడే ఉన్నారని, ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. తొలుత కేవలం బాంబు పేలుడు జరిగినట్లు వార్తలొచ్చాయి. సంస్థలోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారని హబర్‌టర్క్ టెలివిజన్ పేర్కొంది.

# సాక్షి హైదరాబాద్

గురువారం । 24 । అక్టోబర్ । 2024






### ప్రతి చెట్టూ బతకాల్సిందే

కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాజధానిలో రహదారుల వెంట ఉన్న ప్రతి చెట్టూ బతకాల్సిందేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. -8లో



### హల్లో హర్రర్..

భయపడటం బాగుంటుంది. భయపెట్టడం ఇంకా బాగుంటుంది. ఈ రెండు బాగులూ కావాలనుకునేవారిని జాగో అంటున్నాయి సిటీలోని పార్టీ వేదికలు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/21.0

### వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 32, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## 7.058 కేజీల గంజాయి పట్టివేత

**నాలుగు కేసుల్లో ఆరుగురి అరెస్టు**



సాక్షి, సిటీబ్యూరో: నాలుగు కేసుల్లో 7.058 కేజీల గంజాయిని, మరో కేసులో తొమ్మిది గ్రాముల ఎండీఎంఏను బుధవారం ఆబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు కీలక వ్యక్తులు ఉన్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని కేకేనగర్, బండ్లగూడ ప్రాంతంలో 1.500 కిలోలు, గుడిమల్కాపూర్ నల్లపోచమ్మగుడి ప్రాంతంలో 1.308, ధూల్‌పేట్‌లో 1.4, చందానగర్‌లో 2.850 కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం స్వాధీనం చేసుకున్నాయి. ఈ కేసుల్లో నాలుగు సెల్ ఫోన్లు , మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో బెంగళూరు నుంచి హైదరాబాద్ బస్సులో డ్రగ్స్ తెచ్చి బుక్ చేసుకున్న వారికి అందించి తిరిగి వెళుతున్న అజయ్ కుమార్‌ను ఎస్టీఎఫ్ సీఐ శిరీష బృందం లక్డీకాపూల్‌లో పట్టుకుంది. వృత్తి రీత్యా వెల్డింగ్ పని చేస్తున్న అజయ్ కుమార్ బెంగళూరులో డ్రగ్స్ సప్లయర్స్ మారాడు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తెచ్చి ఇస్తుంటాడు. పట్టుబడిన గంజాయి, డ్రగ్స్ విలువ రూ. 3.83 లక్షలు ఉంటుంది. సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్లు కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ ఆపరేషన్ ధూల్‌పేట్ ఇన్‌చార్జి నంద్యాల అంజిరెడ్డి అభినందించారు.

## డ్యూటీమీట్ విజేతలకు సీపీ సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పోలీసు అకాడమీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీసు డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన 35 మంది నగర పోలీసు అధికారులు, సిబ్బందిని కొత్వాల్ సీపీ ఆనంద్ అభినందించారు. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఉన్న కమిషనరేట్‌లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరిగిన ఈ డ్యూటీ మీట్‌లో నగర పోలీసులు మంచి ప్రతిభ చూపడంపై ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. వారికి నగదు ప్రోత్సాహకం అందించి సత్కరించారు. సిటీ పోలీసు విభాగం సాధించిన పతకాల్లో ఐదు బంగారు, రెండు వెండివి ఉన్నాయి. ఇలాంటి డ్యూటీ మీట్స్ వల్ల అధికారులు, సిబ్బందిలో ఉన్న ప్రతిభ బయటకు రావడంతో పాటు మరింత మెరుగవుతుందని ఆనంద్ వ్యాఖ్యానించారు. పోలీసు శాఖలో ఇలాంటి టీమ్ వర్క్‌తో కూడిన కార్యక్రమాలతో అధికారులు, సిబ్బంది మధ్య స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. ఇప్పుడు పతకాలు పొందిన స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో జరిగే డ్యూటీ మీట్స్‌లో మరింతగా రాణించాలని కొత్వాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీ ఎస్.శ్వేత, ఏసీపీ జి.గురు రాఘవేంద్ర, కె.పూర్ణ చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కొట్టేసిన ఫోన్లను పట్టేశారు

**35 రోజుల్లో 800 ఫోన్ల రికవరీ**

- వీటి విలువ రూ.2.40 కోట్లు
- బాధితులకు అందించిన సైబరాబాద్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: 35 రోజుల్లో 800 సెల్‌ఫోన్లను సైబరాబాద్ పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ రూ.2.40 కోట్ల మేర ఉంటుందని డీసీపీ (క్రైమ్స్) కె.నరసింహ తెలిపారు. ఆయా ఫోన్లను బుధవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌ను వినియోగించి మొబైల్స్‌ను రికవరీ చేశామని చెప్పారు. అత్యధికంగా మాదాపూర్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పరిధిలో 135 ఫోన్లు, బాలానగర్ సీసీఎస్‌లో 140, మేడ్చల్ సీసీఎస్‌లో 101, రాజేంద్రనగర్ సీసీఎస్‌లో 133, శంషాబాద్ సీసీఎస్‌లో 72, మేడ్చల్ జోన్‌లో 105, ఐటీ సెల్ ద్వారా 101 మొబైల్స్‌ను రికవరీ చేశామని వివరించారు. సమావేశంలో సీసీఆర్బీ ఏసీపీ కళింగ రావు, సీసీఎస్ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.





## గోషామహల్‌లో కుప్పకూలిన నాలా

**రెండేళ్ల వ్యవధిలో రెండోసారి..**

- అర్ధరాత్రి ఘటన.. తప్పిన పెను ప్రమాదం

గోషామహల్ చాక్నవాడిలో నాలా పైకప్పు కుప్పకూలింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (బుధవారం తెల్లవారుజామున) ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. రెండేళ్ల క్రితం చాక్నవాడి ప్రధాన రహదారిపై నాలా కూలడంతో ఆ ప్రాంతంలో కొత్త పైకప్పుగా వేశారు. దాని సమీపంలోనే 200 అడుగుల దూరంలో మరోసారి నాలా పైకప్పు కూలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అఫ్జల్‌సాగర్ నుంచి వచ్చే ఈ నాలా దారుస్సలాం, గోషామహల్, చాక్నవాడి, బేగంబజార్, గౌలిగూడ మీదుగా మూసీలో కలుస్తుంది. వర్షాకాలంలో పెద్ద ఎత్తున వర్షపునీరు ప్రవహించడంతో పాటు డ్రైనేజీ ఈ నాలాలో ప్రవహిస్తుంది. బుధవారం తెల్లవారు జామున ఈ నాలా పైకప్పు కూలడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, వ్యాపారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్, గోషామహల్-14వ సర్కిల్ ఈఈ అరుణ, వాటర్ బోర్డు జీఎం జాన్ షరీఫ్, ఇతర అధికారులు నాలా కూలిన ప్రాంతాన్ని సందర్శించారు. ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి రహదారిని మూసివేశారు. - అబిడ్స్

# ఇదే మంచి తరుణం

**జలమండలి ఓటీఎస్ గడువు మరో వారం రోజులే**

- అసలు మొత్తం చెల్లిస్తే ఆలస్య రుసుం, వడ్డీపై రాయితీ
- బకాయి వివరాలు ఎస్సెమ్మెస్ ద్వారా చేరవేత
- సులువుగా బిల్లు చెల్లించడానికి జలమండలి ఏర్పాట్లు
- వినియోగదారుల అవగాహన కోసం విస్తృత ప్రచారం



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి నీటి బకాయిల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) వెసులుబాటు మరో వారం రోజుల్లో ముగియనుంది. గడువు కాలంలో పెండింగ్ బిల్లులను చెల్లిస్తే ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందవచ్చు. దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులకు జలమండలి సువర్ణావకాశం కల్పించింది. వినియోగదారులు సకాలంలో బకాయిలు చెల్లించే విధంగా విస్తృత ప్రచారం చేపట్టింది.

### బకాయిలున్న కనెక్షన్లు 7 లక్షలపైనే..

జలమండలి పరిధిలో సుమారు 13.50 లక్షలు నల్లా కనెక్షన్లు ఉండగా అందులో సుమారు 7.1 లక్షల కనెక్షన్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తమ్మీద దాదాపు రూ.1,706 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ఆలస్య రుసుముతో పాటు వడ్డీ రూపంలో ఉన్న రూ.1,189 కోట్ల బకాయిలు మాఫీ కానున్నాయి.

### చెల్లింపు విధానం ఇలా..

- జలమండలి కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లల్లో చెల్లించవచ్చు.
- ఆన్‌లైన్ విధానంలో.. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా
- NEFT, RTGS, BPPS ద్వారా..
- జలమండలి అధికారిక వెబ్ సైట్ www. hyderbadwater.gov.inకు లాగిన్‌తో.. లైన్‌మెన్లు గృహాలను సందర్శించినప్పుడు వారి దగ్గర ఉండే EPOS యంత్రం ద్వారా కూడా చెల్లించవచ్చు.
- మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా సైతం బిల్లు చెల్లించే అవకాశాన్ని కల్పించారు.
- https://www.hyderabadwater.gov.in/HmwssbOnlineNew#HmwssbOTSDetails ఇక్కడ పేర్కొన్న లింకును క్లిక్ చేయడం ద్వారా.. నేరుగా బిల్లు చెల్లించవచ్చు.
- జలమండలి అందించే QR Code స్కాన్ చేసి చెల్లించవచ్చు.

**వడ్డీ మాఫీ పరిధి ఇలా..**

నల్లా బిల్లుల బకాయిలపై వడ్డీ మాఫీ కోసం అధికారులకు స్థాయిని బట్టి అమౌంట్ పరిధిని నిర్ణయించారు. మేనేజర్ స్థాయిలో రూ.2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10,000 వరకు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ.1,00,000 వరకు, చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ బిల్లు మాఫీ చేసే అధికారం ఉంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

పెండింగ్ బిల్లుల వినియోగదారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గడువులోగా పెండింగ్ బకాయిలు చెల్లించి.. ఆలస్య రుసుం, వడ్డీ నుంచి మినహాయింపు పొందాలి. - అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

### మొబైల్ నంబర్లకు సమాచారం

జలమండలి పెండింగ్ బిల్లుల వినియోగదారుల క్యాన్ నంబర్‌కు అనుసంధానమైన మొబైల్ నంబరుకు బకాయి మొత్తం, ఎంత చెల్లించాలి, ఎంత మాఫీ అవుతుంది తదితర వివరాలన్నీ సంక్షిప్త సమాచారం పంపిస్తోంది. సామాజిక మాధ్యమాలైన ట్విటర్, ఫేస్ బుక్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్ఎం రేడియో, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఓటీఎస్-2024 పథకం గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

### నిబంధనలు ఇలా..

- ఓటీఎస్ ఈ నెల 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుంది.
- గతంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు.. ఒకేసారి బిల్లు చెల్లిస్తే.. ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ అవుతాయి.
- గతంలో ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారులకు 50 శాతం వరకు బిల్లు మాఫీ అవుతుంది.
- ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు.. భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని హామీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. బిల్లు చెల్లింపుల విషయంలో వారు విఫలమైతే, ఈ పథకం కింద వారు పొందిన ప్రయోజనాన్ని రద్దు చేస్తారు.
- తమ నల్లా కనెక్షన్.. డిస్ కనెక్షన్ స్థితిలో ఉన్న వినియోగదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకుంటే.. ఇప్పటి దాకా పెండింగ్‌లో ఉన్న బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

## గ్యాంగ్‌స్టర్ అయూబ్ ఖాన్ చిక్కాడు

**కోర్టు విచారణకు కొన్నాళ్లుగా డుమ్మా**

- ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసిన న్యాయస్థానం
- గాలించి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్
- మరో నేరగాడు అష్వఖ్ సైతం పట్టివేత



అయూబ్ ఖాన్, అష్వఖ్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కరడుగట్టిన రౌడీషీటర్, గ్యాంగ్‌స్టర్ అయూబ్ ఖాన్ దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు చిక్కాడు. తనపై నమోదైన కేసుల్లో బెయిల్ పొందిన ఇతను కొన్నాళ్లుగా కోర్టు విచారణకు గైర్హాజరవుతున్నాడు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం జారీ చేసిన నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) ఆధారంగా పట్టుకున్నట్లు బుధవారం టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు. మరో రౌడీషీటర్ అష్వఖ్‌ను సైతం కటకటాల్లోకి పంపినట్లు పేర్కొన్నారు.

**మూడు కమిషనరేట్లలో 72 క్రిమినల్ కేసులు..**

కుమ్మరివాడీ ప్రాంతానికి చెందిన అయూబ్ ఖాన్‌పై శాలిబండ ఠాణాలో రౌడీషీట్ ఉంది. ఇతనిపై మూడు కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్లలో 72 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 14 హత్య, మరో 14 హత్యాయత్నానికి సంబంధించినవి. మిగిలినవి దోపిడీ, బెదిరింపులు, ఆయుధ చట్టం కింద రిజిస్టర్ అయ్యాయి. కామాటిపురా ఠాణాలో నమోదైన ఓ కేసులో బెయిల్ పొందిన అయూబ్ ఖాన్ కొన్నాళ్లుగా నాంపల్లి కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరుకావట్లేదు. దీంతో న్యాయస్థానం ఇతడిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీని ఆధారంగా రంగంలోకి దిగిన దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహులు, జి.ఆంజనేయులు, ఎన్.నవీన్‌లతో కూడిన బృందం ముమ్మరంగా గాలించింది. ఎట్టకేలకు అయూబ్‌ను పట్టుకుని కామాటిపురా పోలీసులకు అప్పగించింది.

**అష్వఖ్‌పై 44 క్రిమినల్ కేసులు..**

కాలాపత్తర్ ఠాణాలో రౌడీషీటర్‌గా ఉన్న మహ్మద్ అష్వఖ్‌పై మూడు కమిషనరేట్లలోని వివిధ పోలీసు స్టేషన్లలో 44 క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2000 నుంచి నేరాలు చేయడం ప్రారంభించిన ఇతడిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం కేసులూ ఉన్నాయి. కాలాపత్తర్ ఠాణాలో నమోదైన ఓ హత్యాయత్నం కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. అక్రమ ఆయుధంతో సంచరిస్తున్న ఇతని కదలికలపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. రంగంలోకి దిగిన అధికారులు పట్టుకుని అక్రమాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నేపథ్యంలో కాలాపత్తర్ కేసులో వాంటెడ్ అనే విషయం తెలియడంతో అక్కడి అధికారులకు అప్పగించారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి: కేటీఆర్



లింగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

అంబర్‌పేట: రాష్ట్రానికి హోంమంత్రి లేకపోవడంతో శాంతిభద్రతలు అగమ్యగోచరంగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకే చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొనడం ప్రభుత్వ పాలన దయనీయ స్థితికి నిదర్శనమన్నారు. తక్షణమే హోంమంత్రిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. అంబర్‌పేట డీడీ కాలనీలో హత్యకు గురైన బ్యాంకు విశ్రాంత ఉద్యోగి లింగారెడ్డి దంపతుల కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పోలీసులకు వారి పని వారు చేసుకోవడానికి ప్రభుత్వం స్వేచ్ఛ ఇవ్వడంలేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై పోలీసులను ఉసిగొల్పకుండా శాంతి భద్రతలపై దృష్టి పెట్టేలా వారికి సూచనలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేయడం శాంతి భద్రతలు ఎంతగా దిగజారాయో తెలుస్తోందన్నారు. తక్షణమే రాష్ట్రానికి హోంమంత్రిని నియమించి శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కేటీఆర్ వెంట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్ స్మృతిలో..

**ప్రత్యేకంగా జంక్షన్ అభివృద్ధి**

- రూ.25 లక్షలతో పనులు
- ప్రారంభించిన జీహెచ్ఎంసీ




నగరంలో ఇటీవల పలు జంక్షన్లు, ఫ్లై ఓవర్లు, డివైడర్ల సుందరీకరణలపై దృష్టి సారించిన జీహెచ్ఎంసీ.. దాని ప్రధాన కార్యాలయం చెంతనే ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జంక్షన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దనుంది. మన పార్లమెంటు భవనం నమూనాలో ఈ జంక్షన్‌ను అభివృద్ధి చేయనుంది. భారత రాజ్యాంగం రూపకల్పనకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అంబేడ్కర్ చేసిన అపార కృషికి ప్రతీకగా, ఆయన గౌరవార్థం పార్లమెంటు నమూనా, అంబేడ్కర్ విగ్రహంతో పాటు ఆయన పిలుపునిచ్చిన 'ఎడ్యుకేట్, ఎజిటేట్, ఆర్గనైజ్' నినాదంతో ఈ జంక్షన్ రూపుదిద్దుకోనుంది. అంబేడ్కర్ విగ్రహం ముందు గ్లోబ్, దానిపై రాజ్యాంగాన్ని గుర్తు తెచ్చేలా పుస్తకం తదితర చిత్రాలు ఆవిష్కృతం కానున్నాయి. ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ. 25 లక్షలు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. - సాక్షి, సిటీబ్యూరో

## స్వదేశీ మేళాలతో స్వయం సమృద్ధి

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**



ఖైరతాబాద్: స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబన భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నగరంలోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ అనేది మన స్వయం సమృద్ధితో పాటు దేశ ఆత్మనిర్భరతను అన్ని రంగాల్లో సాకారం చేసే అద్భుత తారకమంత్రమన్నారు. మూడు దశాబ్దాలుగా స్వదేశీ జాగరణ మంచ్ నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలతో స్థానిక కళాకారులు, ఉత్పత్తులు, వ్యాపారులను అమితంగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం వల్ల ఆర్థిక ప్రయోజనమే కాకుండా కుటుంబం తద్వారా గ్రామం, రాష్ట్రం, దేశం మొత్తం స్వయం సమృద్ధిని సాధిస్తుందన్నారు. స్వదేశీ భావజాలం, స్వదేశీ విధానాలు బలపడిన కొద్దీ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచానికి అగ్రగామిగా నిలవడంతో పాటు ప్రతి ఒక్కరికీ ఆదర్శమవుతుందన్నారు. 334 స్టాళ్లలోని ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ సీఏఆర్ సుందరం, తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్ బాబు, గంగోత్రి డెవలపర్స్ చైర్మన్ మధురాం రెడ్డి, భారత్ అభియాన్ ప్రాంత కన్వీనర్ జి.రమేష్ గౌడ్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వదేశీ మేళా ఈ నెల 27 వరకు అందుబాటులో ఉంటుంది.



స్వదేశీ మేళా స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్

## పెండింగ్ పనులు సత్వరం పూర్తి కావాలి

**అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి**

సాక్షి ఎఫెక్ట్..



పనులకు సంబంధించిన మ్యాప్ పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సార్‌డీపీ మొదటి దశలో చేపట్టిన పనుల్లో ఇంకా పూర్తికానివాటిని సత్వరం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి కాకపోవడంపై 'ఫైసల్లేక.. పనులు సాగక' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఇటీవల ఓ కథన ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో బుధవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పనుల్ని ఆయన పరిశీలించారు. ఈ పనులకు నిధులలేమి ముఖ్య కారణం కాగా, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని అధికారులు ఆయనకు వివరించారు. ఆరాంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్ పనులకు ఇంకా భూసేకరణ పూర్తికాకపోవడంతో భూసేకరణ పనుల్ని సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మాణంలో ఉన్న శిల్పా లే ఔట్ ఫేజ్- 2 ఫ్లైఓవర్ పనుల పరిశీలనలో 33 కేవీ విద్యుత్ లైన్ కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందని ఇంజినీరింగ్ అధికారులు వివరించగా, వెంటనే విద్యుత్ లైన్ తొలగించాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. 33 కేవీ విద్యుత్ లైన్ తొలగించకపోవడంతో వరదనీటి కాలువ/కల్వర్టు, ర్యాంప్, ఇతరత్రా పనులు చేపట్టలేకపోయామని ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించడంతో వెంటనే తొలగించాల్సిందిగా టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. వీటితో పాటు అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ ఇంజినీర్లను ఆదేశించారు.

# నగరంలో 'సీనియర్ లివింగ్ సెక్టార్'

- వయోవృద్ధులకు అధునాతన, ఆరోగ్యకర జీవనశైలికి శ్రీకారం
- వారి కోసమే ప్రత్యేకంగా గ్రీన్‌రిచ్ హైలాండ్స్ నదుపాయాలు
- చెన్నై, బెంగళూరు, కోయంబత్తూర్ తరహాలో వినూత్న ప్రాజెక్టు

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా అధునాతన జీవనశైలితో పాటు అనువైన ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తారనేది విధితమే. కానీ నగరంలో వృద్ధులకు, పెద్ద వయస్కులకు అనువైన సౌకర్యాలు, సౌలభ్యాలు అందించే సీనియర్ లివింగ్ సెక్టార్ కూడా ప్రత్యేకత చాటుకుంటోంది. ప్రత్యేకంగా నగరంలోని వయోవృద్ధులకు మెరుగైన నివాస సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో వేదాంత సీనియర్ లివింగ్, గ్రీన్‌రిచ్ గ్రూప్ ఆధ్వర్యంలో వినూత్న ప్రాజెక్టును చేపట్టామని సంస్థల యాజమాన్యం ప్రకటించింది. ఇందులో భాగంగా గ్రీన్‌రిచ్ హైలాండ్స్ పేరుతో దాదాపు 250 యూనిట్ల నిర్మాణాలను చేపట్టామని వెల్లడించారు. ఈ జీవన శైలికి సంబంధించి భారత్‌లో రానున్న ఐదేళ్లలో 18–20% వార్షిక వృద్ధి రేటు పెరగనుందని వేదాంత సీనియర్ లివింగ్ కో–ఫౌండర్ రాహుల్ సబర్వాల్ తెలిపారు. నగరంలోని వృద్ధులు, ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రశాంతత, మానసికోల్లాసం, వెల్నెస్ హబ్, ఇండోర్ గేమ్స్, రమ్యమైన వినోద ప్రదేశాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని చెప్పారు. చెన్నై, బెంగళూరు, కోయంబత్తూర్, హౌంసర్ వంటి ప్రధాన నగరాల్లో ఆదరణ పొందుతున్న ఇలాంటి సేవలు నగరంలో కూడా అందుబాటులోకి రావడం శుభపరిణామమని వివరించారు. దీనికి సంబంధించి ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్స్ గ్రౌండ్స్ వేదికగా నిర్వహించే ఎన్ఏఆర్ఈడీసీఓ తెలంగాణ ప్రాపర్టీ ఎక్స్‌పోలో అవగాహన కల్పించనున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ప్రతి చెట్టూ బతకాల్సిందే..

- వృక్షాల ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై హైడ్రా నజర్
- వాల్టా యాక్ట్ అమలుపై రంగనాథ్ దృష్టి
- జోన్ల వారీగా బృందాల ఏర్పాటుకు నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాజధానిలో రహదారుల వెంట ఉన్న ప్రతి చెట్టూ బతకాల్సిందేనని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా వాల్టా చట్టం (తెలంగాణ వాటర్ ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్) పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. దీనికోసం జోన్ల వారీగా హైడ్రా, జీహెచ్ఎంసీ, అటవీ విభాగాలతో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన కీలక సమీక్ష సమావేశాన్ని బుధవారం బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో చెట్ల పరిరక్షణతో పాటు ప్రమాదకరంగా మారిన వాటి అంశాన్నీ చర్చించారు. మూడు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో ఏర్పాటయ్యే బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను గుర్తించడంతో పాటు వాటి ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఈ విధానం జరుగుతున్న తీరును సమీక్షించిన రంగనాథ్ వంద శాతం చెట్లు బతికేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను గుర్తించి ప్రాణ–ఆస్తి నష్టాలకు తావు లేకుండా తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా, కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని స్పష్టం చేశారు. రహదారులపై ప్రయాణిస్తున్న వాహనాలకు ఇబ్బందికరంగా మిరిన చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని, తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగించిన చోట కచ్చితంగా మొక్కలు నాటాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు తాకుతున్నాయనే నెపంతో అశాస్త్రీయంగా చెట్ల కొమ్మలు నరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రంగనాథ్ సూచించారు. కరెంట్ తీగలకు తాకుతున్నాయని, రహదారి పైకి వస్తున్నాయనే కారణంగా చెట్లకు ఒక వైపు ఉన్న కొమ్మలను తొలగించడం ద్వారా అవి బ్యాలెన్సు కోల్పోయి కూలిపోయే ప్రమాదం ఉందన్న హైడ్రా కమిషనర్ అలా జరగకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని స్పష్టం చేశారు.

# హోరాహోరీగా ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: స్పోర్ట్స్ ఫర్ ఆల్ చాంపియన్‌షిప్స్ (ఎస్ఎఫ్ఏ) 2024 పోటీల్లో భాగంగా కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు పతకాలతో అలరించారు. ఈ వేదికలో బాలికల అండర్–11 డబుల్స్ ఫైనల్స్‌లో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన పూజ– మదాలస సాయి జంట స్వర్ణం కైవసం చేసుకుంది. బాలుర అండర్–13 డబుల్స్‌లో అర్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ధీరజ్–ధర్‌షీల్ జోడీ విజేతగా నిలిచింది. మరో వేదిక గచ్చిబౌలి స్టేడియంలో కొనసాగుతున్న అథ్లెటిక్స్ పోటీలు బుధవారం ముగిశాయి. ఎస్ఎఫ్ఏ పోటీలకు మరో ఐదు రోజులు మిగిలి ఉండగానే విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్ (నిజాంపేట్) అగ్రస్థానంలో, రెండవ స్థానంలో డీడీఎంఎస్ ఏఎంఎస్ పి.ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్ కొనసాగుతున్నాయి. కాగా ఈ సంవత్సరం హైదరాబాద్ ఎడిషన్ ఎస్ఎఫ్ఏ ఛాంపియన్‌షిప్స్‌లో 920 పాఠశాలల నుంచి 23 వేల మంది అథ్లెట్లు 22 రకాల క్రీడలలో పోటీ పడుతున్నారు.

# సమష్టి కృషితోనే వ్యవసాయ ప్రగతి


వరి పంటలను పరిశీలిస్తున్న రైతులు


అవార్డు అందుకుంటున్న రైతు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని భారతీయ పరిశోధన సంస్థలో బుధవారం ఇండస్ట్రీమీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మీట్‌లో 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో ప్రైవేట్ విత్తన కంపెనీలు, రైస్ మిల్లర్లు నూతన వరి వంగడాలు, సస్యరక్షణ నీటిని పొదుపు చేసే పద్ధతులతోపాటు వ్యవసాయానికి సంబంధించి వివిధ రకాల పంటలను ప్రదర్శించారు. వ్యవసాయ రంగంలో ప్రగతి సాధనకు పరిశోధకులు, విత్తన కంపెనీలు, రైస్ మిల్లర్లు, రైతులు సమష్టిగా కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతను నిపుణులు వివరించారు. దీని ద్వారా రైతాంగానికి కలిగే ప్రయోజనాలను గురించి చర్చించారు. అనంతరం ఉత్తమ రైతులకు అవార్డులు అందజేశారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

ఉద్యోగులకు కలెక్టర్ సూచన


కలెక్టర్‌ను సన్మానిస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు తీసుకెళ్లి..వాటి విజయవంతానికి ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం.బి కృష్ణాయాదవ్‌తోపాటు కమిటీ సభ్యులను కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వివిధ విభాగాల అధికారులను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ఖదీర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పూనమ్, వైస్ ప్రెసిడెంట్ నామాల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ అశన్న, కోశాధికారి వెంకటరమణ, మంచాల రవీందర్, సురేందర్, ఉపాధ్యక్షుడు రాజేందర్, వి.శ్రీరాములు, జాయింట్ సెక్రటరీ, కోటాజీ, మహ్మద్ గౌస్, రవీందర్, ఎ.వెంకటరాంరెడ్డి, రమేష్, సాంస్కృతిక కార్యదర్శి గోపాలకృష్ణ, సందీప్‌కుమార్, జూపల్లి నర్సింగరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కారు అద్దాలు ధ్వంసం చేసి రూ.2 లక్షలు చోరీ

లింగోజిగూడ: కారు అద్దాలు ధ్వంసం చేసి..అందులోని నగదు చోరీ చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ చింతలకుంట చెక్ పోస్ట్ సమీపంలోని సరస్వతి కాలనీలో నివాసం ఉండే వాకిటి సుధాకర్‌రెడ్డి బుధవారం ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం తన మిత్రుడి కారు తీసుకుని హయత్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. రిజిస్ట్రేషన్ ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు కారులో పెట్టి డాక్యుమెంట్ తయారు చేయించుకునేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి కారు వెనుక అద్దాలు ధ్వంసమై ఉన్నాయి. వెంటనే నగదు ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రూ.2 లక్షలు కనిపించలేదు. దీంతో సుధాకర్‌రెడ్డి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో యూపీ కార్మికుడి మృతి

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనిల్‌సింగ్(46) ఐదు నెలల క్రితం వినోభానగర్ సమీపంలోని వైట్ గోల్డ్ కంపెనీలో పనికి కుదిరాడు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం 8 గంటలవుతున్నా నిద్ర లేవకపోవడంతో తోటి కార్మికులు వెళ్లి లేపేందుకు ప్రయత్నించారు. ఉలుకుపలుకు లేకపోవడంతో వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని యూపీలోని అనిల్ కుటుంబ సభ్యులకు తెలియజేయగా.. మృతుడి బంధువులు విమానంలో ఇక్కడకు చేరుకున్నారు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని అనిల్‌సింగ్ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఊరెళ్దామని.. వేరే బస్సెక్కి

- పాఠశాలలో అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ప్రత్యక్షం


నితిన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం నితిన్(14) స్థానిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం నుంచి పాఠశాలలో కనిపించకుండా పోయాడు. వెంటనే ప్రిన్సిపాల్ వరూధిని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పలుచోట్ల గాలించారు. అదృశ్యమైన విద్యార్థి ఉప్పల్‌లో ఉన్నట్లు అదేరోజు రాత్రి పోలీసులకు సమాచారం వచ్చింది. కాగా స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక బస్టాండ్‌కు వచ్చి యాచారం వెళ్లే బస్సుకు బదులుగా ఉప్పల్ బస్సు ఎక్కినట్లు నితిన్ పోలీసులకు తెలిపారు. బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరూధిని సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

## మెడికల్ కళాశాలకు సునీల్‌కుమార్ భౌతికకాయం


సునీల్‌కుమార్ భౌతికకాయాన్ని భాస్కర మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు


సునీల్‌కుమార్ (ఫైల్)

మొయినాబాద్: సామాజిక సేవకుడి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు భాస్కర మెడికల్ కళాశాలకు అప్పగించారు. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన డీఆర్ సునీల్‌కుమార్ పన్నెండేళ్ల క్రితం మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లికి వచ్చి గ్రామంలో ఓ పెంకుటిళ్లు తీసుకుని ఇక్కడే ఉంటున్నారు. సొంత డబ్బులతో గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి చదుకునే యువకులను ప్రోత్సహించేవారు. పరిసర గ్రామాల్లో సైతం వివిధ రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేట్టారు. ఆయన కుటుంబ సభ్యులు మాత్రం బోరబండలోనే ఉంటున్నారు. తాను మరణిస్తే తన భౌతికకాయాన్ని భాస్కర మెడికల్ కళాశాలకు దానం చేసే విధంగా పదేళ్ల క్రితమే అంగీకర పత్రం రాసిచ్చారు. బుధవారం సునీల్‌కుమార్ అనారోగ్యంతో రెడ్డిపల్లిలో మరణించారు. విషయాన్ని గ్రామస్తులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వచ్చి ఆయన నిర్ణయం ప్రకారం భౌతికకాయాన్ని భాస్కర మెడికల్ కళాశాలకు అందజేశారు.

# జాబ్స్ పేరిట మోసగించిన వ్యక్తి అరెస్టు


నిందితుడు చల్లా శ్రీరామ్‌కిరణ్

బంజారాహిల్స్: బ్యాక్‌డోర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో అమాయకులైన యువకుల నుంచి లక్షలాది రూపాయలు దండుకొని మోసగించిన ఘటనలో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..నాగోల్‌కు చెందిన చల్లా శ్రీరామ్‌కిరణ్ (38), ఆయన భార్య పబ్బు సంధ్యారాణి ఇద్దరూ కలిసి తమకు సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఎన్నో పరిచయాలు ఉన్నాయని, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది యువకులను నమ్మించారు. జూబ్లీహిల్స్‌లోని స్రవంతినగర్‌కు చెందిన ఆర్యవరపు వాసు అనే ఐటీ ఉద్యోగికి కూడా ఇలాగే వీరు పరిచయమయ్యారు. వీరి మాటలను నమ్మిన వాసు తనకు తెలిసిన వారితో డబ్బులు చెల్లించి ఉద్యోగాల కోసం ఎదురుచూడసాగారు. ఇలా 114 మంది యువకులు బ్యాక్‌డోర్ ఉద్యోగాల కోసం శ్రీరామ్‌కిరణ్‌కు, ఆయన భార్య సంధ్యారాణికి రూ.కోటికి పైగా చెల్లించారు. వీరందరికీ ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వగా, ఆయా కంపెనీల్లో జాయిన్ కావడానికి వెళ్లిన వీరంతా తమకు ఇచ్చినవి నకిలీ లెటర్లు అని తెలుసుకుని లబోదిబోమన్నారు. న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీరామ్‌కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయన భార్య పరారీలో ఉందని పోలీసులు తెలిపారు. రూ.కోటికి పైగా వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉర్దూ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి


గాంధీ భవన్‌లో మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఉర్దూ ట్రైనీ టీచర్లు

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ–2024 ఉర్దూ మీడియం బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఉర్దూ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని ఉర్దూ ట్రైనీ టీచర్స్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజాపాలన–మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్ బాబును కలిసి తమ గోడు వినిపించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో రిజర్వేషన్ కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు లేక మిగిలిపోయిన పోస్టులను జనరల్ కేటగిరికి కేటాయించి తిరిగి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిసారి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అవుతున్నా రిజర్వేషన్ కేటగిరి పోస్టులు అత్యధికంగా బ్యాక్‌లాగ్ కింద పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కేటగిరిలో పెద్ద ఎత్తున పోస్టులు అర్హులైన అభ్యర్థులు లేక బ్యాక్‌లాగ్‌గా మారాయన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉర్దూ మాట్లాడేవారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు గాంధీభవన్‌లో ప్లే కార్డులు చేతబూని ఉర్దూ ట్రైనీ టీచర్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంజేపీటీబీసీడబ్లూ ఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి అన్నారు. మహాత్మ జ్యోతి బాయి పూలే వెనుకబడిన తరగతుల గురుకుల బాలికల విద్యాలయాల (ఖైరతాబాద్, చాంద్రాయణగుట్ట అండర్–14, అండర్–19) విద్యార్థులకు చర్లపటేల్‌గూడ పరిధిలోని రాజమహేంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఎదుగుదలకు, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో మంచి ప్రావీణ్యాన్ని సాధించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ నెల 29 వరకు నిర్వహించే ఈ క్రీడల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, లాంగ్‌జంప్, హై జంప్, రన్నింగ్, షార్ట్‌పుట్ తదితర పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏజీఓ లక్ష్మయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యదర్శి ఆశన్న, హైదరాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ ఆధిత్యవర్మ, జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్‌రావు, ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# రూ.1.03 కోట్లు ఫ్రీజ్.. రూ.53 లక్షలు రీఫండ్

- రూ.2.88 కోట్లు నష్టపోయిన బాధితుడు
- రెండు బ్యాంకు ఖాతాల్లోని మొత్తం ఫ్రీజ్
- కోర్టు అనుమతితో ఒకదాంట్లోది అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్ల బారినపడి రూ.2.88 కోట్లు కోల్పోయిన నగర వాసికి సైబర్ క్రైమ్ పోలీసులు రూ.53 లక్షలు బుధవారం రీఫండ్ చేయించారు. మరో రూ.50 లక్షల్ని త్వరలోనే బాధితుడికి అందేలా చేస్తామని డీసీపీ దార కవిత తెలిపారు. నగరానికి చెందిన 84 ఏళ్ల వృద్ధుడికి సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారుల పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. రూ.68 కోట్లతో ముడిపడిన ఆర్థిక నేరంలో నిందితుడిగా ఉన్నావని, త్వరలోనే అరెస్టు చేస్తామంటూ బెదిరించారు. ఆ ముప్పు తప్పాలంటే తాము చెప్పినట్లు చేయాలన్న సైబర్ నేరగాళ్లు తమ బ్యాంకు ఖాతాల్లోకి రూ.2.88 కోట్లు బదిలీ చేయించుకున్నారు. ఈ వృద్ధుడు తన సేవింగ్స్, బాండ్స్, డిపాజిట్స్, షేర్స్... ఇలా అన్నీ నగదుగా మార్చి వారికి చెల్లించాడు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించిన ఆయన సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ డి.ప్రసాదరావు నగదు డిపాజిట్ అయిన ఖాతాలపై దృష్టి పెట్టారు. తక్షణం ఆయా బ్యాంకులను సంప్రదించడం ద్వారా సూరత్ యాక్సిస్ బ్యాంకులోని ఖాతాలో ఉన్న రూ.53 లక్షలు, కేరళ ఎస్బీఐలోని రూ.50 లక్షలు ఫ్రీజ్ చేయించారు. కోర్టు అనుమతి లభించడంతో తొలుత సూరత్ బ్యాంక్ ఖాతాలోని నగదు బాధితుడి ఖాతాలోకి బదిలీ చేయించారు. త్వరలో మరోసారి అనుమతి పొంది కేరళ బ్యాంకు ఖాతాలోనిదీ బాధితుడికి అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

## 'క్లీన్ అప్ హైదరాబాద్' స్పెషల్ డ్రైవ్ షురూ


పంజగుట్టలో ప్రారంభిస్తున్న డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: క్లీన్ అప్ హైదరాబాద్‌తో పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 21 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో కాలనీలు, బస్తీలు, ప్రధాన రోడ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తామని ఖైరతాబాద్ సర్కిల్–17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి అన్నారు. నాగార్జున సర్కిల్‌లో బుధవారం స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఒక ఏరియాలో డ్రైవ్ చేపట్టి వ్యర్థాలను టిప్పర్ లారీల ద్వారా తరలిస్తామని చెప్పారు. బస్తీ, కాలనీవాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ భార్గవ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏకసభ్య కమిషన్‌ను ఉపసంహరించుకోవాలి'


మాట్లాడుతున్న డాక్టర్ ప్రొఫెసర్ వీఎల్ రాజు

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ ప్రొఫెసర్ వీఎల్.రాజు డిమాండ్ చేశారు. మాల మహానాడు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని రాజ్యాంగంలో స్పష్టం చేసిన పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు. తాము వర్గీకరణను అంగీకరించమని ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీ కృష్ణస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్ అపహరణ

వెంగళరావునగర్ : టిఫిన్ తిని వచ్చేలోగా ల్యాప్‌టాప్ అపహరణకు గురైె ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం ప్రాంతానికి చెందిన ఇందు నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలో టిఫిన్ చేసేందుకు ఆగింది. తన స్నేహితుడితో కలిసి టిఫిన్ తిన్న అనంతరం వాహనం వద్దకు వచ్చి చూడగా ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెతికినా కనిపించకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీ కులగణన ప్రక్రియ ప్రారంభం హర్షణీయం


టీపీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణాగౌడ్

కాచిగూడ: బీసీ కులగణనకు ప్రభుత్వం జీవో జారీ చేస్తూ ప్రక్రియను ప్రారంభించడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు నాగభూషణం, శ్రీనివాస్ గౌడ్, చందు పటేల్, తొలుపునూరి నరేశ్ గౌడ్ పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

వెంగళరావునగర్ : యువతి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ కాలనీలో నరసింహారావు అనే వ్యక్తి కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతను వాచ్‌మెన్‌గా ఉండగా, కుమార్తె బట్టలషాపులో సేల్స్‌గర్ల్‌గా పని చేస్తున్నది. ఈనెల 22న ఉదయం విధులకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. రాత్రికి అంబాదాస్ అనే వ్యక్తి నరసింహారావుకు ఫోన్ చేసి మీ కుమార్తె తన వద్దే ఉందని చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. గతంలో రెండుసార్లు కూడా ఇదేవిధంగా అంబాదాస్ తన కుమార్తెను తీసుకెళ్లగా ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 26న బీసీల చలో ఢిల్లీ

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 26వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనగణనలో కులగణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది బీసీలు పాల్గొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నందగోపాల్, ఉదయ్ నేత, నాల వెంకటేష్, వేముల రామకృష్ణ, రఘుపతి, మోదీ రాందేవ్, నిఖిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సత్తాచాటిన విద్యార్థులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎస్.సతీష్‌కుమార్ అండర్ 80కేజీ కేటగిరిలో గోల్డ్ మెడల్, బి.గౌరీ 54కేజీల కేటగిరిలో సిల్వర్ మెడల్, ప్రణయ్ 80కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఏ.పురుషోత్తం 58 కేజీల విభాగంలో బ్రౌన్స్ మెడల్, ఓవర్ ఆల్ చాంపియన్ షిప్‌లో కళాశాలకు ద్వితీయ స్థానం లభించింది. ఇంటర్ కాలేజీ కబడ్డీ మెన్స్ చాంపియన్‌షిప్‌లో కూడా అంబేడ్కర్ విద్యార్థులకు మంచి గుర్తింపు వచ్చింది.

# ఖైరతాబాద్ అభివృద్ధికి రూ.35 కోట్లు

**ఎమ్మెల్యే దానం నాగేందర్**
- నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు
- వివిధ శాఖల అధికారులతో సమావేశం
- త్వరలోనే పనులు చేపడతామని వెల్లడి


అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జలమండలి, జీహెచ్ఎంసీ, ఎంటమాలజీ, పారిశుద్ధ్య విభాగం, స్ట్రీట్‌లైట్స్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలి ఆధ్వర్యంలో రూ.11.9 కోట్లతో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆరు డివిజన్లకు కలిపి వరద కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం రూ.35 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందిచామన్నారు. తాను సీఎంను అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారని సీఎం రేవంత్‌రెడ్డికి ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కొద్ది రోజుల్లోనే ఈ పనులన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అంచనాలను కలెక్టర్ కార్యాలయంలోని నియోజకవర్గ అభివృద్ధి కమిటీకి (సీడీపీ) అందజేస్తామన్నారు. ఇటీవల తాము పర్యటించినప్పుడు గుర్తించిన సమస్యలు, బస్తీ నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కూడా తమ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటన్నింటినీ అధికారులకు అందజేసి ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు. ముందుగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, వరద నీటి కాలువ పనులు చేపడుతామని చెప్పారు. తర్వాత కమ్యూనిటీహాల్, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన నేతలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎంఎస్‌మక్తా, బీఎస్‌మక్తాల్లో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని త్వరగా పనులు పూర్తిచేసి బస్తీల్లో సమస్యల్లేకుండా చూస్తామన్నారు. ఇవి పూర్తయితే మరో నాలుగేళ్ల వరకు ఎలాంటి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉండదని, ఆ మేరకే ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్, సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శివకుమార్, జీహెచ్ఎంసీ సర్కిల్–17 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు మామిడి నర్సింగ్‌రావు, బీ భారతినాయక్, సి.రాములుచవాన్ పాల్గొన్నారు.

## చింతలబస్తీ పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు


చింతలబస్తీలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఖైరతాబాద్: చింతలబస్తీ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను బుధవారం తొలగించారు. చింతల బస్తీ ఫిష్ మార్కెట్ నుంచి షాదాన్ కళాశాల వరకు రోడ్లకిరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన వ్యాపార సముదాయాలు, షాపులు, తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. ఏసీపీ సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్న, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌తో పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. షాపుల ముందు ఏర్పాటుచేసిన సెమీ షెటర్లను కూడా తొలగించాలని ఒక రోజు గడువు ఇచ్చినట్లు ఏసీపీ తెలిపారు. పలువురికి జరిమానా కూడా వేసినట్లు పేర్కొన్నారు.

## భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు


బీజేఆర్‌నగర్ గ్రౌండ్‌లో వ్యర్థాల తొలగింపులో కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: 'స్వచ్ఛ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజేఆర్‌నగర్ గ్రౌండ్‌లో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను బుధవారం తొలగించారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ విజయారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజినీకాంత్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ చైతన్య తదితరులతో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీధికుక్కల బెడదపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ అధికారి డాక్టర్ వివేకానంద

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ కమ్యూనిటీ హాల్‌లో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో వీధికుక్కల బెడదపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ వెటర్నరీ అధికారి డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కుక్కలు దగ్గరగా ఉన్నప్పుడు వేగంగా నడిస్తే అవి వెంటపడతాయన్నారు. ఏదైనా కుక్క అరుస్తూ దగ్గరగా వస్తే దాని వెంట పడవద్దని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్–18కి చెందిన 32 మంది రీసోర్స్ పర్సన్లు పాల్గొనగా వీరంతా మహిళా సమాఖ్యలు, సభ్యులకు అవగాహన పెంచాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యూసీడీ డీపీఓ ఆశావిరోనిక, కమ్యూనిటీ ఆర్గనైజర్ బావ్‌సింగ్ పాల్గొన్నారు.

## ఆరోగ్య బీమాపై అవగాహన పెంచుకోవాలి


ఆరోగ్య బీమా బ్రోచర్ ఆవిష్కరిస్తున్న భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆరోగ్య బీమాపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు ఆరోగ్య బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య బీమాతో పాటు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఆరోగ్య బీమా ఉంటే కొంత కాలం పాటు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య బీమాకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, రామడుగు లక్ష్మణ్‌రావు, కేఎం దస్తూరు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుధాకర్, కార్యదర్శి కృష్ణమూర్తి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## రైల్లో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగ్ చోరీకి గురైన సంఘటనలో కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నాంపల్లి ప్రాంతానికి చెందిన రతిలాల్ జైన్ (53) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5వ తేదీన జోద్‌పూర్ వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి వెళ్లారు. నాందేడ్ సమీపంలో మోత్కెడ్ వద్ద చూసుకునే సరికి తన బ్యాగ్ కనిపించకుండా పోయింది. బ్యాగ్‌లో 6 గ్రాముల బంగారు రెండు రిగులు, రూ.50వేల నగదు, రెండు ఫోన్లు ఉన్నాయి. జోద్‌పూర్ వెళ్లి అక్కడ పర్యటించి తిరిగి నగరానికి ఈనెల 18వ తేదీన చేరుకున్నారు. సెల్‌ఫోన్‌లో సిమ్‌ను వేసుకుని చూసుకోగా ఫోన్‌పే ద్వారా రూ.68వేలు విత్ డ్రా అయ్యింది. దీంతో రతిలాల్ జైన్ బుధవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.


## వైద్యురాలితో యువకుడి అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్ : వాకింగ్‌కు వచ్చిన వైద్యురాలిపై వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌కాలనీలో మహిళా వైద్యురాలు నివాసం ఉంటుంది. మంగళవారం రాత్రి తన పెంపుడు కుక్కను తీసుకుని వాకింగ్‌కు వచ్చింది. అదే సమయంలో బైక్‌పై వెనుక నుంచి వచ్చిన యువకుడు వైద్యురాలి ప్రైవేట్ భాగాలను బలంగా తాకాడు. అంతేగాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. ఖంగుతిన్న వైద్యురాలు యువకుడిని చూసి ఆపేందుకు ప్రయత్నించగా వేగంగా పారిపోయాడు. బైక్ నెంబర్ ప్లేట్‌ను గమనించింది. మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన సౌకర్యాలు

లిబర్టీ: కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు, ఉద్యోగాల కల్పన విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేయడం, ప్రాజెక్టులపై దృష్టిసారించడం నీళ్ల మీద నియామకాలు ప్రత్యేక దృష్టిసారించడం వల్ల ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు మరో 14 అంశాలపై దృష్టిసారించి పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి పాల్గొని మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పెద్దమ్మ తల్లి ఫొటోను బహుకరించారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

## నా ఇంటి వద్దే చెత్త తొలగించడం లేదు: ఎమ్మెల్యే

బంజారాహిల్స్: నా ఇంటి పరిసరాల్లోనే చెత్తాచెదారం పేరుకుపోయిందని ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తీసి వెళ్లిపోయారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మండిపడ్డారు. పారిశుద్ధ్య విషయంలో సర్కిల్–18 ఏఎంఓహెచ్ భార్గవ్ నారాయణ పనితీరు బాగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విధులు పకడ్బందీగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.

## కార్యకర్తల శ్రమను గుర్తించాలి



లిబర్టీ: పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలను గుర్తించాలని పీసీసీ కార్యదర్శి సి.బాబు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో పీసీసీ కార్యవర్గంలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవించానన్నారు.

## ఫార్మా రంగానికి గుండెకాయ హైదరాబాద్


ఫార్మా ఇండియా ఎక్స్‌పో 2024లో దుంద్ర కుమారస్వామి

బంజారాహిల్స్: ఫార్మా రంగానికి గుండెలా హైదరాబాద్ నగరం మారిందని క్లీనికల్ సైంటిస్ట్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ సీఈవో స్వదేశీకుమార్, జెనెసిస్ కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫార్మా ఇండియా ఎక్స్‌పో 2024కు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్–19 మహమ్మారి సమయంలోనూ, అనేక క్లిష్టమైన సమయాల్లోనూ పలు దేశాలకు వ్యాక్సిన్లు, విలువైన మందులు సరఫరా చేసిందని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో 60 శాతం భారతదేశంలోనే జరుగుతుండడం గర్వకారణమన్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా దేశాలకు తక్కువ ధరకు మందులను అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఫార్మా రంగంలో టెక్నాలజీ కూడా కీలకపాత్ర పోషించబోతుందన్నారు. ఇక్కడ ప్రదర్శించిన ఉత్పత్తులు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతాయని చెప్పారు.

## ఆకట్టుకున్న 'ది పర్పుల్ పాప్ అప్' ఎగ్జిబిషన్




బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10 లోని జామున్ స్పేస్‌లో 'ది పర్పుల్ పాప్ అప్' పేరిట బుధవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముంబై, ఢిల్లీతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన భిన్నమైన వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించినట్లు నిర్వాహకులు పైడి సుచరిత రెడ్డి, శ్రీజ తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్న డిజైనింగ్ విద్యార్థుల ఉత్పత్తులను సైతం ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని గుండా ఈశ్వర్ ఫౌండేషన్, పైడి రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ల ద్వారా పేద విద్యార్థుల చదువులు, వైద్యం కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఓ వైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇక్కడ 40కి పైగా స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకున్నాయి.




మోతీనగర్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో స్ఫూర్తి మహిళా సేవా సంఘం 4వ వార్షికోత్సవం సందర్భంగా రత్న ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో వారిని భాగస్వాములను చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
– సాక్షి, సిటీబ్యూరో

## బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన అవసరం



కాచిగూడ: బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాసా హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రియాజ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ వెనిగళ్ల నవీన్ కుమార్, డాక్టర్ వీ రాకేశ్, డాక్టర్ కే పృథ్వీ రాజ్‌తో కలిసి బుధవారం మాట్లాడారు. మెదడు, వెన్నెముక సంబంధిత వ్యాధులకు విశేష వైద్య చికిత్సలందిస్తున్న నాసా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో నూతనంగా కాంప్రహెన్సివ్ బ్రెయిన్ స్ట్రోక్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ప్రజలను రక్షించేందుకు 'బీ ఫాస్ట్' ప్రోగ్రాంను రూపొందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'బీ ఫాస్ట్' అవగాహన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. దీనిద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పక్షవాతం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన మూడు గంటల వ్యవధిలోగా ఇంజెక్షన్ ఇస్తే పక్షవాతం ముప్పును తప్పించవచ్చని చెప్పారు.

## నిబంధనల ఉల్లంఘనలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా


అనధికారిక స్టిక్కర్ల తొలగింపును పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే


సైరన్లను తొలగిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: మోటార్ వాహనాల చట్టానికి విరుద్ధంగా కార్లకు సైరన్లు, అనధికారిక స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే పాల్గొని అనధికారికంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ వాహనాల స్టిక్కర్లు, ఆర్మీ, పోలీసు, ప్రెస్‌తో పాటు ఇతర స్టిక్కర్లను తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు జరిగాయి. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొని సైరన్లను తొలగించి జరిమానాలు విధించారు. మళ్లీ ఏర్పాటుచేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: బాణాసంచా దుకాణదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు చేసుకోవాలని ఈస్ట్ డీసీపీ బాలస్వామి సూచించారు. బుధవారం ఛే నంబర్ చౌరస్తాలో ఓ ఫంక్షన్‌హాల్‌లో బాణాసంచా దుకాణదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సలహాలు, సూచనలు చేశారు. వచ్చే దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయాలను పలు జాగ్రత్తలు తీసుకోని విక్రయించుకోవాలని సూచించారు. నిబంధనలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి తీసుకోవాల్సిన అనుమతులను ముందస్తుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిషినల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీలు రఘు, జగన్, ఇన్‌స్పెక్టర్ అశోక్‌లతో ఇతర అధికారులు, బాణసంచా దుకాణాదారులు ఉన్నారు.

## రూ.30 లక్షలతో దేవాలయ పునరుద్ధరణ



దేవాలయంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న శైలజారామయ్యర్

**రాంగోపాల్‌పేట్:** రూ.30 లక్షల వ్యయంతో కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులు చేపట్టామని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. మంగళవారం దేవాలయాన్ని సందర్శించి సంఘటన గురించి డీసీపీ సాధన రేష్మీ పెరుమాళ్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులతో మాట్లాడారు. ఆ తర్వాత పునరుద్ధరణ పనుల గురించి పలు సూచనలు, సలహాలు చేశారు. దేవాలయానికి అవసరమైన మరమ్మతులతో పాటు పంచలోహాలతో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని వివరించారు. దేవాలయంలో ఫ్లోరింగ్ పనులు మొదలయ్యాయని, పెయింటింగ్ తదితర పనులు చేపడతామని ఆమె చెప్పారు. ప్రజలందరూ శాంతియుతంగా ఉండి సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

– డీఎస్‌డీ జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్



**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్(డీఎస్‌డీ) జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. వికలాంగుల పెన్షన్‌ను 6 వేల రూపాయలకు పెంచాలని కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం బాగ్ లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా ఏ ఒక్క హామీనీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని, వికలాంగుల ఉద్యోగాల భర్తీకి కేలండర్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బి.భారతి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ గౌడ్, కిరణ్ కుమార్, ఇమ్రాన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల ఉపాధి మెరుగుకు చర్యలు

బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం



బుర్రా వెంకటేశంకు సావనీర్‌ను అందజేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

**సుందరయ్య విజ్ఞానకేంద్రం:** గీతకార్మికుల ఉపాధిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం అన్నారు. బుధవారం కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించిన 'గీత కార్మికుల 10 ఏళ్ల ప్రయాణం'సావనీర్‌ను వెంకటేశంకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. బుర్రా వెంకటేశంను కలిసిన వారిలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి రమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బి.వెంకటనర్సయ్య, జంగాగౌడ్ తదితరులు ఉన్నారు.

## తగ్గించిన వేతనం తిరిగి ఇవ్వాలి

– బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన



ఎన్టీఆర్ గార్డెన్ ముందు హౌస్‌కీపింగ్ కార్మికుల ఆందోళన

**ఖైరతాబాద్:** బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ పరిధిలోని హౌస్ కీపింగ్ కార్మికుల వేతనాలు తగ్గించడంతో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ నెల 23 నుంచి 14 రోజులపాటు సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ హౌస్ కీపింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జి.సుమిత్ర తెలిపారు. గత సంవత్సరం జీవో 60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించారని, కొద్ది నెలలుగా రూ.9,700 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం పెంచాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి తగ్గించిన వేతనాన్ని ఏరియల్స్ రూపంలో ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వేతనంతో కూడిన పండగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

– తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతు ముదిరాజ్

**సుందరయ్య విజ్ఞానకేంద్రం:** టీజీఎస్ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వి.కె.రావు, ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో యూనియన్ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వి.కె రావు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, అడిషనల్ జనరల్ సెక్రెటరీ ప్రేమ్‌నాథ్, వైస్ ప్రెసిడెంట్ గోలి రవీందర్, జల్దా వెంకటేశ్వర్లు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనయ్య, జాయింట్ సెక్రెటరీ పీకే మూర్తి, కోశాధికారి పి.ఎస్.ఎస్.రావు, సలహాదారులుగా సాయిలు, సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా జీవన్‌రావు, సుధాకర్ ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ 2021 వేతన సవరణ అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీఎస్, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# ఎట్టకేలకు 'కారుణ్యం'

- కంటోన్మెంట్ బోర్డులో 22 మందికి నియామకాలు
- శానిటరీ విభాగంలో విధుల్లో చేరిన సిబ్బంది
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఊరట
- వెయిటింగ్ లిస్ట్‌లో మరో 100 మంది
- 5 శాతం సీలింగ్ ఎత్తివేతపైనే ఆశలు



శానిటరీ సూపరింటెండెంట్‌కు రిపోర్టు చేసిన కంటోన్మెంట్ నూతన ఉద్యోగులు

**కంటోన్మెంట్:** ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు కరుణించింది. విధుల్లో ఉండగా మరణించిన శానిటరీ విభాగం ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత అధికారులు కారుణ్య నియామకాల ప్రక్రియ చేపట్టారు. తాజాగా 22 మందిని కారుణ్య నియామకాల కింద బోర్డు ఉద్యోగులుగా చేర్చుకున్నారు. బుధవారం వీరంతా విధుల్లో చేరారు. ఓ పక్క తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధ, మరో పక్క తమకు ఉపాధి దక్కిందన్న సంతోషంతో వారు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కంటోన్మెంట్‌లో శానిటరీ విభాగంలో ఉద్యోగం పొందిన వీరంతా సూపరింటెండెంట్ మహేందర్‌ను కలిసి రిపోర్టు చేశారు. అయితే తమలాంటి మరో 100 మందికి కూడా ఉద్యోగ అవకాశం కల్పిస్తే బాగుండు అనే ఆవేదన వారిలో కనిపించింది.

### ఆరుగురు సీఈఓలు.. పద్నాలుగేళ్లు

కంటోన్మెంట్ శానిటేషన్ విభాగం క్షేత్రస్థాయి పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉంటాయి. ఈ విభాగంలో సగటున ఏడాదికి 10 మంది విధుల్లో ఉండగానే మృత్యువాత పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా మరణించిన ఉద్యోగుల స్థానంలో ఏడాదిలోపే కారుణ్య నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే ఈ కోటా మొత్తం ఖాళీల్లో 5 శాతానికి మించి నియామకాలు చేపట్టే అవకాశం లేదు. ఖాళీల కంటే ఉద్యోగార్థులు ఎక్కువగా ఉండటంతో 2010 నుంచి కొత్తగా ఎలాంటి నియామకాలు చేపట్టలేకపోయారు. ఉద్యోగార్థుల సంఖ్య ప్రతీయేటా పెరుగుతూ వస్తోంది. దీంతో 5 శాతం సీలింగ్ ఎత్తివేసి పూర్తిస్థాయిలో కారుణ్య నియామకాలు చేపట్టాల్సిందిగా ఉద్యోగ సంఘం నేతలు పోరాడుతూనే ఉన్నారు. సీఈఓలు సైతం తమవంతుగా రక్షణశాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాస్తూ విజ్ఞప్తులు చేస్తూ వచ్చారు. పద్నాలుగేళ్లుగా ఆరుగురు సీఈఓ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 5 శాతం సీలింగ్ ఎత్తివేతకు రక్షణ శాఖ అంగీకరించలేదు. ఇక లాభం లేదని భావించిన కంటోన్మెంట్ అధికారులు, 122 మంది ఉద్యోగార్థుల్లో 5 శాతం సీలింగ్‌కు లోబడి అర్హుల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీ వేశారు. రెవెన్యూ సూపరింటెండెంట్ నర్సింగ్‌రావు నేతృత్వంలోనే కమిటీ సిఫారసుల మేరకు 22 మందికి ఇటీవలే ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. నర్సింగ్‌రావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తూ ఉండగా, తన ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థులు బుధవారం ఉద్యోగంలో చేరడంతో భావోద్వేగానికి గురయ్యారు.

**నిరాశలో 100 మంది**

5 శాతం సీలింగ్ లోబడి నియామకాలు చేపట్టడంతో ఉద్యోగం పొందలేకపోయిన 100 మంది అభ్యర్థులు తీవ్ర నిరాశలో పడిపోయారు. కంటోన్మెంట్ సేవలో నిమగ్నమై ఉద్యోగాలు కోల్పోయిన తమ కుటుంబ సభ్యులపై కనికరం చూపుతూ, రక్షణ శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ తదితరుల ద్వారా కేంద్ర రక్షణ మంత్రికి తమ విజ్ఞాపనలు పంపారు. కేంద్రం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

## 'ఫీజు' బకాయిలు చెల్లించాలని ఆందోళన



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**నాంపల్లి:** రాష్ట్రంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆందోళన చేపట్టింది. విద్యార్థులు ఒక్కసారిగా కలెక్టరేట్ ప్రాంగణంలోనికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి బండ్లగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, ఓయూ అధ్యక్షుడు లెనిన్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయకుంటే విద్యార్థులు చదువుకునేది ఎట్లా అని ప్రశ్నించారు. మూడు విద్యా సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అరెకంటి భగత్, కాంపల్లి కళ్యాణ్, అశ్విన్, ఉదయ్, పవన్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్, వినయ్ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కు ఉద్యోగ అవకాశాలు

సీఎం రేవంత్‌కు వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కృతజ్ఞతలు



ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్‌కార్డు అంజేస్తున్న చైర్మన్ వీరయ్య, డైరెక్టర్ బి.శైలజ

**చాదర్‌ఘాట్:** ట్రాన్స్‌జెండర్స్‌కు ఉద్యోగ అవకాశాలు, గుర్తింపు ఇచ్చి సమాజంలో వారికి ప్రాధాన్యత కల్పించి గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో ఆధార్‌కార్డ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ట్రాన్స్‌జెండర్స్‌ను గుర్తించి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్‌కార్డులు జారీ చేశారని, ప్రభుత్వ పథకాల ఫలాలు వీటి ద్వారా పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ, హైదరాబాద్ ఈస్ట్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ప్రోగ్రామ్ మేనేజర్ జయంతి, కోఆర్డినేటర్ ప్రీతి, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 5న ఆటోడ్రైవర్ల మహాధర్నా



ఆటోడ్రైవర్ల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశం తదితరులు

**కాచిగూడ:** ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విస్మరించడం శోచనీయమని ఆటోడ్రైవర్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం(ఏఐటీయూసీ), వి.మారయ్య(బీఆర్‌టీయూ), వి.ప్రవీణ్ (టీయూసీఐ), పి.శ్రీకాంత్(సీఐటీయూ) అన్నారు. నవంబర్ 5వ తేదీన ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ఆటోడ్రైవర్ల మహాధర్నా పోస్టర్‌ను బుధవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, మహాలక్ష్మీ పథకం వల్ల జీవనోపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని, అర్హులకు సంవత్సరానికి రూ.10 లక్షల సహాయం అందించాలని కోరారు. ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నా తరువాత వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు ఎండీ ఒమర్ ఖాన్, సీహెచ్ జంగయ్య, ఎ.సత్తిరెడ్డి, జి.శ్రీనివాస్, ఎంఏ సలీమ్, రఫాత్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్వీకార్' పునరావాస కేంద్రం సందర్శన

**నిజాంపేట్:** సికింద్రాబాద్ ఉపకార్ ప్రాంగణంలోని 'స్వీకార్'పునరావాస కేంద్రాన్ని బుధవారం బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గెరెథ్ వైన్ ఓవెన్‌తో కలిసి 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సీఈవో సత్యవోలు రాంబాబు, సలహాదారు డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు, డి.ఎల్లా సుబ్బారెడ్డి సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలు, నిర్వహిస్తున్న కోర్సుల గురించి సంస్థ వ్యవస్థాపక చైర్మన్, పద్మశ్రీ అవార్డ్ గ్రహీత హనుమంతరావు వివరించారు. హై కమిషనర్‌తోపాటు సందర్శకులందరూ అక్కడ చికిత్స తీసుకుంటున్న, చదువుకుంటున్న చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. మానసిక దివ్యాంగులు తయారు చేసిన రాఖీని బ్రిటీష్ హైకమిషనర్‌కు కట్టారు. వారే స్వంతంగా తయారు చేసిన మరో బొకేని కానుకగా ఇచ్చారు. 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సంస్థను గురించి తెలుసుకున్న హైకమిషనర్ ఒకసారి సంస్థను సందర్శిస్తానని తెలిపినట్లు రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వడ్రాణం మార్కండేయ, నాగేశ్వర రావు ఉన్నారు.



స్వీకార్'పునరావాస కేంద్రాన్ని సందర్శించిన బ్రిటీష్ హైకమిషనర్ గెరెథ్ వైన్ ఓవెన్, విశ్వగురు వరల్డ్స్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు

## యోగాలో విద్యార్థుల ప్రతిభ



ఎల్‌బీ స్టేడియంలో ఇటీవల 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా కాంపిటీషన్స్‌లో 'అండర్-14 యోగాసన' విభాగంలో నగరానికి చెందిన శ్రీ సత్యసాయి విద్యావిహార్ హైస్కూల్ విద్యార్థిని టి.ప్రదీప్తి మొదటి స్థానంలో నిలిచింది. రిథమిక్ యోగా అండర్-14 విభాగంలో కృతి ద్వితీయ స్థానం, అండర్-17లో అక్షయ మూడవ స్థానం సాధించింది. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. – సాక్షి, సిటీబ్యూరో

## సింగరేణి అభివృద్ధి బాధ్యత అందరిది

- మేనేజ్‌మెంట్, కార్మికులు, యూనియన్లు కృషి చేయాలి
- 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కార్మిక నాయకులు, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

**రాయదుర్గం:** సింగరేణి సంస్థ ఎంతో ప్రాధాన్యత కలిగిందని, ఈ సంస్థను మరింత అభివృద్ధి చేసే బాధ్యత అందరిదని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సింగరేణి సంస్థ గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులకు శిక్షణ, అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, యూనియన్ల నాయకులు, మేనేజ్‌మెంట్‌లపై సంస్థ అభివృద్ధి బాధ్యత ఉందని అన్నారు. ప్రతి నిర్ణయాన్ని పారదర్శకంగా ఉండేలా చేస్తే ఎవరికీ ఇబ్బందులు తలెత్తవన్నారు. సింగరేణి కాలరీస్ పారిశ్రామిక సంబంధాలు, మానవవనరుల అభివృద్ధి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల అమలు సంఘం చైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఎస్‌డీఎం సుబానీ, కవితానాయుడు, రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ సి.త్యాగరాజన్, అన్ని ఏరియాలకు చెందిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## 'అంబేడ్కర్'కు అవమానం

- లోయర్ ట్యాంక్‌బండ్‌లో విగ్రహం చుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మాణం
- దళిత సంఘాల నిరసన.. ప్రహరీ కూల్చివేత



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నేతలు

**కవాడిగూడ:** లోయర్ ట్యాంక్‌బండ్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ సుందరీకరణ పేరుతో జీహెచ్‌ఎంసీ ఎత్తైన ప్రహరీ నిర్మించింది. దీంతో బుధవారం పలు దళిత సంఘాలు అంబేడ్కర్ విగ్రహం కనబడకుండా ప్రహరీ నిర్మించడం సరికాదంటూ గోడను కూల్చివేసి నిరసన చేపట్టారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రహరీ నిర్మిస్తున్న అధికారులు వెంటనే సంఘటనాస్థలానికి రావాలని దళిత సంఘాలు విగ్రహం వద్ద బైటాయించడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. సమాచారం అందుకున్న సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి వాస్తవాలను దళిత సంఘ నాయకులకు తెలియజేశారు. రెండురోజుల్లో దళిత సంఘాల నాయకులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని, చర్చల తరువాతనే అందరి ఆమోదంతోనే పనులు మొదలు పెడతామని ఏసీపీ హామీ ఇవ్వడంతో దళిత సంఘాల నాయకులు శాంతించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య, దళితసేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకులు బల్వంతరావు, ఆయా సంఘాల నేతలు బాలకిషన్, గురుగుల వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల రాములు, గుడ్డిమల్ల వినోద్‌కుమార్, మన్నె శ్రీధర్, మాస్త దయానంద్, ఉత్తమ్, సుమన్, రావుల విజయ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం చుట్టూ నిర్మించిన ప్రహరీ

## కాఫీ షాపులో కాలం చెల్లిన ఆహార పదార్థాలు సీజ్

**గచ్చిబౌలి:** మాదాపూర్ అమర్ సొసైటీలో ఉన్న లాస్ట్ హౌస్ కాఫీ షాపులో కాలం చెల్లిన ఆహార పదార్థాలను సీజ్ చేశామని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం లాస్ట్ హౌస్ కాఫీ షాపులో తనిఖీలు నిర్వహించామన్నారు. కాలం చెల్లిన బ్రెడ్, సాస్‌లు సీజ్ చేశామన్నారు. ఉడకబెట్టిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచారని, ఇది ఆరోగ్యానికి కీడు చేస్తుందన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాల వినియోగం, కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంతో నోటీసులు జారీ చేశామని, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏసీపీ వెంకట రమణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ వీసీకి అభినందనలు



ప్రొ.కుమార్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మందకృష్ణ మాదిగ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్‌కు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ బుధవారం శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. 107 ఏళ్ల ఓయూకు తొలిసారిగా మాదిగ ప్రొఫెసర్ వీసీగా నియమితులు కావడం సంతోషించదగిన విషయమని అన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేసి ఓయూ ప్రతిష్టను పెంచాలని వీసీ ప్రొఫెసర్ కుమార్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్, మంద రాజుమాదిగ, లక్ష్మణ్ మాదిగ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





## తరుణి సమస్యలపై 'పేరిణి'

నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన పేరిణి నృత్య రూపకం ఆహూతులను ఆకట్టుకుంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై 40 మంది కళాకారులు ఈ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ పేరిణి నృత్యాన్ని సామాజిక అంశాలకు జోడించి మొట్టమొదటిసారిగా మహిళామణులతో వారి సమస్యలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ వనజ ఉదయ్, పేరిణి నృత్య అసిస్టెంట్ లెక్చరర్ నవ్యజ, అకాడమీ వ్యవస్థాపకులు గజ్జెల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. –గన్‌ఫౌండ్రీ

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 24, అక్టోబర్, 2024


చిమ్మ చీకటి.. పిన్‌డ్రాప్ సైలెన్స్.. ఆకాశంలో నక్షత్రాల్లాగా అక్కడక్కడా మెరుపుల లైట్లు.. ఫెడేల్మని ఏదో విరిగిన శబ్దం.. దాని వెంటనే హిహిహి.. హెహెహె అంటూ ప్రేతాత్మలు రువ్వే వెకిలి నవ్వులు.. కాసేపటికి ఆ శబ్దం ఊపందుకుంటూ.. దాంతో పాటే ఒక్కొక్కటిగా విరబోసుకున్న కురులతో దెయ్యాలు..(మాస్కులు ధరించిన అమ్మాయిలు) ఊగిపోవడం.. వీరిని నియంత్రించే మంత్రగాళ్లలా, స్తోత్రించే భూతారాధకుల్లా అబ్బాయిలు.. ఇలాంటి సన్ని'వేషాల' కోసం హర్రర్ సినిమాకి వెళ్లనక్కర్లేదు.. మన ఇంటి సమీపంలోనే చూడొచ్చు. - సాక్షి, సిటీబ్యూరో





# నెక్సస్ మాల్‌లో క్యూబాయిడ్స్ 3డి స్క్రీన్

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సస్ మాల్‌లో దేశంలోనే మొదటి ట్విన్ స్టాక్ అనామోర్ఫిక్ క్యూబాయిడ్స్ 3డి స్క్రీన్‌ను ప్రిస్మోక్స్‌ని బుధవారం నెక్సస్ మాల్స్ సీఓఓ జైసనెక్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిశాంక్ జోషి, సీఈఓ గౌతమ్ గులాటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్రాండ్‌లను లీనమయ్యే రీతిలో ఆకర్షణీయంగా ప్రచారం చేస్తామని, ప్రిస్మోక్స్ వినూత్న సాంకేతికత 5 నిమిషాల లూప్‌లో 20 సెకన్ల బ్రాండ్ పట్ల అవగాహన పెంచడంతో పాటు వినియోగదారులకు దగ్గరయ్యేందుకు రిటైలర్లను అనుమతిస్తుందన్నారు. వ్యూహాత్మకంగా మాల్ మధ్యలో 17,12 అడుగుల పరిమాణంలో పెద్దది 5 టన్నుల బరువుతో, 129 అడుగుల కొలతతో 3 టన్నుల బరువుతో చిన్న క్యూబాయిడ్ ఉన్నాయన్నారు. నెక్సస్‌లో రిటైల్ అడ్వర్టైజింగ్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో నిరంతరం ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్నామన్నారు. ఖుషీ అడ్వర్టైజింగ్ భాగస్వామ్యంతో, భారతదేశపు మొదటి ట్విన్‌స్టాక్ అనామోర్ఫిక్ క్యూబాయిడ్‌లును తీసుకువచ్చినందుకు సంతోషిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఖుషీ అడ్వర్టైజింగ్ సీఈఓ విషు తెలాంగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# హల్లో హర్రర్

## దెయ్యాలూ భూతాలకు హా(పా)ర్టీ వెల్‌కమ్

వచ్చేస్తున్నాయ్ భయపెట్టి, భయపడే హర్రర్ డేస్..

డెవిల్స్‌తో ఛీర్స్.. డ్రాక్యులాలతో డ్యాన్స్

సిటీలో హల్లోవీన్ వీక్ సందడి షురూ..

భయపడటం బాగుంటుంది. భయపెట్టడం ఇంకా బాగుంటుంది. ఈ రెండు బాగులూ కావాలనుకునేవారిని జాగో అంటున్నాయి సిటీలోని పార్టీ వేదికలు. ఏటా అక్టోబర్ 31న వచ్చే హల్లోవీన్ నైట్ సందర్భంగా హర్రర్ ప్రియుల కోసం నేడు తమవంతు సేవలు అందించేందుకు టెంపరరీ 'భూతప్రేతాల'ను సిద్ధం చేస్తున్నాయి. భయ'భ్రాంతులు' కావాలని ఆశించేవారికి 'హర్రర్లీ' వెల్‌కమ్ చెబుతున్నాయి. వెరైటీ అనుభవాల్ని ఆశించే యూత్ కారణంగా ఏటేటా జరిగే హల్లోవీన్ నైట్స్ అంతకంతకూ క్రేజీగా మారుతున్నాయ్. ఒకప్పుడు హల్లోవీన్ నైట్ అంటే అక్టోబర్ నెలాఖరున ఒకే రాత్రికి పరిమితమయ్యేది. క్రమంగా హర్రర్‌ను థీమ్‌గా తీసుకుని సాగే ఈ హల్లోవీన్ నైట్ ఇప్పుడు ఓ నాలుగైదు రోజులు ముందుగానే క్లబ్స్, పార్టీప్లేస్‌లలో సందడి సృష్టిస్తోంది.



### ఇతరుల్ని భయపెట్టడం కోసం..

నేనే దెయ్యాన్ని.. నేనే భూతాన్ని అని చెప్పుకున్నట్టు ఉంటాయీ హల్లోవీన్ పార్టీలు. ఈ పార్టీలకు హాజరైన వారికి వెల్‌కమ్ చెప్పే వ్యక్తి నుంచి వీడ్కోలు పలికేవారి వరకూ అంతా భయపెట్టే గెటప్స్‌తోనే ఉంటారు. పార్టీలోకి ఎంటరైన కాసేపటికే గెస్ట్‌లు సైతం దయ్యాలైపోతారు. శక్తిమేరా ఇతరుల్ని భయపెట్టడం కోసం మాస్కులు మస్కారాలు, టాటూలు, పెయింట్లూ.. యువత ఒంటిమీద నాట్యం చేస్తాయి. దెయ్యాలు, భూతాలు, మంత్రగాళ్లు, రాబందులు, వాంపైర్స్, ఏంజెల్స్.. ఇలా కాదేదీ గెటప్పుకూ, డ్రెస్సప్‌కూ అనర్హం అన్నట్టు సిటిజనులు అవతారాలు మార్చేస్తారు. మైఖేల్ జాక్సన్ ఆల్బమ్ 'థ్రిల్లర్' లాంటివి ప్లే చేస్తూ.. తీతువుపిట్ట అరుపుల దగ్గర్నుంచి నక్కల ఊళలు, కీచురాళ్ల చప్పుళ్ల దాకా హారర్ మూవీస్‌లోని థీమ్ మ్యూజిక్‌లన్నీ కలగలిపి భయపెట్టడం డీజే వంతు.



### సిటీలో.. 25 నుంచి..

ప్రపంచవ్యాప్తంగా ఈ హల్లోవీన్ నైట్ తేదీ అక్టోబరు 31. అయితే అక్టోబరు నెల చివరి వారం నుంచే ఎవరి వీలును బట్టి వారు దీన్ని నిర్వహిస్తున్నారు. మన సిటీలో సాధారణంగా 25వ తేదీ నుంచి ఈ హర్రర్ హడావుడి షురూ అవుతుంది. ఈ నెల 27న గ్రేవ్‌యార్డ్ పేరుతో మాదాపూర్‌లోని రెడ్ బ్రిక్ ఆఫీసెస్ హల్లోవీన్ మీట్‌ను, కొండాపూర్‌లోని ఎ19 క్లబ్ అండ్ కిచెన్‌లో హైదరాబాద్ హల్లోవీన్ హంగామా నిర్వహిస్తున్నారు. సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఉన్న కిస్మత్ ఆవరణలో హల్లోవీన్ గేదరింగ్ పేరుతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ, ఈ నెల 28న ఫ్యాట్ ఓ వీన్ పేరుతో జూబ్లీహిల్స్‌లోని ఫ్యాట్ పీగాన్‌లో, 27న విక్డ్ హల్లోవీన్ పార్టీ పేరుతో గ్లోకల్ జంక్షన్‌లో.. ఇలా నగరంలోని ప్రతిపార్టీ ప్లేస్, ఈవెంట్ సెంటర్ ఆ రోజున ప్రత్యేకంగా డెవిల్స్ డెన్‌లా రూపుదాల్చనుంది.



### ఏమిటీ హల్లోవీన్ నైట్?

హల్లోవీన్ నైట్ శతాబ్దాల నాటి పాశ్చాత్య ఒరవడి. దీని పుట్టుక వెనుక చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. చనిపోయిన వారి ఆత్మల్ని గౌరవించడానికి, అదే సమయంలో అవి తమనేమీ చేయలేవని చెప్పడానికి ఈ హల్లోవీన్ సెలబ్రేషన్ పుట్టిందనే కథ బాగా పాపులర్. దీన్ని నమ్మేవారు ప్రత్యేకంగా ఒక రోజును నిర్ణయించుకుని, ఆ రోజున రాత్రి వేడుకలు నిర్వహిస్తారు. రాత్రి సమయంలో తిరిగే భూతప్రేతాల్ని తామే భయపెట్టడానికి భయంకరమైన కాస్ట్యూమ్స్ వేసుకునేవారట. కాలక్రమంలో ఇదో కాస్ట్యూమ్స్ పార్టీలా మారిపోయింది.

### పిల్లలకూ ఉందో సరదా...

హర్రర్ అంటే పెద్దవాళ్ల వేడుక కాబట్టి దీనిలో పిల్లల కోసం ట్రిక్ ఆర్ ట్రీట్ అనే ప్రత్యేకత జత చేశారు. స్పైడర్‌మ్యాన్, సూపర్‌మ్యాన్ తరహా గెటప్స్ వేసుకున్న పిల్లలు ఇంటింటికీ వెళ్లి ట్రిక్ ఆర్ ట్రీట్ అని అడుగుతారు. అప్పుడు ఆ ఇంటి యజమాని వీరి గుప్పెట్లో బోలెడు చాక్లెట్స్ వేస్తారు. అలా పోగు చేసుకువచ్చిన చాక్లెట్లు, బిస్కెట్లు.. ఎక్స్‌ట్రాలన్నింటినీ పిల్లలు రాత్రి సమయంలో ఒకచోట చేర్చి ఎంజాయ్ చేస్తారు.

### స్పెషల్.. థ్రిల్



పార్టీలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. అయితే ఈ హల్లోవీన్ పార్టీ మాత్రం సంథింగ్ డిఫరెంట్. అంతా థీమ్ బేస్ట్‌గా ఉంటుంది. అలాగే ఇందులో చాలా ఫన్ కూడా ఉంటుంది. పార్టీ లవర్స్‌కు బాగా ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్ ఇది. హర్రర్ మూవీస్‌లో బీజీఎంకు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో తెలిసిందే కదా. ఈ పార్టీస్‌లో డీజే మ్యూజిక్ కూడా అంతే. మిగిలిన అన్నిరకాల సెలబ్రేషన్స్ కన్నా ఈ హల్లోవీన్ నైట్‌ని డిజెలు బాగా ఎంజాయ్ చేస్తారు.
– డీజే అనంత్

# 'కార్నివాల్ లిమోసిన్' ఆవిష్కరణ

భారతీయ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కార్ కియా

జూబ్లీహిల్స్ వేదికగా సరికొత్త మోడల్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జూబ్లీహిల్స్ కార్ కియా షోరూమ్ వేదికగా కియా సరికొత్త మోడల్ 'కార్నివాల్ లిమోసిన్'ను విడుదల చేశారు. మల్టీపర్పస్ వెహికిల్(ఎంపీవీ) విభాగంలో ఆవిష్కరించిన ఈ అధునాతన మోడల్ విలాసవంతమైన మొబిలిటీ సొల్యూషన్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ లక్ష్యానికి నిదర్శనమని కారు కియా జనరల్ మేనేజర్ సంతోష్ చంద్ తెలిపారు. ప్రీమియం ఫీచర్లు, అసాధారణమైన సౌలభ్యంతో పాటు అత్యాధునిక సాంకేతికత కలయికతో రూపొందించిన కార్నివాల్ లిమోసిన్ సురక్షితమైన ప్రయాణ అనుభవాలను అందిస్తుందని పేర్కొన్నారు. కార్నివాల్ లిమోసిన్ జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, బోవెన్‌పల్లి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కార్ కియా షోరూమ్‌లలో ప్రదర్శించబడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి స్టార్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నీలం రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### యాపిల్ మ్యూజిక్‌లోనూ..

స్పాటిఫైతో పాటు యాపిల్ మ్యూజిక్, అన్‌విండ్, వింటర్ చిల్, చిల్లింగ్ ఔట్ వంటి వేదికలపై మనోడి మ్యూజిక్‌ను వేలాది మంది ఆస్వాదిస్తున్నారు. బీబీసీ రేడియో కూడా సాత్విక్ మ్యూజిక్‌ను మెచ్చుకుంది. ప్రస్తుతం అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లో 5 కోట్ల సార్లు సాత్విక్ మ్యూజిక్‌ను విన్నారు.



- కివియాన్ పేరుతో మ్యూజిక్ బ్యాండ్ స్థాపన
- వేలాది మంది మ్యూజిక్ లవర్స్‌ను సంపాదించిన సాత్విక్
- మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌పై లక్షలాది వ్యూస్

# కివియానీ.. ఫేస్ ఆఫ్ హైదరాబాద్!

## అమెరికాలో ఉర్రూతలూగిస్తున్న నగర కుర్రాడు

సాక్షి, సిటీబ్యూరో: డీజే మ్యూజిక్ వింటే మనోడికి ప్రాణం ఆగదు.. మ్యూజిక్ అంటే అంత ప్రాణం.. డిగ్రీ పూర్తి చేశామా.. ఏదో ఒక ఉద్యోగం చేశామా.. అన్నట్టు కాకుండా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలనుకున్నాడు. ఇప్పుడు తన టాలెంట్‌ను ఖండాంతరాల్లో చాటుకుతున్నాడు. అతడి పేరే సాత్విక్ గుర్రప్పగారి. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా విభిన్నమైన సంగీత రూపాల్లో సంగీత ప్రియులను అలరిస్తున్నాడు. పాప్, జాజ్ మ్యూజిక్‌తో ఇండియన్ సాంగ్స్‌ను మిళితం చేస్తూ విభిన్నమైన సంగీతాన్ని వీనులవిందు చేస్తున్నాడు. కొన్ని లక్షల మంది మ్యూజిక్ లవర్స్‌కు సాత్విక్ మ్యూజిక్ విననిదే రోజు ప్రారంభం కాదంటే అతిశయోక్తి కాదు. మ్యూజిక్‌లో డిప్లొమా చేసేందుకు అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ చేరాడు. కివియానీ పేరుతో ఓ మ్యూజిక్ సంస్థను స్థాపించిన ఈ 22 ఏళ్ల కుర్రాడు.. ఇప్పుడు మోస్ట్ లవ్లీ సాంగ్స్‌ను రూపొందిస్తున్నాడు.



### మ్యూజిక్ ఈజ్ లైఫ్..

హైదరాబాద్‌లోని సుచిత్రకు చెందిన రమేశ్, శ్వేత కుమారుడైన సాత్విక్‌కు చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. 16 ఏళ్ల వయసు నుంచే మ్యూజిక్ కెరీర్ ప్రారంభించాడు. ఎక్కడ పోటీలు జరిగినా.. అక్కడ వాలిపోతుండేవాడు. తన టాలెంట్‌ను ప్రపంచానికి చాటి చెప్పేందుకు తీవ్రంగా కష్టపడ్డాడు. సీఎంఆర్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఎలాగైనా అమెరికా వెళ్లాలని అనుకున్నాడు. స్పాటిఫై మ్యూజిక్‌లో సాత్విక్ చేసిన ఆల్బమ్స్‌ను వేలాది మంది సంగీత ప్రియులు వింటున్నారు. కడలల్లే వేచె కనులే, కాదల్ ఎస్ కావ్యే వంటి పాటలను రివర్స్ వెర్షన్‌లో మార్చి.. ఆ పాటలను వింటుంటే ఈ ప్రపంచాన్నే మర్చిపోయేలా చేశారు. ఈ సాంగ్స్ తెగ వైరల్ అవుతున్నాయి. కడలల్లే వేచె కనులే పాట నచ్చి నటుడు విజయ దేవరకొండ స్టేటస్ కూడా పెట్టుకున్నాడు.




# డాబర్ మెస్వాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా అక్కినేని నాగార్జున

సాక్షి, సిటీబ్యూరో: ఆయుర్వేదం ఆధారంగా రూపొందించిన ఉత్పత్తులు ఆరోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తాయని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున డాబర్ ఇండియా ప్రకటనలో భాగంగా వెల్లడించారు. ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ డాబర్ ఇండియా ఆధ్వర్యంలో దంత సంరక్షణ బ్రాండ్ డాబర్ మెస్వాక్‌కు నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటుడు, దక్షిణాది సూపర్‌స్టార్ అక్కినేని నాగార్జునను నియమించింది. ఈ సందర్భంగా 'డాబర్ మెస్వాక్‌తో భాగస్వామ్యం సంతోషంగా ఉందని, వ్యక్తిగతంగా నమ్మిన మెస్వాక్‌తో అనుబంధం ప్రత్యేకమైందని' బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. భారత్‌లో ఆరోగ్య సంరక్షణలో భాగంగా సురక్షితమై, సహజ ఉత్పత్తులవైపు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని సంస్థ మార్కెటింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ జుగ్రాన్ తెలిపారు.

# మేజికల్ మెమొరీస్ పేరిట వెడ్డింగ్ ఫిల్మ్ అవార్డ్స్ పోటీ

సాక్షి, సిటీబ్యూరో: పెళ్లి వేడుకలోని అద్భుత ఘట్టాలను అంతే అద్భుతంగా వీడియో కెమెరాల్లో బంధించే వారిని నికాన్ కార్పొరేషన్‌కు చెందిన నికాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆహ్వానిస్తోంది. ఫొటోగ్రఫీ వృత్తిలో ఉన్నవారితో పాటు ఔత్సాహికులు కూడా పాల్గొనేందుకు వీలుగా మేజికల్ మెమొరీస్ పేరుతో వెడ్డింగ్ ఫిల్మ్ అవార్డ్స్ కాంటెస్ట్ నిర్వహిస్తోంది. వీడియోగ్రాఫర్లకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీ అత్యుత్తమ వేదిక అని సంస్థ ఎండీ సజ్జన్‌కుమార్ తెలిపారు. పోటీకి ప్రముఖ వెడ్డింగ్, ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్ కిరణ్‌దీప్‌తో పాటు పలువురు ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారని వివరించారు. వయసులకు అతీతంగా ఎవరైనా పాల్గొనవచ్చని, విజేతలకు అత్యాధునిక నికాన్ కెమెరాలు సహా రూ.6 లక్షల వరకూ విలువైన బహుమతులు అందిస్తామన్నారు. తమ వెబ్‌సైట్ https:// www.nikon.co.in ద్వారా ఎంట్రీల స్వీకరణ గురువారం ప్రారంభమై జనవరి 8వ తేదీ వరకూ కొనసాగుతుందని వివరించారు.



# స్ఫూర్తి దాయకమైన మహిళ.. ఐయామ్ శక్తి

సాక్షి, సిటీబ్యూరో: దసరా నుంచి దీపావళి దాకా మహిళాశక్తిని ప్రతిబింబించే పండుగల నేపథ్యంలో ప్రముఖ కాస్మొటిక్ తయారీ బ్రాండ్ అవాన్ ఇండియా 'ఐ యామ్ శక్తి' పేరిట ప్రచారాన్ని చేపట్టింది. తన జీవితాన్ని మాత్రమే కాకుండా చుట్టూ ఉన్నవారి జీవితాలను సైతం మార్చే శక్తి కూడా మహిళకు ఉందని, అలాంటి గొప్ప మహిళలకు అభినందన పూర్వకంగా ఈ ప్రచారం నిర్వహిస్తున్నామని, తమ సొంత జీవితాలను కమ్యూనిటీలను మార్చుకున్న మహిళల స్ఫూర్తిదాయకమైన కథనాలను 'ఐ యామ్ శక్తి' వెలుగులోకి తెస్తుందని అవాన్ ఇండియా మార్కెటింగ్, జీఎం స్నిగ్ధా సుమన్ తెలిపారు.



# తప్పంతా సర్కారుదే

## నాలుగున్నర నెలల్లో రాష్ట్రంలో వరుసగా అఘాయిత్యాలు

**చంద్రబాబు బాధ్యత తీసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలి ● సహానా కుటుంబ సభ్యుల పరామర్శలో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్**

**సాక్షి ప్రతినిధి, గుంటూరు :** 'రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలు బతికే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 77 మందిపై అత్యాచారాలు జరిగాయి. వీరిలో ఏడుగురు హత్యకు గురి కాగా, ఐదుగురు ఆత్మహత్యలు చేసుకున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలుపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. మహిళల రక్షణను గాలికొదిలేసింది. మనవాడైతే పర్వాలేదు.. ఏం చేసినా చెల్లుబాటవుతుందనే ధోరణి వల్ల తెలుగుదేశం పార్టీ నేతల అఘాయిత్యాలు పెరిగిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికైనా మేలుకొని జరిగిన ప్రతి ఘటనకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. దారుణంగా లైంగిక వేధింపులకు గురై, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సహానా కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఆస్పత్రిలోని మార్చురీకి వెళ్లి సహానా మృతదేహానికి నివాళి అర్పించారు. ఘటన జరిగిన తీరు, వైద్యం.. తదితర వివరాలను ఆమె కుటుంబ సభ్యులను, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### వాస్తవాలను ఎందుకు దాస్తున్నారు?

● రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ స్థాయికి దిగజారాయో చెప్పేందుకు ఇక్కడ నా దళిత చెల్లి పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. చేసిన వాడు మనవాడైతే చాలు.. వాడు ఏం చేసినా పర్వాలేదని కవర్ చేయడానికి, దొంగ కేసులు పెట్టడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అండగా ఉంది. నవీన్ అనే వ్యక్తి చంద్రబాబుతో కలిసి దిగిన ఫొటోలు ఉన్నాయి. స్థానిక ఎంపీతో చాలా సన్నిహితంగా ఉన్న పరిస్థితి, ఫొటోలూ కనిపిస్తున్నాయి. ఇలాంటి వ్యక్తి సహానా పని చేస్తున్న ప్రదేశానికి వచ్చి, ఆమెను కారులో ఎక్కించుకుని వెళ్లాడు. అతనితోపాటు కొంతమందితో కలిసి మృగాలుగా ప్రవర్తించారు. దాడి తర్వాత జీజీహెచ్‌లో పడేసి.. ఆమె కుటుంబ సభ్యులు వచ్చే సరికి జారుకున్నాడు. అప్పుడు అక్కడ నవీన్‌తో మరో ఇద్దరు ఉన్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఎప్పుడైనా ఇలాంటి ఘటన జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని ఏమిటి? మేము తోడుగా ఉన్నామని చెప్పాల్సిన ధర్మం రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? తప్పు చేసిన వాడు ఎవరైనా, ఎలాంటి వాడైనా చట్టానికి అతీతుడు కాదు. కచ్చితంగా శిక్ష పడుతుందనే భరోసా ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

● రాష్ట్రంలో ఇంతటి దారుణ పరిస్థితులు కనిపిస్తుంటే ఈ ప్రభుత్వం ఏమైనా పట్టించుకుంటోందా? ఈ రెడ్‌బుక్ పాలనలో టీడీపీకి చెందిన వారు ఏ తప్పు చేసినా, మీరు తప్పు చేయండి.. మేం వెనకేసుకు వస్తాం.. మీకు ఏమీ కాదు.. మేము సపోర్టుగా ఉంటామని సాక్షాత్తు చంద్రబాబు నాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు.

● పోలీసులు న్యాయంగా దర్యాప్తు చేస్తే, అన్ని వాస్తవాలు బయటకొస్తాయి. ఈ తల్లి (సహానా అమ్మ) 14 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్. నేను పేదలు, దళితులకు తోడుగా ఉంటాను. పేదలు, దళితులంతా మా వారేనని ధైర్యంగా చెబుతాను. పేదలకు తోడుగా ఉన్నామని ప్రభుత్వం చెప్పాలి. కానీ, ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. పైగా మా పార్టీ వారిని నిందించడం సరైనదేనా? ఆ తల్లికి తోడుగా నిలబడినందుకు మాపై నిందలు వేయడం సబబేనా?.

> రాష్ట్రంలో జరిగిన ప్రతి ఘటనకు సంబంధించి ప్రభుత్వం తరఫున చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలి. ప్రతి బాధితుడి వద్దకు మంత్రిని పంపించి రూ.10 లక్షలు డబ్బు ఇచ్చి, ఇటువంటి తప్పు ఇంకోసారి జరగనివ్వబోమని లెంపలేసుకోవాలి. ఇలా చేయకపోతే చంద్రబాబు చరిత్ర హీనుడవుతాడు. అత్యాచారం.. ఆపై హత్యకు గురైన చీరాల నియోజకవర్గంలో సుచరిత, నందికొట్కూరు నియోజకవర్గంలో వాసంతి, పొన్నూరు నియోజకవర్గంలో శైలజ, సూళ్లూరుపేట నియోజకవర్గంలో అనికాకుమారి, పాలకొల్లులో కలిశెట్టి అనసూయ, బద్వేలు నియోజకవర్గంలో ప్రొద్దుటూరు దస్తగిరమ్మ, తెనాలి నియోజకవర్గంలో సహానా కుటుంబాలకు చంద్రబాబు ఇచ్చినా ఇవ్వకపోయినా.. వైఎస్సార్‌సీపీ రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చి తోడుగా ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న మేమే రూ.10 లక్షలు ఇస్తున్నప్పుడు.. ప్రభుత్వంలో ఉన్న మీరు బాధ్యత తీసుకుని ఏమేం చేయగలుగుతారో చెప్పండి. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు సిగ్గు తెచ్చుకోవాలి. ఈ ప్రభుత్వం ఏం చేసినా, చేయకపోయినా బాధ పడాల్సిన అవసరం లేదు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే. అప్పుడు వీళ్లందరినీ ఏరి ఏరి జైళ్లలో పెట్టే కార్యక్రమం చేస్తాం.
>
> - వైఎస్ జగన్

# పరిహారమిచ్చాకే కూలుస్తున్నారా?

## మూసీ నదీ గర్భంలోని ఇళ్లపై సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు

- చట్టప్రకారం చర్యలు తీసుకున్నాకే కూల్చివేత చేపడుతున్నామన్న ఏఏజీ
- ముందుగా నోటీసులు కూడా జారీ చేస్తున్నామని వివరణ
- ఈ వివరాలను నమోదు చేసుకున్న ధర్మాసనం
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, హైడ్రాకు ఆదేశం
- విచారణ 3 వారాలకు వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** 'మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో నిర్మాణం చేపట్టారంటూ మార్కింగ్ చేసిన ఇళ్లను పరిహారమిచ్చాకే కూలుస్తున్నారా? నోటీసులు జారీ సహా చట్టప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియను పాటిస్తున్నారా?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ సమాధానమిచ్చారు. పరిహారంపై నిర్వాసితులతో మాట్లాడి, వారు సమ్మతించిన తర్వాతే ఇళ్ల కూల్చివేత చేపడుతున్నామని కోర్టుకు వివరించారు. ఏఏజీ చెప్పిన అంశాలను నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్న ధర్మాసనం.. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు హైడ్రాను ఆదేశించింది.

**కేఏ పాల్ పిటిషన్ మేరకు..**

''మూసీకి సంబంధించి సరైన సర్వే నిర్వహించి, ఆక్రమణలను గుర్తించే వరకు భవనాలను కూల్చివేయకుండా హైడ్రాను ఆదేశించాలని.. బాధితులకు నోటీసులు ఇచ్చి, ఇళ్లు ఖాళీ చేయడానికి లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి నెల రోజుల సమయం ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావుల ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది.

**పారదర్శకంగా చర్యలు: ఏఏజీ**

విచారణ సందర్భంగా ఏఏజీ ఎక్కడ అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వ న్యాయ వాదులు హాజరుకాకుంటే ఎలాగని, పిటిషనర్ల వాదనలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని పేర్కొంది. దీనితో ఏఏజీ విచారణకు హాజరై వాదనలు వినిపించారు. ''చట్టప్రకారం చర్యలు తీసుకుంటూనే ప్రభుత్వం ముందుకెళ్తోంది. నోటీసులిచ్చి సమయం ఇచ్చిన తర్వాతే కూల్చివేతలు చేపడుతున్నాం. ప్రజలందరి విషయంలో ఒకేలా వ్యవహరిస్తున్నాం. తారతమ్యాలు లేవు. పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా చర్యలు చేపడుతున్నాం'' అని వివరించారు. చెరువులు, కుంటల పరిరక్షణ కోసం కోర్టు ఆదేశాల మేరకు హైడ్రా ఏర్పాటైందని.. రివర్ బెడ్‌లోని ఇళ్లకు మార్కింగ్ మాత్రమే చేసిందని, ఇంకా కూల్చివేతలు చేపట్టలేదని తెలిపారు. హైడ్రాకు చట్టబద్ధత ఇస్తూ ఇటీవల ప్రభుత్వం ఆర్డినెన్స్ కూడా జారీ చేసిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏఏజీ వాదనలను రికార్డు చేశామని, ఈ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

### బాధితుల్లో ఎక్కువ మంది పేదలే.: పాల్



విచారణ సందర్భంగా పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ తానే వాదనలు వినిపించారు. ''ఆక్రమణదారులు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రిజిస్ట్రేషన్, విద్యుత్, నిర్మాణ, నల్లా అనుమతులు ఇచ్చిన అధికారులు అందరూ ఆనందంగానే ఉన్నారు. అనుమతులు ఉన్నాయి కదా అని కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి వారే రోడ్డున పడుతున్నారు. 'హైడ్రా' బాధితుల్లో ఎక్కువ మంది వారే. 462 నిర్మాణాలను, భవనాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చారు. ఎన్ కన్వెన్షన్‌ను ఒక్కరోజులో కూల్చిన అధికారులు.. దాదాపు 250 మంది పెద్దలకు మాత్రం నోటీసులు జారీ చేసి వదిలేశారు. పేద, మధ్యతరగతికి సమయం ఇవ్వకుండా ప్రతాపం చూపిస్తున్నారు. కూల్చడానికి నేను వ్యతిరేకం కాదు.. కానీ, చట్టాన్ని పాటించాలి. న్యాయవాదులను పెట్టుకోలేని స్థితిలో చాలా మంది ఉన్నారు. లక్షల మంది హైడ్రా తమ ఇంటి మీదకు ఎప్పుడో వస్తుందో అని భయంతో బతుకుతున్నారు. అలాంటి వారి కోసమే పిల్ వేశాను. ఇళ్లు కూల్చే వారికి ముందే పరిహారం ఇవ్వాలి. నోటీసులిచ్చి ఖాళీ చేసే సమయం ఇవ్వాలి. తెలంగాణ మరో ఉత్తరప్రదేశ్‌లా మారకముందే చర్యలు తీసుకోవాలి. ఇళ్ల కూల్చివేతపై సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలి'' అని పాల్ వాదనలు వినిపించారు.

## కొండా సురేఖ 30న హాజరుకావాలి

- నాంపల్లి కోర్టు ఆదేశం

**సిటీ కోర్టులు (హైదరాబాద్):** మంత్రి కొండా సురేఖపై నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ వాయిదా పడింది. నాగచైతన్య, సమంతల విడాకుల విషయంలో తన కుటుంబం పరువు తీసేలా సురేఖ ఆరోపణలు చేశారంటూ నాగార్జున నాంపల్లిలోని కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. రాజకీయ లబ్ధి కోసమే సురేఖ నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని, మంత్రిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై కొండా సురేఖ నేరుగా కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని జడ్జి ఎస్.శ్రీదేవి గత వారం నోటీసులిచ్చారు. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేశారు. అయితే బుధవారం సురేఖ హాజరు కాకపోవడంతో విచారణ ఈనెల 30కి వాయిదా పడింది. ఆరోజు కొండా సురేఖ హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. సురేఖ తరఫున న్యాయవాది తిరుపతి వర్మ హాజరయ్యారు.

# ఎలాంటి ఆధారాలూ లేకుండా దిగజారి మాట్లాడారు

▶ మొదటి పేజీ తరువాయి

స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ తన వాంగ్మూలం ఇచ్చారు. వాస్తవానికి గత వారం విచారణలోనే కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇవ్వాల్సి ఉండగా..ఆయన కోర్టుకు రాలేకపోవడంతో న్యాయవాదులు వాయిదా కోరారు. జడ్జి ఎస్.శ్రీదేవి విచారణను బుధవారానికి వాయిదా వేయగా కేటీఆర్ హాజరై వాంగ్మూలం ఇచ్చారు. కేటీఆర్‌తో పాటు సాక్షులు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌కుమార్, తుల ఉమా, బాల్క సుమన్ కూడా తమ వాంగ్మూలాన్ని ఇచ్చేందుకు కోర్టుకు హాజరయ్యారు. అయితే సమయం లేకపోవడంతో శ్రవణ్ కుమార్ వాంగ్మూలం మాత్రమే కోర్టు రికార్డు చేసింది. మిగతావారి వాంగ్మూలం తీసుకునేందుకు వీలుగా విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. బుధవారం నాటి విచారణకు కేటీఆర్ తరఫు న్యాయవాదులు సురేందర్, అరవింద్, సిద్ధార్థ, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాది జక్కుల లక్ష్మణ్ హాజరయ్యారు. తదుపరి విచారణకు సాక్షులు అందరూ హాజరుకావాలని ఆరోజు వారి వాంగ్మూలం తీసుకుంటామని జడ్జి శ్రీదేవి తెలిపారు.

**కేటీఆర్ వాంగ్మూలం ఇలా..**

'డబుల్ పీజీ చేసిన నేను తొలుత అమెరికాలో ఉద్యోగం చేశా. 2006లో తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చి కేసీఆర్ సారథ్యంలో ఉద్యమంలో పాల్గొన్నా. తెలంగాణ ఏర్పడ్డాక మొదటిసారిగా టీఆర్‌ఎస్ పార్టీ తరఫున సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పోటీ చేశా. ఇప్పటివరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందా. ఐటీ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించా. వివిధ దేశాల నుంచి కంపెనీలు తీసుకువచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేశా. కేవలం తెలంగాణలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నా. అలాంటి నాపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయి. దాదాపు 18 ఏళ్లుగా రాజకీయ జీవితంలో అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవ చేస్తున్న నాపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడంతో, నా గురించి తెలిసిన చాలామంది బాధపడ్డారు. సురేఖ బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. ఆమె మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా, తీవ్ర ఆవేదన కలిగించేలా ఉన్నాయి. నేను డ్రగ్ అడిక్ట్‌నని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానని, ఇతరులకు డ్రగ్స్ అలవాటు చేస్తానని, సినీ, రాజకీయ నేతలు చాలామంది విడాకులకు నేనే కారణమని.. ఎలాంటి ఆధారాలూ లేకుండా కేవలం పబ్లిసిటీ కోసం అలాంటి వ్యాఖ్యలు చేశారు. నేను అన్నీ చెప్పలేకపోతున్నా. ఫిర్యాదులో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకోండి. సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను కూడా కోర్టుకు సమర్పించా. నాపై అసత్య ఆరోపణలు చేసిన సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోండి..' అని కేటీఆర్ కోర్టును కోరారు.

**సురేఖ అనుచిత వ్యాఖ్యలతో బాధపడ్డా..**

'కేటీఆర్ నాకు 2007 నుంచి తెలుసు. ఆయనతో పాటు తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశా. 2024 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలతో చాలా బాధపడ్డా. మా నాయకుడిపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోండి..' అని శ్రవణ్‌కుమార్ తన వాంగ్మూలంలో కోరారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు బుధవారం కోర్టుకు వచ్చారు.

## బిడ్డలకు భారం కావొద్దని..

**98 ఏళ్ల వృద్ధురాలి ఆత్మహత్య**



**చిక్కడపల్లి (హైదరాబాద్):** వృద్ధాప్యానికి తోడు.. పిల్లలకు భారం కావద్దనే వేదనతో 98 ఏళ్ల వృద్ధురాలు నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీనగర్ డివిజన్‌లోని సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్‌లో బుధవారం జరిగిన ఈ సంఘటనపై.. ఇన్‌స్పెక్టర్ బానోతు రాజు నాయక్ తెలిపిన వివరాలివి. జవహర్‌నగర్ సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో సరోజని అనే వృద్ధురాలు (98) ఒంటరిగా నివసిస్తోంది. పక్క అపార్ట్‌మెంట్‌లో నివసించే కుమారుడు రవిచంద్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తల్లికి ఉదయం, సాయంత్రం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించేవాడు. కాగా, సరోజని బుధవారం ఉదయం ఇంట్లోనే చీరకు నిప్పంటించుకుంది. ఫ్లాట్ లోంచి పొగలు రావడంతో స్థానికులు 100 నంబర్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలు లోపలి నుంచి గడియ పెట్టుకోవడంతో.. వారు తలుపులు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. అప్పటికే శరీరమంతా కాలిపోయి వృద్ధురాలు చనిపోయింది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి.. కుమారుడు రవిచంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సరోజనికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని, పిల్లలకు భారం కాకూడదనే తనువు చాలిస్తున్నట్లు సూసైడ్ నోట్‌లో మృతురాలు పేర్కొంది.

# లోపాలు తేలినా.. నష్ట నివారణ చర్యలు తీసుకోలేదు

- కాళేశ్వరం బరాజ్‌లపై పీసీ ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఈఎన్సీ బి.నాగేంద్రరావు వెల్లడి
- బరాజ్‌లలో లోపాలపై తనిఖీ చేసి నివేదికలిచ్చాం
- కానీ నష్టనివారణ చర్యలను రామగుండం ఈఎన్సీ చేపట్టలేదు
- ఉన్నత స్థాయి ఆదేశాలతోనే బరాజ్‌లలో నీటి నిల్వలు కొనసాగించారు
- భారీ నిల్వల వల్ల ఇసుక కొట్టుకుపోయి బరాజ్‌లు దెబ్బతిని ఉండొచ్చని వివరణ

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో లోపాలపై 2021 అక్టోబర్, నవంబర్‌లలో తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇచ్చినా.. రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు నష్ట నివారణ చర్యలు తీసుకోలేదని నీటిపారుదల శాఖ ఈఎన్సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేంద్రరావు ఆరోపించారు. బరాజ్‌ల ఎగువన, దిగువన సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయని, దిగువన వేరింగ్ కోట్ దెబ్బతిన్నదని నివేదికలలో తెలిపామని వివరించారు. ప్రాజెక్టుల ఈఈలు, ఎస్ఈలు, సీఈలు దీనికి బాధ్యులని.. బరాజ్‌లలో లోపాలున్నట్టు ఎన్నడూ నల్లా వెంకటేశ్వర్లు తమకు నివేదిక సమర్పించలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం బరాజ్‌లపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ బుధవారం బి.నాగేంద్రరావును మూడున్నర గంటలకుపైగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. 120కిపైగా ప్రశ్నలు వేసింది. నిర్వహణ, పర్యవేక్షణ (ఓఅండ్‌ఎం) విభాగానికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక వ్యవస్థ లేదని.. క్షేత్రస్థాయి అధికారులకు ప్రాజెక్టుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తామని ఈ సందర్భంగా కమిషన్‌కు నాగేంద్రరావు వివరించారు. తమ తనిఖీల నివేదికలను కమిషన్‌కు అందజేశారు. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో బరాజ్‌లకు రక్షణ చర్యలు తీసుకోవాలని.. వర్షాకాలానికి ముందు, తర్వాత, మధ్యలో పరీక్షలు నిర్వహించి నివేదికలు అందించాలని తాము కోరినా రామగుండం ఈఎన్సీ చేయలేదని వివరించారు. ఐఎస్ కోడ్, కేంద్ర జలసంఘం మాన్యువల్స్‌ను కూడా పాటించలేదని ఆరోపించారు. బరాజ్‌ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ముగిసినట్టు నల్లా వెంకటేశ్వర్లు నుంచి తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. గేట్ల నిర్వహణలో ఆపరేషన్ ప్రోటోకాల్ పాటించినట్టు సమాచారం లేదని.. వరద ఉధృతితో దిగువన రక్షణ పనులు దెబ్బతినడానికి అది ఒక కారణం కావొచ్చని తెలిపారు. మరమ్మతులు చేయడం కోసం బరాజ్‌లలో నీటి నిల్వలను తగ్గించాలని నిర్మాణ సంస్థలు కోరినా పట్టించుకోలేదా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఈ దిశగా తమ కార్యాలయం ఆదేశాలేమీ ఇవ్వలేదని, అయితే నిల్వలను పెంచాలని నల్లా వెంకటేశ్వర్లు మౌఖిక ఆదేశాలిచ్చారని నాగేంద్రరావు వివరించారు.

**ఈఎన్సీ పోస్టు అలంకారానికా?**

'బరాజ్‌ల వైఫల్యానికి నిర్వహణ వైఫల్యం ఓ కారణం కాదా? ఈఎన్సీ (ఓఅండ్‌ఎం) పోస్టు ఎందుకు ఉంది? అలంకారానికా?' అని కమిషన్ నిలదీయగా.. నిర్వహణ బాధ్యత క్షేత్రస్థాయి సీఈలదేనని నాగేంద్రరావు బదులిచ్చారు. నిర్వహణ మాన్యువల్స్, సర్క్యులర్లు జారీచేసి వాటిని పాటించాలని కోరడమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు. నిరంతర నిల్వలతో బరాజ్‌ల ఎగువ భాగంలో మరమ్మతులు సాధ్యం కాలేదని, దిగువన అవకాశమున్నా మరమ్మతులు చేయలేదని వివరించారు. అయితే 'నీటి నిల్వ అవసరాలకు బరాజ్‌లు పనికిరావని ఐఎస్ కోడ్‌లో ఉన్న విషయం మీకు తెలియదా? నిల్వ చేయాలని ఆదేశించినది ఎవరు? నిల్వలతోనే పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి బరాజ్‌లు దెబ్బతిన్నాయా?' అని కమిషన్ ప్రశ్నించగా.. ఉన్నత స్థాయి ఆదేశాలతోనే నీళ్లు నిల్వ చేశారని నాగేంద్రరావు వివరించారు. నిల్వలతో ఇసుక కొట్టుకుపోయి దెబ్బతినే అవకాశాలుంటాయని అంగీకరించారు. మూడు బరాజ్‌ల పనులు సంపూర్ణంగా పూర్తయ్యాయా? అని కమిషన్ ప్రశ్నించగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పనులు పూర్తయ్యాయని, మేడిగడ్డ బరాజ్‌లో నిబంధనల ప్రకారం పనులు జరగలేదని నాగేంద్రరావు తెలిపారు.

### నాణ్యతా పరీక్షలకు మనస్సాక్షి అంగీకరించలేదా?

'వరదల అనంతరం బరాజ్‌ల పరిస్థితి ఏమిటి? ఏమైనా దెబ్బతిన్నాయా? నిర్మాణం సరిగ్గా జరిగిందా? లేదా? అని పరిశీలించాలని మీ మనస్సాక్షి అంగీకరించలేదా?' అని క్వాలిటీ కంట్రోల్ రిటైర్డ్ సీఈ అజయ్‌కుమార్‌ను పీసీ ఘోష్ కమిషన్ నిలదీసింది. అయితే నిర్మాణ దశలో, బిల్లుల చెల్లింపుల సమయంలోనే నాణ్యతా పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తామని, నిర్మాణం పూర్తయిన తర్వాత అవసరం ఉండదని అజయ్‌కుమార్ బదులిచ్చారు. ఇక అసంపూర్తి పనులను పూర్తి చేయాలని నిర్మాణ సంస్థలకు నోటీసులిచ్చామని కమిషన్‌కు మాజీ ఈఈ సర్దార్ వివరించారు. గురువారం కమిషన్ రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుకు రెండోసారి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది.

## 'బీఆర్‌ఎస్ కార్యాలయం కూల్చివేత'లో జోక్యం చేసుకోం

- సింగిల్ జడ్జి తీర్పును మార్చిన హైకోర్టు సీజే ధర్మాసనం

**సాక్షి, హైదరాబాద్:** నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే సింగిల్ జడ్జి విధించిన రూ.లక్ష జరిమానా ఆదేశాలను కొట్టివేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 18న ఇచ్చిన తీర్పును సవరిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. 'బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా కార్యాలయ భవనాన్ని క్రమబద్ధీకరించాలని జూలై 3న చేసుకున్న దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ తిరస్కరిస్తూ జూలై 20న ఉత్తర్వులు జారీ చేశారు. అనధికారిక నిర్మాణాన్ని 15 రోజుల్లో తొలగించాలని, లేనిపక్షంలో మున్సిపల్ అధికారులే చర్యలు చేపడతారని పేర్కొన్నారు. కమిషనర్ ఉత్తర్వులను కొట్టివేసి.. నల్లగొండ సర్వే నంబర్ 1506లోని ఎకరం స్థలంలోని నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేలా కమిషనర్‌కు ఆదేశాలివ్వాలి' అని విజ్ఞప్తి చేస్తూ నల్లగొండ బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గతంలోనే ఆదేశాలిచ్చినా.. మరోసారి రిట్ పిటిషన్ దాఖలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ.లక్ష జరిమానా విధించారు. సింగిల్ జడ్జి ఆదేశాలను పిటిషనర్ సవాల్ చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు వెలువరించింది. మున్సిపల్ కమిషనర్ చర్య చట్టానికి అనుగుణంగానే ఉన్నందున సింగిల్ జడ్జి ఇచ్చిన కూల్చివేత ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

## పరువునష్టం కేసు విచారణకు సీఎం గైర్హాజరు

**తదుపరి విచారణ నవంబర్ 6కి వాయిదా**

**సిటీ కోర్టులు:** పరువునష్టం కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు అయ్యారు. భారతీయ జనతా పార్టీ సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం హాజరై రూ.15 వేల చొప్పున రెండు పూచీకత్తులు ఇవ్వాలని గత విచారణ సందర్భంగా జడ్జి ఎస్.శ్రీదేవి ఆదేశించారు. అయితే బుధవారం విచారణకు ముఖ్యమంత్రి హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను కోర్టు నవంబర్ 6కి వాయిదా వేసింది. ఆరోజు కచ్చితంగా పూచీకత్తులు ఇవ్వాలని సూచించింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే, 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్య ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. 50 వేల కంటే ఎక్కువ జనం ఉన్న సభలో రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే ఆరోపణలు చేయడంతోపాటు వారికి తప్పుడు సంకేతాలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు.


# సిమెంట్ పరిశ్రమ మాకొద్దు

**'అంబుజా సిమెంట్'పై ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన ● ముక్తకంఠంతో వ్యతిరేకించిన ప్రజలు.. నిరసనలతో హోరెత్తిన వేదిక**


**రామన్నపేట :** తమ బతుకులను బుగ్గిపాలు చేసే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించొద్దని, అంబుజా గోబ్యాక్, అదానీ గోబ్యాక్ అంటూ ప్రజలు ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట శివారులో అదానీ సంస్థ ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, పీసీబీ ఈఈ సంగీత ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. రామన్నపేట తోపాటు కొమ్మాయిగూడెం, సిరిపురం, వెల్లంకి, బోగారం, జనంపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి నల్లజెండాలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

**ప్రజాభిప్రాయ సేకరణకు బయటి వ్యక్తులు**

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఎన్జీఓ, స్వచ్ఛంద సంస్థల పేరుతో ఏపీతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి కొందరు వచ్చారని గ్రహించిన స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. వారిని గుర్తించి అక్కడి నుంచి తరిమివేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభంలో కంపెనీ ప్రతినిధులు పరిశ్రమ ఏర్పాటు ఉద్దేశాలను వివరిస్తుండంగా ప్రజలు అడ్డుకున్నారు. ప్రజల నినాదాల మధ్యనే కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, కార్మికసంఘాల నేతలు మాట్లాడారు. మాట్లాడిన ప్రతిఒక్కరూ కంపెనీ ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాలను యథాతథంగా ప్రభుత్వానికి చేరవేసి సిమెంట్ కంపెనీ ఏర్పాటును రద్దుచేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ సారాంశాన్ని చదివి వినిపించాలని ప్రజలు అదనపు కలెక్టర్‌కు అడ్డుతగిలారు. వేదిక నుంచి దిగి వెళ్లే వరకు ప్రజలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు వస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చిట్యాలలో పోలీసులు అరెస్టు చేశారు. ఆయన్ను బలవంతంగా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను మోత్కూరులో అరెస్టు చేశారు.



ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వెలుపల ఆందోళన చేస్తున్న ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చిట్యాల వద్ద అరెస్టు చేస్తున్న పోలీసులు

### బంద్ ప్రశాంతం

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను నిరసిస్తూ పర్యావరణ పరిరక్షణ వేదిక పిలుపు మేరకు బుధవారం రామన్నపేట మండలవ్యాప్తంగా వ్యాపా రస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం నుంచే వ్యాపార వాణిజ్య సంస్థలను మూసివేశారు.

## 'ఇందిరమ్మ' కమిటీలపై వివరణివ్వండి

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ సభల ఆమోదం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కమిటీలను ఏర్పాటు చేయడంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. గ్రామ సభల ఆమోదం లేకుండానే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కమిటీలను ఏర్పాటు చేస్తోందంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వడమే ఉద్దేశమని ప్రభుత్వం చెబుతూ, ఏకపక్షంగా గ్రామ స్థాయిలో కమిటీలు వేసిందని, వీటికి గ్రామసభ, వార్డు కమిటీల ఆమోదం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు.

## బీసీ కమిషన్ విచారణపై విస్తృత ప్రచారం చేయండి

- జిల్లా కలెక్టర్లకు చైర్మన్ నిరంజన్ ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ ఈనెల 28నుంచి చేపడుతున్న బహిరంగ విచారణపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని చైర్మన్ జి.నిరంజన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం బీసీ కమిషన్ కార్యాలయం నుంచి సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు నిర్ణయానికి సంబంధించి ప్రజలు, మేధావులు, కుల సంఘాలు, ప్రముఖుల నుంచి అభ్యర్థనలు, సూచనలు, అభ్యంతరాలను వినడానికి కమిషన్ విచారణ నిర్వహిస్తోందని తెలిపారు. దీనిపై ఈనెల 17న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. వచ్చేనెల 13 వరకు వేర్వేరు తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో, ఇతర ప్రధాన కేంద్రాల వద్ద నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాల వారీగా తేదీలను ఇప్పటికే ప్రకటించామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 24-10-2024

● చదువుకు 'న్యాయం'

# ఆమె ఒడి... అనాథల బడి



'మా అమ్మాయి బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగం చేయాలి' అనే కల తల్లిదండ్రులు అందరికీ ఉంటుంది. మరి అనాథపిల్లల గురించి ఎవరు కల కంటారు? సమాధానం వెదుక్కోవాల్సి ఉంటుంది. ఎవరో ఎందుకు కల కనాలి? ఆ పిల్లలే బాగా చదువుకుంటే బాగుంటుంది కదా! అయితే, అనిపించవచ్చు. 'పేరుకే చదువు' అనుకునే పరిస్థితుల్లో... నాణ్యమైన విద్య అనేది అందని పండు అనుకునే పరిస్థితుల్లో ఆ పిల్లల చదువు ముందుకు సాగకపోవచ్చు. కల కనడం అసాధ్యం కావచ్చు. ఈ పరిస్థితిని గమనించిన న్యాయమూర్తి సునీత కుంచాల అనాథపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఒక వేదికను ఏర్పాటు చేశారు.

న్యాయసేవాధికార సంస్థ తరపున అనాథ బాలల వసతి గృహాలను సందర్శిస్తూ ఉంటుంది నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల. అలా వెళుతున్న క్రమంలో బాలికల సదన్‌లో పిల్లలు చదువుకుంటున్న తీరు ఆమెకు బాధగా అనిపించేది. 'నేను మాత్రం ఏంచేయగలను!' అనే నిట్టూర్పుకు పరిమితం కాలేదు.

'ఏదైనా చేయాల్సిందే' అని గట్టిగా అనుకున్నారు.

అనుకున్నదే ఆలస్యం అక్కడ ఉన్న 30 మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందడుగు వేశారు.

ఒక మంచిపనికి పూనుకున్నప్పుడు, 'మీ సహకారం కావాలి' అని అడిగితే ఎవరు మాత్రం ముందుకు రారు! సునీత అడగగానే హైకోర్టు న్యాయవాది సరళ మహేందర్‌రెడ్డి 23 మంది బాలికలకు తమ పాఠశాల 'రవి పబ్లిక్ స్కూల్'లో పదవ తరగతి వరకు ఉచితంగా చదువు అందించేందుకు ముందుకు వచ్చారు. సరళ మహేందర్ రెడ్డి స్ఫూర్తితో మరో రెండు పాఠశాలల వారు తమ వంతు సహకరిస్తామని ముందుకు వచ్చారు. దీంతో నిజామాబాద్ 'బాలసదన్'లోని 30 మంది అనాథ బాలికలకు నాణ్యమైన విద్య అందుతోంది.

సునీత కుంచాలకు సహాయం అందించడానికి ఐపీఎస్ అధికారులు రోహిణి ప్రియదర్శిని (సెవెన్త్ బెటాలియన్ కమాండెంట్), కల్మేశ్వర్ శింగనవార్ (నిజామాబాద్ పోలీసు కమిషనర్), ఐఏఎస్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు(నిజామాబాద్ కలెక్టర్) ముందుకు వచ్చారు. విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ డ్రెస్... ఇతర అవసరాలకు అయ్యే ఖర్చులను అందించేందుకు సునీతతో పాటు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనవార్, బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని సిద్ధమయ్యారు. వీరంతా కలిసి తమ బ్యాచ్‌మేట్స్ సహకారంతో కొంత మొత్తాన్ని సమకూర్చారు. బాలికలను తమ స్కూల్స్‌కు వెళ్లివచ్చేందుకు వీలుగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ పోలీసు వాహనాన్ని సమకూర్చారు. తాము బదిలీ అయ్యాక కూడా ఈ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు వీలుగా 'భవిష్య జ్యోతి' పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేశారు.

ఐసీఐసీఐ బ్యాంకు ఖాతా తెరిచి వాట్సాప్ గ్రూపు ద్వారా ప్రతి లావాదేవీని పారదర్శకంగా కనిపించేలా చేశారు. 'విద్య అనే పునాది గట్టిగా ఉంటేనే కలలు నిలుస్తాయి. సాకారం అవుతాయి' అంటున్న సునీత కుంచాల ఇతర జిల్లాల్లోనూ అధికారుల సహకారం తీసుకొని ఇలాంటి ట్రస్ట్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.

– తుమాటి భద్రారెడ్డి, సాక్షి, నిజామాబాద్



### భవిష్యత్తుకు భరోసా!

ఒక జిల్లా న్యాయమూర్తిగా లైంగిక వేధింపులకు గురైన బాధిత అమ్మాయిలను చూశాను. తల్లిదండ్రులు లేని ఆ పిల్లలకు ప్రభుత్వం వసతి సదుపాయాల వరకు కల్పిస్తుంది. అయితే చదువుకోకపోతే వారి భవిష్యత్తు ఏంటి అనిపించేది. ఆ ఆలోచనలో భాగంగా ఆ పిల్లలున్న హాస్టల్‌కు వెళ్లాం. వారితో మాట్లాడుతున్నప్పుడు వారి చదువు అంతంత మాత్రంగానే ఉందని అర్థమైంది. వారికి మంచి చదువు ఇప్పించాలనుకున్నాం. సాధారణంగా ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లలో 25 శాతం నిరుపేద పిల్లలకు ఉచితవిద్యను అందించాలి. స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూల్స్ వాళ్లను పిలిచి, ఈ పిల్లల చదువు గురించి అడిగాం. ఫీజు లేకుండా పిల్లలకు చదువు చెప్పడానికి మూడు స్కూళ్లు ముందుకు వచ్చాయి. అయితే బుక్స్, స్కూల్ డ్రెస్‌ల సమస్య వచ్చింది. ఒక్క ఏడాదితో ఈ సమస్య తీరదు. పిల్లల చదువు పూర్తయ్యేంతవరకు వారికి సాయం అందాలి. దీంతో పిల్లల కోసం ఓ ట్రస్ట్ ఏర్పాటు చేస్తే మంచిదనే ఆలోచన వచ్చింది. మా నాన్న గారైన గురువులు గారి స్ఫూర్తితో ట్రస్ట్ ఏర్పాటు అయింది. దీనిద్వారా దాతలు స్పందించి, పిల్లల చదువుకు సాయం అందిస్తున్నారు. ప్రతి జిల్లాల్లోనూ ఇలాంటి పిల్లలకు నాణ్యమైన విద్యావకాశాలు కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపితే బాగుంటుంది.

– సునీత కుంచాల, జిల్లా న్యాయమూర్తి, నిజామాబాద్

● ప్యాచ్ ఫ్యాషన్

# అతుకులే అదుర్స్



● అలియా భట్

నటి ఆలియా భట్ 180 ఫ్యాబ్రిక్ ప్యాచ్‌లతో రూపొందించిన లెహంగాను ధరించి అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి ముంబైలో డిజైనర్ మనీష్ మల్హోత్రా దీపావళి బాష్‌కు హాజరైన నటి ఆలియా భట్ తన కస్టమ్ మేడ్ వెడ్డింగ్ సంగీత్ లెహంగాను తిరిగి ధరించి మళ్లీ స్థిరమైన ఫ్యాషన్‌ను ప్రోత్సహించింది. సస్టెయినబులిటీ ప్రాముఖ్యతను పదే పదే తెలియజేయడమే కాకుండా, అలాంటి డ్రెస్సులను ధరిస్తూ తనే ఒక ఉదాహరణగా నిలుస్తోంది. మనీష్ ఏర్పాటు చేసిన స్టార్-స్టడెడ్ దీపావళి బాష్ కోసం వచ్చిన వారిలో ఆలియాభట్ కూడా ఉంది. ఏప్రిల్ 2022లో రణబీర్‌తో పెళ్లికి ముందు ఈ నటి తన సంగీత్ వేడుక కోసం మనీష్ స్వయంగా డిజైన్ చేసిన లెహంగాను ఇప్పుడు మళ్లీ ధరించి, మరింత అందంగా కనిపించింది.

ఈ అందమైన డ్రెస్‌ను తయారు చేయడానికి దాదాపు 180 క్లాత్ ప్యాచ్‌లను కలిపి కుట్టారు. జాకెట్టుకు అచ్చమైన బంగారం, వెండి నక్షి, కోరా పువ్వులు, పాతకాలపు గోల్డ్ మెటల్ సీకెన్స్‌లతో అలంకరించారు. అలియా తన పెళ్లినాటి దుస్తులను తిరిగి ధరించడం, దానికి భిన్నమైన హెయిర్‌స్టైల్‌తో పాటు చమ్కీ చాంద్‌బాలిస్‌తో స్టైల్ చేసి, మరో తాజా రూపాన్ని ఇచ్చింది.

ఈ గంగూబాయి కథియావాడి నటి తన వివాహ దుస్తులను రీసైకిల్ చేయడం ఇదే మొదటిసారి కాదు. కిందటేడాది ఉత్తమ నటిగా జాతీయ అవార్డును అందుకున్నప్పుడు, ఆమె తన పెళ్లి నాటి చీరను ధరించడానికి ఎంచుకుంది. అయినప్పటికీ ఆమె క్లాసీ ఆభరణాలు, చక్కని బన్నుతో విభిన్నంగా స్టైల్ చేసింది. అలియా ప్రస్తుతం తన రాబోయే చిత్రం 'ఆల్ఫా' కోసం పని చేస్తోంది.

● మన(సు)లో మాట

## చెత్త కుండీలోని పేపరు ముక్కలను కూడా చదవకుండా ఉండలేను



డాక్టర్ గారూ! నా సమస్య మీకు వింతగా అనిపించవచ్చు. గత రెండు సంవత్సరాల నుంచి విపరీతంగా నవలలు, వీక్లీలు... ఒకటేమిటి... ఏ పుస్తకం కనబడినా చదవడం అలవాటైంది. క్లాసు పుస్తకాలు చదువుతుంటే నేను చదివిన నవలల్లోని పాత్రలు, సన్నివేశాలు కళ్ళ ముందు మెదిలి చదవలేకపోతున్నాను. దానివల్ల ఆ చదువు ముందుకెళ్ళడం లేదు. ఏదైనా కొత్త పుస్తకం కనబడితే, వెంటనే మొత్తం చదవకపోతే, ఏదో పోగొట్టుకున్న భావన కలుగుతుంది. ఆఖరుకు చెత్త కుండీలోని పేపరు ముక్కలు కూడా తీసి చదవందే మనసు నిలకడగా ఉండడం లేదు. ఈ అలవాటును ఎంత మానుకుందాం అనుకున్నా మానలేకపోతున్నాను. దీనివల్ల నేను బీటెక్ పూర్తి చేయలేనేమోనని భయంగా ఉంది. సలహా ఇవ్వగలరు.

– చందన, విజయనగరం

పుస్తకాలు, నవలలు చదవడం మంచి అలవాటే! కానీ ఏ అలవాటైనా అతిగా చేయడం మంచిది కాదు. కొత్త పుస్తకం కనబడిన వెంటనే మొత్తం చదవాలనే తపన, చదవకపోతే ఏదో తెలియని అలజడి ఇవన్నీ ఒక ఎత్తైతే, చివరకు చెత్త కుండీలోని పేపరు ముక్కలను కూడా ఏరుకుని చదవందే ఉండలేకపోవడమనేది ఖచ్చితంగా ఒక మానసిక రుగ్మతే! 'ఆబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్' అనే మానసిక జబ్బుకు లోనైనవారే ఇలా ప్రవర్తిస్తారు. అలా అతిగా చదవాలనే తపన పడటం, ఆ అలవాటును మీరు మానుకోవాలనుకున్నా మానుకోలేకపోవడం ఈ మానసిక సమస్య ముఖ్య లక్షణం. మెదడులోని 'సెరొటోనిన్' అనే ప్రత్యేక రసాయనిక పదార్థం సమతుల్యంలో తేడాలొచ్చినప్పుడు, మీరు చెప్పిన లాంటి లక్షణాలు బయటపడతాయి. 'క్లోమిప్రెమిన్ ఫ్లూఆక్సిటెన్' అనే మందుల ద్వారాను, 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' అనే ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారానూ ఈ సమస్య నుంచి మిమ్మల్ని పూర్తిగా బయట పడేయవచ్చు. మీరు వెంటనే మంచి సైకియాట్రిస్ట్‌ను కలిస్తే మీ సమస్యకు తగిన చికిత్స చేస్తారు. మీరు మీ బీటెక్ చదువు త్వరలోనే విజయవంతంగా పూర్తి చేయగలరు. ధైర్యంగా ముందుకెళ్ళండి. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● న్యూస్‌మేకర్

# యూట్యూబ్ తెచ్చిన ఆఫీసర్ జాబ్

ఒరిస్సాలోని గిరిజన తెగ.
కోచింగ్‌కు డబ్బులు లేవు.
ఇంట్లో ఇంటర్‌నెట్ రాదు.
కాని జీవితంలో ఏదైనా సాధించాలి.
ఇంటికి, ఊరికి దూరంగా వెళ్లి మరీ సిగ్నల్ ఉన్న చోట కూచుని యూట్యూబ్ వీడియోల సాయంతో 'ఒరిస్సా సివిల్ సర్వీసెస్'లో ఉద్యోగం సాధించింది బిని ముదులి.
సోషల్ మీడియా వల్ల కలిగిన మేలు ఇది.
ఒరిస్సాలో బోండా తెగ నుంచి స్టేట్ సివిల్స్‌లో ఉద్యోగం సాధించిన మొదటి మహిళ బిని పరిచయం...



ఒక్కొక్కరూ ఒక్కొక్కరూ వస్తూ ఉంటే కాసేపటికి ఆ బోండా ఘాట్ జనాలతో నిండిపోయింది. అందరూ బిని ముదులిని చూసి అభినందించేవారే. దిష్టి తీసేవారే. కారణం ఆ అమ్మాయి తమ బోండా తెగ గౌరవాన్ని పెంచింది. తమ తెగ నుంచి 'ఒరిస్సా పబ్లిక్ సర్వీస్ ఎగ్జామినేషన్' (ఓపిఎస్‌సి)లో ర్యాంక్ సాధించి గవర్నమెంట్ అధికారి అవుతున్న మొదటి అమ్మాయి బిని ముదులి.

'నాకు ఉద్యోగం వస్తే నా కంటే మావాళ్లే ఎక్కువ ఆనందిస్తున్నారు' అంటుంది 24 ఏళ్ల బిని ముదులి. మొన్నటి శనివారం విడుదలైన ఓపిఎస్‌సి ఫలితాల్లో ఎస్.టి. కోటాలో 596 వ ర్యాంకు పొంది ఉద్యోగానికి అర్హత సాధించింది బిని. ఓపిఎస్‌సి 2022–23 పరీక్షకు మొత్తం 92,194 మంది అభ్యర్థులు పోటీ పడితే వారిలో 683 మంది అర్హత సాధించారు. విశేషం ఏమిటంటే టాప్ టెన్ ర్యాంకుల్లో ఐదు మంది అమ్మాయిలున్నారు. అర్హత సాధించిన వారిలో 258 మంది అమ్మాయిలే.

### యూట్యూబ్ పాఠాలతో

2020లో ఓపిఎస్‌సి పరీక్ష రాసి ఇంటర్వ్యూలో ఫెయిల్ అయ్యింది బిని. 'నా ప్రిపరేషన్ సరిపోదని నాకు అర్థమైంది. కాని కోచింగ్‌కు వెళ్లేందుకు డబ్బు లేదు. అదీగాక నేను సంపాదించి ఇంటికి సాయపడాల్సిన సమయం. అందుకే ఆయుర్వేదిక్ అసిస్టెంట్‌గా పని చేయడం మొదలెట్టాను. మా ఊరిలో ఇంటర్‌నెట్ ఉండదు. అందుకే దగ్గరిలోని గోవిందపల్లి టౌన్‌కు వచ్చి అక్కడ యూట్యూబ్‌లో దొరికే పాఠాలతో ప్రిపేర్ అయ్యాను. ఆన్‌లైన్‌లో దొరికే మెటీరియల్‌ను చదువుకున్నాను. అనుకున్నది సాధించాను' అంది బిని.

### అమ్మాయిలను స్కూళ్లకు పంపండి

'ఆడపిల్లలను బాగా చదివించండి అనేదే నా పిలుపు. చదువులోనే వారి అభివృద్ధి ఉంది. డబ్బు లేకపోయినా ఇవాళ సోషల్ మీడియా ద్వారా ఉచితంగా అనేక కోర్సులు, కోచింగ్‌లు దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. నేను అధికారి అయ్యాక స్త్రీల స్వయంసమృద్ధి కోసం పని చేస్తాను. అంతేకాదు మా బోండా తెగ కోసం వారికి అందాల్సిన సంక్షేమ ఫలాల కోసం పని చేస్తాను' అంది బిని.



● తల్లిదండ్రులతో...

### వంటలు చేస్తూ పెంచాడు

ఒరిస్సాలోని మల్కన్‌గిరి జిల్లాలో ముదులిపడ అనే చిన్న బోండాల ఊరు బిని ముదులిది. తండ్రి మధుముదిలి అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటచేస్తాడు. తల్లి సునమణి ఊళ్లో అంగన్‌వాడి కార్యకర్తగా పని చేస్తోంది. ఒరిస్సాలో మొత్తం 13 గిరిజన తెగలు అంతరించిపోయే ప్రమాదంలో ఉంటే వాటిలో ఒకటి బోండా తెగ. ఆ తెగ నుంచి తాను బాగా చదువుకుని పైకిరావాలనుకుంది బిని ముదులి. జేపోర్‌లోని బిక్రమ్‌దేబ్ యూనివర్సిటీలో జువాలజీలో ఎంఎస్సీ చేసింది. ప్రభుత్వ అధికారి అయి ప్రజలకు సేవ చేయాలనేది బిని కల.

● స్వీట్ స్టార్టప్

బెంగళూరులో మేఘనా జైన్ కూడా ఈ దీపావళికి ఒక కళ. ఆమె నడుపుతున్న 'డ్రీమ్ ఎ డజన్' నుండి ప్రత్యేక ఆర్డర్‌లపై వెళ్లే గిఫ్టు హ్యాంపర్‌లు అక్కడి కార్పోరేట్ ఆఫీస్‌లను మతాబుల్ని మించిన తియ్యటి వెలుగులతో కాంతిపుంజాల్లా మార్చేస్తుంటాయి. 6 రకాల కప్‌కేక్‌లు, 12 రకాల కేక్ వెరైటీలు, వేర్వేరు రుచుల్లోని కేక్ పాప్స్, చీజ్ కేక్స్‌ను అందమైన హ్యాంపర్‌లో చుట్టి డెలివరీ చేస్తుంటుంది 'డ్రీమ్ ఎ డజన్'. ఆ స్వీట్ స్టార్టప్ యువ అధిపతే మేఘన! ఒక్క దీపావళికి మాత్రమే కాదు, అన్ని సందర్భాలకు, అన్ని సీజన్‌లలో ఇక్కడి కప్‌కేక్‌లకు మంచి గిరాకీ ఉంటుంది. ఇంత చిన్న వయసులో మేఘన ఏడాదికి కోటి రూపాయల బిజినెస్ చేస్తుందంటే ఇక చూడండి!

# మేఘన కేక్ వాక్



మేఘన రాజస్థానీ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. స్వీట్లంటే ఇష్టమే కానీ, స్వీట్స్ బిజినెస్ చేయాలన్న ఆలోచన ఏమాత్రం లేని 18 ఏళ్ల వయసులో ఓ రోజు తమ పొరుగున ఉన్న వాళ్లు సమ్మర్ బేకింగ్ క్లాసులు పెడితే వెళ్లింది మేఘన. కేక్‌ను బేక్ చేయటం నేర్చుకుంది. తర్వాత్త్వాత తను బేక్ చేసిన కేక్‌లను ఇంట్లో, బయట, కాలేజీలో అంతా మెచ్చుకోవటం ఆమెకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. అంతే కాదు, తిరుచ్చిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 'బిజినెస్ ఐడియా'ల పోటీ పెడితే మేఘన చెప్పిన కప్‌కేక్‌ల ఐడియాకు మూడో ప్రైజ్ లభించింది! వెంటనే ఇండియన్ ఏంజెల్ నెట్వర్క్ వాళ్లొచ్చి ''అమ్మాయ్.. మేము ఇన్వెస్ట్ చేస్తాం. నువ్వు కేక్‌ల బిజినెస్‌కి సిద్ధమేనా? అని అడిగారు! మేఘన డైలమాలో పడిపోయింది. చదువా? బిజినెస్సా? కొంత ఆలోచన తర్వాత చదువు వైపే మొగ్గు చూపింది.



డిగ్రీ అయ్యాక మేఘన బెంగళూరులోని 'ఇన్నర్ చెఫ్'లో డెజర్ట్ విభాగంలో చేరింది. ఫుడ్ టెక్నాలజీ కంపెనీ అది. తర్వాత 'కేక్‌వాలా'లో ట్రైనింగ్ తీసుకుంది. తర్వాత 'స్టార్‌బక్స్'లో ఉద్యోగానికి దరఖాస్తు చేసింది. అది రాలేదు. అప్పుడే సొంత బిజినెస్ గురించి ఆలోచించింది. అప్పటికే మేఘన కప్‌కేక్‌ల తయారీతో పాటు, హ్యాంపర్ డిజైనింగ్‌లో మంచి నైపుణ్యం సంపాదించింది. అయితే 2018లో 'డ్రీమ్ ఎ డజన్'ను ప్రారంభించబోతుండగా 'ఉద్యోగం ఇస్తాం రమ్మని' స్టార్‌బక్స్ నుంచి పిలుపు! ఈసారి డైలమాలో పడలేదు మేఘన. స్టార్ బక్స్‌ను వద్దనుకుంది. కొద్ది పెట్టుబడితో కేక్ బిజినెస్‌ను స్టార్ట్ చేసింది. కరోనా సమయంలో కాస్త ఒడిదుడుకులకు లోనైనా తన 'డ్రీమ్'ను నిలబెట్టుకుంది.

మేఘన దగ్గర ప్రస్తుతం 20 మంది ముఖ్య విభాగాలలో పని చేస్తున్నారు. వారిలో ఎక్కువమంది మహిళలే. అలాగే హ్యాంపర్స్‌తో పాటు ఇచ్చే పెయింటెడ్ మాస్కులు, ప్రమిదలు, కొవ్వొత్తుల తయారీని స్థానిక స్వయం సహాయక మహిళా బృందాలకు అప్పగిస్తోంది మేఘన. ఆ విధంగా వారికి కూడా ఆర్థికంగా చేదోడుగా ఉంటోంది. చేతిలో నైపుణ్యం ఉండి, బిజినెస్ చేయాలన్న తపన ఉన్న యువతరానికి మేఘన కచ్చితంగా ఒక రోల్ మోడల్.




● యాడ్‌వర్స్


# యువరాజా ఇదేం తీరు?




'సున్నితమైన విషయాలలో ఎలా స్పందించాలో, ఆరోగ్య సమస్యలపై ఎలా అవగాహన కలిగించాలో కొందరికి కనీస స్పృహ లేకుండా పోతోంది. ఒక దేశం బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలలో అవగాహన ఎలా పెంచుతుంది?! రొమ్ము క్యాన్సర్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లలో 'మీ ఆరెంజ్‌లను చెక్ చేసుకోండి' అంటూ తెలియజేసే ప్రకటన పోస్టర్‌ను ఢిల్లీ మెట్రోలో చూశాను. నరకం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూశాను. ఈ ప్రచారాలు ఎవరు చేస్తారు, వీటిని ఎవరు ఆమోదిస్తారు? ఈ పోస్టర్‌ను పబ్లిక్‌లోకి తీసుకు రాగలిగేటంత మూర్ఖులు మనల్ని పరిపాలిస్తున్నారా?!' అంటూ ఒక మహిళ తన ఎక్స్ ఖాతాలో తీవ్రంగా దుయ్యబట్టారు.

క్యాన్సర్ సర్వైవర్ క్రికెటర్ యువరాజ్ సింగ్ స్వచ్ఛంద సంస్థ 'యువికాన్' ఈ ప్రచారాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దీని వెనుక ఉద్దేశం రొమ్ము క్యాన్సర్ పట్ల సామాన్యులలో అవగాహన కల్పించడమే. కానీ, ఇలాంటి ప్రచారాలు కొన్నిసార్లు అసౌకర్యంగానూ, పనికిమాలినవిగానూ కనిపిస్తాయి. ఇదే విషయాలను ప్రస్తావిస్తూ యూజర్లు కామెంట్ల రూపంలో తమ నిరసనను తెలియజేస్తున్నారు.

'ఇది క్రికెటర్ యువరాజ్‌సింగ్ క్యాంపెయిన్ అని తెలుసుకున్నాను. వీరి ఉద్దేశ్యం సరైనదే కావచ్చు. కానీ, ఇది నిజంగా అసహ్యకరమైనది. ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలనుకుంటున్నాను' అని ఒకరు కామెంట్ చేశారు. 'భారతదేశంలో బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల ఒక శాతం మందికి కూడా సరైన అవగాహన లేదు. తలాతోకా లేని ఇలాంటి ప్రకటన ద్వారా ప్రజలకు విషయం ఎలా చేరుతుంది అనుకుంటున్నారు? స్త్రీలను కించపరిచేలా ఉన్న ఈ ప్రకటన సరైనది కాదు' అని ఇంకొకరు, 'సమస్యను ఎంత బాగా అర్థమయ్యేలా తెలియజేయాలో ఆ ఫౌండేషన్ వాళ్లకే అర్థం కాలేదు' అని మరొకరు 'ప్రకటనదారులు సున్నితమైన విషయాలను పట్టించుకోరు, ఆకట్టుకునే విధంగా డిజైన్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తారు' అని ఒకరు 'ఇది గ్రామీణ జనాభా కోసం కాదు. కేవలం ఇంగ్లిషు మాట్లాడే మహిళల కోసమే' అంటూ ఒక్కొక్కరు ఒక్కో విధంగా తమ స్పందనలను తెలియజేస్తున్నారు.




## నో క్లీన్ షేవ్.. నో లవ్

యువతుల వినూత్న ర్యాలీ... కాలానుగుణంగా యువతలో ఫ్యాషన్ అభిరుచులు మారుతున్నాయి. అబ్బాయిల్లో ఇటీవల ఎక్కువమంది గడ్డం, జుట్టు పెంచి ఫ్యాషన్‌గా కనిపించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై ఇండోర్‌లో ఉన్న కొందరు కాలేజీ యువతులు అబ్బాయిల గడ్డం విషయమై ర్యాలీ తీయడం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మాకు గడ్డంలేని బాయ్‌ఫ్రెండ్స్ కావాలంటూ యువతులు ఈ వినూత్న ర్యాలీకి శ్రీకారం చుట్టారు. 'గడ్డం తొలగించండి.. ప్రేమను కాపాడండి' అనే నినాదంతో యువతులు ముఖాలకు గడ్డం మేకప్‌తో ర్యాలీ నిర్వహించారు.

వారి చేతిలో ఉన్న ప్లకార్డులపై 'నో క్లీన్ షేవ్.. నో లవ్', 'మాకు గడ్డంలేని బాయ్‌ఫ్రెండ్స్ కావాలి', 'నో క్లీన్ షేవ్.. నో గర్ల్‌ఫ్రెండ్' వంటి లైన్స్ కనిపించాయి. ఈ ర్యాలీ తాలూకు వీడియోను ఓ 'ఎక్స్' యూజర్ నెట్టింట పోస్ట్ చేశారు. దాంతో ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

'ఈ యువతుల డిమాండ్ కరెక్టే. వారానికి ఒక్కసారైనా క్లీన్ షేవ్ కాకున్నా కనీసం ట్రిమ్ చేసుకుంటే బాగుంటుంది. అప్పుడే మనం ఎలుగుబంటిలా కాకుండా జెంటిల్‌మన్‌లా కనిపిస్తాం' అని ఒకరు కామెంట్ చేశారు. 'మా బాడీ మా ఇష్టం' అని ఒకరు కామెంట్ చేస్తే 'వారి గడ్డం.. వారి ఇష్టం.. మధ్యలో మీకెందుకు' అని ఇంకొకరు కామెంట్ చేశారు.



## 'లిస్ట్-ఎ' క్రికెట్‌లో బోవెస్ ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ

న్యూజిలాండ్ క్రికెటర్ చాడ్ బోవెస్ 'లిస్ట్-ఎ' క్రికెట్‌లో (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు కలిపి) వేగవంతమైన డబుల్ సెంచరీని సాధించాడు. న్యూజిలాండ్ దేశవాళీ వన్డే టోర్నీ 'ఫోర్డ్ ట్రోఫీ'లో ఈ రికార్డు నమోదైంది. కాంటర్‌బరీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బోవెస్... ఒటాగోతో జరిగిన మ్యాచ్‌లో 103 బంతుల్లోనే 27 ఫోర్లు, 7 సిక్సర్లతో 200 పరుగులు సాధించాడు. ఆ తర్వాత మరో 7 బంతులు ఆడిన అతను చివరకు 205 పరుగుల వద్ద వెనుదిరిగాడు. 53 బంతుల్లో సెంచరీ చేసిన బోవెస్ తర్వాతి 100 పరుగులు సాధించేందుకు మరో 50 బంతులు తీసుకున్నాడు. ఇప్పటి వరకు 'లిస్ట్-ఎ' క్రికెట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా), నారాయణ్ జగదీశన్ (భారత్) పేరిట ఉంది. వీరిద్దరు 114 బంతుల్లో ఈ మైలురాయిని అందుకున్నారు. దక్షిణాఫ్రికాలో పుట్టి 2012 అండర్-19 వరల్డ్‌కప్‌లో ఆ దేశానికి ప్రాతినిధ్యం వహించిన బోవెస్... ఆ తర్వాత న్యూజిలాండ్‌కు వలస వెళ్లాడు. 32 ఏళ్ల ఈ ఓపెనర్ కివీస్ తరఫున 6 వన్డేలు, 11 టి20లు ఆడాడు.

# జింబాబ్వే 344/4


సికందర్ రజా

- అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక స్కోరుతో ప్రపంచ రికార్డు
- గాంబియాతో మ్యాచ్‌లో కొత్త చరిత్ర
- 33 బంతుల్లో సికందర్ రజా సెంచరీ

**నైరోబీ:** జింబాబ్వే జట్టు విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శనతో టి20ల్లో సరికొత్త రికార్డులను నమోదు చేసింది. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా జింబాబ్వే రికార్డు నెలకొల్పింది. బుధవారం గాంబియాతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. 'టి20 వరల్డ్ కప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫయర్' టోర్నీలో భాగంగా ఈ మ్యాచ్ జరిగింది. గత ఏడాది ఆసియా క్రీడల్లో భాగంగా మంగోలియాపై నేపాల్ సాధించిన 314/3 స్కోరును జింబాబ్వే బద్దలు కొట్టింది. జట్టు కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా 43 బంతుల్లోనే 7 ఫోర్లు, 15 సిక్సర్లతో 133 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో 33 బంతుల్లోనే శతకం పూర్తి చేసి అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆటగాళ్ల జాబితాలో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. జింబాబ్వే తరఫున టి20ల్లో ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. రజాతో పాటు మరుమని (19 బంతుల్లో 62; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), క్లయివ్ మదాండే (17 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), బ్రియాన్ బెన్నెట్ (26 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్స్) జింబాబ్వే భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. మొత్తం స్కోరు 282 పరుగులు బౌండరీల ద్వారానే వచ్చాయి. అనంతరం గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలి రికార్డు స్థాయిలో 290 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

### మ్యాచ్‌లో కొత్త రికార్డుల విశేషాలు..

- జింబాబ్వే (344/4) సాధించిన స్కోరు టి20ల్లో అత్యధికం. గతంలో నేపాల్ 314/3 స్కోరును మంగోలియాపై సాధించింది.
- అంతర్జాతీయ టి20ల్లో రజా రెండో వేగవంతమైన సెంచరీ (33 బంతుల్లో) సాధించాడు. సాహిల్ చౌహాన్ (ఎస్తోనియా: 27 బంతుల్లో) పేరిట రికార్డు ఉండగా, జాన్ నికోల్ ఈటన్ (నమీబియా) కూడా 33 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు.
- ఇన్నింగ్స్‌లో అత్యధిక ఫోర్లు (30: శ్రీలంక) రికార్డును జింబాబ్వే (30) సమం చేయగా... అత్యధిక సిక్సర్లతో (26) నేపాల్ పేరిట ఉన్న రికార్డును జింబాబ్వే (27) బద్దలు కొట్టింది.
- ఇన్నింగ్స్‌లో బౌండరీల (57) ద్వారా అత్యధిక పరుగుల (282) రికార్డు నమోదైంది.
- పరుగులపరంగా ఇదే (290) అతి పెద్ద గెలుపు. నేపాల్ 273 పరుగులతో మంగోలియాపై నెగ్గింది.
- గాంబియా బౌలర్ మూసా జోబర్తే తన 4 ఓవర్లలో అత్యధికంగా 93 పరుగులు ఇచ్చి కసున్ రజిత (శ్రీలంక: 75) పేరిట ఉన్న చెత్త రికార్డును సవరించాడు.

## చేజేతులా ఓడిన భారత్


మన్‌ప్రీత్‌సింగ్

**న్యూఢిల్లీ:** అందివచ్చిన అవకాశాలను వృథా చేసుకున్న భారత పురుషుల హాకీ జట్టు మూల్యం చెల్లించుకుంది. ప్రపంచ చాంపియన్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జర్మనీ జట్టుపై విజయం సాధించడంలో టీమిండియా విఫలమైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 0-2 గోల్స్ తేడాతో జర్మనీ జట్టు చేతిలో ఓడిపోయింది. జర్మనీ తరఫున మెర్ట్‌జెన్స్ (4వ నిమిషంలో), విండ్‌ఫెడర్ (30వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. సిరీస్‌లో చివరిదైన రెండో మ్యాచ్ నేడు జరుగుతుంది. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు ఏకంగా ఏడు పెనాల్టీ కార్నర్‌లు, ఒక పెనాల్టీ స్ట్రోక్ కూడా వచ్చాయి. కానీ వీటిని భారత జట్టు గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. మరోవైపు జర్మనీ జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు రాగా, ఒక దానిని గోల్‌గా మలిచింది.

# పుణేలో ప్రతీకారానికి సిద్ధం!

సొంతగడ్డపై తొలి టెస్టులో ప్రత్యర్థి చేతిలో ఓడి వెనుకబడటం, ఆ తర్వాత కోలుకొని వరుస విజయాలతో సిరీస్ గెలుచుకోవడం భారత జట్టుకు కొత్త కాదు. ఇటీవల ఆస్ట్రేలియా ఒకసారి, ఇంగ్లండ్ రెండుసార్లు ఇలాగే ముందంజ వేసినా మన టీమ్ మళ్లీ సత్తా చాటి తామేంటో చూపించింది. ఇప్పుడు ఈ విషయంలో న్యూజిలాండ్ వంతు! ప్రతికూల పిచ్ దెబ్బకు అనూహ్యంగా కివీస్ చేతిలో తొలి టెస్టులో ఓడిన టీమిండియా ప్రతీకారానికి సిద్ధమైంది. తమ స్థాయిని ప్రదర్శిస్తూ రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా రోహిత్ శర్మ బృందం బరిలోకి దిగుతోంది. మరోవైపు గత విజయం ఇచ్చిన ఉత్సాహంతో న్యూజిలాండ్ కూడా ఎక్కడా తగ్గరాదని పట్టుదలగా ఉంది.

### నేటి నుంచి భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు

- తప్పక గెలవాల్సిన ఒత్తిడిలో టీమిండియా
- కొత్త ఉత్సాహంతో కివీస్
- ఉదయం గం.9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం


రోహిత్ శర్మ

**పుణే:** 'రెండు గంటలు మినహా మిగతా మ్యాచ్ మొత్తం మేం బాగా ఆడాం'... బెంగళూరు టెస్టులో ప్రదర్శనపై భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది. పిచ్‌పై అంచనా తప్పడంతో 0-1తో సిరీస్‌లో వెనుకబడిన భారత్ ఈసారి ఎలాంటి అవకాశం ఇవ్వరాదని భావిస్తోంది. అందుకే తమ టీమ్ బలగంతో పాటు స్పిన్ బలాన్ని కూడా నమ్ముకుంటోంది. పూర్తిగా స్పిన్‌కు అనుకూలించే పిచ్‌ను రూపొందించి ప్రత్యర్థికి సవాల్ విసురుతోంది. ఈ నేపథ్యంలో భారత్, న్యూజిలాండ్ మధ్య నేటి నుంచి రెండో టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సిరీస్‌లో 1-1తో సమంగా నిలుస్తుంది.

**బరిలోకి గిల్...**

గత టెస్టు మ్యాచ్ ఆడిన జట్టులోంచి భారత్ రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది. అనారోగ్యం నుంచి కోలుకున్న టాపార్డర్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ మ్యాచ్‌కు అందుబాటులో ఉన్నాడని మేనేజ్‌మెంట్ ప్రకటించింది. అయితే గిల్ వస్తే ఎవరిని తప్పిస్తారనేది ఆసక్తికరం. రాహుల్‌పై విమర్శలు వస్తున్నా... అతను మిడిలార్డర్‌కు మారిన తర్వాత 1 సెంచరీ, 2 అర్ధసెంచరీలతో మెరుగైన ప్రదర్శనే చేశాడు. కానీ గత టెస్టులో ఆటను బట్టి సర్ఫరాజ్‌కే మొగ్గు చూపవచ్చు. ఈ యువ ఆటగాడు తన బ్యాటింగ్ జోరు కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాడు. మరోవైపు సిరాజ్ ఫామ్‌లో లేకపోవడంతో అతనికి బదులుగా ఆకాశ్‌దీప్‌ను ఎంచుకునే అవకాశం ఉంది. అయితే ఎలాగూ స్పిన్‌తో యుద్ధానికి సిద్ధం అవుతున్నారు కాబట్టి నాలుగో స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యం లేదు. రోహిత్, యశస్వి, గిల్, కోహ్లిలతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. పంత్ కూడా పూర్తిగా కోలుకున్నాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన తరహాలో అశ్విన్, జడేజా కూడా ఒక చేయి వేస్తే తిరుగుండదు. బౌలింగ్‌లో వీరిద్దరితో పాటు కుల్దీప్ కివీస్‌ను కుప్పకూల్చాలని టీమ్ కోరుకుంటోంది.


లాథమ్

**సాన్‌ట్నర్‌కు చోటు...**

తొలి టెస్టులో గెలిచినా... వాస్తవ పరిస్థితి ఏమిటో న్యూజిలాండ్‌కు తెలుసు. గత మ్యాచ్ విజయం తమలో స్ఫూర్తి నింపేందుకు పనికొస్తుందే తప్ప వరుసగా రెండో టెస్టులో భారత్‌ను ఇక్కడ ఓడించడం అంత సులువు కాదనేది నిజం. అందుకే టీమ్ అన్ని రకాలుగా సన్నద్ధమై ఉంది. పూర్తిగా స్పిన్ పిచ్ అయినా సరే ముందే బెదిరిపోమని, దానికి అనుగుణంగా తమ ఆటను మార్చుకుంటామని కెప్టెన్ లాథమ్ చెబుతున్నాడు. తొలి టెస్టులో కీలక బ్యాటింగ్ ప్రదర్శన చేసిన రచిన్, కాన్వే, యంగ్ మరోసారి జట్టుకు భారీ స్కోరు అందించగల సమర్థులు. వీరితో పాటు లాథమ్, మిచెల్, బ్లన్‌డెల్ కూడా రాణించాలని జట్టు ఆశిస్తోంది. దూకుడైన బ్యాటింగ్ చేయగల సమర్థుడైన ఫిలిప్స్ ఇటీవల పార్ట్‌టైమ్ స్పిన్నర్‌గా రాణిస్తుండటం ఆ జట్టుకు సానుకూలాంశం. అయితే బెంగళూరు తరహాలో ముగ్గురు పేసర్లు ప్రభావం చూపించే అవకాశం లేదు కాబట్టి ఒకరిని తప్పించి మరో రెగ్యులర్ స్పిన్నర్ సాన్‌ట్నర్‌ను జట్టు బరిలోకి దించనుంది.

### పిచ్, వాతావరణం

తొలి టెస్టు ముగిసిన దగ్గరి నుంచి చెబుతున్నట్లుగా పూర్తిగా పొడిగా ఉండే స్పిన్ వికెట్‌ను సిద్ధం చేశారు. ఆట సాగుతున్నకొద్దీ స్పిన్నర్లు మరింత ప్రభావం చూపగలరు. టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం. వర్షసూచన ఏమాత్రం లేదు. అయితే 2017లో ఇదే మైదానంలో పూర్తిగా స్పిన్ పిచ్‌ను తయారు చేసిన భారత్... ఆసీస్ స్పిన్ దెబ్బకు 333 పరుగులతో ఓడి భంగపడిన విషయం గమనార్హం.


### తుది జట్ల వివరాలు (అంచనా)

**భారత్:** రోహిత్, జైస్వాల్, గిల్, కోహ్లి, సర్ఫరాజ్/రాహుల్, పంత్, జడేజా, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, ఆకాశ్‌దీప్/సుందర్.
**న్యూజిలాండ్:** లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, బ్లన్‌డెల్, ఫిలిప్స్, హెన్రీ, ఎజాజ్, సాన్‌ట్నర్, సౌతీ/రూర్కే.

**2** పుణేలో భారత జట్టు ఇప్పటి వరకు రెండు టెస్టులు ఆడింది. ఒక మ్యాచ్‌లో ఓడి, మరో మ్యాచ్‌లో గెలిచింది. 2017లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత్... 2019లో దక్షిణాఫ్రికాపై ఇన్నింగ్స్ 137 పరుగుల తేడాతో గెలిచింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో విరాట్ కోహ్లి తొలి ఇన్నింగ్స్‌లో 254 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సినిమా



## ఏఐలో శిక్షణ తీసుకుంటున్న రాజమౌళి?

సాధారణంగా దర్శకుడు రాజమౌళితో చేసే చిత్రాల కోసం హీరోలు ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంటారు. కానీ ప్రస్తుతం రాజమౌళియే శిక్షణ తీసుకుంటున్నారట. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో ట్రైనింగ్ తీసుకుంటున్నారట. ఇటీవలి కాలంలో ఏఐని సినిమా ఇండస్ట్రీ కథ మేరకు వినియోగించుకుంటోంది. ఆల్రెడీ కొంతమంది ఫిల్మ్ మేకర్స్ ఏఐని వారి సినిమాల్లో ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కూడా ఫిల్మ్ మేకింగ్‌లో ఏఐ తెచ్చిన మార్పులను గురించి నేర్చుకోవడానికి ప్రత్యేకమైన క్లాసులు తీసుకుంటున్నారని సమాచారం. ఈ క్లాసుల కోసం ఆయన విదేశాల్లోని ఓ ప్రముఖ స్టూడియోతో అసోసియేట్ అయ్యారని భోగట్టా. ఇక మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. ఈ చిత్రం కోసం మహేశ్‌బాబు ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు. ఈ సినిమా కోసమే రాజమౌళి ఏఐను స్టడీ చేస్తున్నారని తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో చిత్రీకరణ మొదలుపెట్టనున్నట్లుగా ఈ చిత్ర కథారచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవల వెల్లడించారు. అలాగే ఈ సినిమాకు కావాల్సిన లొకేషన్స్ అన్వేషణలో కార్తికేయ (రాజమౌళి తనయుడు) ఉన్నారని తెలిసింది. ఇక ఈ చిత్రం ఓ నిధి అన్వేషణ నేపథ్యంలో 18వ శతాబ్దంలో ఉంటుందని, రెండు భాగాలుగా విడుదలవుతుందని, 'మహా రాజా' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారనే ప్రచారాలు జరుగుతున్నాయి.

**'ఆర్ఆర్ఆర్'ను మించి..!**

'ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం) సినిమాలోని ఇంట్రవెల్ సీన్‌లో లెక్కలేనన్ని జంతువులు కనిపిస్తాయి. కాగా మహేశ్‌బాబుతో తాను చేయనున్న సినిమాలో 'ఆర్ఆర్ఆర్' కంటే ఎక్కువ యానిమల్స్‌ని ప్రేక్షకులు చూస్తారని ఇటీవల రాజమౌళి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.


ఆమిర్ ఖాన్

## కిశోర్‌కుమార్ బయోపిక్‌లో..?

ప్రముఖ దివంగత గాయకుడు- నటుడు కిశోర్ కుమార్ బయోపిక్ కోసం హిందీ చిత్ర పరిశ్రమలో కొంతకాలంగా సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే కిశోర్ కుమార్‌గా ఎవరు నటిస్తారనే విషయంపై స్పష్టత రావడం లేదు. పైగా ఎప్పటికప్పుడు పేర్లు మారుతున్నాయి. తొలుత అక్షయ్ కుమార్ పేరు వినిపించింది. ఆ తర్వాత రణ్‌బీర్ కపూర్ పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఆమిర్ ఖాన్ పేరు బీ టౌన్‌లో గట్టిగా వినిపిస్తోంది. కిశోర్ కుమార్ బయోపిక్‌కు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తారని, భూషణ్ కుమార్ నిర్మిస్తారని ఎప్పట్నుంచో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ బయోపిక్ గురించి ఇటీవల ఆమిర్ ఖాన్ - అనురాగ్ బసుల మధ్య చర్చలు జరిగాయని, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ గురించి ఓ అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉందని భోగట్టా. మరోవైపు 'చార్ దిన్ కీ జిందగీ, గజిని 2, ఉజ్వల్ నికమ్ బయోపిక్, ఓ సూపర్ హీరో ఫిల్మ్ (దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో) చిత్రాలు కూడా ఆమిర్ ఖాన్ చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. మరి... ఆమిర్ ఖాన్ నెక్ట్స్ ప్రాజెక్ట్ ఏంటి? అనే ప్రశ్నకు సమాధానం కావాలంటే కొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఇక ఆమిర్ నటించిన 'సితారే జమీన్ పర్' రిలీజ్‌కు రెడీ అవుతోంది.


ప్రభాస్

## స్టైలిష్ రాజా సాబ్

హీరో ప్రభాస్ పుట్టినరోజుని (అక్టోబరు 23) పురస్కరించుకుని ఆయన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు 'రాజా సాబ్' మేకర్స్. ఈ చిత్రం నుంచి ఓ స్పెషల్ వీడియోతో ప్రభాస్ మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. చేతిలో సిగార్, సాల్ట్ అండ్ పెప్పర్ హెయిర్ స్టైల్‌తో సింహాసనంలాంటి కుర్చీలో కూర్చున్న రాజా సాబ్‌ను మోషన్ పోస్టర్‌లో పరిచయం చేసింది యూనిట్. ''ప్రభాస్ హీరోగా మారుతి రూపొందిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ఇది. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ తుది దశలో ఉంది. 2025 ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: కార్తీక్ పళని, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్.

**సలార్ 2 ఆరంభం?:** ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన 'సలార్: పార్ట్-1 సీజ్‌ఫైర్' 2023 డిసెంబరు 22న విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'సలార్ పార్ట్ 2: శౌర్యాంగపర్వం' ఉంటుందని యూనిట్ ప్రకటించింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైందని సమాచారం. 20 రోజుల పాటు జరగనున్న ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కూడా జాయిన్ కానున్నారట.


రాకేశ్ వర్రే

## వాస్తవ ఘటనలతో...

రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. 'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించారు. ముదుగంటి క్రియేషన్స్‌పై ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నవంబరు 8న విడుదల కానుంది. ''1980 కాలంలో తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల చుట్టుపక్కల జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా 'జితేందర్ రెడ్డి'. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని, ఆ తర్వాత ఆయన రాజకీయాల్లోకి రావడం వంటి అంశాలను చూపించాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞానశేఖర్, సంగీతం: గోపీ సుందర్.


చాందినీ చౌదరి

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వద్దు

పేరు ఓరుగంటి కల్యాణి. ప్రభుత్వోద్యోగి కావాలనే లక్ష్యంతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతోంది. అయితే ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కానీ తనకు కాబోయే వరుడు ప్రభుత్వోద్యోగి అయ్యుండాలని, స్మోకింగ్, డ్రింకింగ్ అలవాట్లు ఉండకూడదని, వెజిటేరియన్ అయ్యుండాలని ఆశ పడుతుంది కల్యాణి. అంతే కాదండోయ్... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అసలే వద్దు అంటోంది. మరి... కల్యాణి ఆకాంక్షకు తగ్గ వరుడు దొరికాడా? లేదా అనేది 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాలో చూడొచ్చు. విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా ఇది. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. బుధవారం (అక్టోబరు 23) చాందినీ చౌదరీ బర్త్ డే సందర్భంగా 'సంతాన ప్రాప్తిరస్తు'లో ఓరుగంటి కల్యాణి పాత్రలో ఆమె నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''ప్రస్తుతం చాలామంది ఫేస్ చేస్తున్న సంతానలేమి సమస్య ఆధారంగా 'సంతాన ప్రాప్తిరస్తు' తీస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది'' అని తెలిపారు మేకర్స్.


రోహిణి, రమేశ్ చెప్పాల, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, నేరెళ్ల శారద

## ఇది తండ్రీ కూతుళ్ల కథ - రాజేంద్రప్రసాద్

సాయి రోనక్, ప్రజ్ఞ నగ్ర హీరో హీరోయిన్లుగా రాజేంద్రప్రసాద్, రోహిణి ఇతర కీలక పాత్రల్లో నటించిన ఫన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లగ్గం'. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ- ''మీ శ్రేయోభిలాషి' చిత్రం నుంచి రమేష్ చెప్పాలతో నాకు అనుబంధం ఉంది. నిర్మాత వేణుగోపాల్‌కు ముందే కంగ్రాట్స్ చెబుతున్నా. ఎందుకంటే ఈ సినిమాలో అంత మంచి కంటెంట్ ఉంది. 'లగ్గం' తండ్రీకూతుళ్ల కథ. అయితే ఇటీవల నా కూతుర నన్ను వదిలి వెళ్లిపోయింది'' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ''లగ్గం'తో మంచి సందేశం చెబుతున్నాం'' అన్నారు వేణుగోపాల్ రెడ్డి. ''అరిటాకులో వడ్డించిన విందు భోజనంలా 'లగ్గం' సినిమా ఉంటుంది'' అన్నారు రమేశ్. ''స్కిన్ షో చేస్తేనే సినిమా ఆడుతుందని భావించే ఈ రోజుల్లో ఎలాంటి స్కిన్ షో లేకుండా ఈ సినిమా తీశారు. ఈ తరహా సినిమాలను ఆడియన్స్ ప్రోత్సహించాలి'' అన్నారు తెలంగాణ ఉమెన్ కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద. ఈ కార్యక్రమంలో నటి రోహిణి, సప్తగిరి మాట్లాడారు.


అనూ ఇమ్మాన్యుయేల్

## థ్రిల్ స్టార్టట

అనూ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రలో, శివ కందుకూరి మరో లీడ్ రోల్ ఓ థ్రిల్లింగ్ మూవీ తెరకెక్కుతోంది. సినిమాటోగ్రాఫర్ ఆంద్రూ బాబు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మై 3 ఆర్ట్స్ పతాకాలపై లండన్ గణేష్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల నిర్మిస్తున్న సినిమా ఇది. బుధవారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, లండన్ లొకేషన్స్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని యూనిట్ తెలిపింది. ''ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం'' అని దర్శక-నిర్మాతలు తెలిపారు. వైవా హర్ష, వెన్నెల కిశోర్, ఎస్. నివాసిని, 'షకలక' శంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.


శివకుమార్, నితిన్ ప్రసన్న

## భావోద్వేగాల నటన

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డా. సింధు రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా శివకుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ- ''ఈ సినిమాలో సంపన్న కుటుంబంలో పుట్టిన సత్య అనే పాత్ర చేశాను. ఎంతో సౌకర్యవంతమైన జీవితం గడుపుతున్న సత్య కొన్ని పరిస్థితుల కారణంగా కేరళలోని ఓ అజ్ఞాత ప్రదేశానికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ సత్యకు ఎవరు తోడుగా నిలిచారు? ఏం జరిగింది అన్నది ఈ సినిమా కథాంశం'' అన్నారు. నితిన్ ప్రసన్న మాట్లాడుతూ- ''సుహాస్ 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' సినిమాలో నెగటివ్ రోల్ చేశాను. కానీ 'నరుడి బ్రతుకు నటన'లో ఇందుకు భిన్నమైన పాత్రలో కనిపిస్తాను. మనిషి తన జీవితంలో అన్ని రకాల ఎమోషన్స్‌ను అనుభూతి చెందుతాడు. ఓ నటుడు కూడా అంతే. ఈ విషయాన్నే ఈ సినిమాలో చెప్పే ప్రయత్నం చేశాం. భావోద్వేగపూరితమైన నటన కనబర్చడానికి స్కోప్ ఇచ్చిన కథ ఇది. ఇక నాకు తెలుగు, తమిళంతో పాటు మలయాళ సినిమాల్లోనూ అవకాశాలు వస్తున్నాయి'' అని తెలిపారు.

సాక్షి బిజినెస్
గురువారం
24-10-2024

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 139 | 80,082 |
| నిఫ్టీ ▽ | 37 | 24,436 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 18,231 | ▽ 341 |
| డోజోన్స్ | 42,436 | ▽ 489 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,259 | ▽ 48 |
| డాక్స్ | 19,378 | ▽ 44 |
| షాంఘై | 3,303 | △ 17 |
| నికాయ్ | 38,105 | ▽ 307 |

అమెరికా • బ్రిటన్-జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 78,692 | △ 441 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 78,377 | △ 439 |
| వెండి (కేజీ) | 98,862 | △ 490 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 83.67 | 84.69 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 107.87 | 111.71 |
| € | యూరో | ఒకటి | 89.60 | 92.22 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 54.76 | 56.17 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 55.15 | 57.35 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.57 | 66.24 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 21.52 | 23.08 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 22.00 | 23.78 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.92 | 12.75 |

# కార్పొరేట్ జపం!

### జెడ్ అక్షరంతో మొదలయ్యే బ్రాండ్‌లు, కంపెనీల వెల్లువ

**2018 నుండి భారీగా పెరుగుదల... • కలిసొస్తున్న జెన్ జెడ్ మేనియా**
**న్యూమరాలజీ, ఆస్ట్రాలజీ పరంగానూ కనెక్ట్!**




ఆల్ఫాబెట్స్‌లో చిట్టచివరి అక్షరమే అయినా.. కొత్తగా పుట్టుకొచ్చే కంపెనీలకిపుడు 'జెడ్' తొలి ప్రాధాన్యంగా మారుతోంది. జెన్ జెడ్ ఎఫెక్ట్ కావచ్చు... మరేదైనా కారణం కావచ్చు.. 'జె'ప్రీథింగ్ 'జెడ్' అనేలా బ్రాండ్ బా'జా' మోగుతోంది. దశాబ్దకాలంగా జెడ్ కంపెనీల జోరు ఓ రేంజ్‌లో పెరుగుతూ వస్తోంది! కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2023లో 1,608 కంపెనీలు జెడ్ అక్షరంతో పురుడు పోసుకున్నాయి. 2018తో పోలిస్తే ఈ సంఖ్య ఏకంగా 70 శాతం 'జూ'మ్ అయ్యింది. మొత్తంమీద ఏర్పాటవుతున్న కొత్త కంపెనీల సంఖ్య ఏటా 9 శాతం పెరుగుతుండగా.. జెడ్ కంపెనీల జోరు 11 శాతంగా ఉంది. ఇక ఈ ఏడాది ఆగస్ట్ నాటికే 1,493 కంపెనీలు జెడ్ అక్షరంతో ఆవిర్భవించడం గమనార్హం.

**పేరులో 'జో'ష్ ఉంది...**

మన దేశంలో ఎవరికైనా.. దేనికైనా పేరు పెట్టడం అంటే పెద్ద ప్రహసనమే. వ్యక్తిగత అంశాల నుంచి, ఆచారాలు, మతాలు, జ్యోతిష్యం, సంఖ్యా శాస్త్రం ఇలా చాలా విషయాలు ప్రభావం చూపుతుంటాయి. అయితే, కంపెనీలు పేర్లు ఖాయం చేయడంలో ఈ అంశాలకు తోడు బ్రాండింగ్, మార్కెటింగ్ టెక్నిక్‌లు ఇతరత్రా బోలెడన్ని విషయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. 'మేము ఆట బొమ్మలు, పుస్తకాలు, స్టేషనరీ వ్యాపారాన్ని ప్రారంభించేటప్పుడు ఏదైనా సరదాగా ఉండే పేరు కోసం బుర్రబద్దలు కొట్టుకున్నాం. చివరకు జనాల నోళ్లలో నానేలా జిగ్‌మ్యాగ్ ఎంటర్‌ప్రైజెస్ అనే పేరును నిర్ణయించాం' అని ముంబైకి చెందిన హేతల్ సంగానీ చెబుతున్నారు. వాస్తవానికి జిగ్‌జాగ్ అని పెడదామనుకున్నా.. అది అప్పటికే వేరొకరు రిజిస్టర్ చేసుకోవడంతో జిగ్‌మ్యాగ్‌ను ఎంచుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

బ్రాండ్ పేరు పలికేటప్పుడు ఒకరకమైన జోష్ ఉండాలని కొత్తతరం ఎంట్రప్రెన్యూర్స్ కోరుకుంటున్నారు. బోరింగ్‌గా, పాత వాసనలతో ఉండకూడదనేది వారి అభిప్రాయం. 'ఈ రోజుల్లో ప్రమోటర్లు పేర్లను ఎంచుకునేటప్పుడు క్యాచీగా, ప్రత్యేకంగా, ట్రెండీగా ఉండేలా చూసుకుంటున్నారు. అంతర్జాతీయంగానూ గుర్తింపు పొందడం చాలా ముఖ్యం. ఆస్ట్రాలజీ, న్యూమరాలజీ కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆల్ఫాబెట్స్‌లో 'ఏ' అక్షరంతో కంపెనీలకు కొదవలేదు. దీంతో చివరిదైన జెడ్‌కు ఇప్పుడు ఫుల్ డిమాండ్ ఉంది' అని కంపెనీ సెక్రటరీ ఎస్ఎస్ విశ్వనాథన్ తెలిపారు. 1992లో మీడియా మొఘల్ సుభాష్ చంద్ర నెలకొల్పిన 'జీ టీవీ' గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు! ఇక కొత్తగా నెలకొల్పిన 'జీ5' ఓటీటీ కూడా బంపర్ హిట్టే!!

**జెరోధా... జోహో.. జొమాటో.. జూడియో..**
**జెప్టో... జాగిల్ ప్రీపెయిడ్.. ఇంకా చాలా పెద్ద లిస్టే ఉంది! అయితే ఏంటంటరా? జెన్ జెడ్ మేనియాతో జెడ్ (జీ) నామజపం జోరందుకుంది. జెడ్ అక్షరంతో మొదలయ్యే బ్రాండ్లు, కంపెనీల సంఖ్య ఏటికేడు ఎగబాకుతుండటమే దీనికి నిదర్శనం. పలకడానికి ఈజీగా, వినసొంపుగా... బ్రాండ్ నేమ్ కూడా ఎఫెక్టివ్‌గా ఉండటంతో వీటికి ప్రాచుర్యం పెరుగుతోంది. అంతేకాదు.. ఇటీవల జెడ్ అక్షరంతో వచ్చిన పలు బ్రాండ్లు బిజినెస్ హిట్ కొట్టి.. ఆయా రంగాల్లో జనాలకు చిరపరిచితంగా కూడా మారిపోవడం విశేషం!!**

**జెడ్ = 8**

ఇక న్యూమరాలజీ (సంఖ్యా శాస్త్రం) పరంగా కూడా జెడ్ అక్షరానికి విశిష్టత ఉందంటున్నారు నిపుణులు. జెడ్ అనేది 8 అంకెను సూచిస్తుందని... భౌతిక శక్తి, స్థిరత్వం, పరివర్తనను ఇది చాటి చెబుతుందనేది న్యూమరాలజిస్టుల మాట! దీని ఆకారం విషయానికొస్తే.. జిగ్‌జాగ్ షేపు అనేది వినూత్నత, ఆధునికతకు చిహ్నంగా ఉంటుందని.. నవతరానికి, బ్రాండింగ్, సోషల్ మీడియాలో గుర్తింపునకు కూడా ప్రాతినిధ్యం వహిస్తుందని బ్రాండింగ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జ్యోతిష్య శాస్త్రం (ఆస్ట్రాలజీ) సంగతి చూస్తే... జెడ్ అక్షరంపై గురుడు లేదా బృహస్పతి గ్రహ బలం అధికంగా ఉంటుందని గుజరాత్‌కు చెందిన ఆస్ట్రాలజర్ మనీష్ భట్ చెబుతున్నారు. 'ప్రస్తుతం గ్రహాల కదలికలు... జెడ్ అక్షరం వాడకంపై చాలా సానుకూల ప్రభావం చూపుతున్నాయి' అని భట్ వ్యాఖ్యానించారు!

**'జెడ్' ఫ్యాక్టర్!**

డిస్కౌంట్ బ్రోకరేజీగా **ఆరంభమైన** 'జెరోధా' ఇప్పుడు దేశంలో **టాప్ బ్రోకింగ్ కంపెనీగా** ఎదగడంలో జెడ్ ఫ్యాక్టర్ **కూడా బాగానే** పని చేసిందని చెప్పొచ్చు. క్విక్ **కామర్స్ సంచలనం** జెప్టో పేరు కూడా **మార్మోగుతోంది.** జీలక్స్ ఫ్యాషన్స్, జెనెర్జీ ఫుడ్స్, **జోల్డ్ అకాడమీ,** జోబుల్ ఈస్టోర్, జాయిడ్ ఏఐ, **జెలో టిక్కాల** జీస్, జిమన్స్ టూర్స్, జోఫర్స్, జింబర్ **ఇండియా,** జూజూ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, జప్నోసిస్, **జెన్‌నెక్స్ ఇండియా** ఇవన్నీ ఇటీవలి జెడ్ మేనియాలో **జస్ట్ చిన్న లిస్ట్** మాత్రమే! 'ఆల్ఫాబెట్స్‌లో కొన్ని పలికేం**దుకే కాదు..** వినేందుకు కూడా చాలా సొగసుగా **ఉంటాయి.** అలాంటి వాటిలో జెడ్ లేదా జీ కూడా **ఒకటి. అంతే** కాదు, నవతరం జెన్ జెడ్‌కు కూడా ఇది **భలే కనెక్ట్** అవుతోంది. మరీ పెద్దగా కాకుండా **నాలుగు అక్షరాలలోపు** ఉండేవి పంచింగ్‌గా ఉంటాయి' **అంటు**న్నారు బ్రాండ్ స్ట్రాటజీ స్పెషలిస్ట్ హరీష్ **బిజూర్.** జాప్, జారా, జీల్, జీబ్రా, జీ, జెన్, జెని**త్, జెస్ట్,** జెటా, జియస్, జిలియన్, జింగ్, జియా**న్, జూమ్** వంటివి వీటిలో కొన్ని.

– సాక్షి, బిజినెస్ డెస్క్

# హెచ్‌యూఎల్ లాభం డౌన్

- క్యూ2లో రూ. 2,595 కోట్లు
- మొత్తం రూ. 29 డివిడెండ్

**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) **ప్రస్తుత** ఆర్థిక సంవత్సరం **(2024–25) రెండో త్రైమాసికంలో** ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 2 శాతంపైగా క్షీణించి రూ. 2,595 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,657 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 19 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. దీనికి జతగా మరో రూ. 10 ప్రత్యేక డివిడెండ్‌ను చెల్లించేందుకు బోర్డు అనుమతించింది. దీంతో మొత్తం రూ. 29 (రూ.6,814 కోట్లు) డివిడెండ్ చెల్లించనుంది.

**ఆదాయం ప్లస్...**




తాజా క్యూ2లో హెచ్‌యూఎల్ మొత్తం టర్నోవర్ 2% పైగా బలపడి రూ. 16,145 కోట్లను తాకింది. దీనిలో ప్రొడక్టుల విక్రయాలు 2 శాతం వృద్ధితో రూ. 15,703 కోట్లకు చేరాయి. పట్టణాల్లో డిమాండ్ తగ్గినా గ్రామీణ ప్రాంతాలలో క్రమంగా పుంజుకుంటున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ రోహిత్ జావా పేర్కొన్నారు.

**ఐస్‌క్రీమ్ బిజినెస్ విడదీత..:** క్వాలిటీ వాల్స్, కార్నెటో, మ్యాగ్నమ్ బ్రాండ్లను కలిగిన ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను విడదీయనున్నట్లు హెచ్‌యూఎల్ వెల్లడించింది. స్వతంత్ర కమిటీ సలహామేరకు ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసేందుకు నిర్ణయించినట్లు హెచ్‌యూఎల్ సీఎఫ్‌వో రితేష్ తివారీ చెప్పారు.

**ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 2,658 వద్ద ముగిసింది.**

# పేటీఎంకు ఎన్‌పీసీఐ ఊరట

### కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్




**న్యూఢిల్లీ:** ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎంకు ఊరటనిస్తూ కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) అనుమతించింది. నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనలను పాటించడాన్ని బట్టి అనుమతులు ఉంటాయని ఎన్‌పీసీఐ పేర్కొన్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ (ఓసీఎల్) వెల్లడించింది. నిబంధనలను పదే పదే ఉల్లంఘించినందుకు గాను కార్యకలాపాలు నిలిపివేయాలంటూ ఈ ఏడాది జనవరిలో అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను (పీపీబీఎల్) ఆర్‌బీఐ ఆదేశించడం తెలిసిందే.

**ఎన్‌పీసీఐ అనుమతుల వార్తలతో బుధవారం ఓసీఎల్ షేరు ధర 8 శాతం లాభంతో రూ. 745 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 12 శాతం ఎగబాకింది.**

# బిగ్'సి' దీపావళి డబుల్ ధమాకా ఆఫర్లు




**హైదరాబాద్:** దీపావళి పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్'సి' డబుల్ ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.12 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.10వేల వరకు విలువైన మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా ఇవ్వనుంది. అలాగే రూ.5,999 వరకు విలువైన ఒక కచ్చితమైన బహుమతి అందిస్తుంది. వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మి మొబైళ్ల కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా కార్లు, బైక్స్, మొబైళ్లు మరెన్నో బహుమతులు గెలుచుకొనే అవకాశం ఉంది. ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైళ్ల కొనుగోలు సదుపాయం అందిస్తోంది. పండుగ ఆఫర్లను ప్రజలంతా వినియోగించుకోవాలని కంపెనీ వ్యవస్థాపకులు బాలు చౌదరి కోరారు.

# మూడో రోజూ నష్టాలే...

### సెన్సెక్స్ 139 పాయింట్లు, నిఫ్టీ 37 పాయింట్లు డౌన్



**ముంబై:** స్టాక్ సూచీలు వరుసగా మూడోరోజూ నష్టాలతో ముగిశాయి. ఆటో, ఫార్మా, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణతో బుధవారం సెన్సెక్స్ 139 పాయింట్లు నష్టపోయి 80,082 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు కోల్పోయి 24,436 వద్ద నిలిచింది. దేశీయంగా కార్పొరేట్ దిగ్గజాల సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు నిరాశపరుస్తుండటం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఒక దశలో సెన్సెక్స్ 329 పాయింట్లు కోల్పోయి 80 వేల స్థాయి దిగువన 79,892 వద్ద, నిఫ్టీ 94 పాయింట్లు పతనమై 24,378 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. మరోవైపు ఐటీ, టెక్, టెలికమ్యూనికేషన్, ఫైనాన్స్ సర్వీసెస్ షేర్లు రాణించాయి. ఇటీవల భారీగా నష్టపోతున్న చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 1%, మిడ్ క్యాప్ ఇండెక్స్ అర శాతం చొప్పున లాభపడ్డాయి. లిస్టింగ్ రోజు నిరాశపరిచిన హ్యుందాయ్ మోటార్స్ షేరు 4% లాభపడి రూ.1,897 వద్ద స్థిరపడింది.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..**
'వారీ'వా.. ఐపీవో రికార్డు!
కొనసాగుతున్న 'గోల్డ్' రన్

# భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌లో 316 అప్రెంటిస్‌లు

నాగ్‌పూర్ (మహారాష్ట్ర)లోని వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌లో.. గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 316.
- » **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–101, టెక్నీషియన్ అప్రెంటిస్–215.
- » **విభాగాలు:** మైనింగ్ ఇంజనీరింగ్, మైనింగ్ అండ్ మైన్ సర్వేయింగ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఫుల్ టైమ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- » **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000. టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000.
- » **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, సర్టిఫికెట్ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2024.
- » **వెబ్‌సైట్:** http://www.westerncoal.in

### బీఈఎల్ ఘజియాబాద్‌లో 90 డిప్లొమా అప్రెంటిస్‌లు

ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఏడాది డిప్లొమా అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 90.
- » **స్టైపెండ్:** నెలకు రూ.12,500.
- » **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఇంజనీరింగ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.11.2024.
- » **వెబ్‌సైట్:** https://bel-india.in

### రబ్బర్ బోర్డు, కొట్టాయంలో 50 యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

కొట్టాయం(కేరళ)లోని రబ్బర్ బోర్డులో యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
- » **స్టైపెండ్:** నెలకు రూ.40,000.
- » **ప్రాంతాల వారీగా ఖాళీలు:** నార్త్ ఈస్టర్న్ రీజియన్–40, ఇతర రాష్ట్రాల్లో–10(ఆంధ్రప్రదేశ్–01).
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ (అగ్రికల్చర్ / హార్టికల్చర్/ఫారెస్ట్రీ) లేదా మాస్టర్స్ డిగ్రీ (బోటనీ/ప్లాంట్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తులకు చివరితేది:** 13.11.2024.
- » **వెబ్‌సైట్:** https//rubberboard.gov.in

### తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖలో 1,080ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్)/ఏఎన్ఎం పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 27 ప్రభుత్వ/ప్రైవేటు విద్యా సంస్థల్లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్(ఫీమేల్)/ఏఎన్ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 1,040.
- » **అర్హత:** ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్మీడియట్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.





- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.10.2024.
- » **ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే తేది:** 31.10.2024.
- » **తరగతుల ప్రారంభం:** 01.11.2024.
- » **వెబ్‌సైట్:** https://chfw.telangana.gov.in

## క్యాట్.. మెరుగైన స్కోర్‌కు మార్గం!

- » నవంబర్ 24న క్యాట్-2024 ఎంట్రన్స్
- » ఐఐఎంలలో పీజీ, పీహెచ్‌డీలకు మార్గం
- » రివిజన్, ప్రాక్టీస్‌తోనే సక్సెస్

**కామన్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్యాట్!! దేశంలో మేనేజ్‌మెంట్ విద్యలో.. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లలో.. ఎంబీఏ, పీహెచ్‌డీ, ఇతర మేనేజ్‌మెంట్ పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఏటా రెండు లక్షల మంది వరకు పోటీ పడుతున్న వైనం! ఈ ఏడాది నవంబర్ 24న క్యాట్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షలో మెరుగైన స్కోర్ సాధించేందుకు మార్గాలపై కథనం.**




క్యాట్–2024కు దాదాపు రెండు లక్షల మందికి పైగా పోటీ పడే అవకాశముంది. ఈ స్కోర్‌తో ఐఐఎంలతోపాటు పలు ప్రముఖ బి-స్కూల్స్‌లో కూడా మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. దీంతో ప్రతి ఏటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. క్యాట్ ద్వారా ఐఐఎంలో అడుగు పెట్టాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**నెల రోజుల ప్లాన్**

క్యాట్–2024ను నవంబర్ 24న నిర్వహించనున్నారు. అంటే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం 30 రోజులు మాత్రమే. ఈ సమయంలో విస్తృత అధ్యయనం బదులు రివిజన్, ప్రాక్టీస్, అనాలిసిస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం మేలు. నెల రోజుల ప్లాన్‌ను సిద్ధం చేసుకొని.. అందుకనుగుణంగా ఏకాగ్రతతో ప్రిపరేషన్ సాగించాలి.

**మూడు విభాగాలు.. రెండు గంటలు**

క్యాట్‌ను మూడు సెక్షన్లుగా రెండు గంటల వ్యవధిలో నిర్వహిస్తామని నిర్వాహక ఇన్‌స్టిట్యూట్ ఐఐఎం-బెంగళూరు పేర్కొంది. ఇందులో వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ (24 ప్రశ్నలు); డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ (20 ప్రశ్నలు); క్వాంటిటేటివ్ ఎబిలిటీ (22 ప్రశ్నలు) విభాగాలపై ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగానికి 40 నిమిషాల సమయం ఉంటుంది. అదే విధంగా ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంటుంది. ఐఐఎంలు.. క్యాట్‌లో సెక్షనల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నాయి. ప్రతి సెక్షన్‌లో నిర్దిష్ట మార్కులు పొందితేనే సదరు దరఖాస్తులను తదుపరి దశకు పరిశీలనలోకి తీసుకుంటారు.

**పెరుగుతున్న క్లిష్టత**

ఇటీవల కాలంలో క్యాట్‌లో ప్రశ్నల క్లిష్టత స్థాయి పెరుగుతోంది. గత ఏడాది వీఏఆర్‌సీ, డీఐఎల్‌ఆర్ నుంచి అడిగిన ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని నిపుణులు, పరీక్షకు హాజరైన అభ్యర్థులు చెప్పారు. డీఐఎల్‌ఆర్ సమాధానాలు సాధించేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సిన రావడంతో సమయాభావ సమస్య ఎదురైంది. ఒకే రోజు మూడు స్లాట్లలో జరిగే పరీక్షలో ఒక స్లాట్‌లో ప్రశ్నలు కొంత సులభంగా, మరో స్లాట్‌లో కొంత క్లిష్టంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రశ్నల క్లిష్టత స్థాయి ఎలా ఉన్నా.. సమాధానాలు ఇచ్చే విధంగా సన్నద్ధత పొందాలని సూచిస్తున్నారు.

**సమయ పాలన, సబ్జెక్ట్ విభజన**

పరీక్షలో ప్రతి సెక్షన్‌ను 40 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది.కాబట్టి అభ్యర్థులు తమ వ్యక్తిగత సామర్థ్యాల ఆధారంగా టైం మేనేజ్‌మెంట్ పాటించాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో ప్రతి రోజు ప్రతి సెక్షన్‌కు మూడు గంటలు చొప్పున కేటాయించాలి. సిలబస్‌లో ఇప్పటికీ పూర్తి చేయని అంశాలుంటే.. వాటిని అక్టోబర్ చివరి నాటికి ముగించేలా ప్రిపరేషన్ కొనసాగించాలి మూడు సెక్షన్లకు మూడు గంటలు చొప్పున 9 గంటలు; వారానికి రెండు మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరయ్యే విధంగా వ్యవహరించాలి.

**మొదటి వారం నుంచి రివిజన్**

నవంబర్ మొదటి వారం నుంచి పూర్తిగా రివిజన్‌కే కేటాయించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాల ప్రిపరేషన్‌ను పూర్తి చేయకపోయినా.. వాటి గురించి ఆలోచించకూడదు. పూర్తి చేసిన అంశాలపైనే మరింత పట్టు సాధించేలా ప్రాక్టీస్ చేయాలి. ఇప్పటి నుంచి కనీసం 10 నుంచి 12 మాక్ టెస్ట్‌లకు హాజరై.. వాటిలో ప్రదర్శన తీరును విశ్లేషించుకోవాలి. దాని ఆధారంగా బలహీనంగా ఉన్న అంశాలపై కొంత ఎక్కువ దృష్టి పెట్టాలి. అన్ని సబ్జెక్ట్‌లకు ప్రిపరేషన్ పరంగా సమతుల్యత పాటించే విధంగా వ్యవహరించాలి.

**స్పీడ్ కాలిక్యులేషన్ స్కిల్స్**

పరీక్ష రోజున వీలైనంత ఎక్కువ సమాధానాలు గుర్తించేందుకు తోడ్పడేలా వేగం పెంచుకోవాలి. రీడింగ్, కాలిక్యులేషన్స్‌లలో స్పీడ్ ప్రాక్టీస్ చాలా అవసరం. ఈ సారి ఆన్ స్క్రీన్ కాలిక్యులేటర్ సదుపాయం ఉంది. అయితే దీని ఆధారంగా అన్ని కాలిక్యులేషన్స్ చేయొచ్చు అనే ధోరణి సరికాదు. ప్రతిదానికి ఆన్ స్క్రీన్ కాలిక్యులేటర్‌పై ఆధారపడితే సమయం వృథా అవుతుంది. కాబట్టి మెంటల్ కాలిక్యులేషన్ స్పీడ్ పెంచుకోవాలి.

**వెర్బల్ ఎబిలిటీ**

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రాణించడానికి రీడింగ్ ప్రాక్టీస్ చాలా ముఖ్యం. కారణం.. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉండే విభాగమిది. ఒక నిర్దేశిత ప్యాసేజ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నల్లోనూ అధిక శాతం ప్యాసేజ్ సారాంశం అర్థమైతేనే సమాధానం ఇవ్వగలిగేవిగా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు స్పీడ్ రీడింగ్ అలవాటుతోపాటు ఒక టాపిక్‌ను చదువుతున్నప్పుడే అందులోని కీలక అంశాలను గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకూ.. అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్ అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌లలో వినియోగించిన పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది.

**రీడింగ్ కాంప్రహెన్షన్**

క్యాట్‌లో మిగతా విభాగాలతో పోల్చితే కొంత ఎక్కువ స్కోరు సాధించడానికి అవకాశం ఉన్న విభాగం.. రీడింగ్ కాంప్రహెన్షన్. ఇందులో మంచి స్కోర్ కోసం అభ్యర్థులు ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం అలవర్చుకోవాలి. చదివేటప్పుడు అందులోని ముఖ్య సమాచారం, ప్రశ్నార్హమైన అంశాలు, కీలక పదాలు గుర్తించే నేర్పు సొంతం చేసుకోవాలి. అందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదవాలి. వీటిని చదివిన తర్వాత సొంతంగా క్లుప్తంగా సారాంశాన్ని రాసుకోవాలి. వొకాబ్యులరీని పెంచుకోవడం వెర్బల్ ఎబిలిటీలో ఎంతో ఉపయుక్తం. ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. ప్రిఫిక్స్, సఫిక్స్ విధానంలో వర్డ్ లెర్నింగ్ వొకాబ్యులరీపై పట్టు సాధించేందుకు దోహదపడుతుంది. ప్రతి రోజు కనీసం 20 నుంచి 30 కొత్త పదాలను నేర్చుకోవాలి. ఆయా పదాల యూసేజ్‌పైనా అవగాహన పెంచుకోవాలి.

**డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్**

గ్రాఫ్‌లు, చార్ట్‌లు ఆధారంగా వాటిలో ఇచ్చిన డేటాకు సంబంధించిన ప్రశ్నలు అడిగే విభాగం.. డేటా ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో అధిక శాతం ప్రశ్నలు అభ్యర్థులు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. అంటే.. గ్రాఫ్‌లు, చార్ట్‌లలో ఇచ్చిన దత్తాంశాలపై నేరుగా ప్రశ్నలు అడగకుండా సంబంధిత కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని ఏ ఫార్ములా ఆధారంగా సమాధానం కనుక్కోగలమనే విధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. ఇందుకోసం పర్సంటేజెస్, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

**క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్**

మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ అంశాలు ఉండే ఈ సెక్షన్‌లో రాణించడానికి ముఖ్యమైన వ్యూహం వేగం. అందులోనూ కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగే నేర్పు సొంతం చేసుకోవాలి. నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు ప్రాబబిలిటీ అండ్ పెర్ముటేషన్స్/ కాంబినేషన్స్, నెంబర్స్, అల్‌జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి.

వీటికి సంబంధించిన బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాస్తవానికి క్యాట్‌లో ఎదురయ్యే ప్రశ్నల్లో పది శాతం మేర ప్రశ్నలు బేసిక్స్ ఆధారంగా సొంత ఆలోచనతో చేయాల్సిన విధంగా ఉంటాయి. వీటికోసం పరీక్షలో ఎక్కువ సమయం వృథా అవుతుంది. కాబట్టి ఇలాంటి ప్రశ్నలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా.. బేసిక్స్ ఆధారంగా ఉండే ప్రశ్నలపై దృష్టి సారించాలి. ఫార్ములా బేస్డ్ ప్రశ్నల సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నల ప్రాక్టీస్ చేయడం మేలు.

**క్యాట్-2024 ముఖ్య సమాచారం**

- ✦ నవంబర్ 24న క్యాట్ పరీక్ష
- ✦ 21 ఐఐఎంలలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం.
- ✦ అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: నవంబర్ 5 నుంచి 24 వరకు
- ✦ ఫలితాల వెల్లడి: 2025 జనవరిలో
- ✦ వివరాలకు వెబ్‌సైట్: https://iimcat.ac.in

# మూడు నగరాల ముచ్చట

- రూ.5 లక్షల కోట్ల వ్యయంతో 3 స్మార్ట్ సిటీల అభివృద్ధి
- ఫ్రీ ఎకనామిక్ జోన్‌గా దక్షిణ కొరియాలోని ఇంచియాన్
- ముచ్చర్లలో ఫ్యూచర్ సిటీ నేపథ్యంలో పరిశీలన.. అభివృద్ధి ప్రణాళికలపై అధ్యయనం





మంత్రులు పొంగులేటి, పొన్నంకు జ్ఞాపిక అందజేస్తున్న ఏఐ సిటీ ప్రతినిధి.. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్మార్ట్ సిటీని పరిశీలిస్తున్న అధికారులు

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి దోకూరి వెంకటేశ్వర్‌రెడ్డి)

ఈశాన్య ఆసియాలో దక్షిణ కొరియాను ఆర్థిక హబ్‌గా నిలపాలన్న లక్ష్యంతో 2003లో ది ఇంచియాన్ ఫ్రీ ఎకనామిక్ జోన్ (ఐఎఫ్ఈజెడ్)ను ఏర్పాటు చేశారు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగు పర్చడమే దాని ప్రధాన ఉద్దేశం. ఇక్కడే రూ.5 లక్షల కోట్ల వ్యయంతో మూడు అంతర్జాతీయ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేశారు. మూసీ పునరుజ్జీవం, ముచ్చర్లలో ఫ్యూచర్ సిటీ బృహత్తర ప్రాజెక్టులపై అధ్యయనానికి రాష్ట్ర మంత్రుల బృందం దక్షిణ కొరియాలోని సియోల్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మూడో రోజైన బుధవారం ఇంచియాన్ నగరంలో అభివృద్ధి చేసిన 3 అంతర్జాతీయ స్మార్ట్ సిటీలను మంత్రులు, అధికారుల బృందం పరిశీలించింది. పనిలోపనిగా స్టోర్స్ యూనివర్సిటీని కూడా సందర్శించింది. సాంగ్డో నగరంలో ఐటీ, బయోటెక్నాలజీ (బీటీ), సేవల పరిశ్రమలు, చెయోంగ్నాలో ఫైనాన్స్, హైటెక్ ఇండస్ట్రీలు, యోంగ్‌జోంగ్‌లో లాజిస్టిక్, టూరిజం పరిశ్రమ లను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం 122.34 చదరపు కిలోమీటర్లు (చ.కి.మీ.) విస్తీర్ణంలో ఉన్న ఈ మూడు నగరాల్లో 5,43,653 జనాభా నివాసం ఉంటోంది.

## 3 గంటల్లో ఇతర నగరాలకు..

ఇంచియాన్ నుంచి షాంఘై, బీజింగ్, హాంగ్‌కాంగ్ వంటి నగరాలకు మూడు గంటల్లో చేరుకోవచ్చు. దీంతో ఎగుమతి, దిగుమతి కేంద్రాలకు ఇంచియాన్ నిలయంగా మారింది. పబ్లిక్, మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్‌లతో పాటు ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఓడరేవు, ఫెర్రీ టెర్మినల్స్‌తో మెరుగైన రవాణావ్యవస్థ ఉంది. ఇంచియాన్‌లోని అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఉండటంతో పరి శ్రమ అవసరాలకు తగ్గిన నిపుణులు, నైపుణ్య మున్న ఉద్యోగులకు కొరతే లేదు. అన్ని రకాల మౌలిక సదుపాయాలున్న స్థలాలు, దీర్ఘకాలంపాటు లీజు, నిర్మాణ వ్యయంలో రాయితీలు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ (ఐపీ) భద్రత, విదేశీ సంస్థలకు ప్రత్యేక పన్ను మినహాయింపులు వంటివి అందిస్తున్నారు.

## స్టార్టప్ పార్క్..

ఇప్పటివరకు ఐఎఫ్ఈజెడ్‌లో 14.8 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లు వచ్చాయి. ఇందులో 206 గ్లోబల్, 3,481 స్థానిక సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సెమీ కండక్టర్లు, రోబో, డ్రోన్ వంటి పరిశ్రమలకు చెందిన సంస్థలతో పాటు గ్రీన్ క్లైమెట్ ఫండ్ (జీసీఎఫ్) వంటి ఐక్యరాజ్య సమితికి చెందిన 15 కార్యాలయాలున్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువతను ఆకర్షించేందుకు ఇంచియాన్ నగరంలో స్టార్టప్ పార్క్‌ను కూడా నెలకొల్పారు. ప్రస్తుతం ఇందులో 422 స్టార్టప్స్ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సుమారు 208 బిలియన్ వాన్ నిధులను సమీకరించాయి. ఇంచియాన్ గ్లోబల్ క్యాంపస్‌తో పాటు 6 కొరియన్ వర్సిటీలు, విదేశీ విశ్వవిద్యాలయాలున్నాయి.

### సాంగ్డో: ఐటీ, బీటీ, సేవల పరిశ్రమలు

| | |
|---|---|
| జనాభా: | 2,65,611 |
| గృహాలు: | 1,04,112 |
| ప్రాజెక్ట్ వ్యయం: | రూ.1.2 లక్షల కోట్లు |
| ప్రాజెక్ట్ విస్తీర్ణం: | 53.36 చ.కి.మీ. |

నగరం గురించి క్లుప్తంగా: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బయోటెక్నాలజీ (బీటీ)రంగాల కోసంసాంగ్డో నగరాన్ని అభివృద్ధి చేశారు. బయో పరిశోధన సంస్థలు, అంతర్జాతీయ ఆస్పత్రితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల కోసం రిక్రియేషనల్ సెంటర్ కూడా ఉంది.

### చెయోంగ్నా: ఫైనాన్స్, హైటెక్ ఇండస్ట్రీ

| | |
|---|---|
| జనాభా: | 98,060 |
| గృహాలు: 3 | 6,184 |
| ప్రాజెక్ట్ వ్యయం: | రూ.40 వేల కోట్లు |
| ప్రాజెక్ట్ విస్తీర్ణం: | 17.80 చ.కి.మీ. |

నగరం గురించి క్లుప్తంగా: ఫైనాన్స్, అనుబంధ పరిశ్రమల కోసం చెయోంగ్నా అంతర్జాతీయ నగరాన్ని అభివృద్ధి చేశారు.ఇందులో రోబోట్ థీమ్ పార్క్‌తో పాటు రోబోట్ ఆర్అండ్‌డీ, రోబో ఉత్పత్తుల తయారీ కేంద్రాలు, రీసెర్చ్ కాంప్లెక్స్‌లు కూడా ఉన్నాయి. స్థానికులు, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు టూరిజం కాంప్లెక్స్ కూడా ఉంది.

### యోంగ్‌జోంగ్: లాజిస్టిక్, టూరిజం పరిశ్రమలు

| | |
|---|---|
| జనాభా: | 1,79,982 |
| గృహాలు: | 69,815 |
| ప్రాజెక్ట్ వ్యయం: | రూ.80 వేల కోట్లు |
| ప్రాజెక్ట్ విస్తీర్ణం: | 51.18 చ.కి.మీ. |

నగరం గురించి క్లుప్తంగా: అంతర్జాతీయ కార్గో సేవలు, ఏవియేషన్ లాజిస్టిక్ కేంద్రంగా యోంగ్‌జోంగ్ నగరాన్ని అభివృద్ధి చేశారు. వైమానిక శిక్షణ సంస్థలు, తయారీ, పరిశోధన కేంద్రాలున్నాయి. కొరియన్ రిసార్ట్‌తో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా ప్రభుత్వ అధికారులు

- విద్య, వైద్య, రెవెన్యూ విభాగాలకూ భాగస్వామ్యం
- శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందీప్ శాండిల్య



సాక్షి, హైదరాబాద్: మాదకద్రవ్యాల రహిత తెలంగాణ సాధన కోసం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) అనేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే విద్యా సంస్థల్లో ప్రహరీ క్లబ్స్‌గా పిలిచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. తాజాగా మరో అడుగు ముందుకు వేస్తూ వివిధ ప్రభుత్వ విభాగాలనూ ఈ మిషన్‌లో భాగస్వాముల్ని చేస్తోంది. యువతలో డ్రగ్స్ వినియోగం గుర్తింపు, నిరోధం, వారిలో అవగాహనకు తీసుకోవాల్సిన చర్యలు, రీహాబిలిటేషన్‌పై విద్య, వైద్య ఆరోగ్య, రెవెన్యూ విభాగాలతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లకూ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ అధికారులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా మార్చనుంది. ప్రభుత్వ విభాగాలకు సంబంధించి తొలి విడతలో 940 మందికి ఏర్పాటు చేసిన అవగాహన శిబిరానికి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వేదికైంది. ఈ కార్యక్రమాన్ని టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య బుధవారం ప్రారంభించారు. 4 రోజుల పాటు ఈ శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం రాష్ట్రంలో 16,477 విద్యా సంస్థల్లో ప్రహరీ క్లబ్స్ ఏర్పాటయ్యాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లతో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీలు, పాలిటెక్నిక్, ప్రొఫెషనల్ సంస్థలు ఉన్నాయి. మెడికల్, పీజీ కాలేజీల్లోనూ ఇవి పని చేస్తున్నాయి. మిగిలిన విద్యా సంస్థల్లోనూ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. మాదకద్రవ్యాలపై పోరుకు పోలీసుల బలం, బలగం మాత్రమే సరిపోదు. ఈ క్రతువులో ఎన్జీఓలు, విద్యా శాఖలోని అధికారులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు తదితరులు కూడా భాగ స్వాములు కావాలి. ప్రస్తుతం రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉంది.ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో 4 శాతం, పోలీసులు నమోదు చేసిన వాటిలో 11 శాతం మాత్రమే నేర నిరూపణ అవుతున్నాయి. ఇది కూడా మాదకద్రవ్యాల వినియోగం పెరగడానికి కారణమవుతోంది. ఈ కేసుల్లో శిక్షల శాతం పెంచడానికి అవసరమైన అన్ని స్థాయిల వారికి శిక్షణలు ఇస్తున్నాం. విద్యా సంస్థలకు చెందిన 16,500 మంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌కు చెందిన 2 లక్షల క్యాడెట్లతో పాటు ఆశావర్కర్లు, అంగన్వాడీలకు డ్రగ్స్ నిరోధానికి సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నాం' అని వెల్లడించారు.

# రెండు వారాల్లో 599 సింగరేణి పోస్టుల భర్తీ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థలో 599 పోస్టుల భర్తీ ప్రక్రియను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని అధికారులను సీఎండీ బలరామ్ ఆదేశించారు. 272 పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన సమీక్షించారు. పారదర్శకంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వైద్య పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 300 మంది కారుణ్య నియామక అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

# అనుక్షణం భయం..భయం!

- ఉత్తర, దక్షిణ కొరియా సరిహద్దుల్లో ఇదీ పరిస్థితి
- ఇరువైపులా భారీగా బలగాల మోహరింపు
- డీఎంజెడ్ ప్రాంతంలో మాత్రమే కాస్త ప్రశాంతత

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేకప్రతినిధి)

ఉత్తరకొరియా, దక్షిణకొరియాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత శత్రుత్వం ఉంటుంది. అలాంటిది ఇరుదేశాల సరిహద్దులో పరిస్థితులు ఎలా ఉంటాయి.. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అన్ని దేశాల మధ్య సరిహద్దుల్లా కాకుండా ఈ రెండు దేశాల మధ్య సరిహద్దు కాస్త భిన్నంగా ఉంటుంది. అదేంటో తెలుసుకుందాం. సియోల్ పర్యటనలో ఉన్న మీడియా ప్రతినిధులు సరిహద్దు డీమిలిటరైజ్డ్ జోన్ (డీఎంజెడ్)ను సందర్శించారు. అక్కడి పరిస్థితులను నేరుగా పరిశీలించారు. సందర్శన సమయంలోనే అక్కడ బాంబుల మోత మోగింది. ప్రతిక్షణం ఇరు దేశాల సైనికులు కయ్యానికి కాలు దువ్వుతూ ఉంటారని, అది సర్వసాధారణమని అక్కడి సైనికాధికారులు పేర్కొంటున్నారు.

**రెండు దేశాలను వేరు పరిచేదే డీఎంజెడ్..**

ఇరు దేశాలను సమానంగా ఈ డీఎంజెడ్ వేరుపరుస్తుంది. 4 కిలోమీటర్ల వెడల్పు, 258 కిలోమీటర్ల పొడవుతో ఈ సరిహద్దు ప్రాంతం విస్తరించి ఉంది. ఇరువైపులా భారీస్థాయిలో విద్యుత్ కంచెలు ఏర్పాటు చేశారు. ఈ డీఎంజెడ్‌కు రెండువైపులా ప్రపంచంలోకెల్లా అత్యంత భారీ స్థాయిలో సైనికులను మోహరించారు. డీఎంజెడ్‌లో మాత్రం సైనికులెవరూ ఉండరు. ఎలాంటి సైనిక కార్యకలాపాలు మాత్రం జరగవు. 1953లో ఇక్కడ సైనిక తటస్థ ప్రాంతం (డీఎంజెడ్) ఏర్పాటు చేశారు. ప్రచ్ఛన్నయుద్ధం జరిగిన సమయంలోనే ఉత్తర కొరియా,



డీఎంజెడ్ ప్రాంతం

దక్షిణ కొరియా మధ్య సరిహద్దుగా ఉండేది. అయితే 1953లో ఇరుదేశాల మధ్య అమెరికా, చైనా కలిసి శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ప్రయత్నించాయి. రెండుదేశాలు ఇప్పటికీ అంగీకరించలేదు. కానీ డీఎంజెడ్ ప్రాంతంలో మాత్రం ఎలాంటి సైనిక చర్య ఉండదు. ఇదే ప్రదేశంలో 1635 మీటర్ల పొడవు, 1.95 మీటర్ల ఎత్తు, 2.1 మీటర్ల వెడల్పుతో ఓ టన్నెల్ కూడా ఉంది. ఈ సొరంగాన్ని ఉత్తర కొరియా సైనికులు సియోల్‌పై దాడి చేసేందుకు తవ్వారని చెబుతారు. ఇది పూర్తి కాకముందే ఐక్యరాజ్య సమితి పోలీసు అధికారులు గుర్తించి ఉత్తర కొరియాను హెచ్చరించారట. అయితే తొలుత అసలు ఈ సొరంగాన్ని తవ్వలేదని ఉత్తర కొరియా బుకాయించినా.. చివరకు అది గనుల తవ్వకాల్లో భాగంగా తవ్వామని మాట మార్చిందని అక్కడి పర్యాటకుల సందేశంలో రాసి ఉంది. డీఎంజెడ్‌తో పాటు ఈ సొరంగాలను చూసేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. హిల్ పాయింట్ వ్యూ నుంచి ఉత్తర కొరియాతోపాటు దక్షిణకొరియా గ్రామాలను వీక్షించొచ్చు. కాకపోతే చాలా కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. చిన్న ఫొటో కూడా తీసుకోవడానికి అనుమతివ్వరు.

# ఎవరెస్టుపై చౌటుప్పల్ చిన్నోడు



చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన యువకుడు గోశిక సంపత్‌కుమార్ ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించాడు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గోశిక బాలరాజు కుమారుడైన సంపత్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ ఏడాది బీటెక్ పూర్తి చేశాడు. 20 మంది మిత్రులతో కలిసి పర్వతారోహణ నిమిత్తం 12రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరాడు. శనివారం ఎవరెస్ట్ పర్వతం అధిరోహించి భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మంగళవారం కిందకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా సంపత్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో ఎవరెస్ట్‌ను అధిరోహించాలన్న కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశాడు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 



## గవర్నర్‌తో ఉప కులపతుల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కొత్తగా నియమితులైన ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ వారితో కలిసి తేనేటి విందులో పాల్గొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఎస్‌కే మహమ్మూద్, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ప్రొఫెసర్ జీఎన్ రావు (పాలమూరు), ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి (కాకతీయ), ప్రొఫెసర్ కుమార్ మొగలారం (ఉస్మానియా), ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ (శాతవాహన), ప్రొఫెసర్ నిత్యానందరావు (తెలుగు వర్సిటీ), ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ (మహాత్మాగాంధీ), ప్రొఫెసర్ యాదగిరి రావు (తెలంగాణ) తదితరులున్నారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సీతక్క

## నేడు టీపీసీసీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమావేశం గురువారం గాంధీభవన్‌లో జరగనుంది. సమావేశానికి ఏఐసీసీ సోషల్‌మీడియా చైర్‌పర్సన్ సుప్రియా శ్రీనాటే, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు సోషల్ మీడియా వలంటీర్లు పాల్గొంటారని టీపీసీసీ సోషల్‌మీడియా కమిటీ చైర్మన్ మన్నె సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సంక్షేమ కార్యక్రమాలకు చేయూతనివ్వండి

### ‘ప్రగతిపథంలో ప్రజా పాలన’ పుస్తకావిష్కరణలో మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉండే కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలందరూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు చేయూతనివ్వాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు కోరారు. ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి రూపొందించిన 80 పాటల సంకలనం ‘ప్రగతిపథంలో ప్రజా పాలన’ పుస్తకాన్ని ఆయన బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిక్షణం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్నదని, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, యువత, దళిత, బహుజన వర్గాల ఆర్థిక, సామాజిక వికాసం కోసం విప్లవాత్మకమైన పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తోందని చెప్పారు. ఈ పథకాలన్నీ ప్రజలకి చేరవేయడంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక సారథి కళాకారులు రూపొందించిన పాటలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గృహలక్ష్మి, గృహ జ్యోతి, ఉచిత బస్సు పథకం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, యువకులకి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, పోటీ పరీక్షల సక్రమ నిర్వహణ వంటి కార్యాచరణ ద్వారా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజా అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

## తెలంగాణది సుసంపన్నమైన సంస్కృతి

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, వారసత్వం, కళలు, హస్తకళలతో సుసంపన్నమైన రాష్ట్రమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన మీడియా ప్రతినిధుల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నిర్వహించే ‘ప్రెస్ టూర్’లో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని వివిధ పత్రికలకు చెందిన సుమారు పన్నెండు మంది పాత్రికేయులు తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఈ ప్రతినిధుల బృందానికి పీఐబీ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, శ్రీనగర్ పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ తారిఖ్ రాథర్ నేతృత్వం వహిస్తున్నారు. ఎక్సెల్సియర్, ఏషియన్ మెయిల్, కశ్మీర్ మోనిటర్, గద్యాల్, కశ్మీర్ అబ్జర్వర్, గ్రేటర్ కశ్మీర్, స్టేట్ టైమ్స్, దైనిక్ స్టేట్ సమాచార్, ఉడాన్ వంటి జమ్మూకశ్మీర్ దినపత్రికలకు చెందిన పాత్రికేయులు ఈ బృందంలో ఉన్నారు. పీఐబీ ప్రతినిధి బృందంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మీడియా, కమ్యూనికేషన్ అధికారి వి.గాయత్రి, ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ శివచరణ్‌రెడ్డి తదితరులున్నారు.

## వైద్యుల సంఘం తొలి సమావేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మొట్టమొదటి కార్యవర్గ సమావేశాన్ని బుధవారం కోఠిలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ప్రిన్సిపల్ ఆఫీస్ బేరర్స్ రాష్ట్ర. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్‌తో పాటు సెంట్రల్ కమిటీ సభ్యులు వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్య క్ష, కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని వైద్యభవన్‌ను పునరుద్ధరించి త్వరలోనే వైద్యులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించిన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణా రావు, డాక్టర్ దీనదయాళ్, డాక్టర్ కల్యాణ్, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ రాజు, డాక్టర్ రాం సింగ్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ కవి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుల భర్తీకి వినతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాస్పత్రుల్లో రేడియోగ్రాఫర్, డార్క్‌రూమ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఈ పోస్టులను భర్తీ చేయక పోవడంతో 300కు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈమేరకు బుధవారం గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖిలో భాగంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## పోరుతోనే బకాయిల సాధన

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బకాయిలను పోరాడి సాధించుకోవాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. నవంబర్ 4న నిర్వహించనున్న చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడినుంచి పోరుబాటను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో తండాలోని మొదటి ఉపాధ్యాయుడు చంద్రమౌళి (ఫైల్)



తండావాసులతో బీల్యా నాయక్





రూప్లానాయక్ తండా వ్యూ

# చదువుల తండా

**వందలోపు కుటుంబాలు... దాదాపు అందరూ ఉద్యోగులే**

**కానిస్టేబుల్ నుంచి కలెక్టర్ వరకు... ప్రతీ ఇంట్లో డాక్టర్, ఇంజనీర్**

**ఏడు దశాబ్దాల క్రితమే రూప్లానాయక్ తండాలో విద్యా కుసుమాలు**

సాక్షి, మహబూబాబాద్: లంబాడ తండాలు అంటే అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటాయని అనుకుంటారు. కానీ ఏడు దశాబ్దాల క్రితమే ఆ తండా అక్షరాస్యతతో అభివృద్ధి దిశగా పయనించింది. మహబూబాబాద్ జిల్లాలోని సీరోలు మండలం రూప్లానాయక్ తండా (కలెక్టర్ తండా)లో కానిస్టేబుల్ నుంచి కలెక్టర్ వరకు కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో దాదాపు అన్ని విభాగాలు, దేశ విదేశాల్లో.. డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు ఇలా అన్ని రంగాల్లో రాణించారు.

### జలపతినాయక్ నుంచి చదువుల ప్రస్థానం

భారతదేశాన్ని బ్రిటీష్ వారు పాలిస్తున్న కాలంలో బానోత్, తేజావత్ కుటుంబాలకు చెందినవారు సీరోలు గ్రామానికి సమీపంలో తండాను ఏర్పాటు చేశారు. ఈ తండాకు చెందిన జలపతినాయక్ అప్పటి మదరాసాల్లో ఉర్దూ మీడియంలో ఐదోతరగతి వరకు చదువుకొని సమీపంలోని చింతపల్లి గ్రామ పోలీస్ పటేల్‌గా ఉద్యోగం చేశారు. ఆయన్ను చూసి తండాకు చెందిన బానోత్ చంద్రమౌళినాయక్ హెచ్ఎస్సీ చదివి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరారు.. ఇలా మొదలైన తండాలో విద్యా ప్రస్థానం.. పిల్లలను పనికి కాకుండా బడికి పంపించడం అలవాటుగా మారింది. ఒకరిని చూసి ఒకరు పిల్లలను పక్కనే ఉన్న కాంపెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. ఆపై మహబూబాబాద్, అక్కడి నుంచి హైదరాబాద్ వరకు పిల్లలను పంపించి ఉన్నత చదువులు చదివించారు.

### అప్పుడు 20...నేడు 80 కుటుంబాలు





రూప్లాతండా ప్రభుత్వ పాఠశాల

మొదట 20 కుటుంబాలుగా ఉన్న రూప్లాతండా ఇప్పుడు 80 కుటుంబాలకు చేరింది. జనాభా 150 మంది ఉండగా, వీరిలో దాదాపు 90 శాతం మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగులుగా, జాతీయ అంతర్జాతీయ రంగాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. తండాకు చెందిన జలపతినాయక్‌కు ఎనిమిది మంది కుమారులు, ఎనిమిది మంది కుమార్తెలు.. వారి కుటుంబాల్లో మొత్తం 13 మంది డాక్టర్లు, ఒక ఐపీఎస్, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్, ఫార్మా, డిఫెన్స్, యూనివర్సిటీ ప్రొఫెసర్లుగా ఉన్నారు. చంద్రమౌళినాయక్ నలుగురి సంతానంలో యూఎస్, ఇతర దేశాల్లో స్థిరపడినవారు, డాక్టర్లు ఉన్నారు. బీమ్లానాయక్ కుటుంబానికి చెందిన రాంచంద్రునాయక్ లంబాడ నుంచి మొదటగా ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. రామోజీనాయక్ కుటుంబం నుంచి రమేష్‌నాయక్ ఐపీఎస్ కాగా, డిఫెన్స్, ఎయిర్‌ఫోర్స్, డాక్టర్లు ఇలా ఉన్నత చదువులు, అత్యున్నత ఉద్యోగాలు సాధించిన వారూ ఉన్నారు. ఇలా ఇప్పటి వరకు ఆ తండా నుంచి ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, 20 మంది డాక్టర్లు, 25 మంది ఇంజనీర్లు, 10 మంది విదేశాల్లో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడ్డారు. ఆరుగురు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో, మరో పది మంది ఫార్మా కంపెనీల్లో పనిచేస్తుండగా, హైదరాబాద్, ఖమ్మం, ఢిల్లీ ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు చేస్తుండగా, మిగిలిన వారిలో కూడా చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

### తండాలో పుట్టినందుకు గర్వంగా ఉంది



నలభై సంవత్సరాల క్రితం నేను బడికి పోతుంటే అందరూ హేళన చేసేవారు. కానీ మా నాన్న ఉపాధ్యాయుడు కావడంతో నన్ను పట్టుదలతో చదివించారు. అప్పటివరకు మా లంబాడ ఇళ్లలో డాక్టర్ చదవం నాతోటే మొదలైంది. ఈ తండాలో పుట్టినందుకు గర్వంగా ఉంది.

– కళావతిబాయి, ఖమ్మం జిల్లా డీఎంహెచ్ఓ

### నాన్న ముందు చూపే



ఉర్దూ మీడియంలో ఐదవ తరగతి వరకు చదువుకున్న నాన్న ముందు చూపే తండాలో పుట్టిన వారి జీవన విధానాన్నే మార్చేసింది. కుటుంబాలు గడవడం ఇబ్బందైన రోజుల్లోనే ఇంటర్ హైదరాబాద్‌లో చదవించారు. అదే స్ఫూర్తిగా ఇప్పటి వరకు తండాలో పుట్టిన మాతోపాటు, మా బిడ్డలు కూడా ఉన్నత చదువులు చదివి దేశవిదేశాల్లో స్థిరపడ్డారు.

– డాక్టర్ రూప్‌లాల్, మహబూబాబాద్

### ఒకరిని చూసి ఒకరు పోటీపడి చదివాం



మా తండాలో పుట్టడం ఒక వరంగా భావిస్తాం. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అందరూ బడికి పోవాలి అని చెప్పేవారు. పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు హెచ్చరించేవారు. అందుకోసమే ఏ పాఠశాల, ఏ కళాశాలకు వెళ్లినా మా తండా విద్యార్థి అంటే ప్రత్యేకం. అందరం పోటీపడి చదివాం. ఐఏఎస్, ఐపీఎస్ నుంచి అన్ని రకాల ఉన్నత చదువులు చదివినవారు ఉన్నారు.

– జగదీష్, మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ

## నేడు ఎంపీలతో రైల్వే అధికారుల భేటీ

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ విరామం తర్వాత పార్లమెంట్‌సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు భేటీ అవుతున్నారు. గతంలో ప్రతి బడ్జెట్ సమావేశాల ముందు ఇలా ఎంపీలతో భేటీ అయి వారిచ్చిన ప్రతిపాదనలను రైల్వే బోర్డుకు పంపే ఆనవాయితీ ఉండేది. కోవిడ్ కంటే ముందు నుంచి ఈ భేటీలు ఆగిపోయాయి. మళ్లీ ఆ ఆనవాయితీని పునరుద్ధరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. గురువారం ఉదయం తెలంగాణ, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కర్ణాటక ప్రాంతంలోని ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే జీఎం, ఇతర ఉన్నతాధికారులు రైల్ నిలయంలో భేటీ అవుతున్నారు. ఎంపీల ప్రతిపాదనలను రైల్వే బోర్డుకు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. గతంలో మంజూ రయి, ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయిన కొత్త లైన్లకు నిధులు, వందేభారత్, వందేభారత్ స్లీపర్‌లతో పాటు కొత్త రైళ్ల కేటాయింపు, ఇప్పటికే పనులు జరుగుతున్న ప్రాజెక్టులకు నిధుల పెంపు, కాజీపేట–బలార్షా, విజయవాడ మూడో లైన్ పనుల్లో వేగం పెంపు, రైల్వే స్టేషన్ల విస్తరణ, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించటం, ఎంఎంటీఎస్ రెండో దశకు నిధులు, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ.. లాంటి అంశాలపై ఎంపీలు ప్రతిపాదనలు ఇచ్చే అవకాశంఉంది.

## మూసీపై బీఆర్ఎస్ రాద్ధాంతం

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిల్, వీరేశం**

సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ లేనిపోని అపోహలు సృష్టిస్తోందని, రాద్ధాంతం చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. వారు సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కారణంగా తమ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, కేన్సర్, పక్షవాతం లాంటి రోగాల బారిన పడుతున్నారని, మహిళలకు గర్భస్రావం జరుగుతోందని, బోర్ల నుంచి మురికి నీరు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీని ప్రక్షాళన చేయాలంటూ గతంలో అన్ని పార్టీల నేతలు పాద యాత్రలు, దీక్షలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆ పనికి పూను కుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సుర్యాపేట జిల్లా పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన్ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు.

## ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ‘వీర్లపల్లి’



శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా నియమితులైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మాధవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ ఉద్యోగులు శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

## నకిలీ పారా మెడికల్ కాలేజీలను మూసేయండి

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేని కోర్సులు నిర్వహిస్తూ.. రూ.లక్షల రుసుము వసూలు చేస్తూ విద్యార్థులను మోసగిస్తున్న నకిలీ సంస్థలు, కళాశాలలను ప్రభుత్వం మూసివేయాలని అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వంశీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ కోశాధికారి వెంకటేశ్, ఎం.రాములు, ఒక విద్యార్థి తల్లి కె.దేవదీపికలతో కలిసి మాట్లాడారు. కూకట్‌పల్లి, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట, దిల్‌షుక్‌నగర్ తదితర ప్రాంతాల్లో అల్లైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ పేరుతో సంస్థలు వెలిశాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లో పది కళాశాలలు ఏర్పాటు చేసి తమ సంస్థలలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులు అందిస్తున్నామని చెప్పుకొంటున్నాయని వివరించారు. వీటిలో కోర్సు పూర్తి చేసుకున్న కొంతమంది విద్యార్థులు ఆయా సంస్థలు ఇచ్చిన సర్టిఫికెట్లతో ఉద్యోగాల కోసం వెళ్లగా, అవి నకిలీవని తేలిందన్నారు. అలాంటి సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వంశీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

**వాన వెలిసింది.. వేట మొదలైంది**



మంగళవారం కురిసిన భారీ వర్షాలకు అనంతపురం శివారులోని పండమేరు వాగు పోటెత్తింది. బుధవారం నాటికి వరద ఉధృతి తగ్గడంతో స్థానికులు చేపల వేటకు సిద్ధమయ్యారు. పైనున్న చెరువులు, కుంటలు తెగి అందులోని చేపలు వాగులోకి వస్తుండటంతో జోరుగా చేపలవేట సాగింది.

– జి వీరేశ్ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

**గురి కుదిరింది.. గుటుక్కుమనిపించాలి**



కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలతో పైనున్న ప్రాజెక్టుల నుంచి వరద నీరు విడిచిపెట్టడంతో విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు భారీగా నీరు ప్రవహిస్తోంది. అప్రాన్‌పై నుంచి నీరు ప్రవహిస్తుండగా ఎగిరిపడుతున్న చేపలను పట్టుకుని గుటుక్కుమనిపించేందుకు పక్షులు గోడలపై సిద్ధంగా ఉన్నాయి.

– కిశోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

**ఈ దీపం.. అపురూపం**



దివ్వెల పండుగ దీపావళిని దేశవ్యాప్తంగా ఆనందంగా జరుపుకుంటాం. రంగు రంగుల దివ్వెలు, బాణాసంచా మోతలతో పల్లె, పట్టణాల్లో సంతోషాలు వెల్లివిరుస్తాయి. ఆ సంతోషం అందరి ముఖాల్లోనూ కనిపించాలనే ఉద్దేశంతో విశాఖలోని ప్రజ్వలవాణి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులతో దీపావళి ప్రమిదలు తయారుచేయించారు.

–ఎండీ నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## ఇళ్లకు విద్యుత్ ఆదా పరికరాలు

- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడి
- జైపూర్‌లో దక్షిణాసియా స్వచ్ఛ ఇంధన వేదిక సదస్సు

సాక్షి, అమరావతి: గృహ నిర్మాణంలో ఇంధన సామర్థ్య విధానాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. ఇంధన సామర్థ్యం, సుస్థిరతకు అనుసరించాల్సిన అత్యాధునిక వ్యూహాలపై చర్చించేందుకు దక్షిణాసియా స్వచ్ఛ ఇంధన వేదిక (ఎస్‌ఏసీఈఎఫ్) 2024 ఆధ్వర్యంలో బుధవారం జైపూర్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇంధన సామర్థ్య చర్యలు అమలుకు కేంద్ర విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) తో ఏపీ భాగస్వామ్యంపై ఈ సమావేశంలో చర్చించారు. 2029 నాటికల్లా అర్హులైన అన్ని కుటుంబాలకు ఇళ్లు అందించాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన చెప్పారు. సూపర్ ఎఫిషియెంట్ అప్లయెన్సెస్ కోసం మార్కెట్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఇంధన సామర్థ్యంలో ఏపీ సాధించిన విజయాలను ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ కొనియాడారు. వీధి దీపాల విషయంలో ఏపీని కేస్ స్టడీగా తీసుకోవాలని ఈఈఎస్ఎల్ సీజీఎం అనిమేశ్ సూచించారు.

## డ్రోన్ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు

ముగిసిన రెండు రోజుల సదస్సు

సాక్షి, అమరావతి: రెండు రోజుల పాటు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్–2024 బుధవారం విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. వచ్చే ఐదేళ్లలో డ్రోన్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని ఈ సదస్సులో పాల్గొన్న పలువురు వక్తలు తెలిపారు. యువ భారత్‌లో మేధస్సుకు కొదవలేదని.. అయితే పెట్టుబడుల పరంగా సవాళ్లు ఉన్నాయని.. వాటిని ఎదుర్కొనేలా, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయన్న భరోసా లభించిందని పేర్కొన్నారు.

# మూలాలకు పోదాం

- దేశవాళీ వరి సాగుకు జై కొడుతున్న అత్తోట రైతులు
- ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు
- ఈ బియ్యం వాడటం వల్ల ఆరోగ్యపరంగా సత్ఫలితాలు
- వినియోగదారుల నుంచి మంచి డిమాండ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జీవ వైవిధ్యానికి పెట్టింది పేరైన భారతదేశంలో ఒకప్పుడు వేలాది రకాల వరి విత్తనాలు సాగులో ఉండేవి. నేల స్వభావం, నీటివసతి, భౌగోళిక స్వరూపం.. ఇలా పరిస్థితులను అనుసరించి ఆయా ప్రాంతాల్లో వివిధరకాల వరి సాగుచేసేవారు. అయితే దేశవాళీ వరి విత్తనాల దిగుబడి తక్కువగా ఉంటుండటం, భారీగా పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలు తీర్చేందుకు తప్పనిసరిగా ఉత్పత్తి పెంచాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో విత్తనాల సంకరీకరణకు బీజం పడింది. అధిక దిగుబడి ఇచ్చేవి, పంటకాలం స్వల్పంగా ఉండేవి, వ్యాధులను, నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. అధిక దిగుబడి ఇచ్చే లాభదాయక వరి విత్తనాలు అందుబాటులోకి రావడంతో రైతులు వాటివైపు మొగ్గుచూపడం ప్రారంభించారు. దీంతో క్రమంగా దేశవాళీ వరి సాగు తగ్గుతూ రావడం ప్రారంభమైంది. చివరకు సాగుచేసేవారులేక వేలాది రకాలు అంతరించిపోయే పరిస్థితి వచ్చింది.

అయితే అక్కడక్కడా మిగిలినవాటిలో ఉన్న ఔషధ విలువలు, పోషక విలువలు గుర్తించిన కొందరు కొన్ని రకాలను పునరుజ్జీవింపజేసేపనికి పూనుకున్నారు. ఇది సత్ఫలితాలనిచ్చి ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కొన్ని దేశీయ రకాలు తిరిగి సాగులోకి వస్తున్నాయి. గుంటూరు జిల్లా అత్తోటకు చెందిన 60 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కొన్ని దేశవాళీ రకాలను విజయవంతంగా సాగు చేస్తూ లాభాలు పండిస్తున్నారు.





### 'భూమి భారతి' పేరుతో విత్తన నిధి

మనం ఏనాడో మరిచిపోయిన దేశవాళీ వరి రకాలను సంరక్షించటం, అందులోని పోషకాలను నేటి తరానికి అందించాలనేది వీరి ఆశయం. ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులతో తీసిన విత్తనాలతో 'భూమి భారతి' పేరుతో 'దేశవాళీ వరి విత్తన నిధి'ని 2022లో ఏర్పాటుచేశారు. ఇందుకు 'తానా' సహకరించింది. దేశీ వరి విత్తన నిధిని నిర్వహిస్తూ, రైతులు పండించిన దేశీ వరి బియ్యాన్ని, విలువ జోడించిన ఇతర ఆరోగ్యదాయక ఆహార ఉత్పత్తులను సంతల్లో, సోషల్‌మీడియాలో ప్రచారంతో విక్రయిస్తున్నారు. వీరు సాగుచేసిన వరి రకాల్లో బీపీటీ తరహాలోనే రోజువారీ ఆహార వినియోగానికి తగినట్టుండే 'రత్నచోళి', అధిక పోషకాలు ఉండే సారంగనలి, దానమతి, నెల్లూరు మొలకొలుకులు, బహురూపి, చినుకుమిని, కుంకుమసాలి తదితర ప్రముఖ దేశవాళీ రకాలున్నాయి.

### తులసి బాసో

మొక్క 5 అడుగుల వరకు పెరుగుతుంది. పంటకాలం 40 రోజులు

గింజ చాలా చిన్నగా ఉండి, అన్నం మంచి సువాసన కలిగి ఉండటం దీని ప్రత్యేక లక్షణం. ఒక్కసారి నాటితే మూడు పంటలు తీసుకోవచ్చు. పంటకాలం కేవలం 40 రోజులు పశ్చిమ బెంగాల్ దీని మూల స్థానం, మంచి పోషక విలువలు కలిగి తినడానికి అనువుగా ఉంటుంది. ఈ బియ్యాన్ని దేవుడికి నేవేద్యంగా పెడతారు.

### ఇంద్రాయణి

సాధారణ ఎత్తులో పెరిగే ఈ వరి వంగడం పంటకాలం 130 రోజులు, బియ్యం మంచి సువాసన కలిగిఉంటాయి. అత్యధిక పోషక విలువలు కలిగిఉంటాయి. వండుకోవడానికి, తినడానికి ఈ బియ్యం అనుకూలంగా ఉంటాయి. ఈ బియ్యానికి సర్వరోగనివారిణిగా పేరుంది. మహారాష్ట్రలోని ఇంద్రాయణి నది పరీవాహక ప్రాంతంలో గతంలో ఎక్కువగా సాగులో ఉండటం వల్ల దీనికి ఇంద్రాయణి రైస్ అని పేరువచ్చింది.



తులసి బాసో



ఇంద్రాయణి

### కాలాబట్టి

5 నుంచి 6.5 అడుగుల ఎత్తు పెరుగుతుంది. పంటకాలం 150 రోజులు

నలుపురంగులో ఉండే ఈ బియ్యాన్ని కాలాబట్, బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్ అనే పేర్లతో పిలుస్తారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఎక్కువగా ఈ రకాన్ని సాగుచేస్తుంటారు. ఈ నల్లబియ్యం ఉత్పత్తిలో ప్రస్తుతం మణిపూర్ అగ్రస్థానంలో ఉంది. ఇందులో ఆంథోసియానిన్ అనే యాంటి ఆక్సిడెంట్లు అధికం. మధుమేహ బాధితులు, హృద్రోగులకు ఇది గొప్ప ప్రయోజనకారి. క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ని అదుపులో ఉంచుతుంది. ప్రాచీన కాలంలో ఈ బియ్యంరాజకుటుంబాలు, ఉన్నతవర్గాలవారికి మాత్రమే అందుబాటులో ఉండేవి.



### మాపిళ్లైసాంబ

మాపిళ్లై సాంబ మొక్క 4.5 అడుగుల ఎత్తు పెరుగుతుంది. పంటకాలం 160 రోజులు

ఈ బియ్యాన్ని 'పెళ్లికొడుకు బియ్యం' అని కూడా అంటారు. ఎరుపురంగులో ఉండే ఈ బియ్యాన్ని కొత్తగా పెళ్లయిన దంపతులకు ఇవ్వడం ఒకప్పుడు ఆనవాయితీగా ఉండేది. ఈ బియ్యం వల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా కండపుష్టి, ధాతుపుష్టి, వీర్యవృద్ధి కలుగుతుంది.గర్భధారణ సమస్యలతో బాధపడే దంపతులకు ఉపకరిస్తుందనే నమ్మకం. తమిళనాడులోని తిరవణ్ణామలై ప్రాంతం ఈ విత్తనాలకు మూలకేంద్రం. నాగపట్టణం, తిరుచ్చురాపల్లి, తంజావూర్ జిల్లాల్లో రైతులు కొంతమేరకు సాగుచేస్తూ వస్తున్నారు.



### నవార

మొక్క 5 అడుగుల వరకు పెరుగుతుంది. పంటకాలం 90 రోజులు

ఈ విత్తనం త్రేతాయుగం నాటిది. బియ్యం ఎరుపురంగులో ఉంటాయి. కేరళలోని పాలక్కాడ్ ప్రాంతం ఈ బియ్యానికి మూలకేంద్రంగా గుర్తించారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఈ బియ్యం చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. నరాల బలహీనత, కీళ్ల నొప్పులు తగ్గించేందుకు ఈ బియ్యం చక్కగా దోహదపడతాయి. కేరళ సంప్రదాయ ఆయుర్వేద వైద్యంలో ఈ బియ్యాన్ని ఔషధంగా వినియోగిస్తారు. పక్షవాతం వచ్చినవారికి బాడీ మసాజ్‌లో వినియోగిస్తారు. బియ్యం నుంచి కూడా మొలకలు రావటం దీని ప్రత్యేకత.



### దేశవాళీ సాగు ఎప్పుడూ దెబ్బతీయదు



దేశవాళీ వరి వంగడాల్లో గణనీయమైన జన్యువైవిధ్యాలున్నాయి. వివిధ కారణాలతో అనేక రకాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వీటి సంరక్షణకు మా వంతు కృషిచేస్తున్నాం. దేశవాళీ సాగు ఎప్పుడూ దెబ్బతీయదు. అత్యంత అధ్వాన్నమైన పరిస్థితుల్లోనూ కనీసం యాభై శాతం ఫలితాన్ని అందిస్తుంది.

– యర్రు బాపన్న, సంప్రదాయ సాగు రైతు

### హైబ్రిడ్ బియ్యంతో ఆకలి అణగదు



హైబ్రిడ్ బియ్యం తింటే ఆకలి అణగదు. దీనివల్ల మరో 50 శాతం అదనంగా అన్నం తినాల్సి వస్తుంది. రుచి కూడా అంత బాగుండదు. దేశవాళీ బియ్యం ఇందుకు భిన్నం. మంచి గ్లైసైమిక్ ఇండెక్స్ కలిగివుండటంతో కొన్ని రకాలు మధుమేహ రోగులకు ఆరోగ్య సంరక్షిణిగా నిలుస్తున్నాయి.

–నామని రోశయ్య, సంప్రదాయ సాగు రైతు

ఈ రకాలు గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ప్రకృతి రైతులు సాగుచేస్తున్న అరుదైన దేశవాళీ వరి వంగడాల్లో కొన్ని మాత్రమే. తొమ్మిదేళ్ల క్రితం దీనికి అంకురార్పణ జరిగింది. ఇక్కడి రైతులు తొలుత 5 నుంచి 10 సెంట్లలో స్వల్పరకాలతో ఆరంభించి, ఏటా విస్తీర్ణాన్ని, సాగుచేసే రకాలను పెంచుకుంటూ వెళ్లారు. 2018లో చేపట్టిన వంద రకాల సాగు సత్ఫలితాన్నిచ్చింది. దీంతో 2019 ఖరీఫ్‌లో 180 రకాలను విత్తార్క,భారత్ బీజ్ స్వరాజ్ మంచ్‌కి శివప్రసాదరాజు నుంచి ఆయా రకాల విత్తనాలను సేకరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుకు కావాల్సిన ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలను స్వయంగా తయారుచేసుకుంటున్నారు.

ప్రస్తుతం అత్తోట గ్రామంలో అరవై మంది రైతులు, సమష్టిగా ప్రకృతి వ్యవసాయంలో ఉన్నారు. మొత్తం 85 ఎకరాల్లో దేశీ వరి రకాలను సాగుచేస్తున్నారు. ఇందుకు ఆద్యుడైన రైతు యర్రు బాపారావు. 365 రకాల దేశీ వరి రకాలను సాగుచేస్తున్నారు. వినియోగదారులు ఇప్పటికే అలవాటుపడిన మైసూర్‌మల్లిక, బహురూపి, నవార, నల్లబియ్యం వంటి రకాలను ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తూ, ఇతర రకాలను విత్తన సంరక్షణ కోసం స్వల్పవిస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ఈ గ్రామ రైతులు భారతదేశ వరి వంగడాల్లోని వైవిధ్యత సంరక్షణకు తోడ్పడుతూ, అక్కడి మట్టికి కొత్త పరిమళం అద్దారు.



# దోపిడీకి అడ్డొస్తుందనే.. జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు

**ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చట్టం -2019 రద్దుకు మంత్రివర్గం ఆమోదం**

- టెండర్లలో పారదర్శకతకు పాతర.. ప్రజా భాగస్వామ్యానికి తెర
- అంచనాలు అడ్డగోలుగా పెంచినా అడిగే వారుండరు
- ఇక నచ్చిన కాంట్రాక్టర్‌కే పనులొచ్చేలా టెండర్లు
- కమీషన్లు దండుకోవడానికి మార్గం సుగమం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య దోచుకో.. పంచుకో.. తినుకో (డీపీటీ) పద్ధతిలో ఖజానాను అప్పటి ప్రభుత్వ పెద్దలు దోచేశారు. ప్రజా ధనాన్ని ఇలా దోపిడీ చేయకుండా అడ్డుకట్ట వేస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ (జ్యుడిషియల్ ప్రివ్యూ ద్వారా పారదర్శకత) చట్టం–2019ను తెచ్చింది. ఈ చట్టం ద్వారా టెండర్లలో పారదర్శకత, సూచనలు చేయడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని ప్రవేశపెట్టింది. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేసింది. కానీ, ఇటీవలి ఎన్నికల్లో 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు కూటమే మళ్లీ అధికారంలోకి వచ్చింది. దీంతో మళ్లీ దోపిడీ పర్వానికి తెర తీస్తూ చంద్రబాబు కూటమి జ్యుడిషియల్ ప్రివ్యూను రద్దు చేసింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ (జ్యుడిషియల్ ప్రివ్యూ ద్వారా పారదర్శకత) చట్టం–2019ను రద్దు చేస్తూ ప్రవేశపెట్టిన ప్రతిపాదనను బుధవారం మంత్రివర్గం ఆమోదించింది. ఇప్పటికే రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు జ్యుడిషియల్ ప్రివ్యూ అడ్డునూ తొలగించుకుంది. మళ్లీ 2014–19 తరహాలోనే అడ్డగోలుగా అంచనాలు పెంచేసి.. కమీషన్లు ఎక్కువ ఇచ్చే కాంట్రాక్టర్‌కే పనులు దక్కేలా నిబంధనలతో టెండర్లు పిలిచి, కోరుకున్న కాంట్రాక్టర్‌కు కట్టబెట్టి, మొబిలైజేషన్ అడ్వాన్సులిచ్చి, కమీషన్లు వసూలు చేసుకునేందుకు మళ్లీ సిద్ధమయ్యారని అధికారవర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

**జ్యుడిషియల్ ప్రివ్యూకు నీతి ఆయోగ్ ప్రశంసలు**

రాష్ట్రంలో 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం నీరుగార్చిన టెండర్ల వ్యవస్థకు జవసత్వాలు చేకూర్చుతూ 2019 ఆగస్టు 20న ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ యాక్ట్ (జ్యుడిషియల్ ప్రివ్యూ ద్వారా పారదర్శకత) – 2019 చట్టాన్ని నాటి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తిని జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జిగా నియమించింది. ఈ చట్టం ప్రకారం .. రూ.వంద కోట్లు అంతకంటే ఎక్కువ వ్యయం ఉన్న పనుల టెండర్ ముసాయిదా షెడ్యూల్‌ను ముందుగా జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి పరిశీలనకు పంపుతారు. ఆ ముసాయిదాపై జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి ఆన్‌లైన్‌లో అన్ని వర్గాల ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. వాటిని పరిగణనలోకి తీసుకుని జడ్జి మార్పులు సూచిస్తారు. ఎలాంటి మార్పులు అవసరం లేదని భావిస్తే.. దానిని యథాతథంగా ఆమోదిస్తారు. ఇలా జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి ఆమోదించిన టెండర్ ముసాయిదా షెడ్యూల్‌తోనే రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ. వంద కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయం ఉన్న పనులన్నింటినీ ఇదే విధానంలో నిర్వహించారు. ఈ విధానంలో టెండర్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించడం వల్లే కాంట్రాక్టర్లు భారీ సంఖ్యలో పోటీ పడి.. కాంట్రాక్టు విలువకంటే తక్కువకే పనులు చేయడానికి ముందుకొచ్చారు. దీని వల్ల రూ.7,500 కోట్లకు పైగా ప్రభుత్వానికి ఆదా అయ్యింది. జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. ఈ విధానాన్ని అమలు చేయడాన్ని పరిశీలించాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది.

**అంచనాల్లో వంచనకు, దోపిడీకి అవకాశం ఉండదనే..**

విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఇప్పటిలానే బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. కోట్లాది రూపాయలు వెదజల్లి కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చేందుకు పెట్టిన పెట్టుబడికి వంద రెట్లు ప్రభుత్వ ఖజానా నుంచి కొల్లగొట్టేందుకు టెండర్ విధానాన్ని ఓ అస్త్రంగా మల్చుకున్నారు. 2014 - 19 మధ్య బాబు సర్కారు దోపిడీకి సాక్ష్యాలు ఇవిగో..

- గాలేరు–నగరి పథకం తొలి దశలో 27వ ప్యాకేజీలో 2014 నాటికి రూ.11 కోట్ల విలువైన పని మాత్రమే మిగిలింది. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై 60–సీ నిబంధన కింద వేటు వేసి.. అంచనా వ్యయాన్ని రూ.112.83 కోట్లకు పెంచేసి, దొడ్డిదారిన తన సన్నిహితుడైన సి.ఎం. రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు అప్పగించారు.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి రెండో దశలో 2–బీ ప్యాకేజీలో 2014 నాటికి కేవలం రూ.99 లక్షల విలువైన పనులు, 3–బి ప్యాకేజీల్లో రూ.రూ.8.69 కోట్ల విలువైన పను మిగిలాయి. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేశారు. 2–బి ప్యాకేజీ పనుల అంచనా వ్యయాన్ని రూ.115.08 కోట్లకు పెంచేశారు. 3–బి ప్యాకేజీ వ్యయాన్ని రూ.149.14 కోట్లకు పెంచేశారు. ఈ రెండింటినీ సి.ఎం. రమేష్‌కే అప్పగించారు. ఇలా 2–బి ప్యాకేజీలో రూ.114.09 కోట్లు, 3–బి ప్యాకేజీలో 140.45 కోట్లు పెంచేసి, సి.ఎం .రమేష్‌కు బిల్లులు చెల్లించినట్లు స్పష్టమవుతోంది.
- హంద్రీ–నీవా రెండో దశ 4–బి ప్యాకేజీలో 2014 నాటికి రూ.1.34 కోట్లు, 5–బీ ప్యాకేజీలో రూ.11.87 కోట్ల విలువైన పనులే మిగిలాయి. వాటి కాంట్రాక్టర్లను కూడా 60–సీ నిబంధన కింద చంద్రబాబు తొలగించారు. 4–బి ప్యాకేజీ పనుల వ్యయాన్ని రూ.73.26 కోట్లకు, 5–బి ప్యాకేజీ వ్యయాన్ని రూ.97.40 కోట్లకు పెంచేసి, తన సన్నిహితుడైన ఆర్.మహేశ్వరనాయుడు, ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకున్నారు.
- వెలిగొండ రెండో టన్నెల్‌లో 2014 నాటికి రూ.299.48 కోట్ల విలువైన పనులే మిగిలాయి. వాటిని చేస్తున్న కాంట్రాక్టర్‌పై 60–సీ నిబంధన కింద వేటు వేసిన చంద్రబాబు.. జీవో 22, జీవో 63ను వర్తింపజేసి.. అంచనా వ్యయాన్ని రూ.597.11 కోట్లకు పెంచేశారు. వాటిని సి.ఎం. రమేష్‌కు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ పనులను రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించి, సి.ఎం. రమేష్ సంస్థకంటే రూ.61.76 కోట్లకు తక్కువ ధరకు మరో కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఆ టన్నెల్ పనిని పూర్తి చేయించారు. ఈ ప్రాజెక్టు పనులను తనిఖీ చేసిన కాగ్ జీవో 22, జీవో 63ను వర్తింపజేయడం ద్వారా కాంట్రాక్టర్లకు రూ.630.57 కోట్లను దోచిపెట్టినట్లు తేల్చడం బాబు అవినీతికి తార్కాణం.
- 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రకాశం బ్యారేజ్‌కు 21 కిలోమీటర్ల ఎగువన కృష్ణా నదిపై వైకుంఠపురం వద్ద బ్యారేజి నిర్మాణానికి 2018లో తొలుత రూ.801.88 కోట్లతో చంద్రబాబు సర్కారు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత దాన్ని రద్దు చేసి అంచనా వ్యయాన్ని రూ.1,376 కోట్లకు పెంచేసి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే.. అంచనాల్లోనే రూ.574.12 కోట్లు పెంచేశారు. ఈ పనులను రామోజీరావు కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగకు దక్కేలా టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ పనులను నిబంధనలకు విరుద్ధంగా 13.19 శాతం అధిక ధరకు రూ.1,554.88 కోట్లకు నవయుగకు అప్పగించారు. అంటే.. అంచనాలు పెంచడం ద్వారా, అధిక ధరకు పనులు అప్పగించడం ద్వారా నవయుగకు ప్రభుత్వ ఖజానా నుంచి ఉత్తినే రూ.753 కోట్లు దోచిపెట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ పనులను 2019లో ప్రభుత్వం రద్దు చేసింది.
- ఇప్పుడూ అదే రీతిలో ఖజానాను కొల్లగొట్టేందుకు జ్యుడిషియల్ ప్రివ్యూను ప్రభుత్వం రద్దు చేసిందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

## ఆధ్యాత్మిక సమాచారం

### అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

### శ్రీపాద వల్లభుడికి అభిషేకం



అయినవిల్లి: కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో శ్రీపాద వల్లభుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా పిఠాపురానికి చెందిన శ్రీపాద వల్లభుని ప్రత్యేక రథం బుధవారం ఇక్కడకు చేరుకుంది. శ్రీపాదవల్లభునికి ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీపాదవల్లభుని విగ్రహాన్ని ఆలయంలో ఉంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

### వైభవంగా ముగిసిన మహా కుంబాభిషేకం



తాళ్లపూడి: తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడిలోని నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవాలు, శత చండీయాగం బుధవారంతో వైభవంగా ముగిసాయి. మూడు రోజులుగా సిద్ధేశ్వర శ్రీ కార్తికేయ శివాచార్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అల్లూరి ప్రసాద్ పర్యవేక్షణలో వేద పండితులు యాగశాలలలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, మహా పూర్ణాహుతి, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, దుర్గామల్లేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

## విద్యా సమాచారం

### ప్రణాళికతో 'గేట్'లో విజయం

నూజివీడు: గేట్ పరీక్షలో సక్సెస్ సాధించాలంటే ముందుగా విద్యార్థులు సిలబస్ గురించి తెలుసుకోవాలని గేట్ డైరెక్టర్ పీఆర్వో వీఎస్ఆర్ సురేష్‌కుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ఐటీలో నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు చెందిన ఈసీఈ, ఈఈఈ బ్రాంచిల విద్యార్థులకు బుధవారం గేట్ పరీక్షకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్ష సరళిని తెలుసుకోవాలని, కోర్ సబ్జెక్టు సిలబస్‌తో ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.

### ఆచార్య ప్రసాదరావుకు సన్మానం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు బి.ప్రసాదరావును ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు బుధవారం తన కార్యాలయంలో సన్మానించారు. ఆచార్యుడిగా, వర్సిటీలో విభిన్న పదవులను సమర్థవంతంగా నిర్వహించి, ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాల కరస్పాండెంట్‌గా అవిశ్రాంత సేవలు అందిస్తున్న ప్రసాదరావును వీసీ అభినందించారు.

### విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు.

నీ సన్నిధి

పుష్కర్



సృష్టికర్త బ్రహ్మ ఆలయం

సృష్టికర్త బ్రహ్మదేవుడికి ఆలయాలు లేవెందుకు? త్రిమూర్తుల్లోకెల్లా చిన్నవాడయిన బ్రహ్మ ఎప్పుడూ వృద్ధుడుగానే ఉంటాడెందుకు? ఈ సందేహాలకు సమాధానమిస్తుంది పుష్కర్ పుణ్యక్షేత్రం, ఆ క్షేత్ర స్థలపురాణం. రాజస్థాన్ రాష్ట్రంలో అజ్మీర్‌కు 11 కి.మీ దూరంలో సముద్రమట్టానికి 1580 అడుగుల ఎత్తులో ఉన్న సరస్సు పుష్కర్. క్రమంగా ఆ ప్రాంతం ఈ సరస్సు పేరుతో ప్రసిద్ధి చెందింది. ఈ సరస్సు చెంతనే ఉంది సృష్టికర్త బ్రహ్మ ఆలయం.

# సృష్టికర్తకు ఉన్నదొక బ్రహ్మాండమైన ఆలయం




ప్రపంచంలో బ్రహ్మదేవుడికి ఉన్న ఏకైక ఆలయం ఇది. మన దేశంలోని అతి ముఖ్యమైన తీర్థాల్లో ఒకటైన పుష్కర్‌ను దర్శించుకోకుంటే పుణ్యక్షేత్ర సందర్శన పూర్తి కానట్టేనని పెద్దలంటారు. అందుకే దీన్ని తీర్థరాజ్ అంటారు. పౌరాణికంగా ఎంతో ప్రాశస్త్యం చెందిన మహాభారత, రామాయణాల్లోనూ ఆది తీర్థంగా ప్రస్తావించబడింది ఈ తీర్థం. కార్తీక పౌర్ణమి రోజున ఇందులో ఓసారి మునిగితే వందల సంవత్సరాల పాటు యజ్ఞం చేసిన ఫలితం దక్కుతుందట.

### స్థలపురాణం

పద్మపురాణం ప్రకారం పూర్వం వజ్రనాభ అనే రాక్షసుడు ప్రజల్ని హింసించడం చూసి తట్టుకోలేక వెంటనే తన చేతిలోనే తామరపూవునే ఆయుధంగా విసిరి ఆ రాక్షసరాజుని సంహరించాడు బ్రహ్మదేవుడు. ఆ సమయంలో ఆ తామరపూవు నుంచి రేకులు మూడు చోట్ల రాలి, మూడు సరస్సులు ఏర్పడ్డాయి. వాటిని జ్యేష్ఠ పుష్కర్, మధ్యపుష్కర్, కనిష్ఠపుష్కర్ అని పిలుస్తున్నారు. పైగా సృష్టికర్త తాను భూలోకంలో అడుగిడినప్పుడు తన చేతి (కరం)నుంచి పుష్పం రాలిపడ్డ ప్రదేశం కాబట్టి ఆ ప్రాంతానికి పుష్కర్ అని పేరు పెట్టినట్లు మరో కథనం కూడా వినిపిస్తుంది.

### సరస్వతీదేవి శాపం.. ఏకైక ఆలయం

వజ్రనాభ సంహారం అనంతరం లోకకల్యాణం కోసం ఇక్కడ యజ్ఞం చేయాలని సంకల్పించాడట సృష్టికర్త. సుముహూర్తం ఆసన్నమవుతుండటంతో సరస్వతీ దేవిని తీసుకుని రమ్మని తన కుమారుడైన నారదుడిని పంపిస్తాడు బ్రహ్మ. కానీ నారదుడి కలహప్రియత్వం కారణంగా బయలుదేరేందుకు తాత్సారం చేస్తుంది సావిత్రీ దేవి. (ఈమెనే సరస్వతీ దేవి అని కూడా పిలుస్తారు) ఇవతల ముహూర్తం మించిపోతుండటంతో, అనుకున్న సమయానికే యజ్ఞం పూర్తి కావాలన్న తలంపుతో ఇంద్రుడి సహకారంతో గాయత్రిని పెళ్లాడి నిర్ణీత సమయానికి యజ్ఞాన్ని ప్రారంభిస్తారు. యజ్ఞం సమాప్తం అవుతుండగా అక్కడికి చేరుకున్న సరస్వతీదేవి బ్రహ్మదేవుడి పక్కన మరో స్త్రీని చూసి ఉగ్రరూపం దాలుస్తుంది. బ్రహ్మదేవుడితో సహా అక్కడున్న దేవతలందరినీ శపిస్తుంది. భర్తను వృద్ధుడై పొమ్మని, ఆయనకు ఒక్క పుష్కర్‌లో తప్ప మరెక్కడా ఆలయాలు ఉండవనీ శపిస్తుంది. అనంతరం బ్రహ్మదేవుడి అభ్యర్థనను మన్నించి శాప తీవ్రతను తగ్గిస్తుందట. బ్రహ్మదేవాలయం పుష్కర్‌లో మాత్రమే ఉండటానికి కారణం ఇదేనట. పుష్కర్‌లో సావిత్రీమాత ఆలయంతో పాటు ఓ చిన్న నీటి ప్రవాహం ఉంది. దీన్ని సావిత్రీనది అని పిలుస్తారు స్థానికులు. ఆమెను పూజించిన స్త్రీలకు నిత్య సుమంగళి వరాన్నిస్తుందన్న నమ్మకంతో పుష్కర్‌ను సందర్శించిన భక్తులంతా ఈ ఆలయాన్ని కూడా దర్శిస్తారు.



### ఇతర విశేషాలు

పుష్కర్‌లో ప్రసిద్ధి చెందిన ఆలయాలు, ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఇక్కడ సుమారు 400 పురాతన ఆలయాలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి ఆప్తేశ్వర్, రంగ్‌జీ, ఏకలింగజీ దేవాలయాలు. వీటిలో రంగ్‌జీ ఆలయం దక్షిణాది శైలిలో కట్టబడి ఉంటుంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి రంగ్‌జీగా పూజలందుకుంటున్నాడు. రాజస్తాన్‌లోని సుప్రసిద్ధ శివక్షేత్రం ఏకలింగజీ దేవాలయం. ఇక్కడ శివలింగం కేవలం లింగాకారంగా కాక నలుపక్కలా నాలుగు ముఖాలను కలిగి ఉండటం విశేషం. ఇవి కాక గోవిందాజీ ఆలయం, నక్షత్రశాల, హవామహల్, చత్రిస్, గాలోటా, ఖవాసాహిబ్ దర్గా, అధాన్ దిన్ కా జూన్ ప్రా, అనాసాగర్, జగ్‌నివాస్ భవనం, జగదీష్ ఆలయం, అహర్, నక్కి సరస్సు, జోధ్‌పూర్ పట్టణం, అజ్మీరు, ఉదయ్‌పూర్, అబూశిఖరం, పింక్‌సిటీగా పేరుగాంచిన జైపూర్‌లు తప్పక సందర్శించాల్సిన ప్రదేశాలు.

### ఎలా వెళ్లాలంటే..?

పుష్కర్‌కు వెళ్లడానికి దగ్గరలోని అజ్మీర్ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలి. ఢిల్లీ, జోధ్‌పూర్, జైపూర్, ఆగ్రా, ముంబాయ్. అహ్మదాబాద్‌ల నుంచి రైళ్లున్నాయి. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ బెస్ట్. అజ్మీర్ నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని పుష్కర్‌కు చేరుకోవాలంటే లోకల్ బస్సులు, ఆటోలు ఉన్నాయి. విమాన మార్గం సంగనీర్ ఏర్‌పోర్ట్. అయితే అక్కడినుంచి పుష్కర్ వెళ్లాలంటే 127 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అన్ని ప్రధాన నగరాలనుంచి పుష్కర్‌కు నేరుగా బస్సు సౌకర్యం ఉంది.

- డి.వి.ఆర్. భాస్కర్

బౌద్ధవాణి

## మేలు చేసిన సహన గుణం



ఒక అడవిలో రెండు చిలకలు ఉన్నాయి. ఒక వేటగాడు ఆ రెంటినీ పట్టి రాజుగారికి కానుకగా సమర్పించాడు. రాజు వాటి అందానికి, మాటలకు ముగ్ధుడై బంగారు పంజరాలు చేయించి పెంచుకోసాగాడు. వాటికి రుచికరమైన ఆహారం అందిస్తూ, వాటిని అల్లారుముద్దుగా చూసుకుంటున్నాడు.

కొన్నాళ్లు గడిచాయి.

ఒకరోజున అదే వేటగాడు ఒక అందమైన కోతిని పట్టి తెచ్చి రాజుకు సమర్పించాడు. దాని చేష్టలకు ముచ్చటపడ్డ రాజు, దాన్ని ఎంతో శ్రద్ధతో పెంచుతున్నాడు. కొత్తగా వచ్చిన కోతి మీద శ్రద్ధ పెరగడంతో చిలుకల మీద అశ్రద్ధ ఏర్పడింది. వాటికి సరైన ఆలనాపాలన లేక చిక్కిపోయాయి.

ఈ పరిస్థితి చూసిన చిన్న చిలుక, పెద్ద చిలుకతో– ''చూశావా అన్నా! రాజుగారికి కోతిమీద ఇష్టం పెరిగింది. మనకు అన్న పానీయాలు అందడం లేదు. మనం ఇక్కడినుంచి వెళ్లిపోదాం'' అంది.

అప్పుడు అన్న చిలుక– తమ్ముడూ! తొందరవద్దు. రాజుకి మన మీద ప్రేమ లేక కాదు. కొత్తగా వచ్చింది కాబట్టి కోతిమీద అతని ప్రేమ మళ్లింది. అది కోతి. దాని చేష్టలే దాన్ని ఇక్కడినుంచి తరిమేస్తాయి. సహనం వహించు'' అన్నాడు.


ఆ రాజుగారికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఒకసారి వారు ఆ కోతి దగ్గరకు వచ్చి ఆటపట్టించారు. కోతికి కోపం వచ్చి, పళ్లు బైటకు తీసి, చెవులు రిక్కించి గట్టిగా అరిచి వాళ్ల మీదికి దూకింది. దానితో వాళ్లు భయంతో కేకలు పెట్టారు. రాజుకి విషయం తెలిసి, 'ఆ కోతిని బైటికి తరిమేయండి'అని ఆజ్ఞాపించాడు.

కోతిపోయాక రాజుగారి ఆలనాపాలనా చిలుకల మీదకి మళ్లింది. చిలుకల అందం, మధుర భాషణం వల్ల వీటికి తిరిగి మర్యాదలు దక్కాయి. వాటి సహన గుణమే వాటికి మేలు చేసింది.

- డా. బొర్రా గోవర్ధన్

ఓషో మాట

## యాదృచ్ఛికం!!



అతనొక రాజు. వివేకవంతుడు. అతనొకమారు ఆస్థాన జ్యోతిషుని పిలిచి 'మీ శాస్త్రం ఎంతో క్లిష్టమైనది. ఒకరి ప్రవర్తనను భవిష్యత్తుని ముందుగానే నిర్ణయించి చెప్పడం అసాధ్యం. ఎందుకంటే జీవితపయనంలో ఎన్నో అడ్డదారులున్నాయి. ఓ మనిషి ఎప్పుడైనా మారిపోవచ్చు. దాన్నెవరూ తప్పించలేరు. ఎవరి జీవితం వారిదే. కానీ ఎవరి గురించైనా చెప్పడం సాధ్యమే అనే మీ మాటను మీరు నిరూపించుకోవాలి' అంటాడు.

రాజుగారి కోటకు ఎదురుగా ఓ నది ఉంది. దానిపైన ఓ వంతెన. దానిపై నుంచి ఓ బిచ్చగాడు రోజూ వచ్చి రాజుగారి కోటకు సమీపంలో ఓచోట కూర్చుంటాడు. అతడు తాను కూర్చునే చోట మరెవరినీ కూర్చోనివ్వడు అన్నాడు జ్యోతిషుడు.

'రేపు ఉదయం ఆ బిచ్చగాడు వంతెనపై నడిచి వస్తున్నప్పుడు ఓ మూల ఓ కుండను బంగారునాణాలతో నింపి ఉంచుదాం. రోజూ ఆ వంతెనపై మొదటగా వచ్చేది ఆ బిచ్చగాడే. ఏం జరుగుతుందో చూద్దాం' అన్నాడు రాజు.

మరుసటిరోజు పొద్దున్నే రాజు, జ్యోతిషుడు బంగారునాణాలతో నింపిన కుండను తీసుకువెళ్లి వంతెనపై ఓ మూల ఉంచి ఇవతలకొచ్చి బిచ్చగాడు వచ్చే వరకూ ఓ పక్కన నిల్చున్నారు.

బిచ్చగాడొచ్చాడు. కళ్ళుమూసుకుని చేతిలో ఓ కర్ర ఉంచుకుని ఆ కుండను దాటుకుంటూ తను రోజూ ఎక్కడ కూర్చుంటాడో అక్కడకు వెళ్ళిపోయాడు.

రాజు, జ్యోతిషుడు కాస్సేపు తర్వాత బిచ్చగాడి దగ్గరకు వెళ్ళి మాట్లాడుతారు. అప్పుడు బిచ్చగాడంటాడు–

'ఈరోజు నాకొకటనిపించింది. ప్రపంచంలో ఏ క్షణంలోనైనా ఏదైనా జరగొచ్చు. ఒకవేళ నేను కంటిచూపు కోల్పోయినా నేనిక్కడికి ఎలా చేరుకోగలనో అని ఈరోజు నటించాను. అనుకున్నట్లే నా యథాస్థానానికి చేరుకోగలిగాను. నా లెక్క తప్పలేదు...' అని.

అంతట రాజు 'చూసేరా! మనం బంగారు నాణాలతో నింపిన కుండను ఓ చోట ఉంచడం, అతను సరిగ్గా ఈరోజే గుడ్డివాడిగా నటించాలనుకోడం యాదృచ్ఛికంగా జరిగాయి. ఇది ఆశ్చర్యంగా అనిపించడం లేదు' అన్నాడు.

దాదాపుగా అందరు బిచ్చగాళ్ళు ఇలాగే ప్రవర్తిస్తారు. అయితే మనం ఎవరో ఒక బిచ్చగాడికే ఎప్పుడూ మనకు తెలీకుండానే భిక్ష వేస్తుంటాం. ఓ రైల్వే స్టేషన్ సమీపంలో ఎప్పుడూ కనిపించే ఓ వృద్ధ బిచ్చగాడికి బదులు ఓ యువబిచ్చగాడు కనిపించాడు. అతనిని ఆ వృద్ధుడేడి అని అడిగితే ఆయన తన మామగారని, తనకీ చోటు వరకట్నంగా ఇచ్చాడని అన్నాడు.

అందుకే ఓషో అంటారు...

ఒకడు జ్ఞానం పొందుతాడు అని నిర్ణయించి చెప్పడం కష్టసాధ్యమని!

- యామిజాల జగదీశ్

పరిహారం

## పెళ్లి ప్రయత్నాలు ఫలించడం లేదా..?

పెళ్లిళ్ల కోసం కొందరు ఎన్ని ప్రయత్నాలు సాగించినా ఫలించవు. జాతకాల్లో కుజ దోషం, కళత్ర, ద్వితీయ స్థానాల్లో దుష్టగ్రహాల ప్రభావం వంటి లోపాలు ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉంటాయి. జాతకం చూపించుకుని నిర్దిష్టమైన పరిహారాలు పాటించడం వల్ల ఫలితాలు ఉంటాయి. అయితే, కొందరికి జాతకచక్రాలు ఉండవు. అలాంటి వారు కొన్ని సాధారణ పరిహారాలను పాటించడం వల్ల పెళ్లి ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉంటాయి. పెళ్లి యత్నాలు సఫలం కావాలంటే ఇలా చేసి చూడండి...

- నిద్రపోయే ముందు తల వద్ద ఒక రాగి చెంబుతో నీళ్లు పెట్టుకోండి. ఉదయాన్నే ఆ నీటిని మొక్కలకు పోయండి. వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయండి. శక్తి చాలకుంటే కనీసం చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారికి తోచిన సాయం చేయండి.
- ప్రతి గురువారం పశువులకు తీపిరొట్టెలు తినిపించండి. అలాగే ఆలయాల వద్ద యాచకులకు కూడా తీపిరొట్టెలను పంచిపెట్టండి.
- శ్రీకృష్ణ యుగళ మంత్రాన్ని ప్రతిరోజూ 108 సార్లు పఠించండి. ఇంట్లో రోజువారీ చేసే పూజలో భాగంగా శ్రీకృష్ణుడికి ధూపదీపాలు సమర్పించండి.
- కుంకుమ పువ్వును, కస్తూరిని పాలలో రంగరించి తిలకంగా ధరించండి. ఎరుపు రంగు రుమాలును దగ్గర ఉంచుకోండి. పర్సులో రాగినాణెం ఉండేలా చూసుకోండి.
- గర్వాన్ని, దర్పాన్ని ప్రదర్శించే అలవాటును మానుకోండి. పెద్దలను గౌరవించండి. పిన్నలను ఆదరించండి. ఎవ్వరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్భాషలాడకండి.
- శుష్క వాగ్దానాలు చేయడం మానుకోండి. ఎవరికైనా మాట ఇస్తే ఆ మాటను కచ్చితంగా నిలబెట్టుకోండి.

- సాంఖ్యాయన

నిమిషం విషయం



### గడపకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెడితే..?

వారానికి ఒక సారి ప్రధాన ద్వారపు గడపకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టడం చాలా మంచిది. లేదంటే కనీసం పర్వదినాల్లో అయినా గడపకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టాలి. అలా చేయడం లక్ష్మీప్రదం. దుష్టశక్తులు ఇంటిలోనికి రావు. ఇంటి గడపకు పైన నల్లటి తాడుతో పటిక కట్టండి. శుక్రవారం రోజున ఉదయం స్నానం చేసి కడితే దృష్టి దోషం తొలగిపోతుంది. పండుగ రోజుల్లో మామిడి తోరణాలు కట్టడం ఇంటికి సౌభాగ్యాన్నిస్తుంది.



### దీపారాధన ఎప్పుడు చేయాలి?

అలాగే ఇంట్లో వారానికి ఒకసారి శుక్రవారం పూట లేదంటే, శని, గురువారాల్లో తప్పకుండా దీపారాధన చేయాలి. అసలు ప్రతిరోజూ చేస్తే మంచిది. పూజగదిని ఎప్పుడూ పరిశుభ్రంగా, పవిత్రంగా వుంచుకోవాలి. స్నానం చేయకుండా, అపరిశుభ్రమైన దుస్తులతో కాళ్లు కడుక్కోకుండా పూజగదిని తెరవ రాదు. దేవుళ్ల ప్రతిమలను తాకరాదు. దీపారాధన చేసిన తర్వాత దేవుళ్ల ప్రతిమలకు లేదా పటాలకు పూలు అలంకరించాలి. పూజగది ఎంత కళకళలాడితే అంతగా మన జీవితాలు కళకళలాడుతాయని పండితులు చెప్తున్నారు. వీలైనంతవరకు రెండు లేదా మూడు పటాలను మాత్రమే పూజగదిలో ఉంచాలి. అంతేకానీ, సన్నిహితులు, బంధువులు ఇచ్చిన చిన్న దేవుళ్ళ ఫోటోలతో పూజామందిరాన్ని నింపడం మంచిది కాదని పెద్దల మాట.

ఖురాన్ వాక్కు

## అప్పు పత్రం



విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు ఆ వ్యవహారాన్ని రాసి పదిలపరచండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి రాయాలి. అల్లాహ్ ఎవడికైతే అక్షర జ్ఞానం ప్రసాదించాడో అతడు రాయడానికి నిరాకరించకూడదు, అతడు రాయాలి. బాధ్యత మోనబడిన వ్యక్తి (అప్పు తీసుకునేవాడు) చెప్పి రాయించాలి... నిర్ణయమైన షరతులలో హెచ్చు తగ్గులు చేయరాదు కానీ రుణం తీసుకునే వ్యక్తి అమాయకుడు లేక బలహీనుడు లేక చెప్పి రాయించలేని అసమర్థుడు అయితే అతని సంరక్షకుడు న్యాయంగా చెప్పి రాయించాలి. ఇంకా మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒక స్త్రీ మరచిపోతే రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేయిస్తుంది. ఎవరి సాక్ష్యం మీ అందరికీ ఆమోదయోగ్యమో వారి నుండి ఈ సాక్ష్యాలు ఎన్నుకోబడాలి. సాక్ష్యం ఇవ్వండి అని ఆహ్వానించినప్పుడు సాక్షులు నిరాకరించకూడదు. వ్యవహారం చిన్నదైనా పెద్దదైనా దానిని గడువు నిర్ణయం రూపంలో రాయించడానికి అశ్రద్ధ చేయకూడదు. అల్లాహ్ దృష్టిలో ఈ పద్ధతి మీ కొరకు అత్యంత న్యాయసమ్మతమైనది. సులభంగా సాక్ష్య నిర్ణయం చేయడానికి ఇది తోడ్పడుతుంది. ఇంకా మీరు అనుమానాలకు, అపోహలకు గురి అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది, కానీ మీరు అప్పటికప్పుడు పరస్పరం చేసుకునే సాధారణ వ్యాపార సంబంధమైన లావాదేవీలను రాయకుండా ఉంటే అందులో అభ్యంతరం లేదు. కానీ వ్యాపార వ్యవహారాలు నిశ్చయించేటప్పుడు, తప్పకుండా సాక్షులను పెట్టుకోండి. దస్తావేజులు రాసే వానినీ, సాక్షులనూ పీడించకూడదు. ఆ విధంగా చేస్తే అది పాపం అవుతుంది. అల్లాహ్ ఆగ్రహం నుండి రక్షించుకోండి. ఆయన మీకు సరియైన పద్ధతిని బోధిస్తున్నాడు ఆయనకు ప్రతిదీ తెలుసు.

(దివ్య ఖుర్ ఆన్:2:282)

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

## దేవుని ప్రసిద్ధ చిరునామా

సువార్త



ఈ భూమి మీద ఉన్న దేవుని రాజ్యమే క్రీస్తు ప్రభువు సంఘం. క్రీస్తును బట్టి క్రీస్తు నందు పరలోకం, భూలోకం ఏకము చేయబడ్డాయి. కారణం ఏమిటంటే, దేవుని కుమారునిగా ఆయన అధికార ప్రతినిధిగా, ప్రవక్తగా క్రీస్తు ఈ భూమి మీద దేవుని ప్రజలకు ఎంతో పరిచర్య చేశాడు. తన నిండు యవ్వన ప్రాయాన్ని బలిగా అర్పించేంతగా పరిచర్య చేశాడు. ప్రతిగా తన బలాతిశయం చేత దేవుడు క్రీస్తును మరణం నుండి లేపి తన పక్షాన ఏలే రాజుగా నియమించుకున్నాడు. తన కుడి పక్కన కూర్చుండబెట్టుకున్నాడు. ఈ భూమి మీద దేవుని చిరునామా ఎక్కడో అన్నది ఇప్పుడు అది చాలా ఆసక్తికరం. సత్య వాక్యాన్ని సరిగా విభజిస్తూ ఆ వివరాల్లోకి వెళ్ళడం ఉపయుక్తమే మరి. బైబిలులో మూడు కాలాలు లేదా మూడు యుగాలు ఉన్నాయి. మొదటి, రెండు యుగాలలో దేవుడు వ్యక్తులతో చేసిన ఒడంబడికలు, జాతితో చేసిన నిబంధనలను బట్టి దేవుని చిరునామా మారుతూ వచ్చింది. ఇప్పుడు ఈ యుగాన దేవునికి ఈ భూమి మీద శాశ్వత చిరునామా అంటూ ఒకటి ఉండనే ఉంది. అది ఒక్క మెస్సీయ అనబడే క్రీస్తును బట్టి మాత్రమే ఈ అరుదైన చిరునామా.

క్రీస్తు తన తండ్రియైన దేవుని సంకల్ప ప్రకారంగా ఈ భూమి మీద ప్రాణ త్యాగం చేయబట్టే ఇక్కడ దేవుని నివాస స్థావరం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. ఉన్నత లోకమందు మహా మహుడగు దేవుడు ఉన్నాడు. అది దేవుని పరలోక చిరునామా. అయితే ఇక్కడ ఈ భూమి మీద ఉన్న క్రీస్తు సంఘమే దేవుని చిరునామా. మనుష్యుల అంతరంగలో జీవాత్మను సృజించే యెహోవా దేవుని నివాసం చాలా చాలా ఉన్నతమైనది.

భూ భౌతిక కట్టడాలు, బోర్డులు, దృశ్యప్రధాన వస్తువులు ఇలాంటి అనిత్యములు ఏవీ దేవుని చిరునామాను ఎన్నడూ తెలుపలేవు. సంఘమే, దాని సభ్యులే ఆసక్తిగల వారికి దేవుణ్ణి గూర్చి పరిచయం చేస్తారు. వారే ఆయనను గూర్చి సవివరంగా, ఉన్నతంగా, క్రమశిక్షణ గల తమదైన జీవిత విధానం, నడవడికల ద్వారా బోధిస్తూ తెలియజేస్తారు. నిజానికి, ఇదే దేవుని చిరునామా అనుటలో గల ఉన్నత భావము. వీరే దేవుని చిరునామా అనునది లేఖన సారం.

కేవలం దేవుని చిరునామా తెలుసుకొనుటలో, దాన్ని ఎడతెగక అన్వేషించి కనుగొనుటలో ఆనందం ఏమాత్రం ఉండనే ఉండదు. మధ్యవర్తి, మార్గమైన క్రీస్తు ప్రభువు ద్వారా అంతిమ గమ్యమైన దేవుని చెంతకు విధేయంగా చేరుకొని, ఆత్మ సంబంధంగా దేవునికి నివాస స్థలమై, స్థావరమై ఉండుటే ఆయనను తెలుసుకొన్నాము అనుటలోని అంతరార్థం. ఇలా దేవునికి దగ్గరై, అతి చేరువై, అరుదైన ఆయన ప్రసిద్ధ చిరునామాగా, ఆయనకు నివాస యోగ్యంగా ఉండి వర్ధిల్లుటలోనే ఆనందం ఉంటుంది.

'పవిత్ర హృదయం, మంచి మనస్సాక్షి, నిష్కపటమైన విశ్వాసము నుండి కలిగే ప్రేమే ఉపదేశసారం' అంటూ తన పత్రికల ద్వారా పౌలు చెప్పుట గమనార్హం. నిజానికి ప్రేమ ఎక్కడ ఉంటే దేవుడు అక్కడ ఉంటాడు. ఎందుకంటే దేవుడు ప్రేమా స్వరూపి. సత్య ప్రేమలయందు ఉంటూ సత్య విషయమైన ప్రేమను అవలంభించే క్రీస్తు ప్రభువు సంఘమే దేవుడు నిలిచి ఉండే చోటు అని అదే ఆయన ఉన్నత చిరునామా అంటూ అపొస్తలుడు మరియు లేఖికుడైన యోహాను గారు తేటగా తెలియజేస్తున్నారు. ఇది దేవుని చిరునామా గూర్చిన అసలైన సమాచారం.

- జేతమ్

ధర్మ సందేహాలు



**పూజాసమయంలో మడి కట్టుకున్నవారిని పొరపాటున పిల్లలు తాకితే కష్టాలొస్తాయా?**

– ఆర్. జ్ఞానప్రసూనాంబ, విజయవాడ

ఇలాంటి ఇబ్బందులొస్తాయని గ్రహించిన పెద్దలు ఆ పిల్లల్ని నేరం చేసినవాళ్లగా భావించకుండా ఉండేందుకని మగవారికి ధావళీని, స్త్రీలకి పట్టుబట్టనీ ఏర్పాటు చేశారు. ఈ రెండు తీరుల వస్త్రాలూ భోజన సమయంలో ధరించినట్లయితే ఉతికి ధరించాల్సిందే.

సాక్షి ప్లస్
గురువారం । 24-10-2024

## బిజినెస్ రీల్

### మెట్రో క్యాష్ అండ్ క్యారీ 20 ఏళ్ల సంబరాలు..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హోల్‌సేల్ రంగంలో ఉన్న మెట్రో క్యాష్ అండ్ క్యారీ భారత్‌లో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మెట్రో–ఫెస్టివ్ గిఫ్టింగ్ సంబరాలను నవంబర్ 3 వరకు జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో రిటైలర్స్, కిరాణా వర్తకులు, కార్యాలయాలు, సంస్థలకు ఎక్కువ లాభాలను చేకూర్చేలా గిఫ్టింగ్ ఆఫర్స్ అందిస్తున్నట్టు మెట్రో క్యాష్ అండ్ క్యారీ తెలిపింది.

### ఆకాశ్ రూ.100 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ తన ఎడ్‌టెక్ విభాగమైన ఆకాశ్ డిజిటల్ పునర్నిర్మాణం, వృద్ధికి 18–24 నెలల్లో సుమారు రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది. ఆకాశ్ డిజిటల్ క్లాస్‌రూమ్స్ విస్తరణలో భాగంగా సాంకేతికత, కంటెంట్, ఉపాధ్యాయ సామర్థ్యాలు, డెలివరీలో ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తామని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఎండీ, సీఈవో దీపక్ మెహరోత్రా తెలిపారు.

### అనధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ పట్ల ఆర్‌బీఐ హెచ్చరిక

ముంబై: అనధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) హెచ్చరించింది. ఈ మేరకు ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల అలర్ట్ లిస్ట్‌లో మరో 13 కంపెనీలను జోడించింది. తద్వారా అలర్ట్ లిస్ట్‌లో చేరిన కంపెనీల సంఖ్య 88కి చేరుకుంది. రేంజర్ క్యాపిటల్, టీడీఎఫ్ఎక్స్, ఐనెఫెక్స్, యార్కర్ఎఫ్ఎక్స్, గ్రోలైన్, థింక్ మార్కెట్స్, స్మార్ట్ ప్రాప్ ట్రేడర్, ఫండెడ్‌నెక్ట్స్, వెల్‌ట్రేడ్, ఫ్రెష్‌ఫారెక్స్, ఎఫ్ఎక్స్ రోడ్, టీటీజీ మార్కెట్స్, ప్లస్‌వన్‌ట్రేడ్ వీటిలో ఉన్నాయి. అలర్ట్ లిస్ట్ సమగ్రమైనది కాదని, జాబితాలో లేనంత మాత్రాన ఆ కంపెనీని అధీకృతమని భావించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్–1999 (ఫెమా) ప్రకారం ఫారెక్స్‌లో డీల్ చేయడానికి అధికారం లేని లేదా ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ (రిజర్వ్ బ్యాంక్) ఆదేశాలు–2018 ప్రకారం ఫారెక్స్ లావాదేవీల కోసం ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ (ఈటీపీ) ఆపరేట్ చేయడానికి అధికారం లేని కంపెనీల పేర్లను అలర్ట్ లిస్ట్‌లో చేరుస్తారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 24-10-2024 | |
|---|---|
| విశాఖ | 540–00 |
| చిత్తూరు | 568–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 535–00 |
| విజయవాడ | 540–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 515–00 |
| వరంగల్ | 517–00 |
| రిటైల్ ధర | 5.75 |

### నేటి బోర్డు సమావేశాలు

ఐటీసీ, అదానీ విల్మార్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పతంజలి ఫుడ్స్, ఏసీసీ, సైయంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్, ఎన్‌టీపీసీ, దాల్మియా కెమికల్స్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, ఫినోలాక్స్ ఇండస్ట్రీస్, కాల్గేట్, గోద్రేజ్ కన్సూమర్, ఆర్తి డ్రగ్స్, లారస్ ల్యాబ్స్, గ్లెన్‌మార్క్ లైఫ్, దిక్సాన్ టెక్నాలజీస్, కాస్ట్రాల్, సీఎస్‌బీ బ్యాంక్, డీసీబీ బ్యాంక్, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, నిప్పాన్ లైఫ్, సీజీ ఆటో గేర్స్, అగ్రో టెక్ ఫుడ్స్, యూనిటెక్ బేవరేజెస్, బికాజీ ఫుడ్స్.

### నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BAJFINANCE | 7,004.85 | 4.9 |
| TECHM | 1,732.85 | 2.14 |
| TATACONSUM | 1,016.00 | 1.78 |
| BAJAJ-AUTO | 10,550.00 | 1.75 |
| HDFCBANK | 1,736.20 | 1.26 |

### నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| M&M | 2,794.30 | -3.22 |
| SUNPHARMA | 1,836.70 | -2.69 |
| EICHERMOT | 4,660.70 | -2.07 |
| SHRIRAMFIN | 3,194.00 | -1.86 |
| POWERGRID | 316.8 | -1.84 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 6,975 |
| ఎన్ఎస్ఈ | 1,16,764 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 2,60,873 |
| ఎఫ్ఐఐ | - 5,685 |
| డీఐఐ | + 6,040 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 70.78 | $ 71.74 |
| బ్రెంట్ | 75.00 | $ 76.04 |

# డిమాండ్ తగ్గుతుంది.. అలా చెప్పలేం

## ధర పెరుగుదల నేపథ్యంలో బంగారం కొనుగోలుపై భిన్న స్పందన

ముంబై: పసిడి ధరల తీవ్రత నేపథ్యంలో.. వినియోగదారుల కొనుగోళ్లు ఎలా ఉంటాయన్న అంశంపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ఆ అభిప్రాయాలు క్లుప్తంగా...

### డిమాండ్ పడిపోవచ్చు



కస్టమ్స్ సుంకాలు తగ్గినప్పటికీ అటు అంతర్జాతీయ ఇటు దేశీయ పరిణామాలతో పసిడి ధరలు రికార్డులను సృష్టిస్తున్నాయి. దీపావళికి ముందు చోటుచేసుకుంటున్న ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో ధన్‌తేరస్‌లో డిమాండ్, కొనుగోళ్ల పరిమాణాలు తగ్గుతాయని భావిస్తున్నాం. గత ధన్‌తేరాస్‌తో పోల్చితే కొనుగోళ్ల పరిమాణం కనీసం 10 నుంచి 12 శాతం తగ్గుతుందని అంచనా. అయితే పెరిగిన ధరల వల్ల విలువలో కొనుగోళ్లు 12 నుంచి 15 శాతం పెరగవచ్చు.

– సువంకర్ సేన్, సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ, సీఈఓ

### గత ఏడాదికి సమానంగా బిజినెస్



ధరలు పెరుగుతున్నప్పటికీ మేము మంచి వ్యాపారాన్ని ఆశిస్తున్నాము. ధన్‌తేరస్ తర్వాత 40 లక్షలకు పైగా వివాహాలు జరుగుతున్నందున అమ్మకాలు గత సంవత్సరం మాదిరిగానే ఉండవచ్చని మేము ఆశిస్తున్నాము. ధన్‌తేరస్ నాడు అమ్మకాల పరిమాణం 20 నుంచి 22 టన్నులు ఉండవచ్చు, ఇది గత ఏడాదికి దాదాపు సమానం.

– నయం మెహ్రా, ఆల్ ఇండియా జీజేసీ చైర్మన్

### ఆశాజనంగానే ఉన్నాం...



రెండో త్రైమాసికంలో బులియన్ మార్కెట్ పటిష్టంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పండుగల సమయంలో అమ్మకాలపై మేము ఆశాజనకంగా ఉన్నాము. పండుగలకు ప్రీ-బుక్ ఆర్డర్‌లు కూడా బాగానే కనిపిస్తున్నాయి. సాధారణంగా సానుకూల సెంటిమెంట్ ఉన్నప్పుడు ఇది కనిపిస్తుంది. అకస్మాత్తుగా ధర పెరిగితే వినియోగదారులు కొంత విరామం తీసుకునే మాట వాస్తవమే. అయితే ఈ రోజుల్లో వినియోగదారులు తమ బడ్జెట్ మేరకు కొనుగోళ్లను కొనసాగిస్తున్నారు. కాబట్టి మేము ఈ దశలో 'కొనుగోళ్ల పరిమాణం' గురించి ఇప్పుడు మాట్లాడము.

– టీఎస్ కళ్యాణరామన్, కళ్యాణ్ జ్యువెలర్స్ ఎండీ

### పెళ్లిళ్ల సీజన్‌తో డిమాండ్ పదిలం



బంగారం ధరలు రికార్డు స్థాయిలను తాకినప్పటికీ కొనుగోళ్ల విషయంలో పరిశ్రమ నుండి వచ్చిన సమాచారం సానుకూలంగానే ఉంది. కొనసాగుతున్న పండుగల కారణంగా బంగారం కొనుగోళ్ల డిమాండ్ పటిష్టంగా ఉండే వీలుంది. పెట్టుబడి సెంటిమెంట్, వివాహ సంబంధిత కొనుగోళ్లు పరిశ్రమకు అండగా ఉండే అవకాశాలే ఎక్కువ. వ్యవసాయ పరిస్థితుల మెరుగుదల, ఆదాయాలు పెరగడం, ఎకానమీ, వినియోగం పటిష్టత వంటి అంశాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పసిడికి డిమాండ్ ఉటుంది.

– సచిన్ జైన్, డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ

### దేశమంతా 'ఒకే ధర': ఇదే లక్ష్యమన్న జీజేసీ



దేశ వ్యాప్తంగా ఒకే బంగారం ధర లక్ష్యంతో 'వన్ నేషన్ వన్ గోల్డ్ రేట్' విధానం అమలుకు కృషి చేస్తున్నట్లు అఖిల భారత రత్నాలు, ఆభరణాల దేశీయ మండలి (జీజేసీ) ప్రకటించింది. ''మేము ఒకే ధర వద్ద బంగారం దిగుమతి చేసుకుంటాము, కానీ దేశీయ రిటైల్ ధరలు ఒక నగరం నుండి మరొక నగరానికి భిన్నంగా ఉంటాయి. దేశవ్యాప్తంగా ఒకే రేటు కొనసాగాలని మేము కోరుకుంటున్నాము'' అని జీజేసీ సెక్రటరీ మితేష్ ధోర్డా పేర్కొన్నారు. మండలి సభ్యులతో ఇప్పటికే ఈ విషయంపై 50కుపైగా సమావేశాలను నిర్వహించడం జరిగిందని, తమ ప్రతిపాదనకు ఇప్పటికే దాదాపు 8,000 జ్యువెలర్స్ సూత్రప్రాయ ఆమోదం తెలిపారని వివరించారు. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 9 వరకు జరగనున్న వార్షిక గోల్డ్ ఫెస్టివల్ 'లక్కీ లక్ష్మీ' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఈ లక్కీ లక్ష్మీ ఉత్సవంలో 1,500 మంది రిటైలర్లు అలాగే 9 వరకూ చైన్ స్టోర్స్ పాల్గొననున్నాయి. కొనుగోళ్లకు సంబంధించి రూ. 10 కోట్ల విలువైన బహుమతులను అందజేయడం జరుగుతుంది. బంగారంపై రూ. 25,000 కంటే ఎక్కువ ఖర్చు చేసే కస్టమర్లు పండుగ కాలంలో ఖచ్చితమైన బహుమతులు అందుకుంటారు. బాలీవుడ్ నటి ముగ్ధా గాడ్సే సీనియర్ జీజేసీ సభ్యులతో కలిసి ఈ ఉత్సవ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

# పసిడి, వెండి డబుల్ హ్యాట్రిక్


## వరుసగా ఆరవ రోజూ లాభాలు ● సరికొత్త ధర రికార్డు నమోదు



పసిడి, వెండి ధరలు వరుసగా ఆరవరోజూ లాభాల బాటన పయనించాయి. రెండు విలువైన మెటల్స్ ధరలు బుధవారం సరికొత్త గరిష్టాలను నమోదు చేసుకున్నాయి. బంగారం 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర మంగళవారంతో పోల్చితే బుధవారం రూ.500 పెరిగి రూ.81,500కి ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర సైతం అంతే స్థాయిలో పెరిగి రూ.81,100కి చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. వెండి కేజీ ధర రూ.1,000 ఎగసి, రూ. 1.02 లక్షలకు చేరింది. గడచిన ఆరు ట్రేడింగ్ రోజుల్లో వెండి కేజీకి రూ.10,000 పెరిగితే, బంగారం ధర రూ.2,850 ఎగసింది. అమెరికా సరళతర వడ్డీరేట్ల విధానం, డాలర్ బలహీనత, భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వంటి అంశాలతో ఇన్వెస్టర్లను బంగారం ఆకర్షిస్తోంది. దీనికితోడు దేశీయంగా పండుగల సీజన్ నేపథ్యంలో ఆభరణాల వ్యాపారులు, రిటైలర్ల భారీ కొనుగోళ్లు, రూపాయి బలహీన ధోరణి విలువైన మెటల్ ధరలు పెరగడానికి కారణమని బులియన్ వ్యాపారులు తెలిపారు. పారిశ్రామిక డిమాండ్ వెండికి కలిసి వస్తున్న అంశం.

# వారీ ఎనర్జీస్ సరికొత్త రికార్డ్

- ఐపీవో చరిత్రలో అత్యధిక దరఖాస్తులు
- చివరి రోజుకల్లా 76 రెట్లు స్పందన
- దీపక్ బిల్డర్స్ పబ్లిక్ ఇష్యూ సక్సెస్
- దాదాపు 42 రెట్లు అధికంగా బిడ్స్




న్యూఢిల్లీ: సోలార్ ప్యానళ్ల తయారీ కంపెనీ వారీ ఎనర్జీస్ పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్‌ను సాధించింది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా 76 రెట్లుపైగా స్పందన లభించింది. అంతకుమించి ఐపీవో చరిత్రలోనే అత్యధికంగా 97.34 లక్షల దరఖాస్తులను అందుకుంది. ఇంతక్రితం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీవో 90 లక్షల దరఖాస్తులను అందుకుని రికార్డ్ నెలకొల్పగా.. టాటా టెక్నాలజీస్ 73 లక్షల అప్లికేషన్లు సాధించింది. వారీ ఎనర్జీస్ ఐపీవోకు మొత్తం రూ. 2.41 లక్షల కోట్ల విలువైన బిడ్స్ లభించడం గమనించదగ్గ అంశం.

కంపెనీ 2,10,79,384 షేర్లను విక్రయానికి ఉంచగా.. 160,91,61,741 షేర్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 209 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 62 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 11 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. వెరసి షేరుకి రూ. 1,427–1,503 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 4,321 కోట్లు సమీకరించింది. కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు బలహీనపడటంతో అతిపెద్ద ఐపీవోగా రికార్డు సృష్టించిన హ్యుందాయ్ అంతంత మాత్రంగానే సక్సెస్ అయిన నేపథ్యంలోనూ వారీ ఎనర్జీస్ ఇష్యూకి ఇన్వెస్టర్లు క్యూ కట్టడం విశేషం! కంపెనీ గత వారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,277 కోట్లు సమీకరించింది. 23న ముగిసిన ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 3,600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 48 లక్షల షేర్ల(విలువ రూ. 721 కోట్లు)ను ప్రమోటర్‌తో పాటు, ప్రస్తుత ఇన్వెస్టర్ విక్రయానికి ఉంచారు. ఈక్విటీ జారీ నిధులను ప్రధానంగా ఒడిషాలో ఏర్పాటు చేయనున్న 6 గిగావాట్ల ఇన్‌గాట్ వేఫర్, సోలార్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంటుకు వినియోగించనుంది. కంపెనీ పీవీ మాడ్యూల్ తయారీలో ఉన్న సంగతి తెలిసిందే.

### దీపక్ బిల్డర్స్ సైతం



ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ రంగ కంపెనీ దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. బలహీన మార్కెట్లోనూ ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా దాదాపు 42 రెట్లు అధికంగా స్పందన అందుకుంది. కంపెనీ 89,67,061 షేర్లు ఆఫర్ చేయగా.. 37,24,76,076 షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. క్విబ్ విభాగంలో 14 రెట్లు, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి 82 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఏకంగా 40 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. షేరుకి రూ. 192–203 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 260 కోట్లు సమకూర్చుకుంది.

# చైనా వస్తువుల దిగుమతులకు చెక్

### 5 ప్రొడక్టులపై యాంటీడంపింగ్ డ్యూటీ విధింపు


న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా చైనా నుంచి దిగుమతయ్యే ఐదు వస్తువులపై ఐదేళ్లపాటు అమలయ్యేలా యాంటీడంపింగ్ డ్యూటీకి తెరతీసింది. వీటిలో గ్లాస్ మిర్రర్, సెల్‌ఫోన్ ట్రాన్స్‌పరెంట్ ఫిల్మ్ తదితరాలున్నాయి. తద్వారా పొరుగు దేశం నుంచి భారీగా దిగుమవుతున్న వస్తువులకు చెక్ పెట్టింది. దీంతో చౌక దిగుమతుల నుంచి దేశీ తయారీదారులకు రక్షణలభించనుంది. యాంటీడంపింగ్ డ్యూటీ విధించిన చైనా వస్తువుల జాబితాలో ఐసోప్రొపిల్ ఆల్కహాల్, సల్ఫర్ బ్లాక్, సెల్‌ఫోర్ ట్రాన్స్‌పరెంట్ ఫిల్మ్, థెర్మోప్లాస్టిక్ పాలీయురెథేన్, అన్‌ఫ్రేమ్‌డ్ గ్లాస్ మిర్రర్ చేరాయి. సాధారణ ధరలకంటే తక్కువ ధరల్లో ఈ వస్తువులు చైనా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్నాయి. రెవెన్యూ శాఖ, పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డ్ విడిగా జారీ చేసిన ఐదు నోటిఫికేషన్ల ద్వారా డ్యూటీలు ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించింది. మెడికల్, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఐసోప్రొపిల్ ఆల్కహాల్‌పై టన్నుకి 82 డాలర్ల నుంచి 217 డాలర్ల మధ్య వివిధ కంపెనీలపై సుంకాన్ని విధించింది. చర్మంపై యాంటీసెప్టిక్, హ్యాండ్ శానిటైజర్‌గానూ ఈ ప్రొడక్ట్ వినియోగమవుతోంది. టెక్స్‌టైల్ డయింగ్, పేపర్, లెదర్ తయారీలో వినియోగించే సల్ఫర్‌బ్లాక్‌పై టన్నుకి 389 డాలర్ల సుంకాన్ని ప్రకటించింది. ఈ బాటలో ఆటోమోటివ్, మెడికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో వినియోగించే థెర్మోప్లాస్టిక్ పాలీయురెథేన్‌పై కేజీకి 0.93 డాలర్ల నుంచి 1.58 డాలర్లు, ప్యాకేజింగ్ మెటీరియల్‌గా వినియోగించే సెల్‌ఫోన్ ట్రాన్స్‌పరెంట్ ఫిల్మ్‌పై కేజీకి 1.34 డాలర్లు చొప్పున డ్యూటీ విధించింది. అన్‌ఫ్రేమ్‌డ్ గ్లాస్ మిర్రర్‌లపై టన్నుకి 234 డాలర్ల యాంటీడంపింగ్ సుంకాన్ని ప్రకటించింది. వాణిజ్య శాఖ పరిశోధన విభాగం డీజీటీఆర్ సూచనలమేరకు ప్రభుత్వం తాజా చర్యలను చేపట్టింది.



### సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

# టీవీఎస్ మోటార్ కొత్త రికార్డ్

- 12.28 లక్షల యూనిట్ల విక్రయం
- క్యూ2 లాభం రూ. 588 కోట్లు




న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 41 శాతం జంప్‌చేసి రూ. 588 కోట్లను అధిగమించింది. రికార్డ్ అమ్మకాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 416 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,933 కోట్ల నుంచి రూ. 11,302 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 9,297 కోట్ల నుంచి రూ. 10,428 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో ఎగుమతులతోపాటు ద్విచక్ర, త్రిచక్ర వాహన అమ్మకాలు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 12.28 లక్షల యూనిట్లను తాకాయి. గత క్యూ2లో నమోదైన 10.74 లక్షల యూనిట్లతో పోలిస్తే ఇది 14 శాతం వృద్ధి. వీటిలో మోటార్ సైకిళ్ల విక్రయాలు 14 శాతం పుంజుకుని 5.6 లక్షల యూనిట్లకు చేరగా.. స్కూటర్ అమ్మకాలు 17 శాతం ఎగసి 4.9 లక్షల యూనిట్లను తాకాయి. ద్విచక్ర వాహన ఎగుమతులు 16 శాతం బలపడి 2.78 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ఇక త్రిచక్ర వాహన అమ్మకాలు 5,000 యూనిట్లు తగ్గి 38,000కు పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాలు 31 శాతం అధికంగా 75,000 యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు బీఎస్ఈలో 3.6 శాతం పతనమై రూ. 2,565 వద్ద ముగిసింది.**

# ఎస్‌బీఐ లైఫ్ లాభం జూమ్

### రూ. 529 కోట్లుగా నమోదు




న్యూఢిల్లీ: బీమా రంగ దిగ్గజం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 39 శాతం జంప్‌చేసి రూ. 529 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 380 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 28,569 కోట్ల నుంచి రూ. 40,015 కోట్లకు ఎగసింది. నికర ప్రీమియం రూ. 216 కోట్లు పెరిగి రూ. 20,266 కోట్లను తాకింది. తొలి ఏడాది ప్రీమియం రూ. 4,633 కోట్ల నుంచి రూ. 4,916 కోట్లకు వృద్ధి చూపింది. నిర్వహణలోని ఆస్తులు 28 శాతం బలపడి రూ. 4.4 లక్షల కోట్లకు చేరాయి.

**ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ లైఫ్ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 1,715 వద్ద ముగిసింది.**

# గోద్రెజ్ ప్రాపర్టీస్ బుకింగ్స్ రికార్డ్

### క్యూ2 లాభం రూ. 335 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు ఎగసి రూ. 335 కోట్లను అధిగమించింది. అధిక ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 67 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 605 కోట్ల నుంచి రెట్టింపునకుపైగా జంప్‌చేసి రూ. 1,347 కోట్లకు చేరింది. ఈ కాలంలో 3 శాతం వృద్ధితో రూ. 5,198 కోట్ల బుకింగ్స్‌ను అందుకుంది. దీంతో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో బుకింగ్స్ 90 శాతం దూసుకెళ్లి రూ. 13,835 కోట్లను తాకాయి. వెరసి ఏప్రిల్–సెప్టెంబర్‌లో కంపెనీ చరిత్రలోనే అత్యధిక బుకింగ్స్‌ను సాధించినట్లు ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పిరోజ్‌షా గోద్రెజ్ తెలియజేశారు. వసూళ్లు, క్యాష్ ఫ్లో సైతం భారీగా మెరుగుపడినట్లు తెలియజేశారు. ఫలితంగా ఈ ఏడాది రూ. 27,500 కోట్ల బుకింగ్స్ లక్ష్యాన్ని అధిగమించనున్నట్లు స్పష్టం చేశారు. గతేడాది రూ. 22,527 కోట్ల బుకింగ్స్ సాధించింది.

**ఫలితాల నేపథ్యంలో గోద్రెజ్ ప్రాపర్టీస్ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం ఎగసి రూ. 2,961 వద్ద ముగిసింది.**

# యూపీఐ @ 20,63,994 కోట్లు




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టంట్ పేమెంట్ వ్యవస్థ అయిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సరికొత్త రికార్డులతో దూసుకెళుతోంది. సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా 1,504.1 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి విలువ రూ.20,63,994.7 కోట్లు. ఒక్కో నెలలో లావాదేవీల విలువ రూ.20 లక్షల కోట్లకుపైగా నమోదవడం వరుసగా ఇది అయిదవసారి. దేశంలో ఎక్కడి నుంచైనా తక్షణం చెల్లించే వీలుండడం, సురక్షితం కావడం, క్షణాల్లో లావాదేవీ పూర్తి అవడం వంటి విశిష్టతల కారణంగా యూపీఐ వినియోగం ఎప్పటికప్పుడు సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తోంది. ప్రస్తుతం 622 బ్యాంకులు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. 2023 సెప్టెంబర్‌లో రూ.15,79,133 కోట్ల విలువైన 1055.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ గణాంకాలనుబట్టి చూస్తే యూపీఐ లావాదేవీల వేగం అర్థం చేసుకోవచ్చు.

**తొలి స్థానంలో ఫోన్‌పే:** యూపీఐ యాప్స్‌లో ఫోన్‌పే విజయపరంపర కొనసాగిస్తోంది. లావాదేవీల విలువ పరంగా ఏకంగా రూ.10 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించిన తొలి యూపీఐ యాప్‌గా రికార్డుల్లోకెక్కింది. ఫోన్‌పే సెప్టెంబర్‌లో రూ.10,30,871 కోట్ల విలువైన 722.1 కోట్ల లావాదేవీలు నమోదు చేసింది. నమోదైన మొత్తం యూపీఐ లావాదేవీల సంఖ్యలో 48 శాతం, విలువలో 49.94 శాతం వాటా కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో ఉన్న గూగుల్ పే ద్వారా రూ.7,46,690 కోట్ల విలువైన 562.5 కోట్ల లావాదేవీలు నమోదు అయ్యాయి. లావాదేవీల సంఖ్యలో 37.4 శాతం, విలువలో 36 శాతం వాటాను గూగుల్ పే అందుకుంది. గత నెలలో పేటీఎం రూ.1,13,351 కోట్ల విలువైన 1,064 కోట్ల లావాదేవీలు సాధించింది.

**లావాదేవీలు ఇలా:** మొత్తం లావాదేవీల్లో సంఖ్య పరంగా వ్యక్తుల నుంచి వర్తకులకు 62 శాతం (935 కోట్లు), వ్యక్తుల నుంచి వ్యక్తులకు 38 శాతం (568.9 కోట్లు) నమోదయ్యాయి. విలువ పరంగా వ్యక్తుల నుంచి వ్యక్తులకు 73 శాతం (రూ.14,97,941 కోట్లు), వ్యక్తుల నుంచి వర్తకులకు 27 శాతం (రూ.5,66,053 కోట్లు) లావాదేవీలు జరిగాయి. ఇక విలువ పరంగా వ్యక్తుల నుంచి వ్యక్తులకు రూ.2 వేలకుపైగా విలువచేసే లావాదేవీల వాటా 86 శాతం ఉంది. రూ.501–2,000 మధ్య 10 శాతం, రూ.500లోపు 4 శాతం నమోదయ్యాయి. వ్యక్తుల నుంచి వర్తకులకు రూ.2 వేలకుపైగా విలువ చేసే లావాదేవీలు 67 శాతం జరిగాయి. రూ.501–2,000 మధ్య 17 శాతం, రూ.500 లోపు 16 శాతం నమోదయ్యాయి. లావాదేవీల సంఖ్య పరంగా వ్యక్తుల నుంచి వ్యక్తులకు రూ.500 లోపు 57 శాతం, రూ.501–2,000 మధ్య 22 శాతం, రూ.2,000పైగా విలువ చేసేవి 21 శాతం జరిగాయి. వ్యక్తుల నుంచి వర్తకులకు రూ.500 లోపు 86 శాతం, రూ.501–2,000 మధ్య 10 శాతం, రూ.2,000 పైన 4 శాతం నమోదయ్యాయి.

సాక్షి ప్లస్
ఆదివారం । 27-10-2024



మనోహరం

పల్లె ముంగిట పంట చేలు.. ధాన్యపురాశుల్లో పిచ్చుకల గుంపులు.. అలికిడైతే చాలు.. తుర్రుమంటూ జారుకుంటూ.. విద్యుత్ తీగల నిండా పూదండలా అల్లుకుపోతూ.. ఈ మనోహర దృశ్యం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనగర్తి గ్రామ శివారులో కనువిందు చేసింది. పంట పొలాల్లోని విద్యుత్ తీగలపై.. పూలదండలా అల్లుకుపోయాయిలా..

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలపై వివరణివ్వండి

### హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న పిటిషనర్ అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని అసోసియేషన్‌ను హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అసోసియేషన్‌తో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. తెలంగాణ కబడ్డీ సంఘం కార్యవర్గం ఈ నెల 7న ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు బసాని హేమంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



ఎన్నికల ప్రక్రియలో కల్పిత ఓటర్ జాబితాను ఉపయోగిస్తున్నారని, జాతీయ క్రీడాభివృద్ధి కోడ్ 2011, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను పాటించడం లేదన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, చట్టప్రకారం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల వాయిదాకు నిరాకరించారు. అయితే, అక్రమాలు జరిగినట్లు తేలితే ఎన్నికలను రద్దు చేస్తామని చెప్పారు. ఈ నెల 27న తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## రాజకీయ ప్రచారానికి ప్రభుత్వ హెలికాప్టరా?

### కాంగ్రెస్‌పై కేఏ పాల్ ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: కేరళ వయనాడ్‌లో రాజకీయ ప్రచారానికి తెలంగాణ ప్రభుత్వానికి చెందిన హెలికాప్టర్‌ను వినియోగించడంపై ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మండిపడ్డారు. ఆ హెలికాప్టర్ ద్వారా వంద కోట్లు వయనాడ్‌కు తరలించారనే విమర్శలు కూడా ఉన్నాయని విమర్శించారు.



శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. కేరళ, ఖమ్మం వరదల్లో ప్రజలను రక్షించడానికి ఆ హెలికాప్టర్ ఎందుకు వాడలేదని ప్రశ్నించారు. బాంబులు పేలుస్తాం అంటూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మీరు వేల కోట్లు ఎలా సంపాదించారో నన్ను నోరు విప్పమంటారా అంటూ నిలదీశారు. వేరే గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకోవడంపై పాల్ మండిపడ్డారు.

# సన్నాలకు.. సాంకేతికత

**క్వింటాకు రూ.500 బోనస్** | **గింజను ఒలవడానికి ప్యాడిహస్కర్**

**సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్** | **సంచులకు కోడ్.. ఎర్ర దారంతో కుట్లు.. సంచిపై ఎస్ అనే అక్షరం** | **రాష్ట్రవ్యాప్తంగా 7,185 కొనుగోలు కేంద్రాలు**

సాక్షి, సిద్దిపేట: సన్న బియ్యాన్ని గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నారు. రాష్ట్రంలో సన్న రకాల ధాన్యం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేసింది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 60.8 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. అందులో 40 శాతం వరకు సన్నాలు సాగు చేశారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తంగా 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తాయని, ఇందుకోసం 7,185 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే చాలా వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చెల్లించనున్నారు.



### 33 సన్న రకాలకు బోనస్

ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. బీపీటీ-5204, డబ్లూయజీఎల్ -44, కేపీఎస్-2874, జేజీఎల్-27356, జేజీఎల్ 28545, డబ్ల్యూజీఎల్-14, డబ్ల్యూజీఎల్-32100, జేజీఎల్-11470, జేజీఎల్-384, ఆర్‌ఎన్‌ఆర్-2458, జేజీఎల్-384, జేజీఎల్-3828, తెలంగాణ సోనా, వరంగల్-1119, కేఎల్‌ఎం-1638, వరంగల్-962, రాజేంద్రనగర్, కేఎల్‌ఎం-733, జేజీఎల్-1798, జేజీఎల్3844, జేజీఎల్ 3855, జేజీఎల్-11118, ఎన్‌ఆర్‌ఎల్-34449, సుగంధ సాంబ, శోభిని, సోమనాథ్, ఆర్‌ఎన్‌ఆర్-31379, కేపీఎస్-6251, జేజీఎల్ 33124, హెచ్‌ఎంటీ సోనా, ఎంజీయూ-1224, ఎంటీయూ-1271 రకాలకు బోనస్ చెల్లించనున్నారు.

### బియ్యం గింజగా మార్చేందుకు ప్యాడిహస్కర్



వడ్లకున్న పొట్టును ఒలిచేందుకు ప్యాడిహస్కర్ యంత్రాలను అందజేస్తున్నారు. 20 వడ్ల గింజలను తీసుకుని ఈ యంత్రంలో పోసి తిప్పితే.. పొట్టూడిపోయి బియ్యం గింజలు బయటికొస్తాయి. పాత కాలంలో వడ్లను చేతితో నలిపేవారు. అప్పుడు వడ్ల నుంచి బియ్యం వచ్చేవి. ఇప్పుడు ప్యాడిహస్కర్‌ను వినియోగిస్తున్నారు. ఈ బియ్యం గింజలను సుమారు 10 గింజలను తీసుకుని అన్నింటిని ఒక్కొక్కటిగా గ్రెయిన్ కాలిపర్ మెషీన్‌లో పెట్టి కొలవనున్నారు.

### గ్రెయిన్ కాలిపర్ యంత్రాలు




సన్నధాన్యం గుర్తించేందుకు కొనుగోలు కేంద్రాలకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్) యంత్రాన్ని అందజేస్తున్నారు. దీంతో సన్న బియ్యం గింజ పొడవు, వెడల్పు కొలవనున్నారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండాలని నిర్ణయించారు. బియ్యం గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా నిర్దేశిత ప్రమాణాలుంటేనే కొనుగోలు చేయనున్నారు. ఇలా ఉన్న ధాన్యాన్నే సన్నాలుగా గుర్తించి వారికి క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ అందజేయనుంది. ఇప్పటికే ఈ యంత్రంపై కొనుగోలు కేంద్రాల వారికి అవగాహన కల్పించారు.

### సంచులకు కోడ్

సన్నాల సంచులకు ఎరుపు రంగు దారంలో కుట్టి.. వాటిపై ఎస్ అనే అక్షరం రాయనున్నారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారంతో కుట్లు వేయనున్నారు. కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ఓపీఎంఎస్ కోడ్‌ను రాయనున్నారు. మిల్లుకు చేరిన తర్వాత సైతం ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించనున్నారు.

### ఒక్కో సెంటర్‌కు ఒక్కో మీటర్



సన్నాలు కొనుగోలు చేసే కేంద్రాలకు.. ఒక్కొక్క కేంద్రానికి ఒకటి గ్రెయిన్ కాలిపస్, ప్యాడిహస్కర్‌లను, ఓపీఎంఎస్ కోడ్‌లను అందించాం. ఇంకో 10 రోజులైతే సన్నాలు కొనుగోలు కేంద్రాలకు రానున్నాయి. సన్న వడ్ల సంచులకు ఎస్ అనే అక్షరం సైతం రాయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించాం.

- ప్రవీణ్, డీఎం,
సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, సిద్దిపేట



20 అడుగుల జొన్న

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా మిర్యాల గూడ పట్టణంలోని చింతపల్లి రోడ్డులో ఉన్న విద్యానగర్ కాలనీలో డాక్టర్ సాహితీ సాంబశివరావు ఇంటిఎదుట మొలిచిన జొన్న మొక్క ఏపుగా పెరిగింది. ప్రస్తుతం దీని ఎత్తు 20 అడుగుల వరకు ఉంది. చుట్టుపక్కల వారు, దారిన వెళ్లేవారు ఈ మొక్కను ఆసక్తిగా చూస్తున్నారు.

## మంత్రి కోమటిరెడ్డితో ఏపీ మంత్రి సుభాష్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో.. ఆంధ్ర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వసంశెట్టి సుభాష్ భేటీ అయ్యారు. రీజినల్ రింగురోడ్డు, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ తదితర ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వివరించారు.



రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరుకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రథమ సమావేశం శనివారం బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది.

# అడవిలో ఆఖరి పోరాటం

**శాంతిదళం నుంచి ఫైనల్ మిషన్ ◆ మావోయిస్టులపై ముప్పేట దాడి**

అన్ని విభాగాల సమన్వయంతో జాయింట్ ఆపరేషన్లు • ఉధృతంగా యాంటీ నక్సల్స్ ఆపరేషన్లు
కాలానుగుణంగా కొత్త ఎత్తుగడలు • ఆదిలో పలకరించిన అపజయాలు • లోపాలను సరిదిద్దుకుంటూ కేంద్ర బలగాలు ముందుకు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశంలో మావోయిస్టులను 2026 మార్చి కల్లా ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల ప్రకటించడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సల్వాజుడుం పేరుతో 2007లో మావోయిస్టుల ఏరివేతలో నేరుగా కేంద్రం జోక్యం చేసుకునే ప్రక్రియ.. ప్రస్తుతం ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)కు చేరుకుంది.

**యూపీఏ హయాంలో..**

దేశంలోని ప్రధాన విప్లవ శక్తులైన పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్లు విలీనమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఏపీలోని తిరుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ఆయా పార్టీల నేతలు ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దీంతో మావోయిస్టు పార్టీకి గెరిల్లా జోన్‌గా ఉన్న బస్తర్ అడవుల నుంచి యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌ను కేంద్రం ప్రారంభించింది. మావోయిస్టులకు ఎక్కువ మద్దతిచ్చే తెగకు.. ఎదురు నిలిచే మరో తెగ సభ్యులను ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించింది. వారి చేతికి ఆయుధాలిచ్చి శాంతిదళం (సల్వాజుడుం)ను 2007లో ఏర్పాటు చేసింది. సల్వాజుడుం మొదటి అడుగు నుంచి 2011లో రద్దయ్యే వరకు వివాదాలకు కేంద్ర బిందువుగా ఉంది. సల్వాజుడుంపై విమర్శలు ఎక్కువ రావడంతో 2009 సెప్టెంబర్‌లో పెద్దఎత్తున సీఆర్‌పీఎఫ్ బలగాలను బస్తర్ అడవుల్లోకి పంపాలని కేంద్రం నిర్ణయించింది. దీన్నే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌గా పేర్కొంటున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ కారణంగా మావోయిస్టుల చేతిలో భద్రతా దళాలకు చెందిన జవాన్లు తీవ్రంగా నష్టపోయారు. బస్తర్ అడవులపై ప్రభుత్వ దళాలకు పట్టు చిక్కలేదు.

**నాగా కమాండోలు..**

2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం అమలు చేసిన గ్రీన్‌హంట్‌కు మరింత పదును పెట్టింది. అప్పటికే పశ్చిమ బెంగాల్‌లో మావోయిస్టులను అణచివేయడంలో కీలక పాత్ర పోషించిన నాగా బెటాలియన్‌ను బస్తర్ అడవులకు పంపాలని నిర్ణయించింది. వీరి చేతుల్లో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్, శాటిలైట్ ఫోన్లు పెట్టింది. అప్పటికే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్) దళాలు రంగంలో ఉన్నాయి. అయినప్పటికీ కేంద్రం ఆశించిన ఫలితాలు రాలేదు.



**ఆపరేషన్ సమాధాన్..**

యాంటీ మావోయిస్టు ఆపరేషన్లు చేపట్టి పదేళ్లు దాటినా బస్తర్ అడవులపై పట్టు చిక్కకపోవడానికి వ్యూహాల్లో లోపాలే కారణమనే భావనకు కేంద్రం వచ్చింది. దీంతో 2017లో ఆపరేషన్ సమాధాన్ (ఎస్ - స్మార్ట్ లీడర్‌షిప్, ఏ - అగ్రెసివ్ స్ట్రాటెజీ, ఎం - మోటివేషన్ అండ్ ట్రైనింగ్, ఏ - యాక్షనబుల్ ఇంటెలిజెన్స్, డీ - డ్యాష్‌బోర్డ్ బేస్డ్ కీ రిజల్ట్ ఏరియా, హెచ్ - హర్నెస్సింగ్ టెక్నాలజీ, ఏ - యాక్షన్ ప్లాన్, ఎన్ - నో ఆక్సెస్ టు ఫైనాన్సింగ్)ను తెరపైకి తెచ్చింది. మావోయిస్టుల ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టడం, వారి స్థావరాలను కచ్చితంగా కనుక్కోవడం, ఔషధాలు అందకుండా చూడటం, మావోయిస్టుల్లోకి కొత్త నియామకాలు జరగకుండా జాగ్రత్త పడటం వంటి పనులపై ఎక్కువ శ్రద్ధ చూపించారు. దీంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణంలో వేగం పెంచారు.

**గగనతల దాడులు**

ఆపరేషన్ సమాధాన్‌తో పరిస్థితులు అనుకూలంగా మారాయని నిర్ధారణకు వచ్చిన తర్వాత 2021 జూన్ 19న తొలిసారిగా వాయుమార్గంలో మావోయిస్టు శిబిరాలపై కేంద్ర బలగాలు దాడులు చేశాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే మావోయిస్టు శిబిరాలపై వాయుమార్గంలో దాడులు చేయడంపై ఆందోళన వ్యక్తం కావడం, నిరసనలు రావడంతో.. ఈ తరహా దాడులపై కేంద్రం వెనక్కి తగ్గింది. అయినప్పటికీ 2021 జూన్ నుంచి 2022 చివరి వరకు నాలుగుసార్లు తమపై గగనతల దాడులు జరిగాయని మావోయిస్టు పార్టీ పలు సందర్భాల్లో ఆరోపణలు చేసింది.

### లోపాలను అధిగమిస్తూ..

మావోయిస్టుల ఏరివేతలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సరికొత్త వ్యూహాలను కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చాయి. లొంగిపోయిన, అరెస్టయిన మావోయిస్టుల (సాధారణంగా స్థానిక ఆదివాసీలకే అధికారం)తో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ పేరుతో ప్రత్యేక దళాలను తయారు చేసింది. నాగా కమాండోలు ఇక్కడి అడవులపై పట్టు సాధించలేకపోవడంతో.. వారికి బదులుగా ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లను రంగంలోకి దించింది. సాయుధులైన పురుష కమాండోల వల్ల వచ్చే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేకంగా విమెన్ కమాండో దళాలను తయారు చేసింది. ఎండాకాలం, వానాకాలం అని తేడా లేకుండా ఏడాదంతా అడవుల్లో కూంబింగ్ చేపట్టేలా ఆపరేషన్ సూర్య శక్తి, ఆపరేషన్ జల్‌శక్తి పేర్లతో జవాన్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీంతో ఆఖరికి వానాకాలంలో కూడా మావోయిస్టులు నిర్భయంగా సంచరించే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా భద్రతా దళాలపై మావోలు జరిపే వ్యూహాత్మక ఎదురుదాడులను గణనీయంగా తగ్గించగలిగారు.

### విస్తృతంగా పారా మిలిటరీ క్యాంపులు

సంఖ్య, శిక్షణ, ఆధునిక ఆయుధాలు, లేటెస్ట్ టెక్నాలజీ పరంగా సంసిద్ధమైన తర్వాత బస్తర్ అడవుల్లో ప్రతీ ఆరు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా దళాలకు చెందిన క్యాంపులను ఏర్పాటు చేస్తూ.. మావోయిస్టులను కేంద్రం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం బస్తర్‌లో 370కి పైగా పారా మిలిటరీ క్యాంపులున్నాయి. సుక్మా, బీజాపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలతో కూడిన దండకారణ్యంలో మావోయిస్టుల గెరిల్లా జోన్లు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయాయి. చివరికి మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామమైన పువర్తిలోనూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో భద్రతా దళాలు క్యాంపును ఏర్పాటు చేశాయి.

### ఆపరేషన్ కగార్

సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, కోబ్రా, పోలీసులు.. ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ జాయింట్ ఆపరేషన్లకు శ్రీకారం చుడుతూ ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)ను 2024 జనవరిలో ప్రారంభించారు. మావోయిస్టుల షెల్టర్ జోన్‌గా ఉన్న అబూజ్‌మడ్ (బీజాపూర్, నారాయణ్‌పూర్, కాంకేర్, కొండగావ్) అడవులపై ప్రభుత్వం గురి పెట్టింది. ఈనెల 5న తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 38 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇప్పటి వరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 200 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. మరో 400 మందికి పైగా లొంగిపోవడం లేదా అరెస్టయ్యారు. ప్రభుత్వ దళాల నిర్బంధం పెరిగిపోవడంతో మావోయిస్టు అగ్రనేతలు చెల్లాచెదురయ్యారనే ప్రచారం జరుగుతోంది.



# ప్రపంచంలోనే పే....ద్ద కెమెరా!

## రూబిన్ అబ్జర్వేటరీలో ఏర్పాటు

ఏకంగా 3,200 మెగాపిక్సెల్స్. సామర్థ్యం. 5.5 అడుగుల ఎత్తు, ఏకంగా 12.25 అడుగల పొడవుతో పెద్ద సైజు కారును తలపించే పరిమాణం. దాదాపు 2,800 కిలోల బరువు! 320–1,050 ఎన్ఎం వేవ్‌లెంగ్త్ రేంజ్. ఒక్కో ఇమేజ్ కవరేజీ పరిధిలోకి కనీసం 40 పూర్ణ చంద్రులు పట్టేంత ఏరియా! ప్రపంచంలోనే అతి పెద్ద కెమెరా తాలూకు విశేషాల్లో ఇవి కేవలం కొన్ని మాత్రమే. ఇంతకీ ఇది ఎక్కడుందంటారా? చిలీలో రూపుదిద్దుకుంటున్న వెరా రూబిన్ అబ్జర్వేటరీలో ఏర్పాటు చేస్తున్న సరికొత్త టెలిస్కోప్‌లో. రాజధాని శాంటియాగోకు 500 కి.మీ. దూరంలోని సెరో పాచ్న్ పర్వత శిఖరంపై 2015 నుంచీ నిర్మాణంలో ఉన్న ఈ అబ్జర్వేటరీ త్వరలో ప్రారంభం కానుంది. అందులోని ఈ అతి పెద్ద కెమెరా ప్రతి మూడు రోజులకోసారి రాత్రివేళ దాని కంటికి కన్పించినంత మేరకూ ఆకాశాన్ని ఫొటోల్లో బంధించనుంది. అలా అంతరిక్ష శాస్త్రవేత్తలకు పదేళ్లపాటు రోజుకు కనీసం వెయ్యి చొప్పున ఫొటోలను అందుబాటులోకి తెస్తుంది! అంటే రోజుకు 20 టెరాబైట్ల డేటాను అందజేస్తుంది. ఇది ఒక యూజర్ నెట్‌ఫ్లిక్స్‌లో సగటున మూడేళ్లపాటు చూసే ప్రోగ్రామ్స్, లేదా స్పాటిఫైలో ఏకంగా 50 ఏళ్ల పాటు వినే పాటల డేటాకు సమానం! ఈ క్రమంలో మనకిప్పటిదాకా తెలియని ఏకంగా 1,700 కోట్ల కొత్త నక్షత్రాలను, 2,000 కోట్ల నక్షత్ర మండలాలను ఈ కెమెరా వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నారు. దీన్ని లెగసీ సర్వే ఆఫ్ స్పేస్ అండ్ టైమ్ (ఎల్ఎస్ఎస్‌టీ) కెమెరాగా పిలుస్తున్నారు. అంతేగాక అంతరిక్షంలో సంభవించే చిన్నా పెద్దా మార్పులకు సంబంధించి ప్రతి రాత్రీ ఏకంగా కోటి అలెర్టులను కూడా ఈ టెలిస్కోప్ పంపనుందట కూడా! ''ఇదంతా కేవలం ఆరంభం మాత్రమే. వెరా రూబిన్ అబ్జర్వేటరీ మున్ముందు మరెన్నో ఘనకార్యాలు చేయనుంది'' అని ఆ సంస్థ ఆస్ట్రానమిస్టు క్లేర్ హిగ్స్ చెబుతున్నారు. కృష్ణపదార్థం (డార్క్ మ్యాటర్), కృష్ణ శక్తి (డార్క్ ఎనర్జీ) వంటి పలు మిస్టరీలను ఛేదించడంలో కూడా కీలక పాత్ర పోషించే చాన్సుందన్నారు. ఈ టెలిస్కోప్‌కు 2016లో మరణించిన అమెరికా అంతరిక్ష శాస్త్రజ్ఞుడు వెరా రూబిన్ పేరు పెట్టారు. ఇది ఏడాది లోపులో అందుబాటులోకి వస్తుందని అంచనా.



రూబిన్ అబ్జర్వేటరీ

- సాక్షి, నేషనల్ డెస్క్

యూపీ ఉప ఎన్నికల్లో..

# కాంగ్రెస్ కంట్లో ఎస్పీ నలుసు

- ఆరు స్థానాల్లో సొంత అభ్యర్థులు
- మహారాష్ట్రలో 12 స్థానాలు కోరుతూ 5చోట్ల అభ్యర్థుల ప్రకటన
- మధ్యప్రదేశ్‌లో బుద్నీలో కాంగ్రెస్‌కు పోటీగా ఎస్పీ అభ్యర్థి

**సాక్షి, న్యూఢిల్లీ:** ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామ్య పార్టీగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) తీరు కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పులు తెస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 37 పార్లమెంట్ స్థానాలు కొల్లగొట్టామన్న అతివిశ్వాసంతో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని కాలదన్నుతోంది. ఎస్పీ ఒంటెద్దు పోకడలు కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు. యూపీలో తమతో మాటైన చెప్పకుండా ఎస్పీ అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్‌కు సమస్యగా మారింది. తాము పోటీలో ఉన్న మధ్యప్రదేశ్‌లో మరో అభ్యర్థిని బరిలో దించి పరిస్థితిని ఇబ్బందికరంగా మార్చింది. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమిలో పొరపొచ్చాలు పెరిగేలా 12 సీట్లు కోరుతూ కాంగ్రెస్‌కు ఎస్పీ ఇక్కట్లు తెస్తోంది.

**యూపీలో ఏకపక్షంగా..**

ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం ఉప ఎన్నికలు జరుగుతున్న 9 స్థానాల్లో ఉమ్మడిగా ముందుకెళ్లాలని ఎస్పీ, కాంగ్రెస్‌లు ప్రాథమిక నిర్ణయానికొచ్చాయి. అయితే ఇంతవరకు పోటీ చేసే స్థానాలపై స్పష్టత రాలేదు. హరియాణా ఎన్నికల్లో అతి విశ్వాసం కారణంగా ఓటమిపాలైన కాంగ్రెస్‌తో పెట్టుకుంటే లాభం లేదని ఎస్పీ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ఏకపక్షంగా 6 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఈ స్థానాల్లో తమ ఓటుబ్యాంకు పటిష్టంగా ఉందని బల్లగుద్ది చెబుతోంది. కాంగ్రెస్‌తో కనీస అవగాహనకు రాకుండానే సొంత అభ్యర్థులను నిలబెట్టి ప్రచారం సైతం మొదలుపెట్టింది. ప్రకటించని మూడు స్థానాల్లో ఘజియాబాద్ సదర్, ఖైర్, కుందర్కి అసెంబ్లీ స్థానాలుండగా ఇందులో ఘజియాబాద్ సదర్, ఖైర్ స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని కోరుతోంది. అయితే ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ ప్రాభల్యం బలంగా ఉంది. ఘజియాబాద్ సదర్‌లో దాదాపు 80వేల మంది దళితులు, 60వేల మంది బ్రాహ్మణులు, 40వేల మంది బనియాలు, 35వేల మంది ముస్లిం, 20వేల మంది ఠాకూర్లు ఉన్నారు. ఇక్కడ బీఎస్పీ పోటీలో ఉండటంతో దళితుల ఓట్లు తనకు అనుకూలంగా మారతాయన్న నమ్మకం కాంగ్రెస్‌కు లేదు. ఠాకూర్లతో పాటు సంఖ్యాపరంగా ప్రాభల్యం ఉన్న బ్రాహ్మణ, బనియా వర్గాలు బీజేపీతో ఉండటంతో ఇక్కడ గెలుపు సులభం కాదని కాంగ్రెస్ అంచనావేస్తోంది. ఇక ఖైర్‌లో లక్ష ఓటర్లు ఉన్నారు. ఇక్కడి జాట్‌లు పూర్తిగా ఎన్‌డీఏ కూటమికి మద్దతు పలకడం, 55,000 దళిత ఓట్లలో బీఎస్పీ చీలిక తెస్తుందన్న భయం కాంగ్రెస్‌ను వెంటాడుతోంది. దీంతో ఎస్పీ ఇస్తామన్న రెండు సీట్లపై కాంగ్రెస్ అయిష్టత చూపుతోంది. దీంతో ఉత్తరప్రదేశ్‌లో అసలు పొత్తులు ఉంటాయా? లేదంటే విడివిడిగా బరిలోకి దిగుతారా? అనే ప్రశ్న ఇరుపార్టీల శ్రేణుల్లో తలెత్తుతోంది. మధ్యప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజీనామా చేసిన బుద్నీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించింది. అయితే కాంగ్రెస్‌ను వీడి ఎస్పీలో చేరిన అర్జున్ ఆర్యను ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ బుద్నీలో తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ అంశం సైతం కాంగ్రెస్‌కు మింగుడుపడటం లేదు.

### మహారాష్ట్రలో అదే తీరు

మహారాష్ట్రలో విపక్షాల 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్‌పవార్), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీల మధ్య పొత్తు విషయంలో చర్చలపై ఇంకా ఊగిసలాట కొనసాగుతోంది. ఈలోపే మధ్యలో దూరిన ఎస్పీ తమకు 12 సీట్లు కావాలని డిమాండ్‌చేస్తూ కొత్త పేచీలు మొదలెట్టింది. ఇప్పటికే రెండు స్థానాల్లో ఎస్పీ ఎమ్మెల్యేలు ఉండగా, ఆ అసెంబ్లీ స్థానాలకు చుట్టూ ఉన్న మరో 10 స్థానాలను తమకే కేటాయించాలని కోరుతోంది. ఇందులో మెజార్టీ స్థానాల్లో తమ అభ్యర్థుల్ని నిలపాలని ఎన్సీపీ(ఎస్పీ), కాంగ్రెస్ ఎప్పట్నుంచో అనుకుంటున్నాయి. ఎస్పీ అంతటితో ఆగకుండా బుధవారం ఏకంగా ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించేసింది. దీంతో ఎస్పీతో ఎలా డీల్ చేయాలో కాంగ్రెస్‌కు అంతుపట్టని వ్యవహారంగా తయారైంది.

బెనర్జీని తొలగించాలంటూ

# స్పీకర్‌కు బీజేపీ ఫిర్యాదు

- ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని అభ్యర్థన

**న్యూఢిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లుపై మంగళవారం చర్చ సందర్భంగా పట్టరాని ఆవేశంతో గాజు సీసాను పగలగొట్టి సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికాపాల్ కుర్చీ వైపు విసిరేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీని లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలని ముగ్గురు బీజేపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు బీజేపీ ఎంపీలు నిశికాంత్ దూబే, అపరాజితా సారంగి, అభిజిత్ గంగోపాధ్యాయ్‌లు బుధవారం లోక్‌సభ స్పీకర్‌కు తమ సంతకాలతోకూడిన లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. '' సంయుక్త పార్లమెంటరీ కమిటీలో విస్తృతస్థాయిలో చర్చ జరుగుతున్నప్పుడు బెనర్జీ గూండాయిజం చేశారు. పార్లమెంట్ సభ్యుడిననే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించారు. ఆయన గుండాయిజం చైర్మన్ ప్రాణాలకు ముప్పువాటిల్లే స్థాయికి పెరిగింది. మీరు ఆయనపై కఠిన చర్యలు తీసుకోకుంటే పార్లమెంటరీ వ్యవస్థ పనితీరుకు సరిచేయలేని నష్టం వాటిల్లుతుంది. హింసాత్మకంగా వ్యవహరించిన బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలి. వెంటనే ఆయనను అరెస్ట్‌చేసి విచారించాలి. ఆయన దిగువ సభ సభ్యత్వం రద్దు అంశాన్ని లోక్‌సభ నైతిక వ్యవహారాల కమిటీకి పంపించాలి'' అని బీజేపీ ఎంపీలు ఆ లేఖలో డిమాండ్‌చేశారు.

వైవాహిక అత్యాచారం కేసుల

# విచారణ వాయిదా

**న్యూఢిల్లీ:** వైవాహిక అత్యాచారం ఘటనల్లో భర్తపై నేరం మోపకుండా చట్టం కల్పిస్తున్న రక్షణలపై నమోదైన కేసుల విచారణను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం నాలుగు వారాలు వాయిదావేసింది. నవంబర్ పదో తేదీన సీజేఐ చంద్రచూడ్ పదవీవిరమణ నేపథ్యంలో ఇక ఈ కేసులను ఆయన విచారించబోరని తెలుస్తోంది. కోర్టుకు దీపావళి సెలవు దినాలు మొదలుకానున్న నేపథ్యంలో ఈ కేసుల వాదోపవాదనలను ముగించలేకపోతున్నానని ఆయన చెప్పారు. కేసులో తగిన పత్రాల దాఖలుకు సంబంధిత న్యాయవాదులకు తగు గడువు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం కాకుండా ఈ కేసుల తదుపరి విచారణను మరో ధర్మాసనం ఆలకించే వీలుంది. మైనర్‌కాని భార్యతో బలవంతంగా శృంగారం చేసిన భర్తకు భారతీయ శిక్షా స్మృతి, భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్టాలు విచారణ నుంచి రక్షణ కల్పిస్తున్న విషయం తెల్సిందే. ఈ కేసుల విచారణ అక్టోబర్ 17న మొదలైంది. ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం 18ఏళ్లు దాటిన భార్యతో బలవంతగా భర్త సంభోగించినా అది రేప్‌గా పరిగణించబోరు. అలాగే బీఎన్ఎస్‌లోని సెక్షన్ 63(రేప్)(2) ప్రకారం చూసినా ఈ చర్యను అత్యాచారంగా పరిగణించరు. మారుతున్న సామాజిక పోకలు, ఆధునిక సమాజంలో భర్త సాన్నిహిత్య పరిస్థితుల్లో భార్య సమ్మతి ఉంది లేదు అనే అంశాన్ని నిరూపించడం అసంభవమని కేంద్రం గతంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. చట్టాలను దుర్వినియోగం చేస్తూ ఈ మినహాయింపు రక్షణ నుంచి భర్తను పక్కకు జరిపితే భారతీయ సామాజిక, కుటుంబ వ్యవస్థలో కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని కేంద్రం పేర్కొంది.

## హిట్లర్ కొంత మంచి కూడా చేశాడు

- హిట్లర్‌కున్న సైనిక జనరల్స్ నాకూ కావాలి
- ట్రంప్ గత వ్యాఖ్యలను బయటపెట్టిన వైట్‌హౌజ్ మాజీ ఉన్నతాధికారి

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా మాజీ ఉన్నతాధికారులు గళం విప్పుతున్నారు. ట్రంప్ అధ్యక్షునిగా కొనసాగిన కాలంలో 'జర్మనీ నియంతగా పేరున్నప్పటికీ అడాల్ఫ్ హిట్లర్ ఎంతో కొంత మంచి పనులు చేశాడు. ఆయనకు నమ్మకస్తులుగా మెలిగిన సైనిక జనరల్స్ లాంటి అధికారులు నాక్కూడా ఉంటే బాగుంటుంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారని మాజీ మెరైన్ జనరల్ జాన్ కెల్లీ వెల్లడించారు. ది న్యూయార్క్ టైమ్స్, ది అట్లాంటిక్ వార్తసంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో కెల్లీ ఈ వివరాలు వెల్లడించారు. ట్రంప్ హయాంలో కెల్లీ వైట్‌హౌజ్‌లో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా 2017–19 కాలంలో పనిచేశారు. పరిపాలనలో సైన్యం పాత్ర కీలకంగా ఉండాలని ట్రంప్ భావించేవారని కెల్లీ వెల్లడించారు. నా సైన్యాధికారులు జర్మనీ జనరల్స్‌గా పనిచేయాలని, నమ్మకంగా చెప్పింది చేయాలని పలుమార్లు ట్రంప్ మాతో అన్నారని కెల్లీ వివరించారు.

ఇండస్ట్రియల్ ఆల్కహాల్‌పై

# చట్టాలు చేసే హక్కు రాష్ట్రాలదే

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు

**న్యూఢిల్లీ:** పారిశ్రామిక(ఇండస్ట్రియల్) ఆల్కహాల్ ఉత్పత్తి, సరఫరా నియంత్రపై చట్టాలు చేసే చేసే అధికారం రాష్ట్రాలకే ఉందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 1990లో ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రాష్ట్రాలకు ఈ విషయంలో ఉన్న అధికారాన్ని తొలగించలేమని తేల్చిచెప్పింది. ఇండస్ట్రియల్ ఆలక్హాల్ ఉత్పత్తి, సరఫరాపై నియంత్రణ అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదని ధర్మాసనం వెల్లడించింది. తొమ్మిది మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం 8:1 మెజార్టీతో బుధవారం తీర్పును ప్రకటించింది. అయితే, ఈ తీర్పుతో ధర్మాసనంలోని జస్టిస్ నాగరత్న విభేదించారు. 1990లో సింథటిక్స్, కెమికల్స్ కేసులో అప్పటి ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ఉత్పత్తిని నియంత్రించే అధికారం కేంద్రానికి ఉందని తీర్పు ఇచ్చింది. దీనిపై పలు అభ్యంతరాలు వచ్చాయి. 2010లో ఈ అంశాన్ని తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి సమీక్ష కోసం పంపించారు. ఇండస్ట్రియల్ ఆల్కహాల్ అనేది మానవ వినియోగం కోసం కాదని ఈ ధర్మాసనం పేర్కొంది.



జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై

## అమిత్ షాతో ఒమర్ భేటీ

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై ఆ కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో చర్చించారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ఒమర్ బుధవారం అమిత్‌ను కలుసుకున్నారు. సీఎం అయ్యాక తొలిసారిగా ఢిల్లీకొచ్చిన ఒమర్.. ప్రధాని మోదీతోనూ భేటీకానున్నారు. అమిత్, ఒమర్ భేటీలో ప్రధానంగా రాష్ట్రహోదా అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అని అధికారుల చెప్పారు. 2019లో జమ్మూకశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ తర్వాత ఆ ప్రాంత భద్రతా వ్యవహారాలను పూర్తిగా కేంద్రహోంశాఖ చూసుకుంటోంది. అయితే మూడ్రోజుల క్రితం గాందర్‌బల్ జిల్లాలో నిర్మాణరంగ సంస్థ కార్మికులు, సిబ్బందిపై ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి ఏడుగురి ప్రాణాలు తీసిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రితో సీఎం భేటీకావడం గమనార్హం. అయితే కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులను అమిత్‌కు ఒమర్ వివరించారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

# ఎంపీగా ప్రియాంక కంటే నేనే బెటర్

- సరదా ప్రశ్నకు రాహుల్ స్పందన
- చెల్లితో కలిసి వయనాడ్‌లో సరదాగా బస్సులో షికారు



**వయనాడ్:** 'వయనాడ్ ఎంపీగా ప్రియాంక మీకన్నా మెరుగైన మార్కులు కొట్టేస్తారని భావిస్తున్నారా?' కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి ఎదురైన అనుకోని ప్రశ్న ఇది! తానైతే అలా అనుకోవడం లేదంటూ తడుముకోకుండా బదులిచ్చారాయన. ''ఇది నిజంగా కఠినమైన ప్రశ్నే. కాకపోతే, నాకైతే అలా అనిపించడం లేదు'' అని చెప్పి నవ్వులు పూయించారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలోల కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక బుధవారం నామినేషన్ దాఖలు చేయడం తెలిసిందే. అనంతరం అన్నాచెల్లెళ్లిద్దరూ కలిసి వయనాడ్‌లో బస్సు షికారు చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత కేసీ వేణుగోపాల్ తదితరులు కూడా వారి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా బస్సులో ఒక ప్రయాణికుడు అడిగిన సరదా ప్రశ్నకు రాహుల్ పై విధంగా బదులిచ్చి అందరినీ నవ్వుల్లో ముంచెత్తారు. అయితే, ''చెల్లె అంటే నాకెంతో ఇష్టం. ఆమెను నేనెంతగానో ప్రేమిస్తా. తనలో ఉన్న సుగుణాలు అన్నీ ఇన్నీ కావు. వయనాడ్ ఎంపీగా నా స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రియాంక కంటే మెరుగైన నేత ఇంకెవరూ లేరు. ఆ పాత్రలో తను అద్భుతంగా రాణిస్తుందని నాకు పూర్తి నమ్మకముంది'' అని చెప్పుకొచ్చారు. తర్వాత ప్రియాంక కూడా అన్నను కాస్త ఆట పట్టించారు. 'ముఖమెందుకు అలా బాధగా పెట్టుకున్నావు?' అంటూ సరదగా ప్రశ్నించారు. 'వయనాడ్‌ను మిస్సవబోతున్నాగా! అందుకే ఈ బాధ' అంటూ రాహుల్ బదులిచ్చారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఆయన రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యం కావడం తెలిసిందే.


## వ్యాఖ్యాతల స్థానంలో ఏఐ హోస్ట్‌లు

- వివాదం రేపిన పోలెండ్ రేడియోఛానల్ ప్రయోగం

**వార్సా:** ఒక్కో శ్రోతకు తగ్గట్లు మాట్లాడుతూ, అతిథులతో చర్చలు జరుపుతూ తగు పాటలు ప్లే చేసే వ్యాఖ్యాతలను ఒక పోలెండ్ రేడియో స్టేషన్ హఠాత్తుగా తొలగించింది. కృత్రిమ మేథ ఉండగా మీరెందుకు దండగ అంటూ తెగేసి చెప్పేసింది. వెంటనే కృత్రిమ మేథ(ఏఐ) ఆధారిత వర్చువల్ వ్యాఖ్యాతలతో ఈ వారం సరికొత్త ప్రోగ్రామ్‌లను నడిపించడం మొదలెట్టింది. జర్నలిస్టులను పక్కనబెట్టడంపై పాత్రికేయలోకం ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఆఫ్ రేడియో క్రాకో' రేడియోస్టేషన్ విధాననిర్ణయంపై పలు వర్గాలు పెదవి విరుస్తున్నాయి. సృజనాత్మక రంగంలో మెషీన్లు ఎలా రాణించగలవని ప్రశ్నిస్తున్నారు. అయితే సంస్కృతిక, కళలు, ఎల్‌జీబీటీక్యూ+ వంటి సామాజిక అంశాలను సైతం ఈ వర్చువల్ 'ప్రెసెంటర్‌లు' అద్భుతంగా సమన్వయం చేయగలరని రేడియోఛానల్ వాదిస్తోంది. ఛానల్ యాజమాన్యం నిర్ణయాన్ని స్టేషన్ సారథి జర్నలిస్ట్ మార్కిన్ పులిట్ తప్పుబట్టారు. ఈయనకు పాత్రికేయుడు, సినీ విమర్శకుడు, ఛానెల్‌లో పనిచేసిన మేటజ్ డెమ్సీ గొంతు కలిపారు. '' మీడియారంగంలో అపార అనుభవం ఉన్న ఉద్యోగులను, సృజనాత్మక పరిశ్రమల్లోని సిబ్బందిని మెషీన్లతో నింపబోతున్నారు. ఇది ప్రమాదకర పరిణామం' అని బహిరంగ లేఖ రాశారు.

# అంతరిక్ష చెత్త.. అమాంతం పైపైకి

- వేల టన్నులు పెరిగిన స్పేస్ జంక్
- తాజాగా మరో కృత్రిమ ఉపగ్రహం ముక్కలై మరింత పెరిగిన చెత్త



మానవ, పారిశ్రామిక వ్యర్థాలతో అవనిపై అమాంతం పెరుగుతున్న చెత్తకొండలతో ఎంతో ముప్పు పరిణమిస్తోంది. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు ఏకంగా అంతరిక్షంలోనూ చెత్త పేరుకుపోతోంది. భూమిపై వ్యర్థాలను పునశ్శుద్ధి కర్మాగారాల ద్వారా అయినా కాస్తంత వదిలించుకోవచ్చుగానీ అంతరిక్ష చెత్తలోని నట్లు, బోల్ట్‌లు, ఇతర భాగాలు అలాగే పేరుకుపోయి కొత్త కృత్రిమ ఉపగ్రహాలకు 'అంతరిక్ష బాంబుల్లా' తయారయ్యాయి. పాడైపోయిన పాత ఉపగ్రహాల శిథిలాల స్పేస్‌జంక్ ఇప్పుడు అంతర్జాతీయ ప్రయోగాలకు పెద్ద అవరోధంగా మారింది.

### పేలిపోయిన ఇంటెల్‌శాట్ 33ఇ

యూరప్, మధ్య ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో కమ్యూనికేషన్ సేవలందిస్తున్న ఇంటెల్‌శాట్ 33ఇ ఉపగ్రహం నాలుగు రోజుల క్రితం పనిచేయడం మానేసింది. 2016 ఆగస్ట్‌లో బోయింగ్ సంస్థ ఈ శాటిలైట్‌ను డిజైన్ చేసింది. పనిచేయడం మానేసిన కొద్దిసేపటికే అది పేలి 20 ముక్కలుగా కక్ష్యలో చెల్లాచెదురుగా పడిందని యూఎస్ స్పేస్ ఫోర్సెస్ స్పేస్(ఎస్4ఎస్) సంస్థ ధృవీకరించింది. ఇలా అనూహ్యంగా ఉపగ్రహాలు అంతరిక్ష చెత్తలా మారితే సమీప ఉపగ్రహాలకు మరణశాసనం రాసినట్లే. శాటిలైట్ ముక్కలు వేగంగా భ్రమిస్తూ కక్ష్యదాటి సమీప శాటిలైట్లను ఢీకొట్టి వాటికి భారీ నష్టం చేకూరుస్తాయి. దీంతో ఇతర శాటిలైట్లు కూడా పాడయ్యే ప్రమాదముంది. ఇలా గొలుసుచర్య జరిగితే పెద్ద ఉపద్రవమే సంభవిస్తుంది. అక్కడ సమీప శాటిలైట్లన్నీ ధ్వంసమై భూమిపై సమాచార, ప్రసార వ్యవస్థలు స్తంభించిపోతాయి. భవిష్యత్తులో ఆ ఎత్తుల్లోని ఆ కక్ష్యలను కొత్త ఉపగ్రహాల కోసం వాడుకోలేని పరిస్థితి దాపురిస్తుంది. భూమి నుంచి కొంత పరిధిలోని ఎత్తుల్లో మాత్రమే శాటిలైట్లను ప్రవేశపెట్టగలం. అవి మాత్రమే మానవాళి అవసరాలకు పనికొస్తాయి. సుదూరాల్లో శాటిలైట్లను ప్రవేశపెట్టలేం. అందుబాటులో ఉన్న కక్ష్యలను అన్ని దేశాలకు అత్యంత విలువైన అంతరిక్ష వనరులుగా చెప్పొచ్చు. ఇప్పుడీ అంతరిక్ష చెత్తతో ఆ వనరులను భవిష్యత్తులో మానవుడు ఉపయోగించుకోలేని దురవస్థ రావొచ్చు.

### ఎందుకిలా జరుగుతోంది?

సౌర తుపాన్లు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. శక్తివంతమైన సౌర తుపాన్ల ధాటికి శాటిలైట్ల పనితీరు దెబ్బతిని అవి నియంత్రణ కోల్పోతున్నాయి. గతంలోనూ ఇలా కొన్ని శాటిలైట్లు హఠాత్తుగా పనిచేయడం ఆగిపోవడం, కొన్ని ఢీకొనడం, ఇంకొన్ని నియంత్రణ పరిధి ఆవలికి వెళ్లిపోవడం జరిగాయి.

### లక్షలాది ముక్కలు

యూరోపియన్ స్పేస్‌ఏజెన్సీ గణాంకాల ప్రకారం 10 సెంటీమీటర్లకన్నా పెద్ద పరిమాణంలో ఉన్న ముక్కలు 40,000దాకా అంతరిక్షంలో పోగుబడ్డాయి. ఇక 1 సెంటీ మీటర్ కన్నా చిన్నసైజు ముక్కలు 13 కోట్లదాకా ఉంటాయని తెలుస్తోంది. మనిషి అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాలు, రాకెట్ల కారణంగా అంతరిక్షంలో దాదాపు 13,000 టన్నుల మేర చెత్త పేరుకుపోయింది. ఇది 90 భారీ తిమింగలాల బరువుతో సమానం. ఇందులో 4,300 టన్నుల చెత్త కేవలం రాకెట్ నుంచి విడిపోయిన విడిభాగాల కారణంగా పోగుబడింది. తాజాగా ముక్కలైన ఇంటెల్‌శాట్ 33ఈ ఉపగ్రహం ఏకంగా 35,000 కి.మీ.ల ఎత్తులో పరిభ్రమించేది. ఇంత దూరంలో ఉన్న ముక్కలను లెక్కబెట్టడం కూడా చాలాకష్టం. ఈ ఏడాది జూన్‌లో రెసర్స్–పీ1 ఉపగ్రహం 480 కి.మీ.ల ఎత్తులో భూ దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తూ హఠాత్తుగా బద్దలై 100 ముక్కలైంది. తిరిగే క్రమంలో ఇవి మరింతగా ముక్కలై చిన్నవిగా సమస్యను మరింత జటిలతరం చేస్తాయి. జూలైలో గడువు ముగిసిన రక్షణ, వాతావరణ రంగ 5డీ–2ఎఫ్8 వ్యోమనౌక ముక్కలైంది. ఆగస్ట్‌లో లాంగ్‌మార్చ్6ఏ(సీజెడ్–6ఏ) రాకెట్ సైతం ఛిద్రమైంది.

### తొలగించాల్సిన బాధ్యత ఎవరది?

ఏ దేశానికి చెందిన శాటిలైట్ ముక్కలైతే వాటిని తొలగించాల్సిన బాధ్యత కూడా ఆ దేశానిదే. అంతరిక్ష వస్తువుల కారణంగా చెత్తగా మారిన కక్ష్యలను మళ్లీ అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో 1972లో అంతర్జాతీయ ఒప్పందం చేసుకున్నారు. అయితే అంతరిక్ష చెత్త పెరగడానికి కారకులయ్యారంటూ తొలిసారిగా గత ఏడాది మాత్రమే జరిమానా విధించారు. అమెరికా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఈ జరిమానా విధించింది.

### అందుబాటులోకి డీకమిషన్ ఆధునిక సాంకేతికత

చెత్త మరీ ఎక్కువగా పేరుకుపోకుండా ఏదైనా శాటిలైట్ జీవితకాలం ముగుస్తుందనిపించిన వెంటనే దానిని సురక్షితంగా భూకక్ష్యలోకి తీసుకొచ్చి మహాసముద్రాల్లో పడేసే ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. గతంలో స్కైల్యాబ్ వంటి ఘటనలతో జనం బెంబేలెత్తిపోయినా ఇప్పుడా పరిస్థితి లేదనే చెప్పాలి. గత నెలలో యురోపియన్ స్పేస్ ఏజెన్సీ క్లస్టర్–2 సల్సా శాటిలైట్‌ను ఇలాగే జాగ్రత్తగా డీకమిషన్ చేశారు. భారీ వస్తువును అంతరిక్షంలోకి పంపితే అంతమేర చెత్తను పంపినట్లు లెక్కించాలి. దశాబ్దాలపాటు సేవలందించిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఒకవేళ కక్ష్యలో ముక్కలైతే 22 కోట్ల ముక్కలుగా మారుతుందని ఓ అంచనా. అందుకే దీనిని సురక్షితంగా లాగుడుబండి లాంటి వ్యోమనౌకతో లాక్కొచ్చి మహాసముద్రంలో పడేయాలని అమెరికా ఇప్పటికే ఒక భారీ ప్రణాళిక సిద్ధంచేసింది. ఈ బాధ్యతను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ ప్రైవేట్ అంతరిక్షసంస్థకు అప్పజెప్పింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

# ‘సమాచార దర్పణ్’ ఎవరి కాలంలో ప్రచురితమైంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

హిస్టరీ



### భారత జాతీయోద్యంలో పత్రికల పాత్ర

పత్రికలు భారత జాతీయోద్యమంలో కీలక పాత్రను పోషించాయి. మొగలుల కాలంలో ‘అక్బరాత్’, ‘వఖియనివాస్’ అనే పత్రికల ద్వారా వార్తా కథనాలను చక్రవర్తికి అందించేవారు. 1557లో పోర్చుగీస్ గవర్నర్ అల్ఫోన్సో కాలంలో గోవాలో పత్రికా ముద్రణను ప్రవేశపెట్టారు. మొదట్లో పాలకుల అభిప్రాయ వేదికలుగా గుర్తింపు పొందిన పత్రికలు ఆ తర్వాత సంఘ సంస్కరణ, సమాజహితం, నవభావన వేదికలుగా, అభ్యుదయ భావ వీచికలుగా, మితవాద, అతివాద, విప్లవవాద, గాంధీ సత్యాగ్రహం ఆలోచనా దీప్తులుగా పనిచేశాయి. సామాన్య ప్రజల్లో ఆలోచనా పరిజ్ఞానాన్ని మేల్కొలిపాయి. 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కీ అనే ఆంగ్లేయుడు ‘బెంగాల్ గెజిట్’ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించాడు. తర్వాత కలకత్తా సమీపంలోని ‘శేరంపూర్’లోని క్రైస్తవ మిషనరీ ‘దిగ్దర్శన’(మాసపత్రిక), ‘సమాచార దర్పణ’ అనే బెంగాలీ పత్రికలను స్థాపించింది. 1816లో ‘గంగాధర భట్టాచార్య’ ‘బెంగాల్ గెజిట్’ అనే పత్రికను ప్రారంభించారు. క్రైస్తవ మిషనరీ స్థాపించిన ‘ఫ్రెండ్ ఆఫ్ ఇండియా’ 1869లో సామ్యూల్ క్లర్క్ ప్రారంభించిన ‘స్టేట్స్‌మెన్’ అనే పత్రికలో విలీనమైంది. తర్వాత సామాజిక సంస్కరణలే ధ్యేయంగా రాజా రామ్మోహన్‌రాయ్ 1821లో ‘సంవాద కౌముది’ అనే వార పత్రికను స్థాపించి,సతీ సహగమన నిషేధం, బాల్య వివాహాల రద్దు, ఏకేశ్వరోపాసనల గురించి ప్రముఖంగా ప్రచారం చేశారు. రాయ్ ఆధునిక భావాలను వ్యతిరేకిస్తూ పోటీగా ‘రాధాకాంత్ దేవ్’ సనాతన సాంప్రదాయ వాదుల మద్దతుతో ‘సమాచార చంద్రిక’ను స్థాపించారు. దాంతో రాయ్ ద్వారకానాథ్ ఠాగూర్ సహాయంతో ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, పారశీక భాషల్లో, ఆధునిక భావాల ప్రచారం కోసం ‘వంగదూత’, ‘మిరాతుల్ అక్బర్’, ‘కువ్వత్ – ఉల్ – మువాహిద్దీన్’ లాంటి పత్రికలను ప్రారంభించారు. వీటిని పోలిన ‘జ్ఞానాన్వేషి’ అనే పత్రిక సమాజంలో విశేష ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వ అధికారుల అవినీతి కార్యకలాపాలను విమర్శిస్తూ యువతరం పత్రిక ‘ఎన్క్వైరర్’ అభ్యుదయ భావాలను ప్రచారం చేసింది. ‘సంవాద పూర్ణ చంద్రోదయం’ అనే పత్రికలో సనాతన వాదులు మత విషయాలను చర్చించేవారు. తర్వాత దీనినే రాజకీయ దినపత్రికగా ప్రారంభించారు. బంకించంద్ర చటోపాధ్యాయ ‘నీలిదర్పణ్’ పత్రికను ప్రారంభించారు. దీనికి ‘దీనబంధుమిత్ర’ ఎడిటర్‌గా వ్యవహరించారు. నీలిమందు రైతుల సమస్యలను ఈ పత్రికలో వ్యాసాల రూపంలో ప్రముఖంగా ప్రస్తావించేవారు. 1826లో కాన్పూర్ నుంచి వెలువడిన ‘ఉదాంత మార్తాండం’ అనే తొలి హిందీ పత్రిక పరిసర ప్రాంతాల ప్రజల సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తీసుకొచ్చింది.

- బొంబాయి రాష్ట్రంలో 1822లో దాదాభాయ్ నౌరోజీ నాయకత్వంలో ‘రస్తగఫ్తార్’ అనే పత్రిక గుజరాతీ భాషలో వెలువడింది. 1832లో మరాఠీ భాషలో వెలువడిన ‘బొంబాయి దర్పణ్’ పత్రికలో ఆంగ్లభాష విశిష్టత, బ్రిటిషర్ల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను బాలశాస్త్రి జంబేకర్ చర్చించారు. బాలశాస్త్రి అనుచరుడు ఛాల్ మహాజన్ ‘ప్రభువర్’ అనే పత్రికను స్థాపించి సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టారు. 1842లో పుణే నుంచి క్రైస్తవ మిషనరీలు ‘జ్ఞానోదయం’ అనే పత్రికను ప్రారంభించాయి. 1848లో పుణే నుంచే వెలువడిన ‘జ్ఞానప్రకాశీ’ తొలి మరాఠీ పత్రికగా ప్రసిద్ధి చెందింది. తిలక్, వాసుదేవ అగార్కర్‌లు కలిసి పుణే నుంచి 1881 లో ‘మరాఠీ’ (ఆంగ్లపత్రిక), ‘కేసరి’(మరాఠీ) పత్రికలను నిర్వహించి బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను నిశితంగా విమర్శించడమే కాకుండా, విప్లవ వాదులను సమర్థించినందుకు 1897లో 18 నెలలు జైలుశిక్ష అనుభవించారు. మద్రాస్ రాష్ట్రంలో గాజుల లక్ష్మీనరసుశెట్టి ‘క్రీసెంట్’ అనే పక్ష పత్రికలో బ్రిటిషర్ల దమన నీతిని విమర్శించారు. తర్వాత తెలుగులో వెలువడిన ‘వృత్తాంతిని’ (1838–51), ‘వర్తమాన’, ‘తరంగిణి’ (1848–52) పత్రికలు సామాజిక సమస్యలపై పోరాడాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1830లో బళ్లారి క్రైస్తవ మిషనరీ ‘సత్యదూత’ అనే తొలి తెలుగు పత్రికను ప్రారంభించింది. 1875 లో సుబ్రమణ్య అయ్యర్, కస్తూరి రంగన్ ఆధ్వర్యంలో వెలువడిన ‘ది హిందూ’ పత్రిక భారత జాతిని స్వాతంత్ర్య సమరానికి సన్నద్ధం చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి వెలు వడిన తొలి తెలుగు రాజకీయ పత్రిక ‘ఆంధ్రప్రకాశిక’, ‘స్వదేశీ మిత్రన్’ పత్రి కలు కూడా అదే బాటలో పయనించాయి.
- బ్రిటిషర్ల పరిపాలనను సుస్థిరం చేయ డానికి అధికారేతర బ్రిటిషర్లు కొన్ని పత్రికలు స్థాపించారు. అలాంటి వాటిలో ‘ఫ్రెండ్ ఆఫ్ ఇండియా’, ‘సర్కార్’, ‘బాంబేటైమ్స్’, ‘మద్రాస్ యునైటెడ్ సర్వీస్ గెజిట్’, ‘లాహోర్ క్రానికల్’, ‘సిటీగడో’, ‘మద్రాస్ స్పెక్టేటర్’లు ముఖ్య మైనవి. ఈ పత్రికలు బ్రిటిష్ పాలనకు అనుకూల వాతావరణాన్ని కల్పించేలా భారతీయ సమాజాన్ని ఉత్తేజ పరుస్తూ రచనలు సాగించాయి. ఈ పద్ధతిని ‘పత్రికా స్వేచ్ఛపిత’గా ప్రసిద్ధి చెందిన మెట్‌కాఫ్ నిరసించాడంటే వాటి ధోరణిని అర్థం చేసుకోవచ్చు. ఈ పత్రికలు బ్రిటిష్ సామ్రాజ్య తత్వాన్ని ప్రచారం చేశాయి. 1861లో బొంబాయి నుంచి ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’, 1865లో అలహాబాద్ నుంచి ‘పయనీర్’, 1868లో మద్రాస్ నుంచి ‘మద్రాస్ మెయిల్’ (ఇది దేశంలో తొలి సాయంకాలం పత్రిక), లాహోర్ నుంచి ‘సివిల్ మిలటరీ గెజిట్’లు ఈ కాలంలో వచ్చిన మరికొన్ని ముఖ్యమైన పత్రికలు.
- తర్వాత కాలంలో బెంగాల్ నుంచి నరేంద్రనాథ్ ఆధ్వర్యంలో వెలువడిన ‘ఇండియన్ మిర్రర్’ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, భారతీయుల రాజకీయ హక్కుల కోసం పోరాటం సాగించింది. 1868లో శిశిర్‌కుమార్ ఘోష్ ఆధ్వర్యంలో ‘అమృతబజార్’, ‘సమాచార దర్పణ్’ పత్రికలు బ్రిటిషర్ల ఆర్థిక దోపిడీని విమర్శించాయి. ‘సంధ్య, యుగాంతర్, బందీ జీవన్, ఘదర్’ లాంటి పత్రికలు బ్రిటిష్ సామ్రాజ్య సౌధాలను పునాదులతో సహా పెకిలించాలని, అందుకు సాయుధ తిరుగుబాటుకు భారతీయులు సన్నద్ధం కావాలని ప్రేరేపించాయి. పార్శీ, ఉర్దూ పత్రికలైన ‘మహె ఆలం’, ‘అఫ్రోజ్’, గోఖలే ఆధ్వర్యంలో వెలువడిన ‘సుధాకర్’ పత్రికలు ప్రజా హక్కుల పరిరక్షణ, మితవాద ధోరణిని ప్రతిబింబించగా ‘ఇండియన్ మిర్రర్’, ‘వాయిస్ ఆఫ్ ఇండియా’; అరబిందో ఘోష్, రాస్ బిహారీ ఘోష్‌ల పెట్రియాట్, హిందూప్రకాష్, సోంప్రకాష్ పత్రికలు జాతీయతను రగిలించాయి. 1878లో లార్డ్ లిట్టన్ ప్రాంతీయ భాష పత్రికా చట్టాన్ని ప్రవేశపెట్టి స్వేచ్ఛను హరించాడు. 1882లో రిప్పన్ దేశీయభాషా చట్టాన్ని రద్దు చేసి పత్రికలకు స్వేచ్ఛ కలిగించాడు.
- ఉర్దూలో షంగుల్ అక్బర్, జుంబాల్ ఉల్ అక్బర్, సిరాజ్ – ఉల్ అక్బర్, ఢిల్లీ అక్బర్, సయ్యద్ అక్బర్ పత్రికలు సాంఘిక, మత పునరుజ్జీవానికి కృషి చేశాయి. మిరాతుల్ అక్బర్, జియ జహనామా పత్రికలు హిందూ – ముస్లింల సమైక్యతకు కృషి చేశాయి.
- తెలుగులో కందుకూరి వీరేశలింగం ‘వివేకవర్ధిని, సత్య సంవర్ధిని, సతీహిత బోధిని’ పత్రికలను ప్రారంభించి ‘ఆధునిక ఆంధ్రదేశ పిత’గా పేరు గాంచారు. రాయస వేంకటశివుడి ‘జనానా, ‘సుజన మనోవిలాసిని’, అమృతబోధిని’ పత్రికలు సాంఘిక దురాచారాలపై ఎక్కుపెట్టిన బ్రహ్మాస్త్రాలు.
- తెలంగాణలో ‘గోల్కొండ’ (సురవరం ప్రతాపరెడ్డి ఎడిటర్), ‘మిజాన్’, ‘నీలగిరి’ , షోయబుల్లాఖాన్ ‘ఇమ్రోజ్’ పత్రికలు నాటి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాయి. భారతీయ పత్రికలు 1823లో ఆడమ్స్ ఆంక్షల నుంచి లిట్టన్ ప్రతిబంధకాల వరకు సమస్యలన్నింటినీ అధిగమించి భారత స్వాతంత్ర్య సాధనలో బహుముఖ పాత్రను పోషించాయి.

### మాదిరి ప్రశ్నలు

1. వీటిలో సరికానిది? (2002 సివిల్స్)
   1) సమచార దర్పణ్ – మార్స్‌మన్
   2) మిరాతుల్ అక్బర్– రామ్మోహన్ రాయ్
   3) స్వదేశీ మిత్రన్ – సుబ్రమణ్యం
   4) నీల్ దర్పణ్ – శిశిర్ కుమార్ ఘోష్
2. భారతదేశంలో పత్రికా ముద్రణాయం త్రాన్ని ప్రవేశపెట్టినవారు?
   1) బ్రిటిషర్లు 2) పోర్చుగీస్
   3) డచ్చి 4) ఫ్రెంచివారు
3. దేశంలో తొలి ‘సాయంకాలపు పత్రిక’ ఏది?
   1) బొంబాయి క్రానికల్
   2) మద్రాస్ క్రానికల్
   3) మద్రాస్ మెయిల్ 4) బెంగాల్ గెజిట్
4. ‘ది హిందూ’ (1875) పత్రిక ఎడిటర్లుగా పని చేసిన వారు?
   1) సుబ్రమణ్యం అయ్యర్, పద్మనాభన్ పిళ్లై
   2) కస్తూరీ రంగన్ – సుబ్రమణ్యం
   3) కస్తూరీ రంగన్ – పద్మనాభన్
   4) పద్మనాభన్ – రాజమార్తాండ
5. ‘బెంగాలీ విభజనను’ తొలిసారిగా ప్రచురించిన పత్రిక ఏది?
   1) బెంగాల్ గెజిట్ 2) నీల్ దర్పణ్
   3) ఇండియన్ హెరాల్డ్
   4) అమృతబజార్
6. ‘సమాచార దర్పణ్’ పత్రిక ఎవరి కాలంలో ప్రచురితమైంది?
   1) లార్డ్ కర్జన్ 2) విలియం బెంటింగ్
   3) లార్డ్‌మింటో 4) వారన్ హేస్టింగ్స్
7. కిందివాటిలో సరైన జత?
   1) దీన్ మిత్ర – ముకుంద్‌రావు పాటిల్
   2) సత్య దూత – గంగాధర భట్టాచార్య
   3) సమాచార చంద్రిక–రాజా రామ్మోహన్ రాయ్
   4) బొంబాయి దర్పణ్ – చాల్‌మహాజన్
8. నీలిమందు రైతుల సమస్యలను వివరించిన పత్రిక ఏది?
   1) నీల్ దర్పణ్ 2) ఉదాంత మార్తాండం
   3) జ్ఞానోదయం 4) పైవన్నీ

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 2; 5) 4; 6) 4; 7) 1; 8) 1.

## విద్య, ఉద్యోగ సమాచారం

### జీఆర్ఎస్ఈ, కోల్‌కతాలో హెచ్‌ఆర్ ట్రైనీ పోస్టులు

కోల్‌కతాలోని గార్డెన్ రీసెర్చ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్(జీఆర్ఎస్ఈ) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడాది శిక్షణకు హెచ్ఆర్ ట్రైనీ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06.
» స్టైపెండ్: నెలకు రూ.15,000.
» అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా(హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/హెచ్‌ఆర్ డెవలప్‌మెంట్ /పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/సోషల్ వర్క్/లేబర్ వెల్ఫేర్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 26 ఏళ్లు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» శిక్షణా కాలం: ఒక సంవత్సరం.
» ఎంపిక విధానం: విద్యార్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, సర్టిఫికెట్ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 17.11.2024
» వెబ్‌సైట్: http://grse.in

### కిత్తూరు రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలు

కిత్తూరు(కర్ణాటక)లోని కిత్తూరు రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈ పాఠశాలలో ప్రవేశం పొందిన బాలికలు 12వ తరగతి(సైన్స్ స్ట్రీమ్) వరకు చదువుకోవచ్చు. సీబీఎస్ఈ విధానంలో బోధన ఉంటుంది.

» అర్హత: గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి.
» వయసు: విద్యార్థినులు 2025 జూన్ 01 నాటికి పదేళ్లు నిండి పన్నెండేళ్లలోపు ఉండాలి.
» ఎంపిక విధానం: జాతీయ స్థాయిలో రాతపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందిన వారికి ఇంటర్వ్యూలు, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు.
» పరీక్ష విధానం: పరీక్ష 300 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ మ్యాథమేటిక్స్(150 మార్కులు), జనరల్ నాలెడ్జ్(50 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(50 మార్కులు), ఇంటెలిజెంట్ కోషంట్/మెంటల్ ఎబిలిటీ–50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్ష ఇంగ్లిష్, కన్నడ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.12.2024
» ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 31.12.2024.
» ప్రవేశ పరీక్ష తేది: 02.02.2025.
» పరీక్ష కేంద్రాలు: కిత్తూర్, విజయపూర్, బెంగళూరు, కలబురగి.
» వెబ్‌సైట్: https://kittursainikschool.org

# ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి నాటకం?




### తెలుగు సాహిత్యంపై ఇతర భాషల ప్రభావం

**సంస్కృతం ప్రభావం:**

ప్రపంచ భాషా కుటుంబాల్లో పెద్దది ఇండో ఆర్యన్ లేదా హిందార్య కుటుంబం. వీటిలో అతి ప్రాచీనమైంది సంస్కృతం. దీనికి సంబంధించి రెండు భేదాలున్నాయి. అవి:

1. వైదిక సంస్కృతం
2. లౌకిక సంస్కృతం

**వైదిక సంస్కృతం:** వైదిక ఆచార వ్యవహారాల్లో ఉపయోగించేది వైదిక సంస్కృతం. కావ్యాల్లోని భాష లౌకిక సంస్కృతం. భారతీయ భాషలన్నింటిపై సంస్కృతం ప్రభావం ఉంది. తెలుగు భాషపై ప్రత్యేకించి ఎక్కువ.

మన దేశంలో అతి ప్రాచీన గ్రంథం ‘రుగ్వేదం’. ఇది క్రీ.పూ. 1500 నాటిదని భాషా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. వేదాలన్నీ మౌఖికాలు. పూర్వకాలంలో వాటిని విని, వల్లెవేసేవారు కాబట్టి వేదాలను ‘శ్రుతులు’ అని కూడా అంటారు. మన దేశంలో లిఖిత పూర్వకంగా ముద్రణలో లభించిన మొదటి గ్రంథం యాస్కుని నిరుక్తం.

రుగ్వేదం తర్వాత యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలు వచ్చాయి. వేదాలకు వి వరణాత్మక వ్యాఖ్యానాలుగా బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఆవిర్భవించాయి.

**లౌకిక సంస్కృతం:** కావ్యాల్లో వాడిన భాష లౌకిక సంస్కృతం. దీని కాలం క్రీ.పూ. 1000 నుంచి 600 నాటిదని భాషాశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వాల్మీకి రామాయణం, వ్యాసుడి మహాభారతం, ‘పాణి’ని అష్టాధ్యాయి వంటి గ్రంథాలు లౌకిక సంస్కృతంలోనే ఉన్నాయి. పాణిని అష్టాధ్యాయి వ్యాకరణం ప్రపంచంలో ప్రముఖ భాషా శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకుంది. ‘మానవ మేధాశక్తికి మహత్తర గోపురం’ పాణిని వ్యాకరణం అని ‘బ్లూమ్‌ఫీల్డ్’ అభివర్ణించాడు.

మహాకవి కాళిదాసు కుమార సంభవం, రఘువంశం, ఋతు సంహారం లాంటి ప్రసిద్ధ కావ్యాలను రచించారు. అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం లాంటి గొప్ప నాటకాలు రాశారు. భాసుడు రచించిన ‘ప్రతిమ’, ‘స్వప్న వాసవదత్తం’ నాటకాలు కూడా ప్రసిద్ధికెక్కాయి. భర్తృహరి ‘సుభాషితాలు’, శూద్రకుడి ‘మృచ్ఛకటికం’ నాటకం పండితుల ప్రశంసలు పొందాయి.

తెలుగు భాషా సాహిత్యంపై సంస్కృత భాషా సాహిత్యాల ప్రభావం ఎక్కువగా ఉంది. తొలిదశలో తెలుగు సాహిత్యం సంస్కృత సాహిత్యాన్ని అనుసరించింది. పురాణాలు, కావ్యాలు, నాటకాల్లో సంస్కృత ప్రభావం కనిపిస్తుంది. ఆదికవి నన్నయ భారతాంధ్రీకరణలో ఐదింట నాలుగుపాళ్లు తత్సమ పదాలను ప్రయోగించారు. భారత, భాగవత, రామాయణ గ్రంథాలన్నీ సంస్కృతం నుంచి అనువాదమైనవే. తిక్కన, ఎర్రన, శ్రీనాథ యుగం సంస్కృత కావ్యాలనే అనుసరించింది. శ్రీనాథుడి శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం కావ్యాలు సంస్కృత అనుసరణలుగా, సంస్కృత సమాస భూయిష్టమైన నారికేళ పాకంలో సాగాయి. శ్రీనాథుడు అన్ని భాషలకు సంస్కృతం అమ్మ లాంటిదని (జనని సంస్కృ తంబు సకల భాషలకును) ప్రశంసించారు. 19 వ శతాబ్ది చివరలో బిషప్ కాల్డ్‌వెల్ తెలుగు ద్రావిడ భాషా జన్యమని సిద్ధాంతీకరించేంత వరకు పండితులంతా సంస్కృత భాష నుంచి పుట్టిందనే అభిప్రాయంతో ఉన్నారు. ప్రబంధ కవులు చాలా వరకు సంస్కృత కావ్యాల ఆధారంగా రచనలు సాగించారు. శ్రీ కృష్ణ దేవరాయల ఆముక్తమాల్యద, రామరాజభూషణుడి వసుచరిత్ర సంస్కృత సమాస భూయిష్టంగా నారికేళపాకంలో సాగాయి. మనుచరిత్రలో పెద్దన కొంత కదళీపాకాన్ని, కొంత నారికేళ పాకాన్ని మిళితం చేశారు.

రాజకీయ, సాంస్కృతిక, భౌగోళిక సంబంధాల వల్ల తెలుగులో సంస్కృత పదాలు ప్రవేశించాయి. ప్రస్తుతం పూజలు, కర్మకాండలకే సంస్కృతాన్ని ఉపయోగిస్తున్నారు.

#### ఆంగ్ల భాషా ప్రభావం

సంస్కృతం తర్వాత తెలుగు సాహిత్యంపై అత్యధికంగా ప్రభావితం చేసిన భాష ఆంగ్లం. 19వ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసింది. వీరేశలింగం, గురజాడ, గిడుగు, చిలకమర్తి లాంటి కవులు ఆంగ్ల భాషా సాహిత్యాలను అధ్యయనం చేశారు. వీరేశలింగం ఆంగ్ల సాహిత్య ప్రభావంతో నవల, ప్రహసనం, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర ప్రక్రియలను తెలుగులో రాశారు. గురజాడ పాశ్చాత్యుల హేతువాద దృక్పథాన్ని ప్రశంసిస్తూ ‘కన్నుగానని వస్తు తత్వము కాంచ నేర్వరు/ లింగిరీజులు’ అని మెచ్చుకున్నారు. పాశ్చాత్యుల సంస్కరణ దృక్పథానికి ప్రభావితుడై బాల్య వివాహాలు, కన్యాశుల్కాన్ని నిరసించారు. ‘కన్యాశుల్కం’ నాటకాన్ని శిల్పవంతంగా తీర్చిదిద్దారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం వీరేశలింగం అడుగుజాడల్లో ప్రసిద్ధ నవలలు, ప్రహసనాలు, నాటకాలను రాశారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఆంగ్లభాషా ప్రభావంతో గ్రాంథిక భాష వద్దన్నాడు. వ్యావహారిక భాషా ఉద్యమాన్ని చేపట్టి విజయాన్ని సాధించారు. వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగా తెలుగు ప్రాంతాల్లో అక్షరాస్యత పెరిగింది. సృజనాత్మక వచన రచనలు వెలువడ్డాయి.

20వ శతాబ్ది మొదటి భాగంలో ఆధునిక కవులైన రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి, తల్లావజ్ఝల, కవికొండల వెంకట రావు మొదలైన కవులు షెల్లీ, కీట్స్, వర్డ్స్‌వర్త్, డ్రైడెన్ లాంటి రొమాంటిక్ కవుల ప్రభావంతో భావ కవితా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఆధునిక సాహితీ ప్రక్రియలైన నవల, కథానిక, నాటకం, వ్యాసం, విమర్శ లాంటి రచనలు అందుబాటులోకి వచ్చాయి. పాలనా పరమైన గవర్నర్, కమిషనర్, మేయర్, చైర్మన్, మినిస్టర్, న్యాయ సంబంధమైన కోర్టు, లాయర్, జడ్జి, డిక్రీ లాంటి పదాలు తెలుగులో కలిసిపోయాయి. అలాగే విద్యారంగంలో కాలేజీ, స్కూలు, యూనివర్సిటీ, ప్రొఫెసర్, లెక్చరర్, టీచర్ పదాలు చేరాయి. నిత్య వ్యవహారంలో మిళితమైన రోడ్డు, రైలు, బస్సు, పేపరు, పెన్ను, గన్ను పదాలను ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం ‘నవీన తత్సమాలు’గా పేర్కొన్నారు.

**తెలుగు సాహిత్యంపై ఆంగ్లం ప్రభావాన్ని తెలియజేసే ప్రసిద్ధ గ్రంథాలు:**

1. తెలుగు సాహిత్యంపై ఇంగ్లిషు ప్రభావం – ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు
2. తెలుగులో ఆంగ్ల పదజాలం – ఆచార్య టి. అక్కిరెడ్డి
3. ఆంధ్ర సాహిత్య విమర్శ– ఆంగ్ల ప్రభా వం – ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం
4. బాల వ్యాకరణం – వికాస వ్యాఖ్య – ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం

#### ఉర్దూ ప్రభావం

అల్లాఉద్దీన్ ఖిల్జీ దండయాత్ర ప్రభావంతో ఉర్దూ భాష భారత దేశంలో ప్రవేశించింది. నవీన ఔత్తరాహ భాష హిందీ తర్వాత ప్రముఖమైంది ఉర్దూ. ఈ భాషా వ్యవహర్తలు దేశమంతా ఉన్నారు. మహమ్మదీయుల పాలనలో ఉర్దూ 13వ శతాబ్ది నుంచి పాలనా భాషగా ఉంది. ఇబ్రహీం కుతుబ్‌షా ఉర్దూతోపాటు తెలుగును ఆదరించారు. ఆయన పొన్నెగంటి తెలగన రచించిన ‘యయాతి చరిత్ర’ను అంకితం తీసుకున్నారు. ఆంగ్లేయుల పాలనలో 1835లో ఉర్దూను రాజభాషగా ప్రకటించారు. హిందీ బోధన కంటే ఉర్దూ బోధనకే ప్రాధాన్యమిచ్చారు. ముస్లిం ప్రభువుల పాలనలో సైనిక శిబిరాల్లో పుట్టిన ఉర్దూ సాంఘిక, రాజకీయ కారణాల వల్ల బాగా అభివృద్ధి చెందింది. క్రీ.శ.15వ శతాబ్ది నాటికే ఉర్దూ సాహిత్యం ఉంది. ఈ భాషా సాహిత్య రూపాన్ని ‘దఖానీ’ అని పిలుస్తారు. ఉర్దూ, హిందీలు హిందూస్థానీ భాషలుగా ప్రసిద్ధి చెందాయి. రాజకీయ పాలనా పరంగా నవాబు, నౌకరు, తహసీల్‌దార్, దరఖాస్తు, రసీదు, కుర్తా, కండువా, లంగా మొదలైన ఉర్దూ పదాలు తెలుగులో పూర్తిగా కలిసిపోయాయి. అదే విధంగా సాంస్కృతికపరంగా మసీదు,సలాం, మక్కా, నమాజు లాంటి పదాలు తెలుగులో చేరాయి.

ఆధునిక కవితా రూపాలైన గజల్స్, రుబాయీలు ఉర్దూ సాహిత్య ప్రభావితాలే. ఆధునిక కవుల ప్రయోగాల్లో ఉర్దూ పదాలు విరివిగా ఉన్నాయి. ఉర్దూలో ఇక్బాల్‌చంద్, రాజేందర్ సింగ్ బేడీ ప్రముఖ రచయితలు.

#### ప్రసిద్ధ గ్రంథాలు – రచయితలు

1. తెలుగులో ఉర్దూ పదాలు – డాక్టర్ టి. స్వరాజ్యలక్ష్మి
2. తెలుగు భాషకు మహమ్మదీయుల సేవ – డాక్టర్ షేక్ మస్తాన్
3. తెలుగుపై ఉర్దూ – పారశీకుల ప్రభావం – ఆచార్య కె. గోపాల కృష్ణారావు

### మాదిరి ప్రశ్నలు

1. సంస్కృతం ఏ భాషా కుటుంబానిది?
   1) ఆర్య భాష 2) ఇండో ఆర్యన్ భాష
   3) సినోటిబెటన్ 4) ఆస్ట్రో ఏషియాటిక్
2. తెలుగులో ప్రవేశించిన పాలనా సంబంధ సంస్కృత పదం?
   1) ఆదేశం 2) నిర్బంధం
   3) పరిపాలన 4) పైవన్నీ
3. తెలుగుతో సంస్కృత భాషకు ఉన్న సంబంధం?
   1) సజాతీయ భాష
   2) విజాతీయ భాష 3) సమీప భాష
   4) మత సంబంధ భాష
4. సంస్కృత సమాస భూయిష్టమైన శైలిని ఏమంటారు?
   1) ద్రాక్షాపాకం 2) కదళీపాకం
   3) నారికేళ పాకం
   4) పాషాణ పాకం
5. సంస్కృతం నుంచి తత్సమాలుగా ఎలాంటి మార్పు లేకుండా తెలుగులోకి వచ్చిన మాటలు?
   1) మకారాంత శబ్దాలు
   2) సకారాంత శబ్దాలు
   3) అకారాంత శబ్దాలు
   4) దీర్ఘాచ్చులు ఉన్న ఏకాక్షర పదాలు
6. అన్య దేశ్యాల ద్వారా తెలుగులోకి వచ్చిన అనుబంధ రూపాలు?
   1) దారు, నామా 2) పోతు, గారు
   3) ఖానా, రికం 4) కోరు, పోతు
7. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి నాటకం?
   1) మర్చంట్ ఆఫ్ వెనిస్
   2) జూలియస్ సీజర్
   3) రోమియో జూలియట్
   4) కామెడీ ఆఫ్ ఎరర్స్
8. జీవిత చరిత్ర – స్వీయ చరిత్రలకు మూలమైన ఆంగ్ల ప్రక్రియలు?
   1) లైఫ్ హిస్టరీ – బయోగ్రఫీ
   2) ఆటో బయోగ్రఫీ – లైఫ్ హిస్టరీ
   3) బయోగ్రఫీ – ఆటో బయోగ్రఫీ
   4) బయోగ్రఫీ – సెల్ఫ్ హిస్టరీ
9. తెలుగు నుంచి ఆంగ్లంలోకి ప్రవేశించిన పదం?
   1) ఎలిఫెంట్ 2) కా
   3) క్రో 4) బాండికూట్
10. పర్షియన్ నుంచి దువ్వూరి రామిరెడ్డి అనువదించిన ‘గులిస్థాన్’ మూల రచయిత?
    1) హాఫీజ్ 2) ఉమర్‌ఖయ్యాం
    3) సాదీ 4) జలాలుద్దీన్
11. ఉర్దూ పదం కానిది?
    1) కుర్తా 2) చొక్కా
    3) లంగా 4) కండువా
12. ఆంగ్ల ప్రభావం లేని ప్రక్రియ?
    1) వ్యాసం 2) నవల
    3) విమర్శ 4) యక్షగానం

సమాధానాలు

1) 2; 2) 4; 3) 2; 4) 3; 5) 4; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 2; 11) 2; 12) 4.

### గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. తెలుగులో ప్రస్తుతం వాడుకలో ఉన్న లైటు, స్విచ్, కాఫీ అనే ఆంగ్ల పదాలు?
   1) నిత్యావసరాలకుసంబంధించినవి
   2) సాంస్కృతిక సంబంధమైనవి
   3) పరిపాలనా సంబంధ పదాలు
   4) శాస్త్ర పరిభాషా సంబంధమైనవి
2. తెలుగు మాట ‘వేయి’ పదం?
   1) సంస్కృత పదం
   2) తమిళ పదం 3) కన్నడ పదం
   4) ద్రావిడ వ్యుత్పత్తి ఉన్న స్వతంత్ర పదం
3. ‘జమిలి’ శబ్దానికి మూలరూపం ‘యమల’. ఇది ఏ భాషా పదం?
   1) కన్నడం 2) మలయాళం
   3) సంస్కృతం 4) తమిళం
4. ‘చాకిరీ’ అనే పదం ఏ భాషలోనిది?
   1) కన్నడం 2) మలయాళం
   3) ఉర్దూ 4) తమిళం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
గురువారం । 24-10-2024

# వినాళ గ్రంథులని వేటిని అంటారు?

## హార్మోన్లు

మనిషి శరీరంలోని వివిధ భాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకం. ఒక సమగ్ర వ్యవస్థ (Integrated or Coordination System) అందుకు ఉపకరిస్తుంది. నాడీ వ్యవస్థ, అంతఃస్రావక వ్యవస్థలను రెండింటినీ కలిపి సమన్వయ వ్యవస్థ అంటారు. ఈ రెండు వ్యవస్థలు శరీరంలో వివిధ భాగాలు, అవయవ వ్యవస్థల మధ్య సమన్వయానికి కీలకమైనవి.

నాడీ వ్యవస్థ ద్వారా వేగవంతమైన సమన్వయం జరుగుతుంది. నాడీ ప్రచోదనం (Nerve Impulse) అనే నాడీ సమాచార ప్రసారం ద్వారా నాడీ వ్యవస్థ శరీర భాగాల మధ్య సమన్వయాన్ని తీసుకువస్తుంది. అంతఃస్రావక వ్యవస్థలో హార్మోన్లు అనే రసాయనాలు శరీర భాగాల మధ్య సమన్వయాన్ని చేకూరుస్తాయి.

అంతఃస్రావక వ్యవస్థలో అంతఃస్రావక గ్రంథులు, వాటి నుంచి రక్తంలోకి నేరుగా విడుదలయ్యే హార్మోన్లు ఉంటాయి. అంతఃస్రావక గ్రంథులకు నాళం ఉండదు. అందువల్ల వీటిని వినాళ గ్రంథులు అంటారు. శరీరంలోని వివిధ భాగాల్లోని అంతఃస్రావక గ్రంథులు రక్తంలోకి తమ హార్మోన్లను విడుదల చేస్తాయి. మనిషి అభివృద్ధిలోని వివిధ దశల్లో హార్మోన్లు తగిన మోతాదులో రక్తంలోకి విడుదలై పెరుగుదల, అభివృద్ధి, ప్రత్యుత్పత్తి మొదలైన చర్యలను నియంత్రిస్తాయి. హార్మోన్లు రసాయనకంగా మూడు రకాలు.

- ప్రోటీన్ లేదా పెప్టైడ్. **ఉదా:** పెరుగుదల హార్మోన్, ఇన్సులిన్
- స్టిరాయిడ్. **ఉదా:** అన్ని లైంగిక హార్మోన్లు
- అమైనో ఆమ్ల ఉత్పేరకం. **ఉదా:** థైరాక్సిన్

### శరీర భాగాలు: అంతఃస్రావక గ్రంథులు

తల - పియూష గ్రంథి
మెడ - అవటు, పార్శ్వ అవటు
ఉదరం - క్లోమం, అధివృక్క, జీర్ణకోశం
బీజకోశాలు (స్త్రీలలో అండాశయాలు) పురుషుని ముష్కాలు ఉదరం వెలుపల ఉంటాయి.
**తాత్కాలిక అంతఃస్రావక గ్రంథులు:** కార్పస్ ల్యుటీయం (స్త్రీలలో) - థైమస్

### పియూష గ్రంథి

ఇది మెదడు దిగువన ఉంటుంది. అందువల్ల దీన్ని Hypophysis అంటారు. దీనిలో మూడు లంబికలు ఉంటాయి. పూర్వ లంబిక నుంచి ట్రాపిన్లు అనే హార్మోన్లు విడుదలై కొన్ని ఇతర అంతఃస్రావక గ్రంథులను ప్రేరేపిస్తాయి. పెరుగుదల హార్మోన్ లేదా Somatotropin అనే ట్రాపిన్ శరీర సాధారణ పెరుగుదలను ప్రేరేపిస్తుంది. దీని లోపం వల్ల పిల్లల్లో మరుగుజ్జుతనం (Dwarfism), పెద్దల్లో Simond's వ్యాధి సంభవిస్తుంది. పెరుగుదల హార్మోన్ అధిక మోతాదులో విడుదలవడం వల్ల పిల్లల్లో Gigantism, పెద్దల్లో Acromegaly సంభవిస్తుంది. Acromegaly ఉన్నవారు గోరిల్లా ఆకృతిని ప్రదర్శిస్తారు. పీయూష గ్రంథి పరలంబిక నుంచి రెండు హార్మోన్లు ఆక్సిటోసిన్, అతిమూత్ర నిరోధక హార్మోన్ (Antidiuretic Hormone) లేదా వాసోప్రెసిన్ విడుదలవుతాయి. ప్రసవం సమయంలో గర్భాశయ మృదు కండరాల సంకోచాన్ని ఆక్సిటోసిన్ ప్రేరేపిస్తుంది. ఫలితంగా శిశు జననానికి తోడ్పడుతుంది. వాసోప్రెసిన్ లేదా అతిమూత్ర నిరోధక హార్మోన్ రక్తపీడనాన్ని పెంచుతుంది. అదే విధంగా మూత్రంలో నీటి శాతాన్ని నియంత్రిస్తుంది. దీని అల్ప మోతాదు వల్ల డయాబెటిస్ ఇన్సిపిడస్ (అతిమూత్ర వ్యాధి) సంభవిస్తుంది.

### అవటు గ్రంథి

ఇది అతిపెద్ద అంతఃస్రావక గ్రంథి. ఇంగ్లిష్ అక్షరం 'ఏ' ఆకారంలో ఉంటుంది. దీని నుంచి $T_3$, $T_4$ అనే రెండు హార్మోన్లు విడుదలవుతాయి. ఈ రెండు ఏర్పడటానికి ఆహారంలో తగినంత అయోడిన్ అవసరం. $T_4$ను సాధారణంగా థైరాక్సిన్ అంటారు. ఇది అవటు గ్రంథి నుంచి విడుదలయ్యే ప్రధాన హార్మోన్. శరీరంలోని ఆధార జీవక్రియారేటు (Basal Metabolic Rate, BMR)ను థైరాక్సిన్ నియంత్రిస్తుంది.

### థైరాక్సిన్ సంబంధిత వైపరీత్యాలు

- పుట్టుకతోనే పిల్లల్లో థైరాక్సిన్ లోపం వల్ల క్రెటినిజం సంభవిస్తుంది. మానసిక, శారీరక మాంద్యత దీని ముఖ్య లక్షణం.
- పెద్దల్లో అల్ప థైరాక్సిన్ వల్ల మిక్సోడీమా/గల్స్ వ్యాధి సంభవిస్తుంది. ఆకలి మాంద్యం, జుట్టు రాలడం, గొంతు, ముఖంలో ఒడీమా (వాచిపోవడం) దీని ముఖ్య లక్షణాలు.
- పెద్దల్లో అత్యధిక థైరాక్సిన్ ద్వారా గ్రేవ్స్ వ్యాధి లేదా ఎక్సాప్తాల్మిక్ గాయిటర్ సంభవిస్తుంది. అధిక BMR, అధిక వేడి, కళ్ల నుంచి కను గుడ్లు పడిపోతున్నట్లు కనిపించే బాహ్య లక్షణం.
- ఆహారంలో తగినంత అయోడిన్ లేకపోవడం - **సరళ గాయిటర్.** అవటు గ్రంథి మెడ దగ్గర బంతిలా వాచిపోతుంది.





### పార్శ్వ అవటు గ్రంథి

అవటు గ్రంథికి దగ్గరగా నాలుగు పార్శ్వ అవటు గ్రంథులు ఉంటాయి. వీటి నుంచి పారాథార్మోన్ హార్మోన్ విడుదలవుతుంది. ఇది రక్తంలోని కాల్షియం శాతాన్ని పెంచుతుంది. దీని అల్ప గాఢత వల్ల పారాథైరాయిడ్ టెటనీ (దవడ కండరాలు పట్టేయడం, బిగుతుకండరాలు) అధిక స్రావం వల్ల ఆస్టీటిస్ ఫైబ్రోజా (బలహీన ఎముకలు) సంభవిస్తాయి.

### క్లోమం

ఇది ఒక మిశ్రమ గ్రంథి. దీని అంతఃస్రావక భాగాన్ని లాంగర్‌హెన్స్ పుటికలు అంటారు. ఇందులో రెండు రకాల కణాలు ఉంటాయి. ఆల్ఫా కణాల నుంచి గ్లూకగాన్, బీటా కణాల నుంచి ఇన్సులిన్ ఏర్పడతాయి. గ్లూకగాన్ రక్తంలోని చక్కెర శాతాన్ని పెంచుతుంది. ఇన్సులిన్ రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటి పరస్పర చర్యల వల్ల శరీరంలో స్థిర గ్లూకోజ్ (80-110 mg/100ml of blood) నియంత్రణలో ఉంటుంది. ఇన్సులిన్ లోపంవల్ల టైప్-1 డయాబెటిస్ మిల్లిటస్ వస్తుంది. ఇన్సులిన్ ఏర్పడి పనిచేయని కారణంగా టైప్ - 2 డయాబెటిస్ మిల్లిటస్ వస్తుంది.

### అధివృక్క గ్రంథులు

రెండు అధివృక్క గ్రంథులుంటాయి. ఒక్కొక్కటి ఒక్కో మూత్రపిండంపై అమరి ఉంటాయి. అధి వృక్క గ్రంథి లోపలి భాగం దవ్వ. వెలుపలి భాగం వల్కలం. దవ్వ భాగం నుంచి అడ్రినాలిన్, నార్ అడ్రినాలిన్ అనే రెండు హార్మోన్లు విడుదలవుతాయి. వీటిని Emergency Hormones లేదా పోరాట పలాయన హార్మోన్లు (Hormones of fight, flight, fright) అంటారు. వల్కలం (Cortex) నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. వీటిలో ముఖ్యమైనవి కార్టిసోల్, ఆల్డోస్టిరోన్. కార్టిసోల్ శరీరంలో ఒత్తిడి పెరిగినపుడు అధికంగా విడుదలై, దానిని తగ్గిస్తుంది. అయితే ఇది దీర్ఘకాలం పాటు అధిక మోతాదులో విడుదల వడం వల్ల ముఖం, గొంతులో కొవ్వు పేరుకొని Cushing's Syndrome సంభవిస్తుంది. ఆల్డోస్టి రోన్ శరీర ద్రవాల నీటి - లవణ సమతౌల్యతను నియంత్రిస్తుంది. ఇది మూత్రంలో సోడియం విడు దలవకుండా జాగ్రత్త పడుతుంది. దీని అల్పస్రావం వల్ల చర్మం పొడిబారి, అడిసన్స్ వ్యాధి సంభవి స్తుంది. ఈ వ్యాధి వల్ల రక్తం పరిమాణం తగ్గి తీవ్ర స్థాయిలో కోమాకు చేరి మరణిస్తాడు.

### బీజ కోశాలు

పురుష బీజ కోశాలు ముష్కాలు. ముష్కాల్లోని లీడిగ్ కణాల నుంచి ఆండ్రోజన్లు అనే పురుష లైంగిక హార్మోన్లు విడుదలవుతాయి. వీటిలో టెస్టోస్టిరాన్ ముఖ్యమైంది. మీసం, గడ్డం, బొంగురు గొంతు, శరీరంపై రోమాలు వంటి పురుష ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని టెస్టోస్టిరాన్ ప్రేరేపిస్తుంది. పుట్టుకతో ముష్కాలు మగ శిశువు ఉదరంలోనే ఉండిపోయే స్థితిని Cryptorchidism అంటారు.

స్త్రీ బీజ కోశాలు అండాశయాలు. వీటి నుంచి స్త్రీ లైంగిక హార్మోన్లు ఈస్ట్రోజన్లు విడుదలవుతాయి. వీటిలో ప్రధానమైంది బీటా - ఈస్ట్రాడయాల్. రుతు చక్రం, స్తనాభివృద్ధి, కీచుగొంతు మొదలైన స్త్రీ ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని ఈస్ట్రోజన్లు ప్రేరేపిస్తాయి.

అండాశయం లోపలి గ్రాఫియన్ పుటికల నడుమ అండం అభివృద్ధి చెంది, ఆ తర్వాత పుటికల విచ్ఛిన్నం ద్వారా ఫాలోపియన్ నాళంలోకి విడుదలవుతుంది. విచ్ఛిన్నమైన గ్రాఫియన్ పుటికలు అధిక రక్త సరఫరాను పొంది కార్పస్ ల్యుటియం అనే తాత్కాలిక అంతఃస్రావక నిర్మాణంగా మారుతుంది. దీని నుంచి ప్రొజెస్టిరాన్ అనే హార్మోను విడుదలవుతుంది. అండం ఫలదీకరణం చెంది గర్భం మొదలైతే, ప్రొజెస్టిరాన్ గర్భావధి కాలం పొడవునా విడదలై, గర్భాన్ని మొత్తం నిర్వహిస్తుంది. అందువల్ల ప్రొజెస్టిరాన్‌ను Pregnancy Hormone అంటారు.

### థైమస్ (బాల గ్రంథి)

ఇది యుక్త వయసు వరకు ఉండి అనంతరం నశిస్తుంది. దీని నుంచి విడుదలయ్యే థైమోసిన్ అనే హార్మోన్ రోగ నిరోధక శక్తిలో కీలకమైన T లింఫోసైట్ల అభివృద్ధిని ప్రేరేపిస్తుంది.

### మాదిరి ప్రశ్నలు

1. ఏ హార్మోన్‌ను స్త్రీల మూత్రంలో గుర్తించడం ద్వారా గర్భధారణ నిర్ధారితమవుతుంది?
ఎ) ప్రొజెస్టిరాన్ బి) రిలాక్సిన్
సి) హ్యూమన్ కోరియోనిన్ గోనడోట్రాపిన్
డి) ఈస్ట్రోజన్
2. అవటు గ్రంథి నుంచి విడుదలయ్యే ఏ ప్రోటీన్ హార్మోన్ రక్తంలోని కాల్షియం శాతాన్ని తగ్గిస్తుంది?
ఎ) పారాథార్మోన్ బి) కాల్సిటోనిన్
సి) థైరాక్సిన్ డి) ఏదీ కాదు
3. ఆహారంలో అయోడిన్ లోపం వల్ల సంభవించేది?
ఎ) మహాకాయం బి) జడవామనుడు
సి) విస్తరించిన అవటు గ్రంథి
డి) చిన్న అవటు గ్రంథి
4. కాలేయంలోని పిత్తాశయం సంకోచాన్ని ప్రేరేపించే హార్మోన్?
ఎ) కోలిసిస్టోకైనిన్ బి) గ్యాస్ట్రిన్
సి) సెక్రిటిన్ డి) ఎంటిరోక్రైనిన్
5. భిన్నమైనదేదో కనుక్కోండి?
ఎ) ఈస్ట్రోజన్ బి) ఆండ్రోజన్
సి) టెస్టోస్టిరాన్ డి) డీహైడ్రోటెస్టోస్టిరాన్
6. కింది వాటిలో అంతఃస్రావక, బాహ్య స్రావక చర్యలను ప్రదర్శించే అవయవం?
ఎ) పీయూష గ్రంథి బి) క్లోమం
సి) థైమస్ డి) అవటు
7. మనిషి రక్తంలోని కాల్షియం ఫాస్ఫేట్ శాతాన్ని నియంత్రించే హార్మోన్?
ఎ) గ్లుకగాన్ బి) పెరుగుదల హార్మోన్
సి) పారాథైరాయిడ్ హార్మోన్ డి) థైరాక్సిన్
8. మనిషిలో శుక్రకణాల పోషణను చేపట్టే కణాలు?
ఎ) లీడిగ్ కణాలు
బి) సెర్టోలీ కణాలు
సి) గ్రాఫియన్ పుటికలు
డి) కుప్ఫర్ కణాలు
9. కింది వాటిలో హార్మోన్?
ఎ) ట్రిప్సిన్ బి) గ్యాస్ట్రిన్
సి) టయలిన్ డి) పెప్సిన్
10. ఇన్సులిన్ హార్మోన్ ఒక?
ఎ) గ్లైకోలిపిడ్ బి) ఫాటీ యాసిడ్
సి) పెప్టైడ్ డి) స్టీరాల్

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1 సి | 2 బి | 3 సి | 4 ఎ | 5 ఎ |
| 6 బి | 7 సి | 8 బి | 9 బి | 10 సి |

## ఉద్యోగ సమాచారం

### జీఆర్ఎస్ఈ, కోల్‌కతాలో 230 అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని గార్డెన్ రీసెర్చ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్(జీఆర్ఎస్ఈ)లో ట్రేడ్, గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 230.
» **పోస్టుల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్ (ఐటీఐ)-90, ట్రేడ్ అప్రెంటిస్(ఫ్రెషర్)-40, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-40, టెక్నీషియన్ అప్రెంటిస్-60.
» **విభాగాలు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్), ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సివిల్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌లకు (ఫ్రెషర్) మొదటి ఏడాది రూ.6000, రెండో ఏడాది రూ.6,600, ట్రేడ్ అప్రెంటిస్‌లకు(ఐటీఐ) మొదటి ఏడాది రూ.7000 లేదా 7,700, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.15,000(కోల్‌కతా), రూ.12,500(రాంచీ), టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.10,000(కోల్‌కతా) - రూ.9000 (రాంచీ).
» **వయసు:** 14 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **శిక్షణా కాలం:** ఒక సంవత్సరం. శిక్షణా ప్రదేశాలు: కోల్‌కతా, రాంచీ.
» **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.11.2024.
» **వెబ్‌సైట్:** https://grse.in

### పవర్‌గ్రిడ్‌లో 47 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

గురుగ్రామ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్)ట్రైనీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 47. -వేతనం: నెలకు రూ.30,000.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు గేట్ స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2024
» **వెబ్‌సైట్:** https://www.powergrid.in

# How is 'look' written in a code?

## DATA SUFFICIENCY

**Directions (Q. 1 - 20):** Each of the questions below consists of a question and two statements numbe-red I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the questions. Read both the statements and

**Give answer:**
1) If the data in statement I alone sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question
2) If the data in statement II alone sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question
4) If the data given in both the statements I and II together are not sufficient to answer the question
5) If the data in both the statements I and II together are necessary to answer the question



1. Is X the brother of Y?
I. X is son of Z.
II. Y is daughter of Z.
**Sol:** Both have the same father and X is a male (a son), X must be the brother of Y
**Ans:** (5)
2. Is A the brother of B?
I. Mohan is father of A.
II. Mohan is father of B.
**Sol:** It is very clear that A and B are siblings but we can't be sure that A is a brother unless. We know that he is a male. A may also a sister of Y.
**Ans:** (4)
3. Is A the brother of B?
I. B is sister of A.
II. A and B is spouse of each other.
**Sol:** From the second statement alone, we can conclude that A and B are not brothers.
**Ans:** (2)
4. Is Ravi the father of Girija?
I. Girija is the daughter of Ravi.
II. Ravi's father is the grandfather of Girija.
**Sol:** From the first statement alone Ravi is the father of Girija. From the second statement alone Ravi is the father of Girija.
**Ans:** (3)
5. Among three friends X, Y and Z, who is the tallest?
I. X is taller than Y.
II. X is taller than Z.
**Sol:** From the two statements, we find that X is taller than both Y and Z. So, X must be tallest.
**Ans:** (5)
6. Among three friends X, Y and Z, who is the tallest?
I. X is shorter than Y.
II. X is shorter than Z.
**Sol:** From two statements, we can't find out who is the tallest. We need a comparison of the heights of Y and Z, which is not given.
**Ans:** (4)
7. Among three friends X, Y and Z, who is not the tallest?
I. X is taller than Y.
II. X is taller than Z.
**Sol:** From the first statement alone Y is not the tallest. From the second statement alone Z is not the tallest.
**Ans:** (3)
8. On what date is Arun's birthday?
I. Arun's birthday comes only in a leap year.
II. Arun's birthday is the same as

**BANK EXAMS**
**GENERAL ENGLISH**

that of Morarji Desai.
**Sol:** We can get the answer (29 February) from the data given in statement I alone, because 29 February is the only date that comes only in a leap year. From the second statement alone, we can also find the answer.
**Ans:** (3)
9. On what date is Aruna's birthday?
I. Her birthday falls on the Independence Day of a country.
II. That Country has a flag made of three colours.
**Sol:** There are many countries whose flags have three colours. Hence, the data are insufficient to point out the exact date of her birthday.
**Ans:** (4)
10. What is the age of Ajith?
I. 5 years ago, Ajith was 20
II. Ajith is 25 years older than Rahul.
**Sol:** From the first statement alone, we can conclude that Ajith is 25.
**Ans:** (1)
11. What is the age of Mohan?
I. Mohan is 20 years younger than his father.
II. 5 years later, their ages will be in the ratio 1 : 2.
**Sol:** Both the statements are required to solve this.
**Ans:** (5)
12. How is "now" written in a code language?
I. "now are never" is written as "ha na pa" in that code language.
II. "you may come now" is written as "ja ta ha da" in that code language.
**Sol:** From first and second statements the common word "now" is coded as "ha".
**Ans:** (5)
13. How is "look" written in a code language?
I. "look for me" is written as "ha da pa" in that code language.
II. "you and me" is written as "ja da na" in that code language.
**Sol:** From first and second statements the common word "me" is coded as "da", but we can't find the code for look. Look is coded either "ha" or "pa".
**Ans:** (4)
14. How many boys are there between A and B in a row of thirty boys?
I. A is eighth from the right end of the row.
II. B is ninth from the left end of the row.
**Sol:** From statements I and II A is 8th from the right end and B is 9th from the left end, between A and B [30-(8+9)] = 13.
**Ans:** (5)
15. In a row of thirty students, what is M's position from the right end?
I. M is third to the right of D who is twelfth from the left end of the row.
II. K is fourteenth from the right end of the row and there are eight students between K and M.
**Sol:** From the first statement alone, we can find M is 16th from the right end.
**Ans:** (1)
16. Six persons A, B, C, D, E and F sit around a circular table. Who is on the immediate left of A?
I. B is opposite to C and D is opposite to E.
II. F is on the immediate left of B.
**Sol:** From the two statements we can't arrange the persons of D and E.
**Ans:** (4)
17. How much did Akhil score in the exam?
I. His score was a prime number between 40 and 50.
II. He scored more than 45.
**Sol:** There is only one prime number greater than 45 and less than 50. It is 47. So, both statements are required.
**Ans:** (5)
18. Will it be a Sunday tomorrow?
I. It is not Saturday today.
II. It was Wednesday the day before yesterday.
**Sol:** From the first statement alone, tomorrow is not a Sunday. From the second statement alone, tomorrow is not a Sunday.
**Ans:** (3)
19. Are all pens flowers?
I. All pens are gardens.
II. All gardens are flowers.
**Sol:** From the first statement and second statement, we can conclude all pens are flowers.
**Ans:** (5)
20. Are some pens pencils?
I. Some pencils are flowers.
II. All pencils are pens.
**Sol:** From the second statement alone, some pens are pencils.
**Ans:** (2)